10-4Pg1fBGO 1 VJA_10-4Pg1fBGO.qxd 10/Apr/26 12:07 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ
epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
విజయవాడ
fb.com/vaartha Digital
Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
10-4-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 69 పేజీలు: 12 వెల: 6.50

9

ఓట్లు దంచేశారు..

3 రాష్ట్రాల్లో అంచనాలు మించి ఓటింగ్
75% దాటిన పోలింగ్

లెబనాన్‌లో
విధ్వంసం
254 మంది మృతి..

10 ఆయుధ నిల్వ కేంద్రాలు ధ్వంసం
హెజ్‌బొల్లా అగ్రనేత యూసఫ్ హతం
ఇజ్రాయెల్ భద్రతలో రాజీపడబోం: ఐడిఎఫ్

9

పశ్చిమాసియాలో ఉత్కంఠకు తెరపడలేదు. ఉద్రిక్తతలూ తొలగిపోలేదు. అమెరికా-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ అంగీకారం కుదరడంతో యుద్ధం తాత్కాలికంగా నిలిచిపోయినట్లు కనిపించినా, లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది.

సౌదీ పైప్‌లైన్‌పై
ఇరాన్ దాడి

పంపింగ్ స్టేషన్‌లో ఎగిసిపడ్డ అగ్నికీలలు
హార్ముజ్ జలసంధిని మూసేసిన ఇరాన్



ట్రంప్ వార్నింగ్

వెనక్కి తగ్గేది లేదు
హార్ముజ్ తెరవకపోతే కఠినంగా వ్యవహరిస్తాం..

భూ రికార్డులు మార్చలేరు

ఆటో మ్యుటేషన్ తర్వాత ఇంటికే పాస్ పుస్తకం
కరెన్సీకి వాడే టెక్నాలజీతో పాస్ పుస్తకాలు
2027 మార్చినాటికి రైతులందరికీ పాస్‌బుక్స్
ఐదేళ్లలో 23 లక్షల మంది ఉద్యోగావకాశాలు
రాజధాని నిర్మాణంపై విపక్షానిది తప్పుడు ప్రచారం
అధికారంలో ఉంటే విధ్వంసం.. లేకపోతే బెదరింపులు
మినీ గోవాగా సూర్యలంక బీచ్ అభివృద్ధి
సూరేపల్లి 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో సిఎం చంద్రబాబు

గురువారం సూరేపల్లిలో రైతులకు పాస్ పుస్తకం అందచేస్తున్న సిఎం చంద్రబాబు సభకు హాజరైన నప్రజలు

రేపల్లె(బాపట్ల జిల్లా), ఏప్రిల్ 9 ప్రభాతవార్త: రాష్ట్రంలో భూ సమస్యలను లేకుండా చేసేందుకు ప్రభుత్వం పని చేస్తోందని, 2027 మార్చి నాటికి 1.12 కోట్ల పట్టదారు పాసుపుస్తకాలను పంపిణీ పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఒక్క రూపాయి కూడా అవినీతికి తావు లేకుండా పాసుపుస్తకాలు అందిస్తున్నామని తెలిపారు. ఆటో మ్యుటేషన్ తర్వాత నేరుగా ఇంటికి పాస్ పుస్తకాలను పంపాలని అధికారులను ఆదేశించారు. బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గం సూరేపల్లి గ్రామంలో 'మీ భూమి -మీ హక్కు'కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. ప్రజావేదిక వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను ముఖ్యమంత్రి సందర్శించారు. వేదికపై రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను అందించారు. వారి సమక్షంలోనే పొలం వివరాలను అధికారులతో చదివి వినిపించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రజల భూమిపై కన్నేసి కబ్జాలు చేశారు. ప్రశ్నించిన వారిని కట్టడి చేసేందుకు బ్లాక్ మెయిల్ చేశారు. రికార్డులు తారుమారు చేశారు. ప్రతీ గ్రామంలో, ప్రతి ఇంటిలో భూ వివాదాలకు తెరలేపి భయానక వాతావరణం సృష్టించారు. పట్టాదారు పాస్ పుస్తకాలపైనా జగన్ తన ఫొటో వేసుకున్నాడు. సరిహద్దు రాళ్లపైనా బొమ్మలు చెక్కించుకున్నాడు. ఇందుకోసం వందల కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం చేశారు. వారు అధికారం నుంచి దిగిపోయినా పాపాలు, అక్రమాలు ఇంకా వెంటాడుతున్నాయి. అంతలా రెవెన్యూ వ్యవస్థను నాశనంచేశారు. ప్రజల >>2

గురువారం జరిగిన సోషల్ మీడియా ప్లాట్ ఫాంల ప్రతినిధులు, అధికారుల సమావేశంలో మంత్రులు నాదెండ్ల,లోకేష్, అనిత, సత్యకుమార్ యాదవ్

13 యేళ్ల పిల్లలకు సోషల్ మీడియాకు నో ఎంట్రీ

మంత్రుల బృందం సమావేశంలో మంత్రి లోకేష్ స్పష్టీకరణ

విజయవాడ,ఏప్రిల్ 9,ప్రభాతవార్తప్రతినిధి: సోషల్ మీడియాకు 13 సంవత్సరాల లోపు బాలలను దూరంగా ఉంచడంపై విధివిధానాలు తయారుచేసి, ముసాయిదా చట్టాన్ని సిద్ధం చేయాల్సిందిగా రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. చిన్నపిల్లలను సోషల్ మీడియాకు దూరంగా ఉంచేందుకు విధివిధానాల తయారీ, చట్టరూపకల్పనపై ఉండవల్లి నివాసంలో మంత్రుల బృందం సోషల్ మీడియా ప్లాట్ ఫాం ప్రతినిధులు, అధికారులతో సమావేశమైంది. ఈ సమావేశంలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ సోషల్ మీడియా దుష్ప్రభావానికి లోనుకాకుండా 13 నుంచి 16సంవత్సరాల పిల్లలకు వయసు ఆధారిత కంటెంట్ ను అందుబాటులో ఉంచే విధంగా విధివిధానాలను రూపొందించాలని ఆదేశించారు. సోషల్ మీడియాలో మహిళలపట్ల అవమానకరమైన, విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. పిల్లల డిజిటల్ భద్రత, శ్రేయస్సు, లీగల్ మెకానిజం ఫ్రేమ్ వర్క్ పై ఇతర రాష్ట్రాలు, దేశాల్లో అనుసరిస్తున్న అత్యుత్తమ విధానాలను అధికారులు అధ్యయనం చేయాలన్నారు. పిల్లలను సెన్సిటివ్ కంటెంట్‌కు దూరంగా >>2

ప్రతి నేతన్నకు ఉచిత విద్యుత్

రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత
మగ్గం నేతన్నలకు రూ.720, మరమగ్గం నేతన్నలకు రూ.1,860లు ఆదా
15 వరకు ఉచిత విద్యుత్ పథకానికి దరఖాస్తుల స్వీకరణ

గురువారం సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

విజయవాడ, ఏప్రిల్ 9,ప్రభాతవార్తప్రతినిధి: అర్హులైన ప్రతి నేతన్నకూ ఉచిత విద్యుత్ ఫలాలు అందించాల్సిందేనని రాష్ట్ర చేనేత . జౌళిశాఖ మంత్రి ఎస్ .సవిత స్పష్టం చేశారు. ఇందుకు విద్యుత్, చేనేత, జౌళి శాఖాధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. చేనేతల్లో ఉచిత విద్యుత్ పథకంపై అవగాహన కల్పించడానికి గ్రామ స్థాయిల్లో చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ నెల 15వ తేదీలోగా లబ్దిదారుల నుంచి దరఖాస్తుల స్వీకరణకు గడువుగా పేర్కొన్నారు. విజయవాడలోని ఓ హోటల్‌లో విద్యుత్, చేనేత, జౌళి శాఖాధికారుల సమన్వయ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ >>2

అమరావతిలో మినీ ఢిల్లీ!

ఒకే గొడుగు కిందకు కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు
మోడీ సర్కార్ భారీ ప్రణాళిక.. సమగ్ర నివేదిక తయారు

విజయవాడ,ఏప్రిల్ 9,ప్రభాతవార్తప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో అన్ని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలను ఒకే గొడుగు కిందకు తీసుకురావాలనే లక్ష్యంతో ప్రభుత్వం భారీ ప్రణాళికను సిద్ధంచేసింది. దీని కోసం రూపొందించిన సమగ్ర ప్రాజెక్టు నివేది తుది దశకు చేరుకుంది. ఢిల్లీలోని సెంట్రల్ వెస్టా తరహాలో, సుమారు 20 నుంచి 25 ఎకరాల విస్తీర్ణంలో ఈ అత్యాధునిక సచివాలయ సముదాయాన్ని నిర్మించనున్నారు. ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో అద్దె భవనాల్లో కొనసాగుతున్న సుమారు 50కి పైగా కేంద్ర ప్రభుత్వ విభాగాలు, అనుబంధ సంస్థలు ఈ నూతన భవనంలోకి >>2

అభివృద్ధి, ఆధ్యాత్మికతతో అంతర్వేది వర్ధిల్లాలి

పవిత్ర క్షేత్రంలో తాగునీటి సమస్య ఉండకూడదు
రాజోలు నియోజకవర్గ పరిధిలో పలు అభివృద్ధి పనులకు
వర్చువల్ విధానంలో డి.సిఎం పవన్ కల్యాణ్ శ్రీకారం

రాజోలు, ఏప్రిల్ 9 ప్రభాతవార్త ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి: "ఏదైనా ఒక ప్రాంతం అభివృద్ధి చెందాలంటే అక్కడ చేపట్టాల్సింది కేవలం నిర్మాణాలు మాత్రమే కాదు, అక్కడ ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాలి. మౌలిక వసతులు మెరుగుపరచి వారి జీవితాలకు భరోసా ఇవ్వాలి. భవిష్యత్తుపై నమ్మకం కలిగించాలి" ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. అంతర్వేదిలాంటి పవిత్ర ప్రాంతంలో అభివృద్ధి, ఆధ్యాత్మికతతో కలిసి నడవాలని ఆకాంక్షించారు. ఈ పుణ్యభూమి అభివృద్ధికి కూటమి ప్రభుత్వం బలమైన సంకల్పంతో పని చేస్తుందని హామీ ఇచ్చారు. గురువారం రాజోలు నియోజకవర్గ పరిధిలో పలు అభివృద్ధి పనులకు వర్చువల్ విధానంలో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ముందుగా రూ.17.33 కోట్లతో అంతర్వేదిలో నిర్మించిన మంచినీటి పథకాన్ని ప్రారంభించారు. అనంతరం ఒ.ఎన్.జి.సి. నిధులు రూ.5 కోట్లతో 6 మిలియన్ లీటర్ల సామర్థ్యం కలిగిన ర్యాపిడ్ సాండ్ ఫిల్టర్ల ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి మంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, స్థానిక శాసనసభ్యులు దేవ వరప్రసాద్, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల, గ్రామీణ నీటిసరఫరా విభాగం ఈఎన్సీ గాయత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ "అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి ఆశీస్సులతో ఈ రోజున మీ అందరి కోసం పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడం ఆనందంగా ఉంది. జల్ జీవన్ >>2

10-4pg2exHMNWJQE 2_10-4pg2exHMNWJQE.qxd 10/Apr/26 12:11 AM Page 1

గురువారం సూరేపల్లిలో సర్వే వివరాలను పరిశీలిస్తున్న సిఎం చంద్రబాబు

అభివృద్ధి, ఆధ్యాత్మికతతో అంతర్వేది వర్ధిల్లాలి

>> మిషన్ నిధులతో అంతర్వేది దేవస్థానం, అంతర్వేదికర, పల్లెపాలెం, గొంది గ్రామ పంచాయతీల పరిధిలో 13 గ్రామాలకు చెందిన 30 వేల మంది ప్రజల దాహార్తి తీర్చే లక్ష్యంతో రూ.17.33 కోట్లతో నిర్మించిన సమగ్ర రక్షిత తాగునీటి సరఫరా పథకాన్ని మీ అందరికీ అందుబాటులోకి తీసుకువచ్చాం. ఈ ప్రాజెక్టు 30 వేల మంది తీర ప్రాంత ప్రజల దాహార్తిని తీరుస్తుంది. దీని కోసం 10 ఎకరాల విస్తీర్ణంలో చెరువును అభివృద్ధి చేసి, దానికి అనుబంధంగా 3 మిలియన్ లీటర్ల నీటి శుద్ధి సామర్థ్యం కలిగిన రాపిడ్ సాండ్ ఫిల్టర్ ప్లాంటు, వాటర్ ట్యాంక్ నిర్మించాం. ఈ ప్రాజెక్టుని అత్యంత ప్రాధాన్యతాంశంగా తీసుకుని ఈ వేసవిలోపు అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేశాం. ఈ పథకం కోసం గన్నవరం కాలువ నుంచి పంపింగ్ ద్వారా నీటిని తీసుకువచ్చి చెరువులో స్టోరేజీ చేయనున్నాం" అని వివరించారు.

30యేళ్ల తాగునీటి కష్టాలకు చెక్: గతంలో 12 కిలోమీటర్ల దూరంలో అంతర్వేదిపాలెం రక్షిత తాగునీటి పథకం నుంచి ఈ ప్రాంతానికి తాగునీరు సరఫరా చేసేందుకు ఇబ్బందులు తలెత్తేవి. సుమారు 50 గ్రామాలు దాటి నీరు రావాల్సి ఉండడంతో ప్రజల అవసరాలకు సరిపడ తాగు నీరు అందేది కాదు. 30 ఏళ్లుగా తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దర్శనానికి వచ్చిన సందర్భంలో ప్రజలు తమ తాగునీటి వెతలు చెప్పుకొంటూ వినతిపత్రం ఇచ్చారు. ఈ రోజు ప్రారంభించిన అంతర్వేది సీపీడబ్ల్యూఎస్ పథకం ద్వారా

గురువారం పలు అభివృద్ధి కార్యక్రమాలను వర్చువల్‌గా ప్రారంభిస్తున్న డి.సిఎం పవన్ కల్యాణ్

సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుంది. వేసవి నీటి కష్టాలు పూర్తిగా తొలగిపోతాయి. తీర ప్రాంతం కావడం వల్ల ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు గృహ అవసరాలకు వినియోగించుకునేందుకు కూడా పనికి వచ్చే పరిస్థితి లేదు. అంతర్వేది సమగ్ర రక్షిత తాగునీటి పథకం ద్వారా పూర్తి స్థాయిలో మీ అవసరాలకు తగిన విధంగా స్వచ్ఛ జలాలు సరఫరా చేసే ఏర్పాటు చేస్తామని డిప్యూటీ సిఎం పవన్ తెలిపారు.

ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు : 'రూ.5 కోట్ల ఓఎన్జీసీ సీఎస్ఆర్ నిధులతో గుడిమెల్లంక వద్ద ఏర్పాటు చేయనున్న 6 మిలియన్ లీటర్ల సామర్థ్యం కలిగిన ర్యాపిడ్ సాండ్ ఫిల్టర్ల ఏర్పాటు పనులు ప్రారంభించాం. ఈ పనులు పూర్తయితే గుడిమెల్లంక రక్షిత తాగునీటి పథకం సామర్థం మెరుగుపడుతుంది. 29 గ్రామాల పరిధిలో సుమారు లక్షా 20 వేల మందికి పూర్తి స్థాయిలో తాగునీరు అందుతుంది. అలాగే పల్లెపండగ 2.0 కూడా ఇదే రాజోలు నియోజకవర్గం నుంచి ప్రారంభించాం. అదే రోజు శంకరగుప్తం డ్రెయిన్ సమస్యపై అధ్యయనం చేసి 35 రోజుల్లో రూ. 20.77 కోట్లతో డ్రెయిన్ ఆధునీకరణ పనులకు ముక్కోటి ఏకాదశి రోజున శ్రీకారం చుట్టాం. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ జల్ జీవన్ మిషన్ లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ 55 లీటర్ల సురక్షిత తాగునీరు అందించే విధంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రణాళికలు అమలు చేస్తోంది. ప్రతి గ్రామానికీ, ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందించే లక్ష్యాలను ముందుకు తీసుకువెళ్తాం" అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ ఎవిఎస్ రాజన్, డివిజనల్ ఇంజనీర్లు మారుతీ రావు, బిజెపి నాయకులు, ఎంపిటిసిలు, జడ్‌పిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

సిఎం చంద్రబాబు సంస్కరణలు భావితరాలకు స్ఫూర్తి

చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

విజయవాడ,ఏప్రిల్ 9,ప్రభాతవార్తప్రతినిధి: నవ్యాంధ్రప్రదేశ్ సాధన కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకొచ్చిన సంస్కరణలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఖ్యాతిని ఇనుమడింప జేస్తాయన్నారు. ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొడతాయని ఉద్ఘాటించిన ఆయన చిత్తూరు పార్లమెంటు ప్రగతి పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయని తెలియజేశారు. వైకాపా అధినేత జగన్ మోహన్ రెడ్డి మావిగన్ అనే అంశాన్ని తెరపైకి తెచ్చిన నేపథ్యంలో చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు స్పందించారు. ఎన్డీఏ సర్కార్ సహకారంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రపంచ స్థాయి ప్రమాణాలతో రాజధానిని నిర్మించి, తెలుగు జాతి ఔన్నత్యాన్ని చాటిచెప్పాలనే ధృడ సంకల్పంతో ముందుకు సాగుతుంటే ఓర్వలేని ప్రతిపక్షాలు ఈ రకమైన విమర్శలు చేయడం తగదన్నారు. అమరావతి రాజధాని కావాలని, దీనికి సంబంధించి వేల ఎకరాలు అవసరమని చెప్పిన వారు ఇప్పుడు ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, తమ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలను మభ్యపెట్టడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. 2014లో జరిగిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన, తీవ్ర ప్రతికూలతలకు దారితీసిన నేపథ్యంలో 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం విభజన చట్టంలో పొందుపరిచినహామీలను, ఎన్డీఏ సర్కార్ సహకారంతో సాధిస్తాం దని ఆయన చెప్పారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రాష్ట్ర మంత్రిలోకేష్ బాబు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని రెండు కళ్ళుగా భావించి, సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు చేరువ చేస్తూ..,ఓ ప్రణాళిక బద్ధంగా ప్రజలకు సుపరిపాలన అందించడం తమ అందరికీ గర్వకారణంగా ఉందన్నారు.ఇకనైనా ప్రతిపక్షాలు తమ వైఖరిని మార్చుకోవాలని, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు హితవు పలికారు.

వంట గదిలోకి అనుమతించకపోవడమూ క్రూరత్వమే: బాంబే హైకోర్టు

ముంబై, ఏప్రిల్ 9: అత్తారింట్లో మహిళను వంట గదిలోకి అనుమతించకపోవడమూ మానసిక క్షోభకు గురిచేయడం కిందకే వస్తుందని బాంబే హైకోర్టు తేల్చింది. భర్త తనను వంట గదిలోకి రానివ్వడం లేదంటూ ఇటీవల ఓ మహిళ అతడిపై కేసు పెట్టింది. దీంతో అతడు బాంబే హైకోర్టును ఆశ్రయించాడు. ధర్మాసనం దీనిపై స్పందిస్తూ.. ఇలాంటి చర్యలు మహిళల గౌరవాన్ని కించపరచడంతోపాటు మానసిక క్షోభకు గురిచేసినట్టే అవుతుందని తేల్చి చెప్పింది. వారిద్దరూ 2022లో వివాహం చేసుకున్నారు. కొద్దికాలానికే వారి మధ్య వివాదాలు మొదలయ్యాయి. దీంతో అత్తింటి వారంతా ఆమె ప్రాథమిక హక్కులకు భంగం కలిగేలా ప్రవర్తిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. 'నన్ను అసలు వంట గదిలోకే అనుమతించడం లేదు. ఆహారం కూడా బయట నుంచి తెచ్చుకోవాలని బలవంతపెట్టారు. పుట్టింటి వాళ్లను కూడా కలవనివ్వలేదు. విడాకులు ఇవ్వాలని ఇబ్బంది పెడుతున్నారు' అని సదరు మహిళ ఫిర్యాదులో పేర్కొంది. ఈ ఆరోపణలను ఆమె భర్త ఖండించారు. 'విడాకులు ఇవ్వాల్సి వస్తుందనే కారణంతోనే ఆమె ఇవన్నీ సృష్టించారు' అని ఆమె భర్త తరఫు న్యాయమూర్తి కోర్టులో వాదనలు వినిపించారు. దీనిపై విచారణ చేసిన ధర్మాసనం అతనిపై వేధింపుల కేసును కొట్టివేసేందుకు అంగీకరించలేదు. ఇంట్లో ఆమె సాధారణ అవసరాలను కూడా తీర్చుకోనివ్వకుండా కట్టడి చేయడం కూడా మానసిక క్రూరత్వం కిందకే వస్తుంది అని పేర్కొంది. కానీ ఈ కేసులో ఆమె అత్తపై చేసిన ఆరోపణలు అస్పష్టంగా ఉన్నాయంటూ ధర్మాసనం కొట్టివేసింది.

భూ రికార్డులు మార్చలేరు!

>> ఆస్తులకు భద్రత, ప్రజల జీవితాలకు భరోసా ఇవ్వాలనే లక్ష్యంతో ప్రతి నెల నేను స్వయంగా పట్టాదారు పాస్ పుస్తకాలు అందిస్తున్నాను. భూమి అనేది ఆస్తి మాత్రమే కాదు. భద్రత, జీవనాధారం. అర్జీల్లో రెవెన్యూ సమస్యలవే ఎక్కువగా ఉంటున్నాయి. అందుకే భూ సమస్యలు శాశ్వతంగా పరిష్కరించాలని సంకల్పించాం. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం కోసం రీ సర్వే 2.0 చేపట్టాం. రాష్ట్రంలో మొత్తం 16,816 గ్రామాల్లో రీ సర్వే చేయాల్సి ఉండగా, ఇప్పటికే 6,976 గ్రామాల్లో పూర్తి చేశాం. 2027 మార్చి నాటికి రీ సర్వే పూర్తి చేసి ప్రతి ఒక్కరికి రాజముద్రతో కొత్త పాసుపుస్తకాలు ఇస్తాం. ఈ జనవరి నుంచి మార్చి వరకు 21.23 లక్షల కొత్త పాసుపుస్తకాలు ఇచ్చాం. కరెన్సీకి వాడే టెక్నాలజీనే పాస్ పుస్తకాలకూ వాడుతున్నాం. భవిష్యత్‌లో ఎవరూ రికార్డులు తారుమారు చేయలేరు. రాజీలేకుండా మూడుసార్లు పట్టాదారుకు చెప్పి ఈ కేవైసీ చేస్తున్నాం. రికార్డులు ట్యాంపరింగ్ చేయకుండా వాటిని భద్రపరిచేందుకు బ్లాక్ చైన్ టెక్నాలజీ తీసుకొచ్చాం. క్యూఆర్ కోడ్ పెట్టాం. రికార్డుల లాకర్ సిస్టమ్ తెచ్చాం. దీని ద్వారా భూ యజమానులు ఆధార్, ఈ కేవైసీ ఇచ్చి తమ భూముల రికార్డులు లాక్ చేసుకోవచ్చు. ప్రజల ఆస్తులకు, భూములకు రక్షణ కల్పించేందుకు ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ రద్దు చేశాం' అని ముఖ్యమంత్రి చెప్పారు. 'భూ వినియోగ మార్పులు, మిస్సింగ్ సర్వే నంబర్ల సేవలను త్వరలో ప్రారంభిస్తున్నాం. జూన్ 2024 నుంచి ఇప్పటివరకు 9 లక్షల భూ లావాదేవీలు ఆటోమ్యూటేషన్ చేశాం. సేల్, బహుమానం, పార్టీషన్ డీడ్స్‌లో 100 శాతం ఆటోమ్యూటేషన్ తీసుకొచ్చాం. పట్టణ ప్రాంతంలోని ఆస్తులను కూడా ఆటోమ్యూటేషన్‌లోకి తీసుకువచ్చాం. ఇకపై పాస్‌బుక్ కోసం అధికారులు చుట్టూ, కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరగాల్సిన అవసరం ఉండకూడదు. ఆస్తి అమ్మితే నేరుగా మీ ఇంటికే పాస్ బుక్ వస్తుంది. ఆటోమ్యుటేషన్ తో పాటు, పాస్ బుక్ కూడా ప్రింట్ చేసి నేరుగా యజమానికి ఇంటికి అధికారులు పంపాలి. వారసత్వంగా వస్తున్న భూముల విషయంలోనూ సంస్కరణలు తెచ్చాం. భూ వివాదాలు ఉండే గ్రామాలను కలెక్టర్లు గుర్తించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి అని సిఎం చంద్రబాబు సూచించారు.

అమరావతికి రూ.2 లక్షల కోట్లంటూ తప్పుడు ప్రచారం

"జగన్ లాంటి వెయ్యి మంది సైకోలు వచ్చినా అమరావతి నిర్మాణం ఆగదు. మొన్నటి వరకూ మూడు రాజధానులు అన్నారు. ఇప్పుడు మావిగన్ అంటున్నారు. అమరావతిపై కక్ష గట్టి రైతుల త్యాగాలకు విలువ లేకుండా చేశారు. అమరావతి నిర్మాణానికి రూ.2 లక్షలు ఖర్చు అని అసత్య ప్రచారం చేస్తున్నాడు. అమరావతి పేరు చెప్పడానికి కూడా ఇష్టపడని వ్యక్తికి రాష్ట్రాన్ని పాలించే అర్హత లేదు. మహిళా రైతులను ఇబ్బందులు పెట్టారు. మహిళలు స్నానాలు చేస్తుంటే డ్రోన్‌లతో చిత్రీకరించారు. వారిని జుట్టు పట్టుకుని బయటకు లాగారు. లాఠీలతో కొట్టారు. న్యాయస్థానం టూ దేవస్థానం కార్యక్రమం చేపడితే రోడ్డుపై భోజనం చేయనివ్వకుండా హింసించారు. అమరావతి నుంచి అరసవిల్లి వెళ్లాలంటే వారిపై దౌర్జన్యం చేశారు. మహిళల గురించి, నా భార్య గురించి వ్యక్తిగత దూషణలు చేశారు. గత ఐదేళ్లలో మహిళలను వాళ్లకు మహిళల గౌరవం గురించి మాట్లాడే హక్కు ఎక్కడిది? ఎన్ని ఇబ్బందులు ఎదురైనా అమరావతి మహిళలు వీరోచితంగా పోరాడారు. చివరకు న్యాయం గెలిచింది. అమరావతి అజరామరం. అమరావతే ఎపి రాజధాని అని రాష్ట్రపతి ఆమోదం తెలిపారు. పార్లమెంటులో అమరావతి చట్టబద్ధత బిల్లుకు 49 రాజకీయ పార్టీలు సపోర్ట్ చేస్తే ఒకే ఒక్క సైకో పార్టీ సపోర్ట్ చేయలేదు."అని సిఎం చంద్రబాబు గుర్తుచేశారు.

"నాడు ఐదేళ్ల అధికారంలో ఉండి విధ్వంసం సృష్టించారు... అధికారం పోయాక బెదిరిస్తున్నారు. మళ్లీ అధికారంలోకి వచ్చాక విచారణలు చేసి అందర్నీ పట్టుకొస్తానని బెదిరిస్తున్నాడు. రాజకీయ పార్టీ లేకపోతే జగన్ ఇంట్లో నుంచి బయటకు రాగలరా? రాష్ట్రాన్ని సర్వనాశనం చేయాలని కుట్ర చేస్తున్నారు.నాది న్యాయబద్ధ పాలన. ప్రజాస్వామ్యాన్ని కాపాడతాను. ప్రజలకు ఇబ్బందులు వస్తే నా ప్రాణాలను లెక్కచేయకుండాపోరాడాను. రాష్ట్రాన్ని కాపాడుకో వాల్సిన బాధ్యత మనందరిపైఉంది. ఇలాంటి నేతలను ప్రోత్సహిస్తే ఎవరికీ రక్షణ ఉండదు. భవిష్యత్ ఉండదు. మనందరి జీవితాలు బాగుండాలంటే ఇలాంటి వ్యక్తులను మర్చిపోవాలి. ఏమారితే రాష్ట్రానికి నష్టం జరుగుతుంది" అని సిఎం చంద్రబాబు అన్నారు.

రాష్ట్రంలో రాబోయే ఐదు సంవత్సరాల వ్యవధిలో 23 లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలిచ్చే బాధ్యతతో కూటమి ప్రభుత్వం పనిచేస్తుందంటే పరిశ్రమల స్థాపనకు రూ.20 లక్షల కోట్లు పెట్టుబడులు రావడమే అందుకు ప్రధాన కారణమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికులు ముందుకు రాలేదని గుర్తు చేశారు. ఒక విధంగా చెప్పాలంటే పరిశ్రమల నిర్వాహకులు పారిపోయే పరిస్థితులు కొనసాగాయని చెప్పారు. తమ పరిపాలనలో పరిశ్రమల స్థాపనకు పెట్టుబడిదారులు ముందుకు రావడం శుభపరిణామం అని తెలిపారు.

గురువారం వేమూరు నియోజకవర్గంలో జరిగిన ప్రజావేదిక సమావేశానికి హాజరైన టిడిపి కార్యకర్తలు

"ప్రతీ వ్యక్తికి సంక్షేమం, అభివృద్ధి ఎలా అందుతోంది, అధికారులు ప్రజలతో ఎలా వ్యవహరిస్తున్నారో సమాచారం తెప్పిస్తున్నాం. ప్రజలకు సేవకులుగా పని చేస్తున్నాం. రాష్ట్రంలో ఎకో టూరిజం, టెంపుల్ టూరిజం, బీచ్ టూరిజానికి విస్తృత అవకాశాలు ఉన్నాయి. బాపట్ల జిల్లాలోని సూర్యలంక బీచ్‌ను మరో గోవాగా తయారుచేస్తాం. ఈ ప్రాంతంలో టూరిజాన్ని ప్రోత్సహించడం వల్ల ఉపాధి, ఉద్యోగ అవకాశాలు వస్తాయి. ఇక్కడి ప్రజల ఆదాయం పెంచడంతో పాటు జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. సముద్రపు నాచు సీవీడ్ ద్వారా మత్స్యకారులు స్థానికులకు అదనపు ఆదాయం వస్తుంది. మత్స్యకారుల జీవనోపాధికి నష్టం రాకూడదు. మన సముద్ర జలాలపై మత్స్యకారులదే హక్కు. ఇతర ప్రాంతాల జాలర్లు వస్తే ఉపేక్షించేది లేదు. గత ప్రభుత్వంలో 217 జీవో ద్వారా స్థానిక నీటి వనరుల్లో చేపల పెంపకానికి మత్స్యకారులను దూరం చేశారు. మేం అధికారంలోకి వచ్చాక దానిని రద్దు చేసి మత్స్యకారుల జీవనానికి సహకరించాం. అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

వేమూరు నియోజకవర్గ అభివృద్ధికి హామీలు

"వేమూరు నియోజకవర్గంలో తుంగభద్ర డ్రెయిన్‌పై బ్రిడ్జ్ నిర్మాణానికి రూ.10 కోట్లు మంజూరు చేస్తున్నాం. కొల్లూరు ఫ్రీ రోడ్డుపై హెచ్ ఎల్ బీ నిర్మాణానికి రూ.15 కోట్లు కేటాయిస్తాం. భట్టిప్రోలు, పెసలకం రోడ్డుపై కల్వర్టు నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు చేస్తాం. రోడ్ల మరమ్మతులపై ప్రత్యేక శ్రద్ధ పెడతాం. లంక గ్రామాలు కోతకు గురికాండా చర్యలు తీసుకుంటాం. అలాగే వేమూరులో ఫైర్ స్టేషన్ మంజూరు చేస్తున్నాం. ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున పరిశ్రమలు స్థాపించి స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పిస్తాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. పి4 కింద రోడ్డు నిర్మాణానికి యాజలి గ్రామానికి చెందిన సత్యనారాయణ రాజు రూ.కోటి విరాళాన్ని ముఖ్యమంత్రికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, కొలుసు పార్థసారథి, గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు నక్కా ఆనంద్ బాబు, నరేంద్ర వర్మ, సీఎస్ సాయి ప్రసాద్, ఎంపీ కృష్ణ ప్రసాద్, జిల్లా కలెక్టర్, రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రతి నేతన్నకు ఉచిత విద్యుత్

>> సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, ఎన్నికల ముందు నిర్వహించిన యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేశ్ చేనేతల కష్టాలను స్వయంగా చూశారన్నారు. సీఎం చంద్రబాబునాయుడికి సైతం చేనేత కష్టాలపై స్పష్టమైన అవగాహన ఉందన్నారు. అందుకే, అధికారంలోకి కూటమి వస్తే ఉచిత విద్యుత్ ఇస్తామని ఆనాడు సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ ఎన్నికల హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడుతూ, నేతన్నలకు ఉచిత విద్యుత్ పథకాన్ని రూ.150 కోట్ల వ్యయంతో ఈ నెల ఒకటో తేదీ నుంచి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారన్నారు. మగ్గంపై నేసే నేతన్నలకు 200 యూనిట్లు, మర మగ్గంపై నేతన్నలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందజేస్తున్నామన్నారు. మగ్గం నేతన్నలకు నెలకు రూ.720లు, మరమగ్గం నేతన్నలకు రూ.1,860లు ఆదా అవుతుందన్నారు. విద్యుత్, చేనేత, జౌళి శాఖాధికారులు సమన్వయంతో ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయాలని మంత్రి సవిత సూచించారు. గ్రామాల్లో చైతన్య కార్యక్రమాలు నిర్వహించి, లబ్దిదారులను గుర్తించి, వారితో దరఖాస్తు చేయించాలన్నారు. ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తులకు ఆఖరు గడువు అని స్పష్టంచేశారు. లబ్ధిదారుల ఎంపిక నిరక్ష్యం చూపొద్దని, పొరపాట్లు జరిగితే ఆయా జిల్లాల డీవోలే బాధ్యత వహించాల్సి ఉంటుందని మంత్రి సవిత స్పష్టం చేశారు. ప్రభుత్వానికి, లబ్ధిదారులకు చేనేత, జౌళి శాఖాధికారులు వారధిగా ఉండాలన్నారు. చేనేతలకు మేలు చేయాలన్నది సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. ఇప్పటికే చేనేతలకు లబ్ధి కలిగించేలా వ్యక్తిగత పథకాలు ప్రారంభించామన్నారు. 50 ఏళ్లు నిండిన చేనేతలకు రూ.4 వేల పెన్షన్ అందజేస్తున్నామన్నారు. రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా మాట్లాడుతూ, చేనేతలకు ఉచిత విద్యుత్ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. విద్యుత్, చేనేత, జౌళి శాఖాధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి, విద్యుత్ శాఖాధికారులు, వివిధ జిల్లాలకు చెందిన చేనేత, జౌళి శాఖకు చెందని ఏడీలు, డీవోలు పాల్గొన్నారు.

13 యేళ్ల పిల్లలకు సోషల్ మీడియాకు నో ఎంట్రీ

>> ఉంచడంపై ఆస్ట్రేలియా, సింగపూర్, డెన్మార్క్ వంటి దేశాల్లో అమలు చేస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని సూచించారు. పిల్లలపై సోషల్ మీడియా ప్రభావంపై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రకటించారు. నో బ్యాగ్ డే రోజున ఉపాధ్యాయులు విద్యార్థులకు, ప్రతిఏటా రెండుసార్లు నిర్వహించే మెగా పిటిఎంలో కూడా తల్లిదండ్రులు, విద్యార్థులకు సోషల్ మీడియా దుష్ప్రభావాలపై అవగాహన కల్పిస్తామన్నారు. మహిళలభద్రతపై స్వయంసహాయ సంఘాల మహిళలకు కూడా అవగాహన కల్పిస్తామని తెలిపారు.వయసు నిర్ధారణ కోసం డిజిలాకర్ తో కూడిన ఏజ్ టోకెన్ ల వినియోగంపై అధ్యయనం చేయాల్సిందిగా మంత్రి లోకేష్ అధికారులకు సూచించారు. ప్రజాభిప్రాయం అనంతరం కేంద్రప్రభుత్వ చట్టపరిధిలోని అంశాలపై నివేదికను అందజేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా సున్నితమైన కంటెంట్ ను చిన్నపిల్లలకు దూరంగా ఉంచడంపై విధివిధానాలు, ఫిర్యాదులపై తీసుకుంటున్న చర్యలను వివిధ సోషల్ మీడియా ప్లాట్ ఫాంల ప్రతినిధులు మంత్రుల బృందానికి వివరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకుంటున్న చొరవకు తమవంతు పూర్తి సహాయ, సహకారాలు అందిస్తామని వారు తెలిపారు. ఐటి చట్టంలోని సెక్షన్ - 46 కింద న్యాయ నిర్ణయాధికారిని వెంటనే నియమించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రులు వంగలపూడి అనిత, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్, జిఎడి ప్రిన్సిపల్ సెక్రటరీ శ్యామలరావు, ఐ అండ్ పీఆర్ డైరెక్టర్ కె.ఎస్ విశ్వనాథన్, ఆకే రవికృష్ణ (ఐజీ, ఈగల్, ఇన్ చార్జ్, సైబర్ క్రైమ్), అదిరాజ్ సింగ్ రానా ఎస్పీ సైబర్ క్రైమ్, పి.కిరణ్ కుమార్ (జాయింట్ డైరెక్టర్, ఐ అండ్ పీఆర్), పి.జయరావు, చీఫ్ జనరల్ మేనేజర్ (సోషల్ మీడియా డిజిటల్ మీడియా, డిజిటల్ కార్పొరేషన్), ఓ.మధుసూదన రావు (చీఫ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్, ఐ అండ్ పీఆర్), ప్రాసిక్యూషన్ డైరెక్టర్ రామకోటేశ్వరరావు, మెటా డైరెక్టర్ నటాషా జోగ్, యూట్యూబ్ పబ్లిక్ పాలసీ మేనేజర్ మీరా స్వామినాథన్, ఎక్స్ పబ్లిక్ పాలసీ ప్రొఫెషనల్ జప్రీత్ గ్రెవల్, షేర్ చాట్ పాలసీ హెడ్ తమోగా గోస్వామి, జోష్ ప్రాసెస్ మేనేజ్మెంట్ రామానుజన్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

అమరావతిలో మినీ ఢిల్లీ!

>> మారనున్నాయి. ఈ ప్రాజెక్టును కేవలం కార్యాలయ భవనంగానే కాకుండా, పర్యావరణ హితమైన గ్రీన్ బిల్డింగ్ ప్రమాణాలతో నిర్మించనున్నారు. ఐకానిక్ డిజైన్‌తో కూడిన ఈ భవన సముదాయంలో సెంట్రలైజ్డ్ ఎయిర్ కండిషనింగ్, అత్యాధునిక ఐటీ మౌలిక సదుపాయాలు, కాన్ఫరెన్స్ హాల్స్, విశాలమైన పార్కింగ్ సౌకర్యాలు ఉండనున్నాయి. సుమారు 10 నుంచి 12 అంతస్తుల ఎత్తుతో నిర్మించనున్న ఈ భవనం, అమరావతి నగరానికే ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. దీని ద్వారా పాలనలో వేగం పెరగడంతో పాటు, ప్రజలకు అన్ని కేంద్ర సేవలు ఒకే చోట లభించే వెసులుబాటు కలుగుతుంది. ఈ ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను కేంద్ర ప్రజా పనులశాఖ పర్యవేక్షించనుంది. ప్రాథమిక అంచనాల ప్రకారం, ఈ సముదాయం నిర్మాణానికి సుమారు రూ.మూడు వేల కోట్ల వరకు వ్యయం కావచ్చని భావిస్తున్నారు. రాజధాని ప్రాంతంలో ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన భూములను దీని కోసం వినియోగించుకోనున్నారు. కేంద్ర కేబినెట్ నుంచి తుది ఆమోదం లభించిన వెంటనే టెండర్ల ప్రక్రియను ప్రారంభించి, రాబోయే రెండేళ్లలోపు నిర్మాణాన్ని పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కేంద్ర సచివాలయ నిర్మాణం వల్ల అమరావతి ప్రాంతంలో ఆర్థిక కార్యకలాపాలు మరింత పుంజుకోనున్నాయి. వేలాది మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఒకే ప్రాంతానికి రావడం వల్ల స్థిరాస్తి రంగానికి ఊతం లభించడమే కాకుండా, స్థానికంగా సేవా రంగంలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. అమరావతిని కేవలం ఒక పరిపాలనా కేంద్రంగానే కాకుండా, జాతీయ స్థాయిలో ఒక కీలకమైన నగరంగా తీర్చిదిద్దడంలో ఈ ప్రాజెక్టు మైలురాయిగా నిలవనుంది.

ప్రస్తుత సిఆర్‌డిఏ చట్టాల్లో మార్పులు..

విజయవాడ ఏప్రిల్ 9 ప్రభాతవార్త ప్రతినిధి: అమరావతి రాజధాని నగర పాలక కోసం ప్రత్యే చట్టాలను రూపొందించనున్నారు. దీనికి అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు వీలుగా కన్సల్టెన్సీ నియామకం కోసం సిఆర్డీఏ అధికారులు కార్యాచరణ మొదలుపెట్టారు. దీని ప్రకారం అమరావతి రాజధాని పరిపాలన కోసం కొత్త చట్టాలను తయారు చేస్తారు. ప్రస్తుతం ఉన్న సీఆర్డీఏ చట్టాలను రాజధానికి వీలుగా అవసరమైన విధంగా మార్పులు, చేర్పులు చేయనున్నారు. ఇందులోనే ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించడం, పిపిపికి రక్షణ కల్పించేలా చట్టపరమైన నిబంధనలనూ రూపొందించాలని నిర్ణయించారు. రాజధాని నగర ప్రభుత్వం సుస్థిర ఆర్థిక ప్రగతి కోసం ఏమిచేయాలనే అంశాలనూ రూపొందించే ఫ్రేమ్ వర్క్ రూపొందించడంపై సిఆర్డీఏ అధికారులు దృష్టి సారించారు. ముఖ్యంగా తొలిదశలో ఆస్తులు ఎన్ని ఉన్నాయి? అప్పులు ఎంత? అనే అంశాలపై స్పష్టమైన నివేదిక తయారు చేయడం ద్వారా అక్కడ వసూలు చేయాల్సిన యూజర్ చార్జీలు, పన్నులు ఎంత నిర్ణయించాలనే అంశంపై ఒక నివేదికను తయారు చేయనున్నారు. ఆస్తిపన్ను భూమి విలువ పెంపు, ఇతర లెవీలకు సంబంధించి అన్ని రూపాల్లోనూ ఆదాయ మార్గాలను గుర్తించేలా సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయనున్నారు. దీనికోసం నిర్మాణం ప్లానుకు వీలుగా కన్సల్టెన్సీని ఆహ్వానించారు. అలాగే ప్రస్తుతం సీఆర్డీఏ నుంచి రాజధానిగా మార్పునకు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లనూ చేయాలని నిర్ణయించారు. కొత్త నగరంలో ఎప్పటికప్పుడు జరిగే మార్పులపై ముఖ్యంగా ఆదాయ విద్య , ఉపాధి, మౌలిక సమపాయాల కల్పన, స్వయం సమృద్ధి వంటి వాటిని నిరంతరం పర్యవేక్షించేందుకు సర్వే చేయడం వంటి అంశాలకు వీలుగా నిబంధనలు రూపొందించనున్నాయి.

74వ రాజ్యాంగ సవరణ ప్రకారంమెట్రోపాలిటన్ ప్లానింగ్ కమిటీ ఏర్పాటుపైనా నివేదిక తయారు చేయాలని నిర్ణయించారు. ఈ ఏర్పాటులో పట్టణాభివృద్ధిశాఖ, సిఆర్డీఏ మెట్రోపాలిటన్ అథారిటీ ఒకదానికొకటి సమన్వయం చేసుకునేలా నూతన ప్రతిపాదనలు ఉండాలని తెలిపారు. ముఖ్యంగా డిజిటల్ గవర్నెన్స్‌పై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. అత్యంత కీలకమైన రాజధాని నగర పాలన హెచ్ ఆర్ పాలసీపై ప్రత్యేక శ్రద్ద పెట్టనున్నారు. ఇందులో ప్రస్తుతం ఉన్న సిబ్బందిని డిప్యూటేషన్ , లేదా ఇతర నియామకంతోపాటు, నైపుణ్యం ఉన్న ప్రైవేటు వ్యక్తులను నియమించుకోవడానికి వీలుగా నిబంధనలు ఉండాలని సూచించారు. వీటితోపాటు రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు రాజధాని సంస్థ మధ్య సమన్వయం కోసం ప్రత్యేక యంత్రాంగాన్నీ నియమించనున్నారు.

నేడు ఎపి మంత్రి మండలి సమావేశం

విజయవాడ,ఏప్రిల్9,ప్రభాతవార్తప్రతినిధి: ఏపీ మంత్రి మండలి సమావేశం శుక్రవారం జరుగుతుంది. ఈ సమావేశంలో పలు కీలకంశాలపై నిర్ణయం తీసుకుంటారు.ఇటీవల జరిగిన పెట్టుబడుల సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మంత్రి మండలి సమావేశంలో ఆమోదిస్తారు. క్వాంటమ్ వ్యాలీలో ఈ నెల 14న జరిగే కార్యక్రమాలు, అమరావతికి చట్టబద్ధత కల్పించినందుకు కేంద్రానికి కృతజ్ఞతలు తదితరం శాలు సమావేశంలో చర్చిస్తారు. ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరుగుతుంది.

వారం - వర్జ్యం

10-04-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, కృష్ణపక్షం, రేవతి కార్తె
అష్టమి రా.11.13
పూర్వాషాఢ ఉ.11.25
వర్జ్యం : రా.8.09-రా.9.54
దు.ఉ.8.24-ఉ.9.14,
2)మ.12.33-మ.1.23
రాహుకాలం - ఉ.10.30-12.00

వార్తాఫలం

మేషం: ఎటువంటి ప్రయోజనం ఉండదని తెలిపినా మీ ప్రమేయం లేకుండా మానసికంగా ఆలోచనలు చోటు చేసుకుంటాయి.

వృషభం: పలురంగాల పట్ల మీకున్న అనుభవం మీకు ఉపకరిస్తుంది. స్థిరాస్తి విషయంలలో ఒక నిర్ణయమునకు వస్తారు.

మిథునం: సంతాన పురోగతి మీరు ఆశించిన దానికంటే ఎక్కువగా ఉంటుంది. సేవాకార్యక్రమాలలో పాల్గొంటారు.

కర్కాటకం: తమ నైపుణ్యమునకు, సామర్థ్యంనకు తగినటువంటి స్థానం సంపాదించు కోవటానికి విశేషంగా కృషిచేస్తారు.

సింహం: నూతన విద్యావకాశాలు లభిస్తాయి. దీర్ఘకాలిక సమస్యలు తీరి ప్రశాంతత పొందుతారు. వాహనసౌఖ్యం.

కన్య : ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. భూముల విషయంలో నూతన అగ్రిమెంట్లు చేసుకుంటారు.

తుల : మీ పరిధులను, మీ యొక్క శక్తిని దృష్టిలో ఉంచుకొని ఉద్దేశ్య పూర్వకంగానే ఒక అవకాశాన్ని వదిలివేస్తారు.

వృశ్చికం: భాగస్వామ్య వ్యాపారాలలో ఒడిదుడుకులు ఉంటాయి. షేర్ల క్రయ విక్రయాలలో ప్రోత్సాహం లభిస్తుంది.

ధనుస్సు: జీవిత భాగస్వామితో మాట్లాడేటప్పుడు సంయమనం పాటించడం చెప్పదగినది. ఋణాలు తీరుస్తారు.

మకరం: అన్నీ సానుకూలంగా ఉన్నా వ్యవహార పురోభివృద్ధిలో ఏదో ఒక మెలిక ఏర్పడుతుంది.కొత్త మిత్రులు పరిచయ మవుతారు.

కుంభం: పెదవి దాటితే పృథివి దాటుతుందన్న నానుడి గుర్తుంచుకోవడం, తదనుగుణంగా నడుచుకొంటారు.

మీనం: చెప్పుకోదగిన ఒడుదుడుకులు లేకుండా కాలం గడుస్తుంది. విందు, వినోదాలలో పాల్గొంటారు.వస్త్రలాభం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

వైకుంఠమ్ కాంప్లెక్స్-3 నిర్మాణం కలేనా!

- పెరుగుతున్న భక్తులతో ఆవశ్యమన్న ప్రతిపాదనలు

- 2000లో వైకుంఠమ్ -2 కాంప్లెక్స్‌నిర్మాణం

తిరుమల,ఏప్రిల్ 9ప్రభాతవార్తప్రతినిధి: రోజు వారీగా సరాసరి లక్షమంది వరకు భక్తులు... సుమారుగా 80వేలమంది ఆ దేవదేవుని దర్శనం చేసుకుంటుండటం ప్రత్యేకత. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తే ఇక ఆ అదనపు క్యూలైన్లు ఆలయం వెలుపల నాలుగు కిలో మీటర్లు నిండిపోయి శిలాతోరణం, పాప వినాశనమ్ మార్గం వరకు వ్యాపిస్తున్నాయి. రోజురోజుకూ తిరుమలకు వస్తున్న భక్తుల సంఖ్య అనూహ్యంగా రెట్టింపవుతుండటంతో తిరుమలలో వెలుపల కిలోమీటర్లుక్యూలైన్లకు స్వస్తిపలకడానికి వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్-3 నిర్మాణం చేయాలనేది ప్రస్తుతం కోనసాగుతున్న బోర్డు ఆలోచన. అధికారుల ప్రతిపాదనలు. అయితే గత ఏడాదికాలంగా ఈ ప్రతిపాదనలు కార్యరూపం దాల్చడంలేదు. సాధారణరోజుల్లోనే లక్షమందివరకు భక్తులు తిరుమలకు వస్తున్నారు. ఇక వారాంతం, ప్రత్యేక పర్వదినాలు, విశేషరోజుల్లో 1.30-1.50లక్షల మంది వరకు భక్తులు చేరుకుంటున్నారనేది టిటిడి అంచనా.కొండపైకి 40వేలమంది భక్తులు వస్తే వైకుంఠమ్ 1, వైకుంఠమ్ 2 క్యూకాంప్లెక్స్‌లలో 62కంపార్టుమెంట్లు నిండిపోతున్నాయి. ఒక్కోకంపార్టుమెంట్‌లో 400మంది లెక్కన 25వేలమంది వరకు భక్తులు కూర్చునేందుకు సౌకర్యంగా ఉంటుంది. ప్రస్తుతం తిరుమలలో 40వేలమంది భక్తులు వస్తేనే వైకుంఠమ్ -1,2 క్యూకాంప్లెక్స్‌లు నిండిపోయి నారాయణగిరిషెడ్లు నిండి ఆలయం వెలుపల మూడుకిలోమీటర్లు దూరం శిలాతోరణం వరకు భక్తుల లైన్లు వ్యాపిస్తున్నాయి. వైకుంఠమ్ కాంప్లెక్స్‌లు నిండితేనే భక్తులకు కష్టాలు మొదలవుతాయి. ఎండకు,వానకు ,చలికి ఇబ్బందులు పడటం తప్పడంలేదు. ఇప్పటికీ టిటిడి పాలకమండలి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి వెలుపల క్యూలన్లలో భక్తులకు సకల సౌకర్యాలు కల్పించారు. దేశవిదేశాల నుంచి కొండకు వస్తున్న భక్తుల సంఖ్య పెరిగిపోతూ సామాన్య భక్తులకు మరింత సులభంగా దేవుని దర్శనం చేయించడం గగనంగా మారింది. ప్రస్తుత భక్తులరద్దీ పెరిగిపోతున్న పరిస్థితుల్లో వైకుంఠమ్ 3 మల్టీక్యూకాంప్లెక్స్ అవసరమనేది శ్రీవారిభక్తుడు, తిరుపతివాసి పినవీన్‌కుమార్‌రెడ్డి కూడా తన అభిప్రాయం వ్యక్తం చేశారు. భక్తుల సంఖ్యకు తగ్గట్లు సౌకర్యాలు మెరుగుపరచాలని, 1980లో భక్తులకు అప్పటి సంఖ్యకు తగ్గట్లు అవసరాలకు కనీసం తలదాచుకునేందుకు వైకుంఠమ్ 1 క్యూకాంప్లెక్స్ నిర్మాణం చేపట్టారు. 1983లో అప్పటి సిఎం ఎన్టీరామారావు ప్రారంభించారు. పుష్కరకాలానికి తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య మరింతగా పెరగడంతో 2000 సంవత్సరంలో వైకుంఠమ్ 2 కాంప్లెక్స్ నిర్మించి క్రౌడ్‌మేనేజ్‌చేశారు. నారాయణగిరి ఉద్యానవనాల్లోనే వైకుంఠమ్ 3 కాంప్లెక్స్ నిర్మాణం అవసరం ఎంతైనా ఉందనేది భక్తుల నుండి అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ కాంప్లెక్స్ నిర్మాణంతో వెలుపల కిలోమీటర్లు బారులుతీరడం నియంత్రించడం సులభమవుతుంది.

ఆదాయపన్ను శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌గా సురేశ్ బత్తిని

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఏప్రిల్9: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఆదాయ పన్ను శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌గా సురేశ్ బత్తిని నియమితులయ్యారు. ప్రస్తుతం మోరంపూడి అనిల్ కుమార్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌గా ఉన్నారు. ఆయన స్థానంలో సురేశ్ బత్తిని బాధ్యతలు చేపడుతారు. వీరిద్దరూ తెలుగువారే. సురేశ్ బత్తినిని నియమిస్తూ కేంద్రప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) ఉత్తర్వులు జారీ చేసింది. సురేశ్ బత్తిని గతంలో హైదరాబాద్ రీజియన్‌లో చీఫ్ కమిషనర్‌గా పని చేశారు. రెండు తెలుగు రాష్ట్రాలలోని పన్నుల పరిపాలన, ఆదాయ వసూళ్ల లక్ష్యాలు, శాఖాపరమైన అంశాలపై ఆయనకు పూర్తిస్థాయి అవగాహన ఉంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆదాయపన్ను శాఖకు సంబంధించి అత్యున్నత పదవి ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ పదవి. పన్ను వసూళ్ల లక్ష్యాలను పర్యవేక్షించడంతో పాటు చెల్లింపుదారులకు మెరుగైన సేవలు అందించడం, శాఖాపరమైన పరిపాలనను సమన్వయం చేయడం వంటివి ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ ప్రధాన బాధ్యతలు.

'ఆడుదాం ఆంధ్రా' క్రీడాపోటీల కార్యక్రమంలో అవినీతి ఆరోపణలపై విజిలెన్స్ నివేదిక!

- రూ.40కోట్లు మేరకు అవినీతి జరిగినట్లు నివేదికలో పేర్కొన్న విజిలెన్స్

విజయవాడ,ఏప్రిల్ 9,ప్రభాతవార్తప్రతినిధి: వైఎస్సార్సీపీ హయాంలో 'ఆడుదాం ఆంధ్రా" క్రీడాపోటీల కార్యక్రమంలో అవినీతి ఆరోపణలపై 'విజిలెన్స్ నివేదిక ప్రభుత్వానికి అందించింది. ప్రాథమిక సమాచారాన్ని అనుసరించి రూ. 40 కోట్ల మేర నిధులు దుర్వినియోగం అయినట్లు విజిలెన్స్ అధికారులు నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం.. ఈ వ్యవహారంలో విజిలెన్స్ అధికారలు, ఇందులో అప్పటి క్రీడాశాఖ మంత్రి రోజా, శాప్ మాజీ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డిపై పాత్రపై అనుమానం వ్యక్తం చేసినట్లు సమాచారం. కేసులు నమోదు చేయాలంటూ నివేదికలో విజిలెన్స్ నివేదికలో స్పష్టం చేసారంటున్నారు. వీరితో పాటుగా శాప్ ఇన్చార్జిగా పని చేసిన అప్పటి ఎండీ హర్షవర్ధన్ పైనా క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, అప్పటి స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ సురేశ్ కుమార్, మరో ఐఏఎస్ అధికారి ధ్యాన్ చంద్రతోపాటు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి వాణీ మోహన్ పైనా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

సిద్ధమవుతున్న ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితా

విజయవాడ,ఏప్రిల్ 9,ప్రభాతవార్తప్రతినిధి:ఉపాధ్యాయుల ప్రమోషన్స్ ప్రక్రియలో మరో కీలక అడుగు ముందుకు పడింది. సాధారణ సీనియారిటీ జాబితాల ధ్రువీకరణ కోసం అమరావతిలోని విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయంలో ఏప్రిల్ 13 నుండి 17 వరకు వివిధ జోన్ల వారీగా సీనియారిటీ జాబితాలను తనిఖీ చేయనున్నారు. ఈ ప్రక్రియ అనంతరం ఫైనల్ సీనియారిటీ జాబితాలు విడుదల అవుతాయి.

తిరుమల సమాచారం

ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.10 లక్షలు విరాళం

తిరుమల,ఏప్రిల్ 9ప్రభాతవార్తప్రతినిధి: తిరుమలకు వస్తున్న భక్తులకు ఆకలి అనేది తెలియకుండా రుచిగా శుచిగా అన్నప్రసాదాలు అందిస్తున్న ట్రస్ట్‌కు దాతలు తమవంతుగా విరాళాలందిస్తున్నారు. గురువారం ఉదయం బెంగుళూరుకు చెందిన జి.విజయ్ హేమంత్ కుటుంబసభ్యులతో కలసి వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు 10,00,104 రూపాయలు విరాళంగా ఇచ్చారు. ఈ విరాళాలను దాత టిటిడి అదనపు ఇఒ చిరూమామిళ్ళ వెంకయ్య చౌదరికి డిడిని అందజేశారు.

అంతా మంచి జరగాలని వేడుకున్నాం - సినీనటి నయనతార

తిరుమల,ఏప్రిల్ 9ప్రభాతవార్తప్రతినిధి: తెలుగుప్రజలందరికి మంచి జరగాలని, సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నట్లు సినీ నటి నయనతార ,దర్శకుడు విఘ్నేష్ శివన్ దంపతులు తెలిపారు. స్వామివారి ఆశీస్సులందు కుంటే మనసు ఎంతో ఆనందంగా ఉంటుందన్నారు. గురువారం ఉదయం కుటుంబసభ్యులతో కలసి తిరుమల శ్రీవారిని నయనతార,విఘ్నేశ్ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు.

జూనియర్ సివిల్ జడ్జిగా పద్మావతి వర్సిటీ విద్యార్థిని స్వర్ణ సుష్మా

తిరుపతి,ఏప్రిల్ 9ప్రభాతవార్తప్రతినిధి: తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం న్యాయ విభాగం విద్యార్థిని స్వర్ణ సుష్మా జూనియర్ సివిల్ జడ్జిగా (న్యాయమూర్తిగా) ఎన్నికయ్యింది. ఫైనల్ ఇయర్ చదువుతున్న ఆమె న్యాయమూర్తుగా ఎన్నికైనట్టు వర్సిటీ అధికారులు తెలిపారు. స్వర్ణ సుష్మా పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం న్యాయ విభాగంలో 3 సంవత్సరాల లా కోర్సు 2019-2022 బ్యాచ్లో ముగించి, ప్రస్తుతం ఇదే విశ్వవిద్యాలయంలో పీజీ లా కోర్సు చేస్తున్నట్టు వర్సిటీ అధికారులు తెలిపారు. తమ వర్సిటీ విద్యార్థి ఇంత ఘనత సాధించినందుకు లా విభాగం, వర్సిటీహర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వర్సిటీ ఉపకులపతి ఆచార్య ఉమ,రిజిస్ట్రార్ ఆచార్య ఉష , లా విభాగం అధికారులు స్వర్ణ సుష్మాకు సన్మానం చేశారు.

అమరావతికి చట్టబద్ధత హర్షణీయం :ఎంపి కలిశెట్టి

తిరుమల,ఏప్రిల్ 9ప్రభాతవార్తప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి చట్టబద్ధత రావడం హర్షణీయమని విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. అమరావతి రాజధాని నిర్మాణానికి సహకరించిన రాష్ట్రపతి, ప్రధాని, ఎంపిలకు, లోక్‌సభస్పీకర్‌కు తిరుమల శ్రీవారి ప్రసాదం తీసుకెళుతున్నట్లు చెప్పారు. రాజధాని ఏర్పాటుకు అండగా నిలిచిన అన్ని రాజకీయ పార్టీల నేతలకు కూడా శ్రీవారి ప్రసాదం (నేడు)శుక్రవారం అందజేస్తానని వెల్లడించారు. రాష్ట్రప్రజల చిరకాల స్వప్నం అమరావతికి దేవుని ఆశీస్సులు, అందరి సహకారం లభించడం శుభపరిణామమని ఎంపి కలిశెట్టి తెలిపారు. గురువారం ఉదయం తిరుమలకు వచ్చిన ఆయన విఐపి బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

హాజ్‌యాత్రీకులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి : మంత్రి ఫరూఖ్

గన్నవరం(కృష్ణా), ఏప్రిల్ 9, ప్రభాతవార్త : మనదేశంలోనే ముందుగా రాష్ట్ర రాజధాని అమరావతి నుండి హజ్‌యాత్రకు వెళుతున్న యాత్రీకులకు ఏవిధమైన ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్రమైనార్టీశాఖా మంత్రి ఎన్‌యండి.ఫరూఖ్ అధికారులను ఆదేశించారు. హజ్‌యాత్రీకులకు గన్నవరంలో ఏర్పాటు చేయనున్న శిబిరంపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈసంవత్సరం దేశంలో అందరికంటే ముందుగా విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుండి హజ్‌యాత్ర ప్రారంభం కానుండటం సంతోషంగా ఉందన్నారు. ఈనెల 17వతేదీ నుండి 19వతేదీ వరకు గన్నవరంలోని ఎస్‌యం కన్వెన్షన్ సెంటర్‌లో హజ్‌యాత్ర శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 18వతేదీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే కార్యక్రమంలో కన్వెన్షన్ సెంటర్ నుండి విమానాశ్రయం వరకకు వెళ్ళే బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తారని చెప్పారు. విజయవాడలో ఎంబార్కేషన్ పాయింట్ రావటానికి ముఖ్యమంత్రి చేసిన కృషి మరువలేనిదన్నారు. హజ్‌యాత్రీకులకు దేశంలో ఎక్కడా లేని విధంగా లక్షరూపాయల ఆర్ధికసాయం అందిస్తున్నామన్నారు. హజ్‌యాత్ర శిబిరంలో యాత్రీకులకు సురక్షిత చల్లని తాగునీరు, భోజనవసతి సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. మైనార్టీసంక్షేమశాఖ కార్యదర్శి సిహెచ్.శ్రీధర్ మాట్లాడుతూ విజయాడ ఎంబార్కేషన్ పాయింట్ నుండి 335మంది సౌదీకి వెళుతున్నారని తెలిపారు. సౌదీఅరేబియాలోని మక్కాలో 40రోజులపాటు హజ్‌యాత్రీకులు ఉంటారని వివరించారు. శిబిరంలో విధులు నిర్వహించే సిబ్బంది కోసం అప్రాన్‌లు, ఐడికార్డులు సిద్ధం చేయాలన్నారు. హజ్‌యాత్రీకులను కన్వెన్షన్ సెంటర్ నుండి విమానాశ్రయానికి తరలించేందుకు 5బస్సులను సిద్ధం చేయాలని సూచించారు. శిబిరం వద్ద ఏవిధమైన అవాంచనీయ సంఘటనలు జరుగకుండా బందోబస్తు ఏర్పాట్లు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. యాత్రీకుల కోసం శిబిరం వద్ద ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలన్నారు. యాత్రీకులు సౌదీనుండి తిరిగి వచ్చే వరకు వారికి అందుబాటులో ఉండేలా హెల్ప్‌లైన్ నెంబర్ కేటాయించాలన్నారు. రాష్ట్రహజ్‌కమిటీ చైర్మన్ హాజీషేక్ హసన్‌బాషా మాట్లాడుతూ ఈనెల 17వతేదీన యాత్రీకులు శిబిరం వద్దకు చేరుకుంటారని తెలిపారు. 18, 19తేదీల్లో రెండు ప్రత్యేక విమానాల్లో హజ్‌యాత్రీకులు తరలి వెళతారన్నారు. 18వతేదీ 160మంది, 19వతేదీ 175 మంది యాత్రీకులు, ఇద్దరు హజ్‌కమిటీ ఇన్‌చార్జీలు మొత్తం 177మంది ఇక్కడి నుండి వెళతారని చెప్పారు. ఈకార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, ఉర్దుఅకాడమీ చైర్మన్ ఫరూఖ్‌షుబ్లీ, గుంటూరు ఎమ్మెల్యే షేక్ నజీర్‌మహమద్, విజయవాడ అదనపు డిసిపి మురళీకృష్ణ తదితర అధికారులు పాల్గొన్నారు.

గంజాయి మత్తులో.. కారుతో బీభత్సం

గుంటూరు ఏప్రిల్ 9 ప్రభాత వార్త ప్రతినిధి : పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో గంజాయి మత్తులో ఉన్న కొందరు యువతీ యువకులు కారుతో వీరంగం సృష్టించారు. వేగంతో దూసుకొచ్చిన కారు ఒక్కసారిగా నియంత్రణ కోల్పోయి రోడ్డు పక్కన ఉన్న ఓ హోటల్లోకి దూసుకెళ్లింది.ఈ ప్రమాదంలో హోటల్లోని ఫర్నిచర్, ఇతర సామాగ్రి పూర్తిగా ధ్వంసమయ్యాయి. ప్రమాద సమయంలో హోటల్లో జనం తక్కువగా ఉండటంతో తృటిలో పెద్ద ప్రాణనష్టం తప్పింది. ఈ పరిణామంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ప్రమాదం జరిగిన విజయ బ్యాంకు సెంటర్ పరిసర ప్రాంతాల్లో పలు స్కూల్స్, కాలేజీలు ఉన్నాయి.నిత్యం వందలాది మంది విద్యార్థులు ఈ మార్గం గుండానే రాకపోకలు సాగిస్తుంటారు. కారు బీభత్సం సృష్టించిన తీరు చూసి అటుగా వెళ్తున్న విద్యార్థులు, వారిని బడిలో దింపేందుకు వచ్చిన తల్లిదండ్రులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఒకవేళ ఆ కారు రోడ్డుపై వెళ్లే విద్యార్థులను ఢీకొట్టి ఉంటే పరిస్థితి ఏంటని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఘటనా స్థలానికి చేరుకుని పోలీసులు తనిఖీ చేయగా కారు నడుపుతున్న వ్యక్తితో పాటు అందులో ఉన్నవారు గంజాయి మత్తులో ఉన్నట్లు గుర్తించారు. కారులో ఇద్దరు యువకులు, ముగ్గురు యువతులు ఉన్నట్లు సమాచారం. నిందితులందరినీ అదుపులోకి తీసుకున్న పోలీసులు వారిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. మత్తు పదార్థాల ప్రభావంతో వాహనాలు నడుపుతూ ఇతరుల చెలగాటమాడటంపై స్థానికులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. నిందితులను కఠినంగా శిక్షి ంచాలని కోరారు.

త్వరలో 5 కిలోల సిలిండర్లు

పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

విజయవాడ ఏప్రిల్ 9 ప్రభాతవార్త ప్రతినిధి: ఎల్‌పీజీ ఏజెన్సీలతో సంయుక్త కలెక్టర్లు నిత్యం సమీక్షించాలని ప్రజలను ఇబ్బంది పెడుతూ గ్యాస్ సిలిండర్లను పక్కదారి పట్టిస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో సిలిండర్ల డెలివరీలో జాప్యం జరుగుతోంది. బుకింగ్స్, డెలివరీలను రోజూ అప్‌డేట్ చేసే వ్యవస్థ అందుబాటులోకి రావాలి అని చెప్పారు. రాష్ట్రంలో గ్యాస్ సరఫరా, రబీ ధాన్యం కొనుగోలు తదితర అంశాలపై బుధవారం ఆయన కమిషనరేట్ నుంచి జిల్లాల సంయుక్త కలెక్టర్లు, పౌరసరఫరాలశాఖ అధికారులు, ఆయిల్ సంస్థలు ,గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. గ్యాస్ కొరతను అధిగమించేందుకు కేంద్రం 5 కిలోల సిలిండర్ల పంపిణీకి చర్యలు తీసుకుంటోంది. అవసరమైనవారికి వీటిని మార్గదర్శకాల ప్రకారం పంపిణీ చేయాలని కిరోసిన్ సరఫరాకు కూడా కేంద్రం సిద్ధంగా ఉంది. పాడేరు వంటి ప్రాంతాల్లో కిరోసిన్ అవసరం ఉంటుంది. ఇంకా ఎక్కడెక్కడ అవసరమో గుర్తించి పంపిణీకి చర్యలు తీసుకోవాలి అని సూచించారు.

ఖరీఫ్‌లో రికార్డు స్థాయిలో ధాన్యం సేకరించామని రబీలోనూ అదే స్ఫూర్తి కొనసాగించాలని మంత్రి మనోహర్ అధికారులను కోరారు. అకాల వర్షాలు పడే అవకాశం ఉన్న ప్రాంతాల్లో ధాన్యం సేకరణకు చర్యలు తీసుకోవాలి. రైతులకు ఇబ్బంది రాకూడదు అని పేర్కొన్నారు.

బర్డ్‌ఫ్లూ ప్రభావిత ప్రాంతాల్లో కోళ్ల రవాణా నిషేధం తొలగింపు!

విజయవాడ,ఏప్రిల్ 9,ప్రభాతవార్తప్రతినిధి: బర్డ్‌ఫ్లూ (ఎవిఎన్ ఇన్‌ఫ్లూయెన్‌జా) వ్యాప్తి చెందిన కారణంగా గతంలో కోళ్ల రవాణాకు నిషేదిత ప్రాంతాలు అమలు చేస్తుంది.తాజా ఆ నిషేదాన్ని ఎత్తి వేస్తూ.,ఆ ప్రాంతాలను ఫ్రీ ఏరియాలుగా గుర్తిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు వ్యవసాయ శాఖ ఎక్స్‌అఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఈ వ్యాధి ప్రబలిన నేపథ్యంలో తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కాకినాడ, కర్నూలు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలను ఇన్‌ఫెక్టెడ్ జోన్లుగా ప్రకటించి, 1 కిమీ పరిధిని ప్రభావిత ప్రాంతాలుగా, 1 నుంచి 10 కిమీ పరిధిని సర్వైలెన్స్ జోన్లుగా గుర్తించారు. ఈ ప్రాంతాల్లో కోళ్ల రవాణాపై కూడా ఆంక్షలు విధించారు. అయితే, పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ నివేదిక ఆధారంగా ప్రభుత్వం తాజా సమీక్ష జరిపి, ప్రస్తుతం పరిస్థితులు మెరుగుపడినట్లు గుర్తించింది. దీంతో ఈ జిల్లాల్లోని పలు గ్రామాలను ఎవియన్ ఇన్‌ఫ్లూయెన్‌జా వ్యాధి నుండి పూర్తిగా విముక్తి పొందిన ప్రాంతాలుగా ప్రకటిస్తూ డీనోటిఫికేషన్ జారీ చేసింది. పశ్చిమ గోదావరి జిల్లా: వెల్పూరు, తూర్పు గోదావరి జిల్లా: కనూరు అగ్రహారం, కర్నూలు జిల్లా ఎన్ఆర్ పేట, ఏలూరు జిల్లా బదంపూడి, ఎన్టీఆర్ జిల్లా అనుముల్లంక, కష్టారావుపాలెం,

కాకినాడ జిల్లా పిఠాపురం వార్డు నెం.21, చెందుర్తి ఈ ప్రాంతాలను ఇకపై "ఫ్రీ ఏరియా"గా ప్రకటిస్తూ, కోళ్ల వ్యాధి నియంత్రణ చట్టం 2009 ప్రకారం ప్రభుత్వం అధికారిక గెజిట్‌లో నోటిఫికేషన్ విడుదల చేయనుంది.

పొగాకు రైతుల ఆశలపై నీళ్లు

- డిసిపల్లిలో ప్రారంభమైన కొనుగోళ్లు

మర్రిపాడు (నెల్లూరు), ఏప్రిల్ 9, ప్రభాతవార్త : ఆరుగాలం అష్టకష్టాలు పడి పండించిన పొగాకుకు గిట్టుబాటు ధర లభించకపోవడంతో రైతుల ఆశలపై నీళ్ళు చల్లినట్లయ్యింది. జిల్లాలోని మర్రిపాడు మండలం డిసిపల్లిలో గురువారం అట్టహాసంగా కొనుగోళ్ళు ప్రారంభమయ్యాయి. ఈ తరుణంలోకేజీ పొగాకు ధర 250 రూపాయలు మాత్రమే పలికింది. దీంతో రైతులు నిరాశ చెందక తప్పలేదు. ప్రస్తుత ఏడాది సాగుచేసేందుకు రెట్టింపు పెట్టుబడులు పెట్టి పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించకపోవడంతో వారి ఆశలు అడియాశలయ్యాయి. తొలిరోజున కొనుగోళ్ళు ప్రారంభించే ముందుగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వ్యాపారస్తులు వేలంలో పాల్గొని పొగాకును కొనుగోలు చేశారు. ఈ వేలం కేంద్రానికి 18పొగాకు బేళ్ళను రైతులు తీసుకురాగా ఆ 18బేళ్ళను వ్యాపారస్తులు కొనుగోలు చేశారేఉ. ఈవేళలో 8కంపెనీల వ్యాపారస్తులు పాల్గొని పొగాకును కొనుగోలు చేశారు. మొదటగా వేలం నిర్వహణాధికారి సునీల్‌కుమార్ వేలంలో వ్యాపారస్తుల ముందు అధిక ధరను ఉంచగా అదే ధరకు అన్ని పొగాకు బేళ్ళు అమ్ముడుపోయాయి. అయితే రైతులు మాత్రం ఈ ధర గిట్టుబాటు కాదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుత ఏడాది పెట్టిన పెట్టుబడులకు కిలో గరిష్ట పొగాకు ధర 350రూపాయలు పలికితేనే రైతులు గట్టెక్కుతారని వ్యాపారస్తుల ముందు రైతులు వాపోయారు. లేని పక్షంలో అదే ధర పలికితే నష్టపోక తప్పదని అభిప్రాయం వ్యక్తం చేశారు.

భద్రాచలంలో రాజుకుంటున్న ఐదు పంచాయతీల రగడ

తెలంగాణలో విలీనం చేయాలని ఊపందుకుంటున్న ఉద్యమం

పోలవరం జిల్లా ప్రతినిధి,ఏప్రిల్ 9 ప్రభాతవార్త. భద్రాచలం పట్టణాన్ని ఆనుకొని ఉన్న ఆంధ్రాలోని ఐదు పంచాయతీలను తిరిగి తెలంగాణలో కలపాలని మరోసారి భద్రాచలంలో ఉద్యమం ఊపొందుకుంటుంది. రాష్ట్ర విభజనతో భద్రాచలం పట్టణం తప్ప మిగతా గ్రామాలన్నిటిని పోలవరం పేరుతో ఆంధ్రాలో కలపటంతో భద్రాచలం అభివృద్ధి ఆగిపోయిందని, భద్రాచలం పట్టణాన్ని ఆనుకొని ఉన్న ఐదు పంచాయతీల ప్రజలు సైతం తెలంగాణలో ఉండటానికి ఇప్పటికి ముగ్గు చూపటం కోసం మెరుపు. దాంతో మరోసారి ఐదు పంచాయతీలను తెలంగాణలో కలపాలన్న ఉద్యమం మరోసారి తెరపైకి వచ్చింది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ఉన్నాయి. దక్షి ణ అయోధ్యగా పేరు గాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రం భద్రాచలం అభివృద్ధి జరగాలంటే భద్రాచలం సరిహద్దులను ఆనుకొని ఉన్న ఆంధ్రాలోని గుండాల, పురుషోత్తపట్నం,యటపాక,పిచ్చుకలపాడు,కన్నాయగూడెం గ్రామ పంచాయతీలను తిరిగి తెలంగాణాలో విలీనం చేయాల్సిం దేనని అఖిలపక్ష పార్టీలు,ఆయా విభాగాల అనుబంధ సంఘాల, ఛాంబర్ ఆఫ్ కామర్స్, సామాజిక వర్గాల నాయకులు పట్టు బడుతున్నారు. ఐదు పంచాయతీల విలీనం కోరుతూ జరిగే ఉద్యమ సన్నాహక సమావేశం గురువారం భద్రాచలం పట్టణం లో నిర్వహించారు .తెలంగాణా ఉద్యోగ,ఉపాధ్యాయ,పెన్షనర్స్ ఐక్య వేదిక, తెలంగాణ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ(భద్రాచలం శాఖ)సారధ్యంలో మీడియా నిర్వహించారు. ఈ సమావేశంలో భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, టీజీఈజెఏసి సెక్రటరీ జనరల్, తెలంగాణా రాష్ట్ర గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు, భద్రాచలం సర్పం చ్ పూనెంకృష్ణ దొర,టిఎన్జిఒ జిల్లా నాయకులు చల్లగుళ్ళ నాగేశ్వరరావు, తెలంగాణా ఉద్యమ తొలితరం నాయకులు తిప్పన సిద్ధులు, కొండరెడ్ల సంఘం, వామపక్ష పార్టీల నేతలు,

AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్
సమాచార ప్రకటన

"ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్" ఏప్రిల్ 1వ, 2024 తేదీ నుండి AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్‌తో విలీనమైందని రుణగ్రహీతలందరికీ మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేస్తున్నాము. SARFAESI చట్టం, 2002 ప్రకారం వేలం ప్రక్రియ ద్వారా AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్. (ఒక షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకు) విక్రయించనున్న, క్రింద పట్టికలో పేర్కొన్న) తాకట్టు ఆస్తి నుండి తమ చర ఆస్తులను (movable assets) తొలగించుకోవాలని, క్రింద పేర్కొన్న రుణగ్రహీతలకు మరియు సహ-రుణగ్రహీతలకు తెలియజేయడమైనది. ఒకవేళ ఈ ఆస్తులను 15 రోజుల లోపు తొలగించని పక్షంలో, ఆ చర ఆస్తులు వారి సొంత ఖర్చుతో ఏదైనా ఇతర ప్రదేశానికి తరలించబడతాయి; అంతేకాకుండా, ఆ తరలింపు సమయంలో ఆస్తులకు ఏదైనా నష్టం వాటిల్లితే, దానికి వారే బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఇతర సందేహాల కోసం, క్రింద పేర్కొన్న సంబంధిత వ్యక్తిని సంప్రదించగలరు.

రుణ ఖాతా నం./రుణగ్రహీత/పేరు సహ-రుణగ్రహీత/తనఖాదారు/హామీదారు పేరు	సంప్రదించు వ్యక్తి
(Loan A/C No.) 23660000672973, ఉదూరి లక్ష్మీలావతి (రుణగ్రహీత), ఉదూరి వెంకటేశ్వరాచార్యులు (సహ-రుణగ్రహీత)	మోసిన్ బాషా T MD 8309312894
తనఖా పెట్టిన ఆస్తి వివరణ: ప్రకాశం జిల్లా - ఒంగోలు R.D - సింగరాయకొండ S.D - సింగరాయకొండ రెవెన్యూ మండలం - బింగినపల్లి గ్రామ పంచాయతీ - ఇంటి నెం. 1-163 - బింగినపల్లి గ్రామకంఠం, గ్రామ సర్వే నెం. 322 - మొత్తం విస్తీర్ణం 42 ఎకరాల 40 సెంట్లు ఇందులో, 04.06.2016 తేదీ దేవాదాయ శాఖ కమిషనర్ వారి ఉత్తర్వుల నెం. M2/9576/2016, తేదీ 04-06-2016 ప్రకారం, దేవాదాయ భూమిగా 0 ఎకరాల 32 సెంట్లు మినహాయించగా మిగిలిన విస్తీర్ణం 42 ఎకరాల 08 సెంట్లు; ఇందులో భాగముగా, నిర్దిష్ట సరిహద్దుల లోపల ఉన్న 0 ఎకరాల 08875 సెంట్లు లేదా 429.55 లేదా 360.8222చ.మీ. విస్తీర్ణం గల స్థలం (సైటు), అన్ని రాకపోకల మరియు సౌలభ్యపు హక్కులతో సహా.	
(Loan A/C No.) 23660000767475, గుండాల కోటయ్య (రుణగ్రహీత), గుండాల రాణి (సహ-రుణగ్రహీత)	మోసిన్ బాషా T MD 8309312894
తనఖా పెట్టిన ఆస్తి వివరణ: ప్రకాశం జిల్లా - ఒంగోలు R D-పొదిలి SD- పొదిలి మండలం - పొదిలి నగర పంచాయతీ రామాయణకండ్రిక గ్రామకంఠం S No-5/5- విస్తీర్ణం 145.2 చ.గ. సైట్ డోర్ నెం-4-7-అసెస్‌మెంట్ నెం-1191003645-RCC ఇల్లు మరియు సైట్ 5 D- ప్రకాశం జిల్లా ఒంగోలు ఆర్డీ-పొదిలి	
(Loan A/C No.) 23660000866259, అంబటి హిమానిమేలు (రుణగ్రహీత), అంబటి కోటేశ్వరమ్మ (సహ-రుణగ్రహీత)	మోసిన్ బాషా T MD 8309312894
తనఖా పెట్టిన ఆస్తి వివరణ: స్థిరాస్తి ఆస్తి వివరాలు: ప్రకాశం జిల్లా - సింగరాయకొండ S.D. - కొండపి రెవెన్యూ మండలం - పెట్లూరు గ్రామ పంచాయతీ, పెట్లూరు సర్వే నెం. 318లో గల 145.2 చదరపు గజాల స్థలం (దీని సరిహద్దులు క్రింద పేర్కొనబడ్డాయి). ఈ సరిహద్దుల లోపల, అన్ని రాకపోకల మరియు సౌలభ్యపు హక్కులతో కూడిన 145.2 చదరపు గజాలు (లేదా 121.968 చదరపు మీటర్లు) విస్తీర్ణం గల స్థలం.	
(Loan A/C No.) 23660000672483, సంకూరి నాగరత్నం (రుణగ్రహీత), సంకూరి విజయ్ కుమార్ (సహ-రుణగ్రహీత)	రవి కుమార్ M 9008720664
తనఖా పెట్టిన ఆస్తి వివరణ: గుంటూరు జిల్లా, గుంటూరు రెవెన్యూ డివిజన్, ఫిరంగిపురం ఉప-జిల్లా, ఫిరంగిపురం గ్రామ పంచాయతీ, ఫిరంగిపురం గ్రామం, సర్వే నెం. D.No 393/A/A1, ఇంటి నెం. 10-118, అసెస్‌మెంట్ నెం. 3908, విస్తీర్ణం: 113.33 చదరపు గజాలు RCC డాబా పై: 435 చదరపు అడుగుల RCC.	
(Loan A/C No.) 23660000764801, షేక్ సిరాజున్ (రుణగ్రహీత), షేక్ అన్వార్ పాషా (సహ-రుణగ్రహీత)	రవి కుమార్ M 9008720664
తనఖా పెట్టిన ఆస్తి వివరణ: పల్నాడు జిల్లా, నరసరావుపేట R.D., పెదకూరపాడు ఉప-జిల్లా, పెదకూరపాడు మండలం, పాటిబండ్ల గ్రామపంచాయతీ, పాటిబండ్ల గ్రామం, Sy.D No. 368/2A, ఇంటి నం. 2-56/1, అసెస్‌మెంట్ నం.567, పరిధి: 96-8 చ.గజాల RCC డాబా ఇల్లు.	
(Loan A/C No.) 23660000830947, చులమంచిల సత్యనారాయణ (రుణగ్రహీత), చులమంచిల కనక దుర్గ (సహ-రుణగ్రహీత)	రవి కుమార్ M 9008720664
తనఖా పెట్టిన ఆస్తి వివరణ: విస్తీర్ణం మొత్తం 0-03 సెంట్లు అనగా 145.2 చదరపు గజాలకు సమానం గల ఖాళీ స్థలం; దీనితో పాటు డోర్ నెం. 5-49/1, అసెస్‌మెంట్ నెం. 2713, RS.No. 163+# గల RCC భవనం. ఈ ఆస్తి I పోలవరం సబ్-డివిజన్, I పోలవరం మండలం, కేసనకుర్రు గ్రామ పంచాయతీ పరిధి, కేసనకుర్రు గ్రామం, గ్రామకంఠం, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పూర్వపు తూర్పు గోదావరి జిల్లా పరిధిలో ఉంది. 145.2 చదరపు గజాల స్థలంతో పాటు RCC భవనం, సాధారణ రాకపోకల మార్గాలు మరియు ఇతర సర్వ హక్కులతో కూడిన ఈ ఆస్తికి సంబంధించిన సరిహద్దు.	
(Loan A/C No.) 23660000258473, నెలటూరి ఇశ్రయ్య (రుణగ్రహీత), నెలటూరి అరుణ (సహ-రుణగ్రహీత)	మోసిన్ బాషా T MD 8309312894
తనఖా పెట్టిన ఆస్తి వివరణ: ప్రకాశం జిల్లా - ఒంగోలు R.D. - పొదిలి S.R. - మర్రిపూడి మండలం, వేమవరం గ్రామ పంచాయతీ - వేమవరం గ్రామం, సర్వే నం. 430లో 240 చదరపు గజాల స్థలం, నిర్దిష్ట సరిహద్దుల లోపల, అన్ని రాకపోకల మరియు సౌలభ్య హక్కులతో కూడిన 240 చదరపు గజాల స్థల విస్తీర్ణం.	
(Loan A/C No.) 23660000671965, బొక్క తిరుపతమ్మ (రుణగ్రహీత), బొక్క వెంకట సుబ్బయ్య (సహ-రుణగ్రహీత)	మోసిన్ బాషా T MD 8309312894
తనఖా పెట్టిన ఆస్తి వివరణ: ప్రకాశం జిల్లా, ఒంగోలు ఆర్.డి. పొదిలి ఎస్.ఆర్. పరిధి, మర్రిపూడి మండలం, వేమవరం గ్రామ పంచాయతీ, వేమవరం గ్రామం, సర్వే నం. 430లో గల 240 చదరపు గజాల స్థలం. ఈ స్థలం యొక్క సరిహద్దుల లోపల, అన్ని రాకపోకల మరియు సౌలభ్య హక్కులతో కూడిన 240 చదరపు గజాల విస్తీర్ణం.	
(Loan A/C No.) 22660000950762, నిమ్మితం సాయి (రుణగ్రహీత), నిమ్మితం శివ కుమారి (సహ-రుణగ్రహీత)	మోసిన్ బాషా T MD 8309312894
తనఖా పెట్టిన ఆస్తి వివరణ: ప్రకాశం-ఒంగోలు R.D - దాసి S.D - ముద్దమూరు మండలం - అమ్మలమడక పోస్టల్ - మక్కేనావారిపాలెం గ్రామ పంచాయతీ - అమ్మలమడక పోస్టల్, మక్కేనావారిపాలెం గ్రామం, D.No. 285 - ఇంటి నెం. 2-15 - అసెస్‌మెంట్ నెం. 378. ఆస్తి సరిహద్దులు: 169.4 చదరపు గజాలు లేదా 141.6184 చదరపు మీటర్ల విస్తీర్ణం కలిగిన స్థలం, దీనికి సంబంధించిన అన్ని రాకపోకల మార్గాలు మరియు సౌలభ్య హక్కులతో సహా.	
(Loan A/C No.) 23660000471772, ఉచురి ఆదెమ్మ (రుణగ్రహీత), ఉచురి సుప్రియ (సహ-రుణగ్రహీత)	మోసిన్ బాషా T MD 8309312894
తనఖా పెట్టిన ఆస్తి వివరణ: ప్రకాశం జిల్లా, ఒంగోలు ఆర్.డి. పొదిలి ఎస్.ఆర్. పరిధి, మర్రిపూడి మండలం, వేమవరం గ్రామ పంచాయతీ, వేమవరం గ్రామం, సర్వే నం. 430లో గల స్థిరాస్తికి సంబంధించిన పూర్తి వివరాలు ఇవి. సరిహద్దుల మధ్యన, రాకపోకల మార్గాలు మరియు ఇతర అనుబంధ హక్కులతో సహా, 253.11 చదరపు గజాల విస్తీర్ణం కలిగిన స్థలం ఈ ఆస్తి పరిధిలోనిది.	
(Loan A/C No.) 22660000952559, పెరికల రవి కుమార్ (రుణగ్రహీత), మట్టుపల్లి అను రాధ (సహ-రుణగ్రహీత)	రవి కుమార్ M 9008720664
తనఖా పెట్టిన ఆస్తి వివరణ: గుంటూరు జిల్లా, గుంటూరు ఆర్.డి. ఫిరంగిపురం ఉప-జిల్లా, ఫిరంగిపురం గ్రామ పంచాయతీ, ఫిరంగిపురం గ్రామం, టీ.ఎస్.నం. 391/A, బ్లాక్ నం. 10, డి. నం. 10-266, అసెస్‌మెంట్ నం. 2262, విస్తీర్ణం: 62 చదరపు గజాల స్థలం. ఇందులో, కింది అంతస్తులో 300 చదరపు అడుగుల RCC డాబా మరియు మొదటి అంతస్తులో 200 చదరపు అడుగుల ACC గృహం.	

తేది: 09/04/2026
ప్రదేశం : ఆంధ్రప్రదేశ్

సం/-
అధీకృత అధికారి, AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్.

వార్త

ఓర్పు లేకపోవడం ఒక రకమైన దౌర్జన్యం.
అది ప్రజాస్వామ్య ప్రగతికి అవరోధం.

- మహాత్మా గాంధీ

ప్రకృతితో చెలగాటాలొద్దు !

మానవ తప్పిదాల వల్లనే విపత్తులు ఒకదాని వెంట ఒకటి తోసుకువస్తున్నాయి. అపార ప్రాణ, ఆస్తి నష్టాలకు కారణాలవుతున్నాయి. వాతావరణంలో తలెత్తుతున్న అనేక మార్పులు ప్రకృతి వైపరీత్యాలకు దారి తీస్తున్నాయి. ఇందుకు ముందుగా నిందించాల్సింది, తప్పుపట్టాల్సింది మానవుడినే. పర్యావరణాన్ని కాపాడకపోతే మానవుడి మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుందని ఎందరో పర్యావరణ శాస్త్రవేత్తలు దశాబ్దాల తరబడి పదేపదే చెబుతున్నా పట్టించుకునేవారే లేకుండాపోతున్నారు. పర్యావరణాన్ని కాపాడడం అటుంచి తూట్లు పొడవడం దురదృష్టకరం. ప్రస్తుతం అమెరికా ఇజ్రాయెల్, ఇరాన్‌ల మధ్య జరుగుతున్న అణుయుద్ధంలో ఎంతటి విధ్వంసం జరుగుతున్నది వేరే చెప్పక్కర్లేదు. ముఖ్యంగా పర్యావరణానికి ఎంతటి చేటు తెస్తుందో శాస్త్రజ్ఞుల అంచనాలకు అందడం లేదు. ఇక అభివృద్ధి పేరుతో పాలకులు చేపడుతున్న కొన్ని కార్యక్రమాలు పర్యావరణానికి ఎంతో హాని చేస్తున్నాయి. ఇష్టానుసారంగా తవ్వకాలు మొదలు పెడితే కొండలను తొలచి ప్రాజెక్టులు, రహదారుల నిర్మాణం, నగరీకరణ పేరుతో ప్రపంచవ్యాప్తంగా కోట్లాది ఎకరాల పంట పొలాలను జనవాసాలుగా మార్చడం ఒకటేమిటి ఎన్ని విధాలుగా పర్యావరణానికి నష్టం చేయగలుగుతారో అన్ని మార్గాల్లో నిత్యం అన్వేషణ విధ్వంసం జరుగుతున్నాయి. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం భారత దేశ జనాభాయే మరో దశాబ్దం నాటికి నూటయాభై కోట్ల వరకు చేరుకుంటుందని అందుకు తగినట్టుగా దేశంలో సహజ వనరులపై ఒత్తిడి పెరుగుతుందని ప్రధానంగా అటవీ సంపద హరించుకుపోతుందని స్పష్టం చేసింది. ఇప్పటికే భారత్‌లో ప్రతిరోజూ దాదాపు మూడువందల ఎకరాలకుపైగా అటవీ భూములు అదృశ్యమైపోతున్నాయని ఐక్యరాజ్యసమితి నివేదికలో వెల్లడించింది. బొగ్గు గనులు, థర్మల్ విద్యుత్ కేంద్రాలు, పరిశ్రమలు, నదీ లోయ ప్రాజెక్టుల కోసం యథేచ్ఛగా అడవులను నరికివేస్తున్నారు. ఇలాంటి కారణాలు ఎన్నో పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్నాయి. ఇక ప్లాస్టిక్ కాగితాలు మట్టిలో కలిసిపోవడానికి కొన్ని వందల సంవత్సరాలు పడుతుంది. కొన్ని ప్లాస్టిక్ వస్తువులను నిషేధించినా అవి కాగితాలకే పరిమితమవుతున్నాయి. ఈ ప్లాస్టిక్ పర్యావరణానికి ఎంత నష్టం చేకూరుస్తున్నదో ప్రజల్లో అవగాహన కల్పించడంలో అధికార వర్గాలు విఫలమవుతున్నాయని చెప్పొచ్చు. పెట్రోలు, డీజిల్, ఇథనాల్ వాడకం గురించి చెప్పక్కర్లేదు. వాహన కాలుష్య నియంత్రణ మాటలకే పరిమితమవుతున్నది. ఎన్ని చట్టాలు చేసినా, మరెందరిపై జరిమానాలు విధించినా పెరుగుతున్న వాహనాల సంఖ్య రెట్టింపుస్థాయిలో వాహన కాలుష్యాన్ని పెంచుతున్నది. ఇక పరిశ్రమలు వదులుతున్న పొగ, ధూళికణాలు, తదితరవన్నీ కలిసి వాయుకాలుష్యాన్ని విస్తరిస్తున్నాయి. దేశ రాజధాని ఢిల్లీ లాంటి ప్రదేశాల్లో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరుకున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ముఖ్యంగా చలికాలంలో పరిస్థితి దారుణంగా తయారవుతున్నది. నీటి కాలుష్యం పరిస్థితి అదుపు తప్పుతున్నదేమో. పెరుగుతున్న మురికివాడలనుంచి వెలువడుతున్న కలుషిత నీరు అంచలంచెలుగా నదుల్లోకి చేరుకొని పెద్దపెద్ద నదులను మురికి కూపాలుగా మారుస్తున్నాయి. ఈ నది, ఆ నది అని కాదు. దేశంలోని నదుల్లో నీటి పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది. ఇలాంటి ఎన్నో కారణాలతో భూ ఉష్ణోగ్రత పెరిగి ప్రపంచంలోని తీర ప్రాంతాలు దీవులతోసహా అనేక దేశాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని పర్యావరణ శాస్త్రవేత్తలు హెచ్చరించారు. ఇలా ప్రకృతితో మనిషి ఆటలాడుకుంటుంటే ఇందుకు ప్రతీగా ప్రకృతి రెట్టింపు స్థాయిలో స్పందిస్తున్నది. పర్యావరణ సమతుల్యం దెబ్బతిన్న కారణంగా సకాలంలో వర్షాలు కురియడం లేదు. కురిస్తే ఒకే ప్రాంతంలో కుంభవృష్టి కురవడం, వరదలు, తుఫాన్‌లు భూకంపాలు లాంటి ఉపద్రవాలు చోటు చేసుకొంటున్నాయి. యేటా దాదాపు మూడువందల ఎనభైకి పైగా ప్రపంచవ్యాప్తంగా ఉపద్రవాలు సంభవిస్తున్నట్లు అధికార రికార్డులే వెల్లడిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది ఈ ఉపద్రవాలతో ప్రాణాలు పోగొట్టుకుంటే కోట్ల సంఖ్యలో రోగపీడితులు అవుతున్నారు. పాకిస్థాన్, ఇరాన్, హైతీ, న్యూజిలాండ్, నేపాల్ లాంటి ఎన్నో దేశాలలో వస్తున్న భూ కంపాలు విలయాన్నే సృష్టిస్తున్నాయి. సిరియాలో భూకంపం కారణంగా దాదాపు తొమ్మిదివేల మందికిపైగా అసువులు బాసారు. మెరోకోలో వచ్చిన భూకంప ప్రకంపనాలతో దాదాపు నాలుగువేల మంది జీవితాలు సజీవమయ్యాయి. పశ్చిమ ఆఫ్ఘానిస్థాన్‌లో భూప్రకంపనాలు విలయాన్నే సృష్టించాయని చెప్పొచ్చు. భారత్‌కు సంబంధించి కూడా అనేక ప్రాంతాల్లో భూ ప్రకంపన వార్తలు వింటూనే ఉంటున్నాం. చెన్నై, ముంబయి, కోల్‌కత్తా, పూణె, ఢిల్లీ లాంటి దాదాపు డెబ్భై నగరాలకు భూప్రకంప నాలు పొంచి ఉన్నట్లు శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తూనే ఉన్నారు. ఇక వరదలు, తుఫాన్‌లతోవ్యవసాయ రంగం కుదేలైపోతున్నది. తుఫాన్‌ల బారి నుంచి తీరప్రాంతాలు తప్పించుకోలేకపోతున్నాయి. గతంలో దివిసీమలో సంభవించిన తుఫాన్ సిరిధాన్యాలతో తులతూగే ఆ ప్రాంతాన్ని శవాల దిబ్బగా మార్చేసింది. ఇప్పటికీ ఆ బీభత్సం గురించి మరచిపోలేకపోతున్నారు. ఏదిఏమైనా ఉపద్రవాల నియంత్రణకు పర్యావరణాన్ని కాపాడేందుకు త్రికరణ శుద్ధిగా కృషి చేయాలి. అన్నింటికంటే ముఖ్యంగా ప్రజల్లో అవగాహన పెంచాలి. ఇందులో ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా మరెన్నో విలయాలు తప్పవు. భారీ మూల్యం చెల్లించక తప్పదు.

సంతృప్తిపడే వ్యక్తి ఏనాటికీ పేదవాడు కాదు. అలాగే అసంతృప్తి చెందే వ్యక్తి ఎన్నటికీ సంపన్నుడు కాలేడు.

థామస్ జెఫర్‌సన్



నేరస్తులను శిక్షించుటే ప్రధానంకాదు. నేరం చేయడానికి ఏ పరిస్థితులు పురికొల్పుతున్నాయో వాటిని తొలగించడం ముఖ్యం.

ఆల్బర్ట్‌కామూ

ప్రజావాక్కు

రోగులపై దయ,దాక్షిణ్యాలు చూపండి

అందినకాడికి రోగుల నుంచి దోచుకోవడమే ఈ ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రుల పని. రోగులకు వున్న సాధారణ జబ్బును కూడా మసి పూసి మారేడు కాయ చేసి వారి జేబులకు చిల్లులు పడేలా చేయడమే వారి పని. అదేమో గాని అక్కడి వాతావరణం చూస్తే గుండె ఆగినంత పని అవుతూ ఉంటుంది. అటురోగులకు, ఇటు రోగుల బంధువులకు కూడా. ఎందుకంటే ఒక్క రోజులో డిశ్చార్జ్ చేసే పేషెంట్‌ను కుడా మూడు రోజులు పెట్టుకొని వారికి కావలసిన కాడికి దండుకోవడమే వారి పని. కాబట్టి మనమంతా మన పెద్దలు సెలవిచ్చిన కొన్ని మంచి ఆరోగ్య చిట్కాలు పాటిస్తే కార్పొరేట్ ఆసుపత్రుల బారిన పడకుండా మనల్ని మనం కాపాడుకుంటూ మన ఆరోగ్యాన్ని మరో పది కాలాల పాటు వర్ధిల్లేలా చేసుకోవచ్చు. అలా చేయకుండా మన ఇష్టానుసారం ఒక పద్ధతి పాడు లేకుండాఆహారాన్ని తీసుకుంటే మాత్రం ఎవ్వరూ కాపాడలేరు.

- బుగ్గన మధుసూదనరెడ్డి, నంద్యాల జిల్లా

అక్రమ వ్యాపారాలను రద్దు చేయాలి

ఎస్సీ,ఎస్టీ పేదలు రాళ్ల రప్పలు సాగు చేసుకుంటున్న భూములను 1978లో గుర్తించి ప్రభుత్వం ఇనాం భూమిగా ఇచ్చింది. అట్టి భూమిని కేవలం వ్యవసాయ పంట పొలాలకు మాత్రమే వినియోగించాలి. ఇట్టి పంచారాయి భూములు రిజిస్ట్రేషన్ కావు.కానీ అక్రమంగా రెవెన్యూ రికార్డులలో పట్టా భూములుగా నమోదు చేసుకుని ప్రభుత్వబ్యాంకుల ద్వారారుణాలు తీసుకొని బర్లషెడ్డు నిర్మించి, పాడిగేదెలపై ఋణం తీసుకొని, అనుమతి లేని పాల డైరీలను నిర్వహిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని మండల కేంద్రాలలో ఆకస్మిక తనిఖీ నిర్వహించి అట్టి వ్యాపారాలను రద్దు చేయాలి. అదే ప్రాంతాలలో బెల్టు షాపుల దందా ఊరి చివరన జరుగుతున్న ఇలాంటి సంఘటనలను ప్రభుత్వం రద్దు చేయాలి.

- రాపాక రవీందర్, జనగాం

అహంకారం వీడితే

పంతాలను, దోషాలను విడిచిపెట్టి పరస్పరం సహకరించుకుంటూ ఇండియా కూటమి పార్టీలు రంగంలోకి దిగాలి. ఐక్యమత్యంతో పనిచేసి గెలుపును అందిపుచ్చుకోవాలి. అలాకాక మాకు ఎవరితోనూఅవసరం లేదు, నేను గొప్ప, నా పార్టీ గొప్ప, ఏ పార్టీతోనూ పొత్తు లేదు అంటూ అహంకారపు మాటలు వల్లే వేస్తూ ఒంటరిగా బరిలోకి దిగితే నష్టపోయేది ఇండియా కూటమి పార్టీలే.

-రాశి, హైదరాబాద్

వృద్ధులను నిర్లక్ష్యం చేయొద్దు

నేటి ఆధునిక సమాజంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నమై వ్యష్టికుటుంబాలు పెరగడంవల్ల వృద్ధులు తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నారు. ఒకప్పుడు ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్నవారు నేడు ఒంటరితనంతో కొట్టుమిట్టాడుతున్నారు. పిల్లలు ఉద్యోగాల రీత్యా దూరమవ్వడం, కనీస పలకరింపు కరువవ్వడం వల్ల వారిలో మానసిక వేదన, నిరాశ పెరుగుతున్నాయి. ఆర్థికంగా ఇతరులపై ఆధారపడటం వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తోంది. వృద్ధాశ్రమాల సంఖ్య పెరగడం సామాజిక పతనానికి నిదర్శనం. ఆస్తుల కోసం తల్లిదండ్రులను వేధించడం, వారిని భారంలా భావించి వదిలేయడం మానవత్వానికే మచ్చ. వృద్ధులు అనుభవాల గనులు. వారి జ్ఞానం నేటి తరానికి ఎంతో అవసరం. వారిని కేవలం ఇంటి పనులకే పరిమితం చేయకుండా,కుటుంబనిర్ణయాల్లో భాగస్వాములను చేయాలి. ప్రభుత్వాలు కూడా వృద్ధుల సంక్షేమం కోసం కఠినమైన చట్టాలు, ప్రత్యేక వైద్య సదుపాయాలు కల్పించాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

జలంతో చెలగాటం

వేసవి సెలవుల్లో ఎండ వేడిమికి ఉపశమనం కోసంకాలువ, చెరువు, బావి, సముద్రం, నదుల్లో ఈతకు వెళ్లి మృత్యువాత పడికన్నవారిని బంధుమిత్రులను దుఃఖసాగంలోకి నెట్టుతున్నారు. పిల్లలు పెద్దలు ప్రమాదమని తెలిసి కూడా ఏమీ కాదులే అన్న నిర్లక్ష్యం వల్ల బంగారు జీవితాన్ని బుగ్గిపాలు చేసుకుంటున్నారు. నిత్యం ఏదోఒక చోట ఇలాంటి దుర్ఘటనలు జరుగుతుండడం ఆందోళనకరం. అందుకే భయం కూడా మనిషికి వరమంటారు. లైఫ్‌లో సరదా ఒక భాగమని గుర్తించాలి. పర్యాటనలు, పండుగలు ఎంజాయ్ చేయాలికానీ జలంతో చెలగాటం వద్దు.

- ఆర్.వెంకటేష్ చరన్, బెంగళూరు

సంబంధాల అనుభూతులు

నేటి కాలంలో రక్త సంబంధాల కంటే స్నేహ సంబంధాలు, పరిచయ సంబంధాలు చాలా గొప్పవి. రక్త సంబంధాలు ఎల్లప్పుడూ మనకు దగ్గరగా ఉంటాయి. స్నేహ సంబంధాల వారితో అన్ని విషయాలు పంచుకోవచ్చు. అందరూ ఒకే వేదికపై పని చేసి అర్ధాంతరంగా మనకు అనుభూతుల్ని పంచి మననుండి దూరంగా వెళ్తారు. ఇలాంటి స్నేహ సంబంధాలను జీవితాంతం గుర్తుంచుకోవాలి. ఇలాంటి బంధాలు చాలా పదునుగా నమ్మకంగాను ఉంటాయి. అందుకే వీలైనంత వరకు నిరంతరం స్నేహ సంబంధాలను ముందుకు తీసుకెళ్లండి.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

బకాయిల భారంతో 'విద్య'కు దారేది?

విద్య అనేది కేవలం వ్యక్తిగత ప్రయోజనం కాదు, అది సామాజిక అభివృద్ధికి పునాది. బహుజన వర్గాల విద్యాభివృద్ధి లేకుండా సమానత్వం సాధ్యం కాదు. కాబట్టి ఈ సమస్యను రాజకీయ కోణంలో కాకుండా సామాజిక న్యాయదృష్టితో చూడాలి. మొత్తంగా చూస్తే, విద్యహక్కు కేవలం రాజ్యాంగంలో ఉన్న ఒక నిబంధనగా మిగలకుండా, ప్రతి పేద విద్యార్థి జీవితంలో నిజంగా అమలవ్వాలంటే ప్రభుత్వాలు తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించాలి. లేకపోతే శతాబ్దాలుగా కొనసాగుతున్న అన్యాయం మరో రూపంలో కొనసాగుతుంది. బహుజన వర్గాల భవిష్యత్తు విద్యపై ఆధారపడి ఉంది. ఆ విద్యను కాపాడటం అనేది కేవలం ఒక విధానం కాదు, అది ఒక సామాజిక బాధ్యత, ఒక నైతిక కర్తవ్యం. విద్యనుహక్కుగా మాత్రమేకాకుండా, సమానత్వానికి మార్గంగా భావించే దిశగా అడుగులు వేయాల్సిన సమయంఇదే.

మన్నారం నాగరాజు

భారతదేశ చరిత్రలో విద్య అనేది కేవలం జ్ఞానాన్ని అందించే సాధనం మాత్రమే కాదు, అది అధికారాన్ని, అవకాశాలను, సమానత్వాన్ని నిర్ణయించే అత్యంత ప్రభావవంతమైన ఆయుధంగా పనిచేసింది. కానీ ఈ ఆయుధం అందరికీ సమానంగా అందలేదు. శతాబ్దాలుగా వర్ణవ్యవస్థ కట్టుబాట్లలో బంధించబడిన బహుజన వర్గాలు, ప్రత్యేకంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ సమాజాలు, విద్య అనే హక్కు నుండి దూరం చేయబడ్డాయి. అస్పృశ్యత, అంటరానితనం వంటి అమానుష ఆచారాలు కేవలం వారి గౌరవాన్ని మాత్రమే కాదు, వారి భవిష్యత్తును కూడా కట్టడి చేశాయి. ఈ చారిత్రక అన్యాయాన్ని సరిదిద్దడానికి భారత రాజ్యాంగం ఒక మహత్తర సాధనంగా అవతరించింది. రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ స్పష్టంగా గుర్తించిన విషయం ఏమిటంటే, సమాజంలో శతాబ్దాలుగా కొనసాగుతున్న అసమానతలను కేవలం చట్టపరమైన సమానత్వంతోనే తొలగించలేమని, అందుకే రాజ్యాంగంలో ప్రత్యేక నిబంధనలు చేర్చి అణగారిన వర్గాల విద్యా, ఆర్థిక అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చారు. ఆర్టికల్ 21ఎ ద్వారా విద్యను ప్రాథమిక హక్కుగా గుర్తించడం, ఆర్టికల్ 46 ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల అభివృద్ధికి రాష్ట్రం ప్రత్యేక శ్రద్ధ చూపాలని పేర్కొనడం, ఈ నిబంధనలన్నీ చారిత్రక అన్యాయాలను సరిదిద్దడానికే ఉద్దేశించబడ్డాయి. అయితే, రాజ్యాంగంలో ఉన్న ఈ గొప్ప ఆలోచనలు వాస్తవ జీవితంలో ఎంతవరకు అమలవుతున్నాయన్న ప్రశ్న నేటికీ నిలిచే ఉంది. నేటి భారత సమాజంలో అక్షరాస్యత శాతం పెరిగినప్పటికీ, వర్గాల మధ్య అసమానతలు మాత్రం స్పష్టంగా కనిపిస్తూనే ఉన్నాయి. అగ్రవర్ణాలతో పోలిస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల విద్యా స్థాయి ఇంకా వెనుకబడినట్టే ఉంది. ఇది కేవలం ఆర్థిక సమస్య కాదు, ఇది చారిత్రకంగా ఏర్పడిన సామాజిక అడ్డంకులప్రతిబింబం. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలల కొరత, ఉపాధ్యాయుల లోపం, కుటుంబ ఆర్థిక పరిస్థితులు, చిన్న వయస్సులోనే పని చేయాల్సిన పరిస్థితులు, ఈ కారకాలన్నీ అణగారిన విద్యార్థులను విద్యా వ్యవస్థ నుండి దూరం చేస్తూనే ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వాలు చేపట్టిన సంక్షేమ పథకాలలో ఫీజు రీయింబర్స్మెంట్ ఒక కీలకమైన మైలురాయిగా నిలిచింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశపెట్టిన ఈ పథకం వల్ల వేలాది మంది పేద విద్యార్థులు ఉన్నత విద్యలోకి అడుగుపెట్టే అవకాశం పొందారు. ఇంజనీరింగ్, మెడిసిన్, డిగ్రీ, పీజీ వంటి కోర్సులు చదవడం కేవలం కలగానే ఉన్న కుటుంబాల్లో ఈ పథకం ఆశలను నింపింది. ఇది ఒక ఆర్థిక సహాయం మాత్రమే కాదు, ఇది ఒక సామాజిక మార్పుకు దారి తీసిన సంస్కరణ. కానీ రాష్ట్ర విభజన తర్వాత ఈపథకం అమలులో వచ్చిన మార్పులు గత ప్రభుత్వం చేసిన ఫీజు రీయింబర్స్మెంట్ ఇచ్చింది, కానీ ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలు ఆరు గ్యారెంటీలలో విద్యను ఆలస్యం, నిర్లక్ష్యం, ఇవన్నీ తీవ్ర ఆందోళనలను రేకెత్తించాయి. బకాయిల చెల్లింపుల్లో నెలలు కాదు, సంవత్సరాల ఆలస్యం జరుగుతుండటంతో కాలేజీలు విద్యార్థులపై ఒత్తిడి పెంచుతున్నాయి. ఫీజులు చెల్లించలేని పరిస్థితుల్లో విద్యా

ర్థులు హాల్ టికెట్లు పొందలేక పరీక్షలు రాయలేని స్థితికి చేరుతున్నారు. ఇది విద్యా హక్కును ప్రత్యక్షంగా ప్రభుత్వం దెబ్బతీసే పరిణామం. ఇటీవల హైకోర్టు ఇచ్చిన తీర్పు ఈ సమస్యను మరింత సంక్లిష్టం చేసింది. కాలేజీలు విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయవచ్చని చెప్పడం ద్వారా, బాధ్యతను ప్రభుత్వం నుంచి విద్యార్థులపై మళ్లించినట్లైంది. పేద విద్యార్థుల పరిస్థితిని పరిగణలోకి తీసుకోకుండా వచ్చిన ఈ తీర్పు సామాజిక న్యాయ సూత్రాలకు విరుద్ధమని అనేక విద్యార్థి సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన సూచనలు, పేద విద్యార్థుల హక్కుల పరిరక్షణ, వీటన్నింటినీ పట్టించుకోనట్లు అనిపిస్తోంది. ఇక్కడ ప్రధానంగా నిలిచే ప్రశ్న ఏమిటంటే, ప్రభుత్వం తన బాధ్యతను ఎంతవరకు నిర్వర్తించింది? కోర్టులో సరైన వాదనలు వినిపించడంలో విఫలమవడం, పథకం అమలులో నిర్లక్ష్యం చూపడం ఇవన్నీ పరిపాలనా అసమర్థతను సూచిస్తున్నాయి. అడ్వకేట్ జనరల్ పాత్రపై వచ్చిన విమర్శలు కూడా ఈ నేపథ్యంలోనే చూడాలి. విద్యార్థుల భవిష్యత్తు వంటి కీలకమైన అంశంలో ప్రభుత్వ నిర్లక్ష్యం అనేది అంగీకరించలేని విషయం. ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని బలోపేతం చేస్తామని చెప్పిన ప్రభుత్వం, ఇప్పుడు బకాయిలను విడుదల చేయడంలో ఆలస్యం చేయడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకవైపు ఫీజులు చెల్లించమని కాలేజీలు ఒత్తిడి తెస్తుండగా, మరోవైపు ప్రభుత్వం స్పందించకపోవడం విద్యార్థులను మానసికంగా కుంగదీస్తోంది. ఈ పరిస్థితి కొనసాగితే దానిప్రభావం కేవలం వ్యక్తిగత స్థాయిలోనేకాదు, సమాజస్థాయిలో కూడా తీవ్రంగా కనిపిస్తుంది. సుమారు14 లక్షల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల ఉన్నత విద్య ప్రమాదంలో పడితే, అది రాష్ట్ర అభివృద్ధిపై కూడాప్రభావం చూపుతుంది. విద్య లేకుండా ఉపాధి అవకాశాలు తగ్గిపోతాయి. తద్వారా పేదరికం, అసమానతలు మరింత పెరుగుతాయి. ఈ నేపథ్యంలో విద్యార్థి సంఘాలు, సామాజిక సంస్థలు చేపట్టిన నిరసనలు ఒక సహజ ప్రతిస్పందనగా కనిపిస్తున్నాయి. తమ హక్కుల కోసం పోరాడడం ప్రజాస్వామ్యంలో ఒక ప్రాథమిక హక్కు. రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, ప్రదర్శనలు నిర్వహిస్తూ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడం ద్వారా సమస్యకు పరిష్కారం కనుగొనాలని వారు ప్రయత్నిస్తున్నారు. ఇప్పుడు అవసరమైనది ఏమిటంటే, ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవడం. ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి. హైకోర్టు తీర్పుపై అప్పీల్ చేయడం ద్వారా విద్యార్థుల ప్రయోజనాలను కాపాడాలి. పథకాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా అమలు చేయడానికి చర్యలు తీసుకోవాలి. కాలేజీలతో సమన్వయం పెంచి విద్యార్థులపై ఒత్తిడి తగ్గించాలి. అదే సమయంలో సమాజం కూడా తన బాధ్యతను గుర్తించాలి. విద్య అనేది కేవలం వ్యక్తిగత ప్రయోజనం కాదు, అది సామాజిక అభివృద్ధికి పునాది. బహుజన వర్గాల విద్యాభివృద్ధి లేకుండా సమానత్వం సాధ్యం కాదు. కాబట్టి ఈ సమస్యను రాజకీయ కోణంలో కాకుండా సామాజిక న్యాయదృష్టితో చూడాలి. మొత్తంగా చూస్తే, విద్య హక్కు కేవలం రాజ్యాంగంలో ఉన్న ఒక నిబంధనగా మిగలకుండా, ప్రతి పేద విద్యార్థి జీవితంలో నిజంగా అమలవ్వాలంటే ప్రభుత్వాలు తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించాలి. లేకపోతే శతాబ్దాలుగా కొనసాగుతున్న అన్యాయం మరో రూపంలో కొనసాగుతుంది. బహుజన వర్గాల భవిష్యత్తు విద్యపై ఆధారపడి ఉంది. ఆ విద్యను కాపాడటం అనేది కేవలం ఒక విధానం కాదు, అది ఒక సామాజిక బాధ్యత, ఒక నైతిక కర్తవ్యం. విద్యనుహక్కుగా మాత్రమేకాకుండా, సమానత్వానికి మార్గంగా భావించేదిశగా అడుగులు వేయాల్సిన సమయంఇదే. ●

రక్షణ చట్టంతోనే సామాజిక న్యాయం సాధ్యం!

మేకల క్రిష్ణ

ఒకే దేశం - ఒకే చట్టం అనే నినాదం వినడానికి ఆకర్షణీయంగా అనిపించవచ్చు. కానీ భారతదేశం వంటి విభిన్న సామాజిక వర్గాలు ఉన్న దేశంలో అది ఎంతవరకు న్యాయం చేస్తుందన్న ప్రశ్న తప్పనిసరిగా ఎదురవుతుంది. ఎందుకంటే మన సమాజం ఒకే స్థాయిలో లేదు. కులం, వృత్తి, ఆర్థిక పరిస్థితి, విద్యా అవకాశాలు. ప్రతి అంశంలోనూ స్పష్టమైన అసమానతలు కనిపిస్తూనే ఉన్నాయి. అలాంటి పరిస్థితుల్లో అందరికీ ఒకే చట్టం అమలు చేస్తే నిజమైన సమాన న్యాయం సాధ్యమవుతుందా అన్నది ఆలోచించాల్సిన అవసరం ఉంది. స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు గడిచినా, రాజ్యాంగం ఇచ్చిన సమానత్వ హామీ పూర్తిగా కార్యరూపం దాల్చలేదనే వాస్తవాన్ని ఒప్పుకోవాల్సిందే. ముఖ్యంగా జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలు, ఇప్పటికీ అనేక రంగాల్లో వెనుకబాటుతనాన్ని ఎదుర్కొంటూనే ఉన్నారు. ఉద్యోగాల్లో, ఉన్నత విద్యలో, పాలనలోవారి ప్రాతినిధ్యం ఆశించిన స్థాయిలో లేదు. ఇది కేవలం సంఖ్యల సమస్య కాదు, అవకాశాల పంపిణీలో అసమానాతలకు సంకేతం. సామాజికంగా అణగారిన వర్గాలపై జరుగుతున్న అన్యాయాలను అరికట్టేందుకు ప్రత్యేక చట్టాలు తీసుకు రావడం ప్రభుత్వ బాధ్యత. అందుకే ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దౌర్జన్యాలను నిరోధించేందుకు అట్రాసిటీ చట్టం అమల్లోకి వచ్చింది. ఈ చట్టం ద్వారా బాధితులకు రక్షణ లభించడమే కాకుండా, న్యాయం కోసం ముందుకు వచ్చే ధైర్యం కూడా పెరిగింది. అంటే, ప్రత్యేక రక్షణ ఉన్నప్పుడే అణగారిన వర్గాలకు న్యాయం జరుగుతుందని అనుభవపూర్వకంగా తెలుసుకున్న సత్యం. ఇదే సమయంలో బీసీల పరిస్థితిని పరిశీలిస్తే, సమస్యలు ప్రత్యక్షంగా కనిపించకపోయినా చాలా ఉన్నాయి. వృత్తుల్లో పరిమితులు, ఆర్థికంగా స్థిరపడలేకపోవడం, నాణ్యమైన విద్యకు అడ్డంకులు, రాజకీయంగా సరైన ప్రాతినిధ్యం లేకపోవడం ఇవన్నీ బీసీ వర్గాల అభివృద్ధిని నిరోధిస్తున్న అంశాలు. గ్రామీణ ప్రాంతాల్లో భూమి లేని కుటుంబాల్లో, చిన్నచిన్న ఉపాధులపై ఆధారపడే వర్గాల్లో బీసీల శాతం గణనీయంగా ఉంది. అంటే, అభివృద్ధి ఫలాలు అందరికీ సమానంగా చేరలేదన్నది స్పష్టమవుతోంది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో బీసీలకు రక్షణ చట్టం తీసుకురావడానికి ప్రభుత్వం కసరత్తు ప్రారంభించడం ఒక శుభ పరిణామం. స్వతంత్ర భారతదేశంలో 50 శాతానికి పైగా జనాభా కలిగిన వర్గం ఇప్పటికీ సామాజికంగా వెనుకబడిన స్థితిలో ఉండటం ఆలోచించాల్సిన విషయం. బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా అనేక రూపాల్లో అణచివేతను ఎదుర్కొంటున్నారనే వాదనను పూర్తిగా విస్మరించలేం. ఇలాంటి పరిస్థితుల్లో బీసీలకు కూడా ప్రత్యేక రక్షణ చట్టం అవసరమా అన్న చర్చ సహజంగానే ముందుకు వస్తోంది. ఇది కేవలం రాజకీయ నిర్ణయం మాత్రమే కాదు.సామాజిక న్యాయసాధనలో ఒక ముఖ్యమైనఅడుగు. ఒక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యేకంగా గుర్తించి, వాటికి చట్టపరమైన రక్షణ కల్పించడం ద్వారానే సమానత్వాన్ని సాధించవచ్చు అన్నది వాస్తవం. సమానత్వం అంటే అందరికీ ఒకే విధంగా వ్యవహరించడం కాదు. అసమాన పరిస్థితుల్లో ఉన్నవారికి ప్రత్యేక రక్షణ ఇవ్వడం ద్వారానే నిజమైన సమాన న్యాయం సాధ్యమవుతుంది. భారత రాజ్యాంగం కూడా ఇదే భావనను ప్రతిపాదిస్తుంది. అందుకే రిజర్వేషన్లు, ప్రత్యేక చర్యలు అమల్లోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభమైన బీసీల రక్షణ చట్టంపై చర్చ తెలంగాణలోనూ ముందుకు రావాల్సిన అవసరం ఉంది. బీసీ వర్గాలు ఎదుర్కొంటున్న అన్యాయాలు, అణచివేతలు కనిపించకపోయినా అవి వాస్తవాలు. వాటిని గుర్తించి చట్టబద్ధమైన రక్షణ కల్పించడం రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత. తెలంగాణలో కూడా బీసీలకు రక్షణ చట్టం తీసుకురావడం కేవలం ఒక విధాన నిర్ణయం కాదు, అది సామాజిక న్యాయానికి ఇచ్చే హామీ. అణగారినవర్గాల గౌరవం, భద్రత, హక్కులు రక్షించబడినప్పుడే సమాజం సమానత్వ దిశగా సాగుతుంది. అందుకే తెలంగాణలోనూ బీసీలకు రక్షణ చట్టం తీసుకురావాలి. అదే నిజమైన న్యాయం, అది ప్రభుత్వ బాధ్యత కూడా. ●

యుద్ధోన్మాదం వీడండి.. శాంతివైపు అడుగులేయండి

వి.వి.కె.సురేష్

పర్యావరణ పరిరక్షణ, కృత్రిమ మేధ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన సద్వినియోగం, ఉపాధి పరిరక్షణ వంటి మానవాళి మౌలిక సమస్యలపై సునిశితమైన దృష్టి పెట్టాల్సిన కీలక నేపథ్యంలో, గత నెల రోజులకు పైగా అమెరికా, ఇజ్రాయిల్ ఒక ప్రక్క, మరోవైపు ఇరాన్ కొనసాగిస్తున్న అమానుష యుద్ధం ఫలితంగా ప్రపంచ దేశాలపై తీవ్రమైన దుష్ప్రభావం పడింది. ఎటువంటి యుద్ధంలోనైనా ఇరు ప్రక్కల వినాశనం తప్ప,ఏ ఒక్కరికీ విజయం మాత్రం దక్కదని, పరాజితులు తప్ప, యుద్ధాల్లో చివరకు విజేతలు ఎవరూ ఉండరని చరిత్రలో ఎన్నో సందర్భాల్లో స్పష్టంగా రుజువైంది. ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న అహంకారపూరిత వైఖరి మాత్రమే ఈ యుద్ధానికి ముఖ్యకారణం అనడంలో ఎటువంటి సందేహం లేదు. ఇప్పటికే పాలస్తీనాలోని ప్రాంతాలపై గత రెండేళ్లకు పైగా మారణహోమం సాగిస్తున్న ఇజ్రాయిల్, అమెరికాకు వంతపాడుతూ ఈ యుద్ధంలో మరో భాగస్వామిగా ఉంది. ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్ట్ (ఐ.సి.సి) ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహును ఒక యుద్ధ నేరస్తునిగా ఇప్పటికే ప్రకటించింది. ట్రంప్ వలలో చిక్కుకోకుండా అప్రమత్తంగా వ్యవహరించిన నాటో దేశాలను తప్పనిసరిగా అభినందించాలి. ఇరాన్‌పై తప్పుడు ఆరోపణలతో, అవివేకమైన అంచనాలతో యుద్ధబరిలోకి ఏకపక్షంగా దిగిన ట్రంప్ ఇప్పుడు దిక్కుతోచని సంకట స్థితితో సతమతమవుతున్నాడు. అసలు ఏ లక్ష్య సాధనకు యుద్ధం మొదలు పెట్టాడో అర్థం కాని అయోమయ స్థితికి ట్రంప్ నెట్టబడ్డాడు. చివరకు తన సొంత దేశమైన అమెరికా ప్రజల తీవ్ర ఆగ్రహానికి ఆయన గురయ్యారు. మితిమీరిన ఆయన యుద్ధకాంక్షను అమెరికన్ కాంగ్రెస్ కూడా తప్పు పట్టింది. యుద్ధ ప్రభావాన్ని చర్చించిన బ్రిటిష్ పార్లమెంట్ కూడా మిత్ర దేశమైన అమెరికాకు దూరంగా ఉండాలని నిర్ణయించుకుంది. ఐక్యరాజ్య సమితి చేసిన పలు తీర్మానాలను, అంతర్జాతీయ న్యాయ సూత్రాలను అమెరికా ఉల్లంఘింస్తోంది. అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధాన్ని ప్రారంభిస్తే, యుద్ధాన్ని మాత్రం తామే ముగిస్తామని ఇరాన్ ధీమాగా చెబుతోంది. ఇరాన్ పై ఆకస్మికంగా, అన్యాయంగా యుద్ధాన్ని ప్రారంభించిన ట్రంప్, గడియ గడియకో మాట చెబుతూ, రోజుకొక విధానం అనుసరిస్తున్నాడు. ఇరాన్‌ను మళ్లీ రాతియుగంలోకి పంపిస్తామని బెదిరిస్తున్నాడు. ఇరాన్ పై దాడి చేసి వందల మంది పిల్లలను చంపేయడం వర్ణించలేని కిరాతక చర్య. మొత్తం యుద్ధంలో ఇరుపక్షాల వైపు చమురు క్షేత్రాలు, మిలటరీ కేంద్రాలు, ఆసుపత్రులు, విద్యుత్‌ప్లాంట్లు, పాఠశాలలు, వంతెనల వంటి కీలక కేంద్రాలు ధ్వంసమవుతున్నాయి. ఇరాన్ శక్తియుక్తుల్ని తక్కువగా అంచనా వేయడమే ట్రంప్ అహంకారానికి, అనాలోచిత వైఖరికి నిదర్శనం. చరిత్రను విశ్లేషిస్తే, అమెరికా ఎటువంటి గుణపాఠాలు నేటికీ నేర్చుకోలేదని అర్థమవుతోంది. గతంలో చిలీ, లిబియా, ఇరాక్ వంటి దేశాలకు సంబంధించి అమెరికా అత్యంత

దుర్మార్గంగా వ్యవహరించింది. వియత్నాం చేతుల్లో ఘోరంగా దెబ్బతింది. వెనిజువేలా అధ్యక్షుడు మదురోను అర్ధరాత్రి వేళ అక్రమ పద్ధతుల్లో కిడ్నాప్ చేసి ఆయన్ను బంధించి అమెరికాకు తరలించడం దేశాల సార్వభౌమాధికారంపై దాడి చేయడమే. అర్థంపర్థం లేనివిధంగా పలు దేశాలపై ట్రంప్ భారీ సుంకాలు విధించడం కూడా ఆర్థిక అగ్రవాదమే. ఒక రకంగా అదీ యుద్ధమే. మరోవైపు ఇరాన్ సమయస్ఫూర్తితో గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలను లక్ష్యంగా ఎంచుకుని వాటిపై దాడి చేస్తోంది. సామ్రాజ్యవాద, దురహంకార పెత్తనం చెలాయించే అమెరికాకు ఇరాన్ రూపంలో తీవ్ర ప్రతిఘటన ఎదురవుతోంది. అసలు గల్ఫ్ దేశాల్లో అమెరికా స్థావరాలు దీర్ఘకాలంగా ఉండటమే అమెరికా ఆధిపత్య ధోరణికి నిదర్శనం. తన రక్షణ వ్యాపారం కోసం, చమురు సంపద కోసం, పశ్చిమాసియాపై తన రాజకీయ, ఆర్థిక పెత్తనం కోసం అమెరికా ఈ దుర్నీతికి అనేక సంవత్సరాలుగా పాల్పడుతోంది. ఫలితంగా పశ్చిమాసియాలో తీవ్ర అనిశ్చితి నెలకొంది. హర్మూజ్ జలసంధిని ఇప్పుడు ఇరాన్ మూసేసింది. ఫలితంగా భారత్‌తో సహా అన్ని దేశాలు చమురు కష్టాలు పడుతున్నాయి. చమురు బ్యారెల్ ధరలు కూడా విపరీతంగా పెరిగాయి. అమెరికాతో సహా పలు దేశాలు తమ రక్షణ బడ్జెట్‌ను భారీగా పెంచేసాయి. యుద్ధ ప్రభావం తీవ్రంగా ఉండటంతో ప్రపంచ దేశాలకు పలు రకాల ఇబ్బందులు ఎదురయ్యాయి. పలు దేశాల ఆర్థిక వ్యవస్థలు చిన్నాభిన్నమవుతున్నాయి. ద్రవ్యోల్బణం, ధరలు పెరిగాయి. ఎగుమతులు, దిగుమతుల వ్యవస్థలు దెబ్బతిని వాణిజ్య రంగం కునారిల్లుతోంది. హర్మూజ్ జల సంధి ద్వారా జరిగే చమురు రవాణాకు తీవ్ర విఘాతం ఏర్పడింది. ఇరాన్‌తో భారత్ కున్న సాంప్రదాయక మిత్రత్వం వల్ల కొంత మేరకు ఉపశమనం లభించింది. అయితే రూపాయి విలువ రికార్డ్ స్థాయి పతనం, క్రూడ్ ఆయిల్ ధరల పెరుగుదల, భారీ వాణిజ్యలోటు వంటి తీవ్ర సమస్యలను భారత్ ఎదుర్కొంటోంది. గల్ఫ్ దేశాల నుండి సుమారు 4 లక్షల మంది భారత్‌కు తిరిగి వచ్చేసారు. ఐక్య రాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ యుద్ధాన్ని వెంటనే విరమించాలని అమెరికా, ఇజ్రాయిల్, ఇరాన్ దేశాలకు గట్టిగానే చెప్పారు. కానీ ప్రపంచ శాంతి, దేశాల భద్రత కోసం ఆయన చేసిన సూచనలను పెడచెవిన పెట్టడం సహించరాని విషయం. వీటో అధికారం కల్గిన అమెరికా వంటి ఒక అగ్రదేశం ఐక్యరాజ్య సమితి నిర్ణయా లను ఖాతరు చేయకపోవడం అనైతికం. అదే సందర్భంలో 'ప్రతి దేశం తమ సొంత ప్రయోజనాల కన్నా, అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు కట్టుబడి ఉండటం ఎంతో మిన్న' అంటూ స్పెయిన్ ప్రధానమంత్రి పెడ్రో సాంచెజ్ ఇచ్చిన అపూర్వమైన సందేశం ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలిచింది. అంతే కాకుండా ఇజ్రాయిల్ నుండి తమ దేశ రాయబారిని వెనక్కు రప్పించి యుద్ధం పట్ల తీవ్ర వ్యతిరేకతను ఆయన గట్టిగా వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తక్షణమే యుద్ధ విరమణ జరగాలి. అప్పుడే విపత్కర పరిస్థితుల నుండి భారత్‌తో సహా మొత్తం ప్రపంచ దేశాలు బయట పడతాయి. యుద్ధ విరమణ కోసం అన్ని దేశాలు తమ వంతు కృషి చేయాలి, అంతే కాదు బిగ్గరగా గళమెత్తాలి. తద్వారా ప్రపంచం యావత్తు అస్థిరతలో కూరుకుపోయే పెను ప్రమాదాన్ని నివారించాలి. ●

అనుమానస్పద స్థితిలో కుళ్ళిపోయిన మృతదేహం గుర్తింపు

కంచికచర్ల ఏప్రిల్ 9 ప్రభాతవార్త: కంచికచర్ల మండల పరిధిలోని పరిటాల గ్రామ హైవే పక్కన ఉన్న ఆంజనేయ స్వామి గుడి సమీపాన ఉన్న ముళ్ళకంప పొదలో కుళ్ళిన స్థితిలో ఒక మగ శవం ఉన్నట్లు ది.9.4.2026 గురువారం కంచికచర్ల పోలీస్‌లకు అందిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా మృతి చెందిన వ్యక్తి హైదరాబాద్‌లోని కాప్రాకు చెందిన చంపేటి మాల కొండయ్య 55 సంవత్సరాలు సన్‌ఆప్ పెద్ద మాల కొండయ్య అనే వ్యక్తి ఆర్థిక ఇబ్బందుల కారణంగా పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుని భార్య స్వరూప తెలియజేసింది. సదరు మృతుడు మాల కొండయ్య పై మార్చి 26 తేదీన హైదరాబాద్‌లోని కుషాయి గూడ పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు అయి ఉన్నది. సదరు మృతుడి భార్య స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కంచికచర్ల పోలీస్ వారు అనుమానస్పద మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కంచికచర్ల ఎస్సై విశ్వనాథ్ తెలియజేశారు.

పేకాట ఆడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

కంచికచర్ల ఏప్రిల్ 9 ప్రభాతవార్త: కంచికచర్ల పట్టణంలో ది.08.04.2026 వ తేదీన బుధవారం అర్ధరాత్రి సమయంలో కంచికచర్ల వాటర్ ప్లాంట్ వెనుక బజార్‌లోని ఒక ఇంట్లో పేకాట ఆడుతున్నారు అనే పక్కా సమాచారం మేరకు కంచికచర్ల ఎస్సై 2 నాని నరేంద్ర తన సిబ్బందితో కలిసి పేకటా ఆడుతున్న 8 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి 3850/- రూపాయ నగదు మరియు పేకాట ఆడే పేకలను స్వాధీన చేసుకొని వారిని స్టేషన్‌కు తరళించి కేసు నమోదు చేసిన కంచికచర్ల ఎస్సై విశ్వనాథ్.

వేసవిలో ఆరోగ్యకర ఆహారం అవసరం

అమరావతి, ఏప్రిల్ 9, ప్రభాతవార్త : వేసవిలో జిమ్ సెషన్లు ఎంత అవసరమో ఆరోగ్యకరమైన శరీర బరువును తీర్చిదిద్దడానికి ఆరోగ్యకరమైన ఆహారం అంతే అవసరమని న్యూఢిల్లీలోని మాక్స్ హెల్త్‌కేర్ డైటెటిక్స్ రీజనల్ హెడ్ రితికా సమద్దార్ తెలిపారు. పోటీన్, ఆరోగ్యకరకొవ్వులు, విటమిన్ ఇ, మెగ్నిషియం పుష్కలంగా వున్న కాలిఫోర్నియా బాదంతో ఆరోగ్యకరమైన జీవనం లభిస్తుందన్నారు.

విజయవాడ వార్త

అన్న క్యాంటీన్‌లో మెరుగైన సేవలందించాలి

జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

విజయవాడ కార్పొరేషన్,ఏప్రిల్ 9,ప్రభాతవార్త : అన్న క్యాంటీన్‌లో ప్రజలకు అందిస్తున్న సేవలు మెరుగ్గా ఉండేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్

లక్ష్మీశా ఆదేశించారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్,మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి అయిన ఆయన గురువారం ఉదయం హెచ్‌బి కాలనీలో ఉన్న అన్న క్యాంటీన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్యాంటీన్‌కు వచ్చే ప్రజలతో తానే నేరుగా మాట్లాడి, అందిస్తున్న ఆహారంలో నాణ్యత,పారిశుద్ధ్య నిర్వహణ,మౌలిక సదుపాయాలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.అనంతరం క్యాంటీన్ వెలుపల ట్రస్ట్ అధ్వర్యంలో నిర్వహిస్తున్న మజ్జిగ పంపిణీ కేంద్రంలో ప్లాస్టిక్ గ్లాసులను వినియోగించడం గమనించిన ఆయన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తక్షణమే నిలిపివేయాలని ఆదేశించారు. ప్లాస్టిక్ వాడకం పర్యావరణానికి హానికరమని, ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలిపారు. పర్యావరణహితమైన ప్రత్యామ్నాయ వస్తువులను ఉపయోగిస్తూ మజ్జిగ పంపిణీ చేయాలని సూచించారు.క్యాంటీన్ పక్కనున్న పార్కులో జరుగుతున్న నిర్వహణ పనులను కూడా ఆయన పరిశీలించారు. పార్కు నిర్వహణకు ఎంతమంది సిబ్బంది పనిచేస్తున్నారు,వారు ప్రతి రోజు ఏ సమయాల్లో హాజరవుతారు వంటి వివరాలను అధికారులనడిగి తెలుసుకున్నారు. పార్కు శుభ్రత,నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా చూసుకోవాలని సూచించారు.

పార్కులను ఆహ్లాదకరంగా ఉండేటట్లు చర్యలు తీసుకుంటున్నాం : కమీషనర్ ధ్యానచంద్ర

విజయవాడ కార్పొరేషన్,ఏప్రిల్ 9,ప్రభాతవార్త : వేసవి కాలంలో స్కూల్ పిల్లలకు సెలవులు ఉంటాయి కాబట్టి వారికి ఆడుకోవడానికి పార్కులను అనుగుణంగా,అందంగా,ఆహ్లాదకరంగా ఉండేటట్లు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. గురువారం ఉదయం తన పర్యటనలో భాగంగా స్వాతి రోడ్డు,కుండల బజార్,హెచ్‌బి కాలని ప్రాంతాలన్నీ పర్యటించి

క్షేత్రస్థాయిలో పార్క్ నిర్వహణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో పార్కులను అబివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తున్నామన్నారు.నగర ప్రజలు వారి కుటుంబాలతో సాయంత్ర సమయాల్లో సేద తీరేందుకు పార్కులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. నగరం లోని ప్రతి పార్కులో ఎటువంటి మరమ్మత్తులు లేకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఈ పర్యటనలో డిప్యూటీ డైరెక్టర్ (హార్టికల్చర్) చంద్రశేఖర్,సిబ్బంది పాల్గొన్నారు.

డొక్కు అద్దెబస్సులు మాకొద్దు బాబోయ్

ఆర్టీసి సంస్థ బస్సులు నడవాలి

ఎ కొండూరు, ఏప్రిల్ 9, ప్రభాతవార్త : విజయవాడ పండిట్‌నెహ్రూ బస్టాండ్ నుండి ఇబ్రహీంపట్నం మైలవరం ఎ కొండూరు మండలం చీమలపాడు, కుదప మీదుగా విసన్నపేట నడిచే ప్రైవేటు అద్దె బస్సులు వేళలు పాటించడం లేదని ఈ రూటులో తిరుగుతున్న ఈ హైర్ బస్సులు సరైన కండీషన్‌లో లేవని ఇటీవలి కాలంలో టైర్లు పంక్చర్లు అవ్వడం ఇంకా ఇతర సమస్యలతో ఈ బస్సులు ఎక్కడ పడితే ఆగిపోతుండటంతో సకాంలో గమ్యానికి చేరుకోలేకపోతున్నామని ఈ ప్రాంత ప్రయాణీకులు స్త్రీశక్తి మహిళలు ఆరోపించారు. ఈ ఎండాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ రూటులో ఈ డొక్కు అద్దె బస్సుల స్థానంలో ఆర్టీసి సంస్థకు చెందిన బస్సులు నడిపి తమ కష్టాలను తొలగించాలని చీమలపాడు రుద్రవరం కుదప కొనపరాజు పర్వ, విసన్నపేట ప్రాంత ప్రజలు విజయవాడ ఆర్టీసి చైర్మన్‌కు ఆర్ఎంకు విజ్ఞప్తి చేశారు.

తిరువూరు కేంద్రంగా రేషన్ బియ్యం అక్రమ వాపార దందా..

అంటీ ముట్టని అధికారులు

ఎ కొండూరు, ఏప్రిల్ 9, ప్రభాతవార్త : ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు కేంద్రంగా రేషన్ చౌక బియ్యం అక్రమ రవాణా దందా నిర్వహిస్తున్న మునుకుళ్ల గ్రామానికి చెందిన ఒక వ్యాపారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని చౌకబియ్యం అక్రమ రవాణాలు అరికట్టాలని తిరువూరు నియోజకవర్గ ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఈ నియోజకవర్గంలోని 4 మండలాల డీలర్ల వినియోగదారుల నుండి బియ్యం కొనుగోలు చేసి దందా వ్యాపారానికి రాత్రిపూట ట్రక్ ఆటోలో తిరువూరు కేంద్రంగా ఇతర జిల్లాలకు ఓడరేవుల ద్వారా అక్రమ రవాణా దందా వ్యాపారి నిర్వహిస్తున్నాడని పలువురు ఆరోపించారు. ఈ అక్రమ రవాణా చౌకబియ్యం గురించి పోలీస్, రెవిన్యూ, పిడిఎస్ శాఖల అధికారులు ఈ దందా వ్యాపారిపై దాడిజరిపి ఈ వ్యాపారాన్ని అరికట్టకపోవడం పట్ల అధికారులు అంటీముట్టని వైఖరిని ప్రజలు విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో ఎండియు వాహనాల ద్వారా ఇంటింటికి బియ్యం పంపిణీ సక్రమంగా జరుగుతున్న సమయంలో రాష్ట్రం తిరిగి కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం చౌకడిపో డీలర్లను పునరుద్ధరించి డీలర్ల ద్వారా ఈ సరుకులు పంపిణీ చేయించడం డీలర్లే స్వయంగా వినియోగదారుల నుండి బియ్యం కొనుగోలు చేసి చౌక బియ్యం దందా వ్యాపారికి విక్రయించి సొమ్ము చేసుకోవడం బహిరంగ రహస్యం అయినా చౌకడిపో డీలర్లపై అధికారులు తరచూ తనిఖీలు నిర్వహిస్తూ చర్యలు తీసుకోకుండా ఉదాసీన వైఖరి అవలంభించడాన్ని నియోజకవర్గ ప్రజలు తీవ్రంగా ఆక్షేపించారు. ఇకనైనా ఈ రేషన్ బియ్యం అక్రమ దందా తిరువూరు కేంద్రంలో వ్యాపారాన్ని అరికట్టి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యాన్ని నీరుగార్చకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

హజ్ యాత్రకు అన్ని సౌకర్యాలు కల్పించాం

గుంటూరు, ఏప్రిల్ 9,ప్రభాతవార్త : హజ్ యాత్రికులకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి ఎండి ఫరూక్, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. హజ్ యాత్రకు వెళ్లే వారికి సౌకర్యాలు కల్పించేందుకుగాను గురువారం విజయవాడలోని గన్నవరం వద్ద ఎస్ కన్వెన్షన్ లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ నజీజ్ పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ హజ్ యాత్రకు వెళ్లే వారి కోసం సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. హాజీలకు ఒక్కొక్కరికి లక్ష రూపాయలు చొప్పున ప్రభుత్వం అందిస్తోందని వెల్లడించారు. తంలో హైదరాబాద్ నుంచి హజ్ యాత్రకు వెళ్లేవారని ఈ ఏడాది నుంచి గన్నవరం నుంచి వెళ్లేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముస్లింల సంక్షేమానికి పెద్దపేట వేసిందని తెలిపారు. ఈనెల 18వ తేదీ నుంచి హజ్ యాత్రకు బయలుదేరుతారని, వీరి కోసం గన్నవరంలో భోజన వసతి సదుపాయాలు కల్పించామని తెలిపారు. హజీలు ప్రత్యేక ప్రార్థనలు చేసుకునేందుకుగాను ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. అజీలు బయలుదేరినప్పటి నుంచి వారి ప్రయాణ భద్రత సౌకర్యాల విషయంలో ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని తెలిపారు.

పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ

కంకిపాడు ఏప్రిల్9,ప్రభాతవార్త : విలేకరులు సేవాభృక్పథంతో ఐక్యతతో ఒక సంస్థగా ఏర్పడి నిరుపేద కుటుంబాలకు సేవచేయాలనే ఆలోచన అభినందనీయమని కృష్ణాజిల్లా తెలుగుదేశంపార్టీ అధికార ప్రతినిధి తుమ్మలపల్లి హరికృష్ణ విలేకరులకు అభినందన అక్షరమాలలు వేసారు.కృష్ణాజిల్లా కంకిపాడు మండలం పునాదిపాడు గ్రామంలోని యానాదుల కాలనీలో కుటుంబాలకు గురువారం

బోధిసత్వ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను పంపిణీ చేసారు.ఈ సేవా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన హరికృష్ణ మాట్లాడుతూ విలేకరులు ప్రజలకు ప్రభుత్వానికి వారథులుగా ఉంటూ ప్రజా సమస్యలను వెలికి తీయడంలో వీరి పాత్ర కీలకమని వీరు బోధిసత్వ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం మహదానందాన్ని కలుగజేస్తుందని తెలిపారు.అనంతరం యానాదుల కుటుంబాలకు ఆయన చేతులమీదుగా నిత్యావసర సరుకులను అందజేసారు.ఈ కార్యక్రమంలో బోధిసత్వ ఫౌండేషన్ అధ్యక్షులు వల్లూరు కుమార్,వెంకట్,విలేకరులు దిలీప్,గంగాధర్,ఫయాజ్,లాయర్ పులిశ్రీనివాసరావు,భాను,కోటి,తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం మొక్కజొన్న విత్తనాలు సాగుచేసి నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం అందించాలి : ఎపి కౌలు రైతు సంఘం నాయకుల డిమాండ్

ఎ కొండూరు, ఏప్రిల్ 9, ప్రభాతవార్త : ఎన్‌టిఆర్ జిల్లా ఎ కొండూరు మండలం రామచంద్రాపురం గ్రామంలో శ్రీసాయిసీడ్స్ వ్యాపారి నుండి కొనుగోలు చేసిన మొక్కజొన్న సీడ్ టాటా ఎంఎం 9375 రకం మొక్కజొన్న (ధన్య) హైబ్రిడ్ మొక్కజొన్న రైతులకు తక్షణమే నష్టపరిహారం అందచేసి ఆదుకోవాలని ఎపి కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య ఎన్‌టిఆర్ జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి మేకల డేవిడ్, జిల్లా నాయకులు ఎం.వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని రామచంద్రాపురం శివారు కోమటికుంట గ్రామాన్ని వీరు సందర్శించి మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఈ గ్రామంలో 8మంది రైతులు హైబ్రిడ్ సీడ్ 3 కేజీల ప్యాకెట్ రూ.1950లకు కొనుగోలు చేసి పంట సాగు చేయగా ఆశించిన దిగుబడి రాక రైతులు తీవ్ర ఆందోళన చెందారు. నాసిరకం మొక్కజొన్న విత్తనాల వల్ల పంట నష్టపోయిన బాధిత రైతులకు తక్షణమే నష్టపరిహారం అందచేసి ఆదుకోవాలని వీరు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శాస్త్రవేత్తల ద్వారా పరిశీలించే విధంగా నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.1లక్ష పరిహారం అందించాలని తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మండల వ్యవసాయ అధికారి ఎం నాగరాజు నాయక్ అందచేశారు.

ఏపి బార్‌కౌన్సిల్ మెంబర్ గంగాభవానీకి పలువురి అభినందన

విజయవాడ, ఏప్రిల్ 9, ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ మెంబర్గా అడ్వకేట్ గంగాభవానీ గెలిచిన సందర్భంగా గురువారం విజయవాడలో వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా, అసోసియేషన్ ఫర్ ప్రెటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ ఆంధ్రప్రదేశ్ చాప్టర్ ఉమ్మడిగా అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్రాధ్యక్షులు కెఎంఎ సుబాన్, ఏపి సిఆర్ రాష్ట్ర అధ్యక్షులు



పిచ్చుక శ్రీనివాస్ తదితరులు మాట్లాడుతూ నేడు రాజ్యాంగ వ్యతిరేక అంశాలే తీర్పులుగా న్యాయస్థానాలు వెలువరిస్తున్న నేపథ్యంలో గంగాభవానీ రాజ్యాంగబద్దమైన తీర్పులకోసం కృషి చేయాలన్నారు. తననభినందించిన వారికి కృతజ్ఞతలు తెలిపిక గంగాభవానీ మాట్లాడుతూ లాయర్లు, స్త్రీలు, మానవహక్కుల కోసం బాధ్యతాయుతంగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్ రాంప్రసాద్‌రెడ్డి, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆటోమేటిక్ డిఫ్రాస్టింగ్‌తో విర్ల్‌పూల్ రిఫ్రిజిరేటర్లు

విజయవాడ, ఏప్రిల్ 9, ప్రభాతవార్త : వినియోగదారులు మాన్యువల్ డిఫ్రాస్టింగ్ సమస్యను పరిష్కరించడానికి ఇక ఆటోమేటిక్ డిఫ్రాస్టింగ్ సౌకర్యంతో నో టెన్షన్ రిఫ్రిజిరేటర్లను అందుబాటులోకి తెచ్చామని విర్ల్‌పూల్ ఆఫ్ ఇండియా లి. ప్రతినిధులుతెలిపారు. ఇంప్రో ప్లస్ ప్రవేశంతో సింగిల్‌డోర్ విభాగంలో ఆటోమేటిక్ డిఫ్రాస్ట్ రిఫ్రిజిరేటర్లను ఆవిష్కరించామన్నారు.

తనిష్క్ కొత్త ప్రచార ముఖచిత్రంగా రుక్మిణి వసంత్

అమరావతి, ఏప్రిల్ 9, ప్రభాతవార్త : పవిత్ర అక్షయ తృతీయ పండుగ సమీపిస్తున్న తరుణంలో తమ తాజా ఆభరణాలను సినీనటి రుక్మిణి వసంత్ ఆవిష్కరించారని తనిష్క్ ప్రతినిధులు తెలిపారు. కెంపులు, పచ్చలు, తదితర ప్రకాశవంతమైన రాళ్లతో కూడిన సమకాలీన దక్షిణభారతపు శైలితో కూడిన ఈ ఆభరణాలను పరిచయం చేశారన్నారు.

పారాగాన్ పాదరక్షలపై క్యాష్‌బాక్ ఆఫర్

విజయవాడ, ఏప్రియల్ 9, ప్రభాతవార్త : మహిళల పాదరక్షణ కలెక్షన్‌లపై క్యూఆర్ ఆధారిత ప్రక్రియతో రు.30 తక్షణ క్యాష్‌బ్యాక్ ఆఫర్ అందిస్తున్నట్లు పారగాన్ ఫుట్‌వేర్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, మార్కెటింగ్ అండ్ ఐటి సచిన్ జెసెఫ్ తెలిపారు. వినియోగదారులకు ఈ అదనపు విలువతో పాటు సౌకర్యవంతమైన అనుభవాన్ని పొందవచ్చన్నారు.

మానవత్వమే క్రైస్తవత్వం

విజయవాడ, ఏప్రిల్ 9, ప్రభాతవార్త : మానవత్వమే క్రైస్తవత్వం అని స్వాతంత్ర్యం రాకమునుపు నుండే మానవీయ విలువలకు క్రైస్తవ మిషనరీలు ప్రాథాన్యత ఇచ్చారని దేశాభివృద్ధిలో క్రైస్తవుల పాత్ర ఎంతో వుందని కతోలిక పీఠం మోన్సిన్యోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్ తెలిపారు. ఫెడరేషన్ ఆఫ్ చర్చస్, అఖిల క్రైస్తవ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో బెంజిసర్కిల్ వద్ద సెయింట్‌పాల్స్ కథెడ్రల్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తొలి ప్రధాని జవలహర్‌లాల్ నెహ్రూ, మాజీ ఉప ప్రధాని

ఎల్‌కె అధ్వానిలు క్రైస్తవుల పాత్ర భారతదేశాభివృద్ధిలో ఎనలేనిదని ప్రశంసించారని గుర్తు చేశారు. క్రైస్తవులపై మతపరమైన దాడులు ఏపిలో కూడా జరుగుతున్నాయని ఉండి నియోజకవర్గంలో జరిగిన మత ఘర్షణలపై శాంతి కమిటీ, నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బేతేలు మినిస్ట్రీస్ బైబిల్ కాలేజ్‌చైర్మన్, డైరెక్టర్ రెవ పాస్టర్ సల్లూరి జయకుమార్, రాజమండ్రి రిటైర్డ్ సిఐ కె సాల్మన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఏవియేషన్‌తో అమృత ఇంటర్నేషనల్ ఏవియేషన్ కాలేజ్ ఒప్పందం

విజయవాడ, ఏప్రియల్ 9, ప్రభాతవార్త : విమానయాన శిక్షణనందించడానికి యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఏవియేషన్ మలేషియాతో తాము ఒప్పందం చేసుకున్నట్లు చెన్నైస్ అమృత ఇంటర్నేషనల్ ఏవియేషన్ కాలేజ్ సిఒఒ భానుమతి, డీన్ సురేష్, ప్రిన్సిపల్ డా రాహుల్, హెచ్ఒడి అరుణ్‌లు తెలిపారు. ఫ్యూచర్ డ్రీమ్ అకాడమి మలేషియా చైర్మన్ కలైయరసన్, సిఇఒ జైనాక్ సింగ్ , చెన్నైస్ అమృత గ్రూప్‌ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ చైర్మన్ బూమి నాథన, యునికామ్ మలేషియా డీన్ ఉమర్ అబ్దిల్లాలు సమక్షంలో ఈ ఒప్పందం జరిగిందన్నారు.

పిడుగు పాటుకు 14 గొర్రెలు మృతి

పెదకూరపాడు,ఏప్రిల్9,ప్రభాతవార్త : మండల పరిధిలోని గారపాడు గ్రామంలో గురువారం సాయంకాలం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. అకస్మాత్తుగా పిడుగు పడటంతో గారపాడు గ్రామానికి చెందిన నల్లగొండ నాగమల్లేశ్వరరావు మేపుకునే 14 మేకలు పిడుగుపాటుకు మృతి చెందాయని నాగమల్లేశ్వరరావు తెలిపారు. సుమారు మూడు లక్షలు విలువ కలిగిన జీవాలు చనిపోవడంతో నాగమల్లేశ్వరరావు కన్నీరు మున్నీరు అయ్యారు.

గంజాయి మత్తులో ..

యువతీ యువకుల బీభత్సం

గుంటూరు ఏప్రిల్ 9 ప్రభాతవార్త ప్రతినిధి : పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో గంజాయి మత్తులో ఉన్న కొందరు యువతీ యువకులు కారుతో వీరంగం సృష్టించారు. వేగంతో దూసుకొచ్చిన కారు ఒక్కసారిగా నియంత్రణ కోల్పోయి రోడ్డు పక్కన ఉన్న ఓ హోటల్లోకి దూసుకెళ్లింది.ఈ ప్రమాదంలో హోటల్లోని ఫర్నిచర్, ఇతర సామాగ్రి పూర్తిగా ధ్వంసమయ్యాయి. ప్రమాద సమయంలో హోటల్లో జనం తక్కువగా ఉండటంతో తృటిలో పెద్ద ప్రాణనష్టం తప్పింది. ఈ పరిణామంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

ప్రమాదం జరిగిన విజయ బ్యాంకు సెంటర్ పరిసర ప్రాంతాల్లో పలు స్కూల్స్, కాలేజీలు ఉన్నాయి.నిత్యం వందలాది మంది విద్యార్థులు ఈ మార్గం గుండానే రాకపోకలు సాగిస్తుంటారు. కారు బీభత్సం సృష్టించిన తీరు చూసి అటుగా వెళ్తున్న విద్యార్థులు, వారిని బడిలో దింపేందుకు వచ్చిన తల్లిదండ్రులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఒకవేళ ఆ కారు రోడ్డుపై వెళ్లే విద్యార్థులను ఢీకొట్టి ఉంటే పరిస్థితి ఏంటని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

నిందితుల అరెస్ట్

ఘటనా స్థలానికి చేరుకుని పోలీసులు తనిఖీ చేయగా కారు నడుపుతున్న వ్యక్తితో పాటు అందులో ఉన్నవారు గంజాయి మత్తులో ఉన్నట్లు గుర్తించారు. కారులో ఇద్దరు యువకులు, ముగ్గురు యువతులు ఉన్నట్లు సమాచారం. నిందితులందరినీ అదుపులోకి తీసుకున్న పోలీసులు వారిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. మత్తు పదార్థాల ప్రభావంతో వాహనాలు నడుపుతూ ఇతరుల చెలగాటమాడటంపై స్థానికులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు.

మహిళా ఉద్యోగిపై అత్యాచారం ఘటనలో నిందితుడు అరెస్టు

-రిమాండ్ విధించిన కోర్టు ఫసాంకేతిక ఆధారాలతో కేసును చేధించిన మాచర్ల పోలీసులు

వెల్దుర్తి, ఏప్రిల్ 9 ప్రభాతవార్త: మాచర్ల 13వ వార్డులో సంచలనం రేపిన ఓ ప్రభుత్వ మహిళా ఉద్యోగిపై అత్యాచార ఘటనలో నిందితుడిని సాంకేతిక ఆధారాలతో చాకచక్యంగా మాచర్ల పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. ఈ మేరకు కేసు వివరాలను పల్నాడు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

ఘటన నేపథ్యం

ఈ నెల 2వ తేదీన మధ్యాహ్నం సమయంలో బాధితురాలు ఇంట్లో ఒంటరిగా ఉన్నప్పుడు గుర్తు తెలియని వ్యక్తి వచ్చి నీళ్లు అడిగాడు. ఆమె నీళ్లు తీసుకురావడానికి వెళ్లగా, నిందితుడు లోపలికి చొరబడి కత్తితో బెదిరించి ఆమెపై దారుణంగా అత్యాచారానికి ఒడిగట్టాడు. అనంతరం ఆమె కాళ్లు, చేతులు చున్నీతో కట్టేసి అక్కడి నుంచి పారిపోయాడు. స్థానికులు, 108 సిబ్బంది సాయంతో బాధితురాలికి ఆసుపత్రికి తరలించి చికిత్సన అందించారు.

దర్యాప్తు తీరు : బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, అదనపు ఎస్పీ జేవీ సంతోష్ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. తొలుత బాధితురాలు భయంతో తనకు గుర్తు తెలియని వ్యక్తి అని చెప్పినప్పటికీ, సీసీ టీవీ ఫుటేజ్ సాంకేతిక ఆధారాలను పరిశీలించిన పోలీసులకు విస్తుపోయే నిజాలు తెలిశాయి.

సోషల్ మీడియా పరిచయమే శాపమైంది :

నిందితుడు నామాల శ్రీనివాస్ (అలియాస్ సంజు) సోషల్ మీడియా యాప్ ద్వారా బాధితురాలికి పరిచయమై, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా సన్నిహితంగా మెలిగినట్లు దర్యాప్తులో తేలింది. ఘటన జరిగిన రోజు బాధితురాలే అతడిని ఇంటికి ఆహ్వానించినట్లు, ఆ తర్వాత ఈ అఘాయిత్యం జరిగినట్లు పోలీసులు గుర్తించారు. నిన్న ఉదయం మాచర్ల రైల్వేస్టేషన్ వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు, కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు.

ఎస్పీ హెచ్చరిక

మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ కృష్ణారావు హెచ్చరించారు. ఆపద సమయంలో వెంటనే 112 నంబరుకు లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కేసును త్వరితగతిన ఛేదించిన పోలీసు అధికారులను, సిబ్బందిని ఈ సందర్భంగా ఆయన అభినందించారు.

ఫీడ్ బై పీపుల్ సంస్థల అధినేత బిషప్ సాధు థామస్ ఆధ్వర్యంలో పాస్టర్లకు నిత్యావసరాలు పంపిణీ

తెనాలి టౌన్ ఏప్రిల్9(ప్రభాతవార్త): తెనాలి పట్టణంలోని ఐతానగర్ అయ్యర్ పేటలో గల దివంగత బిషప్ గడ్డం థామస్ ప్రాంగణంలో ఆర్ఈఐ,ఫీడ్ బై పీపుల్ సంస్థల అధినేత బిషప్ గడ్డం సాధు తామస్(జూనియర్)ఆధ్వర్యంలో పాస్టర్లకు బియ్యం పంపిణీ చేశారు.గురువారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమంలో సాధు తామస్ మాట్లాడుతూ, మా చిన్న కుమార్తె రిబ్కా హెలెన్ పుట్టినరోజు సందర్భంగా పాస్టర్లకు సాయం అందించినట్లు చెప్పారు.48 మంది పాస్టర్లకు బియ్యం పంపిణీ చేయడం జరిగిందన్నారు.నా కుమార్తెలు,కుటుంబం కొరకు పాస్టర్ లందరూ ప్రార్థనలు చేయాలని కోరారు.ఈ సందర్భంగా జరిగిన సభకు బిషప్ డాక్టర్ గడ్డం సాధు థామస్ జూనియర్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన జాన్ టైటస్ వాక్య పరిచర్య చేశారు.జాన్ టైటస్ బైబిల్ వాక్య

పరిచర్య గావిస్తూ రెబక హెలెన్ అనే మాటకు అర్థం సౌందర్యం తెలివితేటలు గల వ్యక్తి అని తెలిపారు.ప్రభువుని మనసులో నింపుకొని ప్రభువు అందించే సౌందర్య జ్ఞానాన్ని పొందాలని కోరుకుంటున్నట్లు చెప్పారు.చిన్నారి రెబక హెలెన్ కు ప్రార్థనల ద్వారా ఆశీర్వచనాలు అందించారు.అనంతరం బిషప్ గడ్డం సాదు తామస్ ముఖ్య అతిధులుగా విచ్చేసిన థామస్, బిషప్ జోనతన్, బిషప్ జాన్ టైటస్ లను ఘనంగా సత్కరించారు. అనంతరం ప్రేమ విందు కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బిషప్ గడ్డం సాధువు థామస్ (జూనియర్) కుటుంబ సభ్యులు,గొల్లపూడి రాజు, బ్రదర్ ఆనంద్ అన్న టౌన్ పాస్టర్స్, ఆర్ ఈ ఐ, ఫీడ్ మై పీపుల్ సంస్థల సిబ్బంది పాల్గొన్నారు.

సాహితీ కృషీవలుడు డాక్టర్ ప్రజ్ఞాచారి

తెనాలి టౌన్, ఏప్రిల్9,(ప్రభాతవార్త): కవిత్వం ఈశ్వర వరప్రసాదితం,కవి విశ్వ శ్రేయస్సు కాంక్షితుడు.కలం పట్టిన ప్రతివారు కవికాలేరు.నాన్నృషీ కురుతే కావ్యం అను వేదోక్తికి నిదర్శనం పూర్ణ ప్రజ్ఞాచారి కవిత్వం. కవిత్వం రాయాలంటే ఋషితత్వం ఉండాలి. సమాజంలో ఎదురవుతున్నవివత్కర పరిస్థితులను చూసి శాంతం వహిస్తూనే , ప్రత్యామ్నాయపరిస్థితులను కవిగా అన్వేషించాలి. ఆకోవ కు చెందిన కవులలో ఒకరు డాక్టర్.నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారి. తెనాలి మండలం కొలకలూరు గ్రామస్తులైన మధురకవి నూతక్కి అబ్రాహాం, సరోజినీదేవి దంపతులకు పూర్ణ ప్రజ్ఞాచారి మూడో కుమారునిగా జన్మించారు. కవి అయిన తండ్రి వద్ద శిష్యునిగా కవితా లక్షణాలు చందస్సు వ్యాక కరణం నేర్చుకుని కావ్య రచనకు శ్రీకారం పుట్టారు ప్రజ్ఞాచారి. కవి రాసే కవిత్వంలో ప్రత్యేకత ఉంటేనే పాఠకులు ఆదరిస్తారు. కథా వస్తువులోని ప్రత్యేకత కవికి గుర్తింపుతెస్తుంది. డాక్టర్ పూర్ణ ప్రజ్ఞాచారి రచనలలో ఆ ప్రత్యేకత స్పష్టంగా కనిపిస్తుంది. ప్రజ్ఞాచారి స్పృశించిన కవితా, కథా వస్తువులు ఇతర కవుల రచనలకు భిన్నంగా ఉంటాయి. అమ్మ గూర్చి అందరికీ తెలుసు. ఆమె వ్యక్తిత్వాన్ని అక్షర బద్ధం చేయటం గొప్ప విషయం. అక్షరం విలువ చదువుకున్న వారికి తెలుసు. చదువుకో లేనివారి పరిస్థితిగూర్చి ఆలోచించాలి, అదే ప్రజ్ఞాచారి అక్షర వేదనలోని ప్రత్యేకత. నేటి కాలాన తెలుగు మాట్లాడే వాళ్లే చదువుకోవడానికి తెలుగు వద్దంటున్న సందర్భంలో తెలుగు ఘనత వైభవం గూర్చి వివరించడమే తెలుగు విలాపం కావ్యం ప్రత్యేకత. వైవిద్యమైన పద్ధతిలో పద్య గద్య కావ్యాలు రాసిన ప్రజ్ఞాచారి నాలుగు పరిశోధన కావ్యాలు కూడా రాశారు. నిరంతరం సాహితీ కృషి

చేస్తేనే అటువంటి పరిశోధన కావ్యాలు రాయటం సాధ్యమవుతుంది. మూడు దశాబ్దాలుగా తెలుగు భాష సేవ చేస్తూ కవిగా,రచయితగా, చరిత్రకారుడిగా, పరిశోధన వేత్తగా, రచనలు చేస్తున్న ప్రజ్ఞాచారి పలు సాహితీ సంస్థల ద్వారా జాతీయ స్థాయి పురస్కారాలు, ప్రభుత్వ పురస్కారాలు అందుకున్నారు. సామాజిక ప్రయోజనం కోసం రచనలు చేస్తున్న డాక్టర్ నూతక్కిపూర్ణ ప్రజ్ఞాచారి సాహితీ పరిశ్రమను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు గుర్తించి మరింతగా ప్రోత్సహించాలి.

జనాభా గణన పక్కాగా నిర్వహించాలి

పొన్నూరు, ఏప్రిల్ 9,ప్రభాతవార్త: జనాభా గణనను పక్కాగా నిర్వహించేవిధంగా ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ ఆదేశించారు. స్థానిక వివిఎస్ఆర్ కళాశాలలో ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు మూడు రోజుల

శిక్షణా కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ మాట్లాడుతూ పది సంవత్సరాలకు ఒకసారి జనాభా గణను చేపట్టడం జరిగిందన్నారు. గతంలో 2011లో జనాభా గణను చేశారన్నారు. 2021లో జనాభా గణనన చేయాల్సి ఉండగా కోవిడ్ కారణంగా అప్పట్లో జనాభా గణన చేపట్టలేదన్నారు. ప్రస్తుతం జనాభా గణన చేసేందుకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. అందులో భాగంగా మే ఒకటో తేదీ నుంచి 30వ తేదీ వరకు మొదటి విడత జనాభా గణన చేపట్టడం జరుగుతుందన్నారు. ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు పూర్తిస్థాయిలో శిక్షణ పొంది జనాభా గణను నూరుశాతం విజయవంతం అయ్యేవిధంగా చూడాలన్నారు. జనాభా గణన వల్ల ప్రజలకు సమర్ధవంతమైన విధానాలను రూపొందించడానికి, వనరులను నిర్వహించడానికి, సామాజిక ఆర్థిక పురోగతిని పర్యవేక్షించడానికి ఉపయోగపడు తుందన్నారు. జనాభా నిష్పత్తిని బట్టి నిధుల కేటాయింపు కూడా ఉంటుందన్నారు. ప్రజలకు అవసరమైన మౌళిక సదుపాయాల కల్పనకు కూడా జనాభా గణను ఎంతగానో దోహదపడుతుందన్నారు. సహాయ గణాంకాధికారి(ఏఎస్ఓ) నల్లాని ప్రసాద్ మాట్లాడుతూ పొన్నూరు రూరల్ మండలం మొత్తాన్ని 108బ్లాకులుగా చేయడం జరిగిందన్నారు. ఒక్కో బ్లాక్‌కు ఒక్కో ఎన్యుమరేటర్‌ని నియమించి జనాభా గణన పక్కాగా నిర్వహించేవిధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఒక్కో ఎన్యుమరేటర్ 200గృహాలు కానీ, 800మంది జనాభాకు సంబంధించిన వివరాలను నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. దేశంలో తొలిసారిగా డిజిటల్ పద్దతిలో జనాభా గణన చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ జనాభా గణను సంబంధించి వంద మంది ఎన్యుమరేటర్లు, 18మంది సూపర్‌వైజర్లను నియమించడం జరిగిందన్నారు. ఎన్యుమరేటర్లుగా సచివాలయ సిబ్బంది, సూపర్‌వైజర్లుగా మండలస్థాయి అధికారులను నియమించామన్నారు. నియమించిన సిబ్బందికి మూడు విడతలుగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. గృహాలకు సంబంధించిన యజమానులు సెల్ఫ్ ఎన్యుమరేషన్ కూడా చేసుకోవచ్చన్నారు. అయితే ఎన్యుమరేటర్ మీ ఇంటికి వచ్చినప్పుడు మీరు ఎన్యుమరేషన్ చేసిన ఐడిని చెప్పాల్సి ఉంటుందన్నారు. శిక్షణా కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రాజవరపు వెంకటేశ్వరరావు, ఎంపిడిఓ కార్యాలయ సూపరింటెండెంట్ నారాయణరావు, గృహనిర్మాణ శాఖ ఎఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఫీల్డ్ ట్రైనర్లు జి.భువనచంద్ర, పి.వి.శ్రీనివాసరావులు సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.

జనగణన పై ఎన్యూమరేటర్లకు శిక్షణా కార్యక్రమం : మున్సిపల్ కమీషనర్

తెనాలి మున్సిపాలిటీ ఏప్రిల్9(ప్రభాతవార్త): జనగణన2027 నిర్వహణలో భాగంగా, జనగణన నిర్వహణ సమర్థవంతంగా నిర్వహించేందుకు, ఫీల్డ్ ట్రైనర్స్ ద్వారా ఎన్యుమరేటర్లకు మరియు

సూపర్వైజర్లకు జన గణన సాధనాల వినియోగంపై మూడు విడతలుగా శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో, పట్టణంలోని బుర్రిపాలెం రోడ్డు గుప్తా పీజీ కాలేజ్ నందు ఏప్రియల్ 9వ తేదీ నుండి 23వ తేదీ వరకు ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మొదటి విడతగా ఏప్రియల్ 9 10 11 తేదీల్లో రెండవ విడతగా ఏప్రిల్ 15 16 17 తేదీల్లో అదేవిధంగా మూడవ విడత లో ఏప్రిల్ 21 22 23 తేదీల్లో, నిర్వహించబడుతుందని, ఈశిక్షణ ఎనీమరేటర్లకు జనగనణ సాధనాల వినియోగంపై సిబ్బందికి అవగాహన కల్పించటం జరుగుతుందన్నారు. పట్టణంలో ఆస్తిపన్ను బకాయిలను సెలవు రోజుల్లో కూడా చెల్లించే విధంగా తగిన ఏర్పాట్లు చేసినట్లు కమిషనర్ రామ అప్పలనాయుడు తెలిపారు. పాత మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రెండు కౌంటర్ల యందు తమ సిబ్బంది ఉదయం నుండి సాయంత్రం వరకు అందుబాటులో ఉండి పన్నులు కట్టించుకుంటారని, కావున పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరం పన్ను ఏక మొత్తంలో ఒకేసారి చెల్లించినట్లయితే వారికి 5 రాయితీ కల్పించబడుతుందని అదేవిధంగా పాత బకాయిలు కూడా ఏక మొత్తం ఒకేసారి చెల్లించినట్లయితే వారికి వడ్డీలో 50 రాయితీ ఇవ్వటం జరుగుతుందని ఆయన తెలిపారు.

విద్యుత్ వినియోగం ఎక్కువుగా ఉంది... ట్రాన్స్‌పార్మర్స్ ఏర్పాటు చేయండి : విద్యుత్ ఎస్ఈ రమేష్

కొల్లిపర,ఏప్రిల్ 9 ప్రభాతవార్త: వేసవికాలం కావటంతో ఉష్ణోగ్రతలు పెరిగాయని విద్యుత్ వినియోగం ఎక్కువుగా ఉంటుందని అవసరమైన చోట విద్యుత్ ట్రాన్స్‌పార్మర్లు ఏర్పాటు చేయాలని విద్యుత్ ఎస్ఈ సిహెచ్ రమేష్ అన్నారు.గురువారం మండల గ్రామాల్లో ఏడీఈ మల్లిఖార్జునప్రసాద్ ఆధ్వర్యంలో విద్యుత్ అధికారులు 40 బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేసారు.ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ

మండలంలో 2,902 విద్యుత్ సర్వీసులను పరిశీలించి అదనపులోడ్ విద్యుత్ వినియోగం కింద 114 సర్వీసులు నమోదు చేసి 4 లక్షల 80 వేల రూపాయలు అపరాద రుసుం విధించటం జరుగుతుందన్నారు,ఎండతీవ్రత మరింత పెరిగిందని విద్యుత్ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలన్నారు.సోలార్ ఉపయోగం గురించి ప్రజలకు విద్యుత్ అధికారులు అవగాహన కలిగించాలన్నారు.ఈ తనిఖీలో విద్యుత్‌శాఖ డీఈఏ సత్యన్నారాయణ,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అక్కల సత్యన్నారాయణ,డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రాజశేఖర్,విద్యుత్ ఏఈ ప్రదీప్‌కుమార్,సబ్‌ఇంజనీర్ జి.సత్యన్నారాయణ,డివిజన్ స్థాయి విద్యుత్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల జయంతి ఉత్సవాలను వాడవాడలా నిర్వహించాలి : ప్రజా సంఘాల నాయకులు

పొన్నూరు, ఏప్రిల్ 9,ప్రభాతవార్త: మహాత్మాజ్యోతిరావు పూలే జయంతి ఈ నెల 11వ తేదీ నుంచి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి వరకు ఆ మహనీయుల జయంతోత్సవాలను వాడవాడలానిర్వహించాలని ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక మానవ హక్కుల వేదిక కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో కుల నిర్మూలనా పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ మాట్లాడుతూ నాకు మాతృదేశం లేదు. ఇక్కడి మతం మమ్మల్ని కుక్కలు, పిల్లుల కంటే హీనంగా చూస్తుంటే, ఇక్కడ కనీసం త్రాగడానికి నీళ్ళు కూడా దొరక్కుండా ఉంటే ఈ దేశం నా మాతృభూమి అని ఎలా చెప్పను. ఆత్మ గౌరవం కలిగిన ఏ అంటరానివాడూ ఈ దేశం నాదని గర్వపడడు. ఈ దేశం మామీద సాగించిన అన్యాయాలు, బాధలకు అంతులేదు.

ఈ దేశం పట్ల వ్యతిరేక వ్యక్త పరిస్తే దానికి బాధ్యత ఈ దేశానిదే అని హిందూ మత ప్రతినిధి అయిన గాంధీతో దళిత జాతుల వైతాళికుడైన అంబేద్కర్ ఆవేదనగా, ఆవేశంతో అన్న మాటలు గుర్తు చేసుకొంటే ఆనాటి కంటే ఘోరమైన పరిస్థితులే నేడున్నాయన్నారు. ఆమహనీయుల జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించి వారి మార్గాన్ని మననం చేసుకోవాలన్నారు. అనంతరం అందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పౌరహక్కుల సంఘ రాష్ట్ర కోశాధికారి డాక్టర్ తుమాటి రాజారావు, మానవ హక్కుల వేదిక రాష్ట్రనాయకుడు జిఎస్ రాయెల్, కుల నిర్మూనా పోరాట సమితి సభ్యుడు తోడేటి శ్రీనివాస్, గుడిసెవాసుల సంఘం నాయకుడు బలగాని వెంకటేశ్వర్లు, కె.విజయకుమార్, బాలస్వామి తదితరులున్నారు.

ప్రతి అంశంపై తెలుసుకోండి... జన గణనపై అవగాహన కలిగించండి

-ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్ లక్ష్మీకుమారి

కొల్లిపర,ఏప్రిల్ 9 ప్రభాతవార్త: శిక్షణలో ప్రతి అంశంపై నిశితంగా తెలుసుకుంటూ ప్రజలకు జన గణనపై అవగాహన కలిగించాలని ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్ లక్ష్మీకుమారి అన్నారు.గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జనాభాగణనపై ఎన్యుమరేటర్లు,సూపర్‌వైజర్లకు జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఇన్‌చార్జి తహశీల్దార్ గోపాలకృష్ణ అద్యక్షతన జరిగిన ఈ శిక్షణ కార్యక్రమంలో లక్ష్మీకుమారి మాట్లాడుతూ జనాభా లెక్కల నమోదు చాలా ముఖ్యమైన కార్యక్రమం అన్నారు.జనాభా గణన చేసేటప్పుడు ప్రతి ఒక్కరూ ఓర్పుతో చేయాలన్నారు.ప్రతి ఇల్లు..ప్రతి వ్యక్తి వివరాలు నమోదు చేయాల్సి



ఉంటుందన్నారు.జనాభా గణనతో సేకరించిన సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు.ప్రజలతో స్నేహ పూర్వకగా మెలుగుతూ సమాచార సేకరణలో ఓర్పుతో వ్యవహరించాలన్నారు.కార్యక్రమంలో డిప్యూటి తహశీల్దార్ రాజేష్,ఎఎస్ఓ మనోహర్‌రెడ్డి,డిప్యూటి ఎంపీడీవో దానయ్య,శిక్షకులు కె.సురేష్‌బాబు,ఈదా రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజస్థాపనే ధ్యేయం : డాక్టర్ షేక్ షారోన్

పొన్నూరు, ఏప్రిల్ 9,ప్రభాతవార్త: చిన్నారులు, గర్భిణీలు, బాలింతలలో పోషకాహార లోపాన్ని తగ్గించడే పోషణ్ పక్వాడా కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ షేక్ షారోన్ అన్నారు. ఈ నెల 9వ తేదీ నుండి 23వ తేదీ వరకు పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. పోషకాహార లోపాన్ని గుర్తించి, అందుకు సంబంధించిన మార్గాలను అన్వేషించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని స్థాపించడమే



ధ్యేయంగా ప్రభుత వ్ం ముందుకు సాగుతుందన్నారు.ఆరోగ్యం, పోషణపై అవగాహన కల్పించడం, చిరుధాన్యాల వాడకాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా ప్రభుత్వం పెట్టుకొందన్నారు. మొదటి ఆరేళ్ళలో మెదడు వికాసాన్ని గరిష్టం చేయడం, పుట్టినప్పటి నుండి మొదటి వెయ్యి రోజుల వరకు శిశువుల పోషణ, ఎదుగుల, తల్లుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి ఉంచాలన్నారు. చిరుధాన్యాలు తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ యు.పద్మజ మాట్లాడుతూ అంగన్‌వాడీ ద్వారా చిన్నారులకు, బాలింతలకు, గర్భిణీస్త్రీలకు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ ్బంది, గర్భిణీస్త్రీలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాధాకృష్ణ పై చర్యలు తీసుకోవాలి,పోలీసులకు మాజీ ఎమ్మెల్యే శివకుమార్ ఫిర్యాదు

తెనాలి టౌన్ ఏప్రిల్9(ప్రభాతవార్త): వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఏబీఎన్ ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ పై చర్యలు తీసుకోవాలని తెనాలి మాజీ శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్ ఆధ్వర్యంలో, వైసీపీ శ్రేణులు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ పార్టీల నాయకులు ప్రతిపక్ష నాయకులను వారి కుటుంబ సభ్యులను ముఖ్యంగా స్త్రీలను అనుచిత వ్యాఖ్యలు చేస్తూ పరిపాలన పక్కనపెట్టి సాగిస్తున్న ధమనకాండను స్ఫూర్తిగా తీసుకొని, ఆంధ్రజ్యోతి ఎడిటర్ రాధాకృష్ణ,తన పత్రికలో ప్రతిపక్ష నాయకుల భార్యలను కించపరుస్తూ చేసిన అనుచిత వ్యాఖ్యలు సభ్యసమాజం తలదించుకునే విధంగా ఉన్నాయని,తక్షణమే రాధాకృష్ణ క్షమాపణలు చెప్పాలని,తన వ్యాఖ్యలను వెనక్కి



తీసుకోకపోతే, తమ నిరసనలను తీవ్రం చేస్తామని శివకుమార్ హెచ్చరించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణపై తెనాలి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడం జరిగిందని, పోలీసులు తక్షణమే స్పందించి రాధాకృష్ణపై కేసు నమోదు చేసి ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు,దేసు శ్రీనివాసరావు, ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు, తాడిబోయిన రమేష్,షేక్ గోల్డ్ రహీమా,కొడాలి క్రాంతి,చింక సురేష్ చంద్రయాదవ్, బేతాళ ప్రభాకర్,తాడిబోయిన బుచ్చిరాజు, షేక్ దుబాయ్ బాబు,పెదలంక వెంకటేశ్వర్ రావు, మైల విజయ నాయుడు,శానంపూడి రఘురాం రెడ్డి,కటారి హరీష్, కుర్ర జస్వంత్ యాదవ్,పే చ్చింగ్ సుభాని,అక్కిదాసు కిరణ్ కుమార్,గుంటూరు కృష్ణ,గుమ్మడి రవిరాజు, చుండూరు వెంకటేశ్వరరావు, కొల్లా గుర్నాథ్ గుప్త, సమయపురం సురేష్, షేక్ ఫరీద్,కుదరవల్లి శంకర్రావు, నాలాది బుజ్జిబాబు, దర్శి రవితేజ,కొలకలూరి భరత్, అమర్తలూరు సీమోను, పిల్లి ప్రేమ్ రాజ్,పిల్లి అజిత్,కోలా వాసు, కాళిదాసు సత్యం మరియు మహిళా నాయకులు కోర్ర యశోద కపూర్,కొంగర రాగ మంజరి, మన్నవ శాంతిశ్రీ,మార్పు ఇందిరా ప్రియదర్శిని, సిద్దాబత్తుని శాంతి,మాజీ ఏపీపీ మోహన్ రెడ్డి,చుక్క ఆనంద్ ఉదయ్, షేక్ హుస్సేన్,మందపాటి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదాయం.ఆరోగ్యం...విద్య వివరాలు నమోదు చేయాలి

-డిప్యూటి ఎంపీడీవో దానయ్య

కొల్లిపర,ఏప్రిల్ 9 ప్రభాతవార్త: కుటుంబ సర్వేలో ఆదాయం.ఆరోగ్యం...విద్య వంటివి వివరాలు నమోదు చేయాలని డిప్యూటి ఎంపీడీవో దానయ్య అన్నారు.గురువారం మండల పరిధిలోని అన్నవరం,బొమ్మువానిపాలెం సచివాలయాన్ని ఆయన తనిఖీ చేసి సిబ్బందికి తగిన సూచనలు..సలహాలు ఇచ్చారు.ఈ సందర్భంగా



దానయ్య మాట్లాడుతూ కుటుంబానికి సంభందించిన సమగ్ర వివరాలు ద్వారా ప్రతి ఇంటికి బెనిఫిట్ కార్డు ఇవ్వటం జరుగుందన్నారు.నిర్ణీత వ్యవధిలో కుటుంబ డేటా సేకరణ సర్వేను పూర్తి చేయాలన్నారు.ఈ సర్వే పూర్తయితే అర్హులైన వారందరికీ ప్రభుత్వ సం క్షేమ పథకాలు అందించటానికి అవకాశం ఉందన్నారు.

సూపరింటెండెంట్‌గా షేక్ కరీముల్లా

పొన్నూరు, ఏప్రిల్ 9,ప్రభాతవార్త: తహశీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్‌గా షేక్ కరీముల్లా గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఆరేటి మాధవి రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్‌గా నియామకమయ్యారు. తెనాలి సీఎస్‌డీటీగా పనిచేస్తున్న షేక్ కరీముల్లా డిప్యూటేషన్‌పై తహశీల్దార్ కార్యాలయ పర్యవేక్షకులుగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా కరీముల్లా మాట్లాడుతూ వివిధ సమస్యలపై కార్యాలయానికి వచ్చే వారి సమస్యలను తెలుసుకొని తన శక్తిమేర పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. అర్జీదారులు నేరుగా తనను కలిసి సమస్యలను విన్నవించుకోవచ్చన్నారు. కరీముల్లా డిప్యూటీ తహశీల్దార్‌గా గతంలో పిట్టలవానిపాలెం, పెదనందిపాడు, తెనాలి మండలాల్లో పనిచేశారు.

సైకిల్ పై ఆకస్మికతనిఖీలు నిర్వహించిన తాహశీల్దార్ గోపాలకృష్ణ

తెనాలి టౌన్ ఏప్రిల్9(ప్రభాతవార్త): ఇటీవల పంచాయితీ సర్పంచ్ ల పదవీకాలం ముగియటంతో,ప్రత్యేక పాలనాధికారిగా నియమింపబడ్డ తెనాలి మండల తహసీల్దార్ కేవీ. గోపాలకృష్ణ, రూరల్ మండల గ్రామం పెదరావురు లో ప్రత్యేక అధికారిగా సైకిల్ పై వచ్చి గ్రామంలో ఆకస్మిక తనికీలు నిర్వహించారు.ప్రత్యేక అధికారిగా గురువారం ఆకస్మికంగా పెదరావూరు గ్రామంలో పర్యటించి, గ్రామంలోని పారిశుధ్య పరిస్థితులను సమగ్రంగా పరిశీలించి,సంబంధిత సిబ్బందికి తక్షణ చర్యలు తీసుకోవాల్సిందిగా స్పష్టమైన సూచనలు ఇవ్వడం



జరిగింది.ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశమై, గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పరస్పర సహకారం ఎంతో అవసరమని తెలియజేసి, వారి సహకారం కోరడం జరిగింది. గ్రామంలో గుర్తించిన ప్రధాన సమస్యలను ఆర్థిక మరియు ఆర్థికేతర విభాగాలుగా వర్గీకరించి,వాటిని స్థానిక శాసనసభ్యులు,రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి తీసుకువెళ్లి, ప్రాధాన్యత క్రమంలో త్వరితగతిన పరిష్కారం సాధించేందుకు చర్యలు తీసుకోబడుతుందని తహసీల్దార్ గోపాలకృష్ణ తెలిపారు.

తల్లి ఆరోగ్యంగా ఉంటేనే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుంది : వైద్యాధికారి కావ్య

కొల్లిపర,ఏప్రిల్ 9 ప్రభాతవార్త: తల్లి ఆరోగ్యంగా ఉంటేనే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని వైద్యాధికారి కావ్య అన్నారు.గురువారం మండల కేంద్రం కొల్లిపర సామాజిక ఆరోగ్య కేంద్రంలో

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ పక్వాడా కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు.అంగన్‌వాడీ కార్యకర్త గడ్డం నిర్మలాజ్యోతి అద్యతన జరిగిన కార్యక్రమంలో కావ్య మాట్లాడుతూ గర్భిణీలు ప్రతి నెలా వైద్యపరీక్షలు చేయించుకుంటూ..ఆరోగ్య సూత్రాలను తప్పనిసపరిగా పాటించాలన్నారు. గర్భిణీలు పోషక విలువలు గలిగిన ఆహారం తీసుకోవాలన్నారు.అదేవిధంగా మండల గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు ఆధ్వర్యంలో పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించి బాలింతలకు,కిశోరి బాలికలకు ఆరోగ్య సూత్రాలపై అవగాహన కలిగించారు.ఆయా కార్యక్రమాల్లో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శాంతిశ్రీ,అంగన్‌వాడీ కార్యకకర్తలు మున్నంగి సీతమ్మ,జె.కిన్నెర, ఎం.వసంతకుమారి,చందు,బాలచంద్రిక,అద్దంకి శివనాగభార్గవి తదితరులు పాల్గొన్నారు.

87 క్వింటాళ్ల అక్రమ పిడిఎస్ బియ్యం పట్టివేత

వట్టిచెరకూరు, ఏప్రిల్ 9, ప్రభాతవార్త: పేదల బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలుచేసి మండలంలోని ఓ మేజర్ పంచాయితీ గ్రామంలోని రైస్ మిల్లులో రీసైక్లింగ్ చేస్తున్న సమాచారంతో సంబంధిత అధికారులు దాడులు చేసి అక్రమ పిడిఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. సివిల్ సప్లై డిప్యూటీ తహసిల్దార్ శివశంకర్ తెలిపిన వివరాలు మేరకు.. మండలంలోని మేజర్ పంచాయతీ గ్రామం అనంతవరపాడ ులోని శ్రీవల్లి రైస్ మిల్లులో పిడిఎఫ్ బియ్యాన్ని రీసైకిలింగ్ చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారనే సమాచారంతో విజిలెన్స్ శాఖ సివిల్ సప్లై శాఖలు సంయుక్తంగా దాడులు చేసి



పిడిఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో రైస్ మిల్లులో నిల్వ ఉంచిన 175 బస్తాలు అనగా 87.50 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. అధికారులు రైస్ మిల్లులో నిల్వ ఉన్న బస్తాల్లోని బియ్యాన్ని పరిశీలించగా అవి పిడిఎస్ బియ్యమేనని నిర్ధారించినట్లు చెప్పారు. రైస్ మిల్లును సీజ్ చేసి అక్కడ ఉన్న హరీష్ పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో విజిలెన్స్ సీఐ శివాజీ, ఎస్సై అమీర్, విజిలెన్స్ డిటీ లక్ష్మి, పత్తిపాడు, గుంటూరు వెస్ట్ సివిల్ సప్లై డిప్యూటీ తాసిల్దారులు శివశంకర్, భవాని తదితరులు పాల్గొన్నారు.

రోటరీక్లబ్ ఆధ్వర్యంలో వికలాంగులకు ఉచిత ట్రై సైకిళ్లు పంపిణీ

తెనాలి మున్సిపాలిటీ ఏప్రిల్9(ప్రభాతవార్త): రోటరీక్లబ్ ఆఫ్ తెనాలి వైకుంతపురం ఆధ్వర్యంలో బిజిఆర్ మైనింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ మరియు జూబ్లీహిల్స్ క్లబ్ వారి సంయుక్త నిర్వహణలో, గురువారం ఏడుగురు వికలాంగులకు ఉచితంగా ట్రై సైకిల్లు పంపిణీ చేశారు.క్లబ్ అధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో, అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్ ముఖ్య అతిథిగా పాల్గొని సైకిళ్ల పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, సమాజ సేవలో రోటరీ క్లబ్ ముందుంటుందని తమ వంతు బాధ్యతగా వికలాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేయడం జరుగుతుందని, సామాజిక సేవలో భాగంగా రోటరీ క్లబ్ ఇప్పటికే అనేక సేవా కార్యక్రమాలు

చేపట్టిందని భవిష్యత్తులో కూడా ఇదే విధంగా కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో కార్యదర్శి గుమ్మడి వెంకటనారాయణ, జాయింట్ సెక్రెటరీ గుత్తా వెంకటరత్నం,జోనల్ ఛైర్మన్ కన్నెగంటి మురళీకృష్ణ, ధూళిపాళ్ల రవీంద్రనాథ్, ప్రెసిడెంట్ ఎలెక్ట్ గుమ్మడి సరోజ్ బాబు ప్రసాద్,బత్తుల వెంకటేశ్వరరావు,అర్జున్ రావు,లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

వైకాపా నాయకుడు రత్నరాజు పరామర్శించిన అంబటి

చేబ్రోలు(పొన్నూరు), ఏప్రిల్ 9,ప్రభాతవార్త: వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ నాయకుడు దాసరి రత్నరాజు మాతృమూర్తి దాసరి దీనమ్మ ఇటీవల మృతి చెందారు. ఆమె దశ దిన కర్మ కార్యక్రమంలో గురువారం సమన్వయకర్తల అంబటి మురళీకృష్ణ పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ

సందర్భంగా దీనమ్మ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంబటి వెంట నాయకులు, కార్యకర్తలున్నారు.

ఆస్తి పన్నుపై 5శాతంరాయితీ

-మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు

పొన్నూరు, ఏప్రిల్ 9,ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఇంటి పన్ను, ఖాళీ స్థలం పన్నులను ఈ నెల 30వ తేదీలోపు ఒకేసారి ఏకమొత్తంగా చెలి ంచినవారికి ఆస్థి పన్నులో ఐదు శాతం రాయితీ కల్పించిందని మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్ బాబు చెప్పారు. గత ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న పాత బకాయి మొత్తం ఏక మొత్తంగా చెలి ంచేవారికి వడ్డీపై 50శాతం రాయితీ అవకాశం కల్పించిందన్నారు. ఈ అవకాశాన్ని పన్ను చెల్లింపుదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇంటి పన్ను, ఖాళీస్థలం పన్ను, నీటి పన్నులను మీ దగ్గరోల్నఇ సచివాలయాలకు వెళ్ళి ప్రత్యేక కౌంటర్ ద్వారా చెల్లించి రశీదులు పొందాలని కమిషనర్ తెలిపారు. పన్ను చెల్లింపుదారులు సకాలంలో పన్నులను చెల్లించి, పట్టణాభివృద్ధికి తోడ్పాటునందించాలని రమేష్‌బాబు కోరారు.

నేటి బాలలే రేపటి పౌరులు

తాడేపల్లి,ఏప్రిల్ 9,ప్రభాతవార్త : మండల పరిధిలోని బ్రహ్మానందపురంలో ఉన్న డాక్టర్ ఏ.పి.జె.అబ్దుల్ కలాం బాలల పార్లమెంట్ సమావేశం గురువారం జరిగింగి.గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బాలల పార్లమెంట్ గ్రూప్ సమావేశంలో ముఖ్యమైన మూడు సమస్యలను పిల్లలు గుర్తించి సచివాలయ సిబ్బంది టి.లావణ్య, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వి.నారాయణరావు,ఆర్ రాజేశ్వరీ హెల్త్ సెక్రటరీలకు వినతిపత్రం అందజేశారు.విషయాన్ని త్వరలోనే పరిష్కరిస్తామని సచివాలయ సిబ్బంది శానిటరీ సెక్రటరీ రవికుమార్ హామీ ఇచ్చారు.కార్యక్రమంవలో గుడ్ షెఫర్డ్ సిబ్బంది అత్తోట పోతురాజు,మహిళా పోలీస్ టి.లావణ్య,ఎపిజె అబ్దుల్ కలాం బాలల పార్లమెంట్ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

అబ్బినేని గుంట పాలెం లో పోషణ పక్వాడ ప్రదర్శన

పెదనందిపాడు ఏప్రిల్ 9 (ప్రభాతవార్త) నేటి నుండి ఈనెల నుండి 23 వరకు జరిగే పోషణపక్వాడ కార్యక్రమం లో భాగంగా, గురువారం పెదనందిపాడు మండలం లోని, అబ్బినేని గుంటపాలెం పాలెం ఎస్సీ అంగన్వాడీ కేంద్రం లో, తల్లి మరియు శిశు పోషణ, గురించి తెలియచేసే కార్యక్రమం లో ఐసిడి ఎస్ సూపర్వైజర్ ఎండి జరిన మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు మరియు బాలింత లు మరియు పిల్లల కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు ఈ సందర్భంగా స్థానికంగా లభ్యమయ్యే పోషకాహార వంటకాలు ప్రదర్శించటం, పోషణ ప్రాముఖ్యత పై తాతలు అమ్మమ్మలు నానమ్మలు అవ్వలు కథలు చెప్పడం ద్వారా న మాజ స్థాయి లో వ రన్పరం అనుభవాలను పంచుకోవటం

,ఇంకా జంక్ ఫుడ్, మరియు ప్యాక్ చేసిన ఆహార పదార్థాలు వలన జరిగే నష్టాలు, గురించి అవగాహన కల్పించడం. గర్భిణీ స్త్రీలు చేయించుకునే (ఏ ఎన్ సి) పరీక్షల ప్రాముఖ్యత, పుట్టిన వెంటనే తల్లి పాలు ప్రారంభించటం, సరైన వయస్సులో అనుబంధ ఆహారం ప్రారంభించటం, గురించి ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎండి జరీనా వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, గర్భిణీ స్త్రీలు , చిన్నారులు తల్లులు పాల్గొన్నారు.

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం(ఏ.యెన్.యూ) డిగ్రీ మొదటి సెమిస్టర్ లో 90 మార్కులు సాధించిన వి రమ్యశ్రీ.

పెదనందిపాడు ఏప్రిల్ 9 (ప్రభాతవార్త) ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం గురువారం విడుదల చేసిన డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో స్థానిక పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థులు 72 శాతం ఉత్తీర్ణత సాధించినారు. వరగాని గ్రామానికి చెందిన వి. రమ్య శ్రీ 90 మార్కులతో కళాశాలలో ప్రథమ స్థానంలో నిలవగా, పర్చూరుకు చెందిన సి.హెచ్ లక్ష్మి ప్రణతి 88 మార్కులతో ద్వితీయ స్థానంలో, కాకుమాను గ్రామానికి చెందిన రుద్రపాటి రాహుల్ 86 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భముగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. జి. వీర

రాఘవయ్య, వైస్ ప్రిన్సిపాల్ కే ప్రతాప్ కుమార్ .పెదనందిపాడు ఎడ్యుకేషన్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షులు. విశ్రాంతి విజిలెన్స్ ఎస్పి. కాళహస్తి సత్యనారాయణ, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ లావు రత్తయ్య, ట్రెజరర్ లావు ఆదిశేషయ్య, జాయింట్ సెక్రెటరీ నర్రా బాలకృష్ణ , వైస్ ప్రెసిడెంట్ మండది చలపతిరావు , పాలకవర్గ సభ్యులు నర్రా వీరయ్య మరియు కమిటీ మెంబర్స్, అధ్యాపకులు వారికి శుభాభినందనలు తెలియజేసినారు.

ఆర్కే పై నిప్పులు రేపిన బలసాని

ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు.

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 9, ప్రభాతవార్త: నైతిక విలువలు వదిలేసి సభ్య సమాజం తలదించుకునేలా మహిళలను, వైసీపీ కార్యకర్తలను కించపరిచేలా రాధాకృష్ణ చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటని ప్రత్తిపాడు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ ఆగ్రహం

వ్యక్తంచేశారురాధాకృష్ణపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బలసాని వైసిపి పార్టీ నేతలతో కలిసి ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్లో గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బలసాని విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ..ఏబీఎన్, ఆంధ్రజ్యోతి అధినేత వేమూరి రాధాకృష్ణపై నిప్పులు చెరిగారు. వీకెండ్ కామెంట్ బై ఆర్కే కార్యక్రమంలో మహిళలను, వైసీపీ కార్యకర్తలను కించపరిచేలా వ్యాఖ్యలు చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నైతిక విలువలు వదిలేసి, సభ్య సమాజం తలదించుకునేలా వ్యవహరించిన ఆర్కేతో పాటు ఏబీఎన్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పచ్చ పార్టీకి వంత పాడుతూ జర్నలిజం ముసుగులో నీచమైన రాజకీయాలు చేస్తున్నారంటూ ఏబీఎన్ ఆర్కేపై విరుచుకు పడ్డారు. ఈ నెల 4వ తేదీన ప్రసారమైన వీకెండ్ కామెంట్ బై ఆర్కే ప్రోగ్రామ్‌లో మహిళలను కించపరిచేలా, అత్యంత అసహ్యకరమైన వ్యాఖ్యలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్మోహన్ రెడ్డి చెబితే సొంత భార్యలను కూడా చెల్లెళ్లుగా భావించే వెన్నెముక లేని బ్యాచ్ అంటూ ఆర్కే చేసిన వ్యాఖ్యలు రాజకీయవర్గాల్లో దుమారం రేపుతున్నాయన్నారు. ఈ వ్యాఖ్యలు కేవలం ఒక పార్టీని విమర్శించడం మాత్రమే కాదని, మహిళా లోకాన్ని, కట్టుకున్న భార్యలను అవమానించడమేనని మండిపడ్డారు. రాధాకృష్ణకు అసలు సంస్కారం ఉందా? నీకు తల్లి, చెల్లి, భార్య లేరా? రాజకీయ విమర్శలు చేయాలంటే నీతిగా చేయాలి. అంతేకానీ వైసీపీ కార్యకర్తల భార్యల గురించి అంత నీచంగా మాట్లాడతారా? జర్నలిజం పేరుతో నువ్వు చేస్తున్నది అరాచకమని ఫైర్ అయ్యారు. వెంటనే ఆర్కేపై, ఆ ఛానల్ యాజమాన్యంపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. మరోసారి నోరు జారితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి ఖబడ్దార్ అని హెచ్చరించారు. వీకెండ్ కామెంట్ బై ఆర్కే ప్రోగ్రామ్‌లో పాల్గొన్న యాంకర్, ఎడిటర్ మరియు మేనేజ్‌మెంట్ అందరినీ బాధ్యులను చేస్తూ చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పట్టుబట్టారు. మహిళలను కేవలం వస్తువులుగా చిత్రీకరిస్తూ, లింగ సమానత్వాన్ని దెబ్బతీసేలా ఆర్కే ప్రసంగాలు ఉన్నాయని ఆరోపించారు. బాధ్యతాయుత మైన, ప్రజాస్వామ్యానికి మూల స్తంభమైన జర్నలిజంలో కొనసాగుతూ, ఇలాంటి నీచపు మాటలకు పాల్పడుతున్న ఏబీఎన్ వైఖరిపై రాష్ట్రవ్యాప్త నిరసనలకు సిద్ధమవుతున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు, పెదనందిపాడు మండల వైసీపీ కన్వీనర్లు చల్లా హనుమంతు యాదవ్, కాసిం పీరా, రాష్ట్ర మాజీ ఆర్ అండ్ బి డైరెక్టర్ పిల్లి మేరీ, నియోజకవర్గ వాలంటీర్స్ విభాగం అధ్యక్షులు వంగ సీతారామరెడ్డి, ట్రేడ్ యూనియన్ మహిళ జాయింట్ సెక్రెటరీ బోరుగడ్డ రజిని, బూత్ కమిటీ అధ్యక్షులు రేటూరు సుధాకర్, నియోజకవర్గ మహిళా విభాగం జాయింట్ సెక్రెటరీ పాటిబండ్ల కవిత, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు దారం అశోక్ యాదవ్, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షులు బాపతు రమణమ్మ రాష్ట్ర సేవాదళ్ వైస్ ప్రెసిడెంట్ మెట్టు వెంకటప్ప రెడ్డి, మండల యువజన విభాగం అధ్యక్షులు గోవిందరెడ్డి బాపతు, ప్రత్తిపాడు మాజీ సర్పంచ్ అనిల్ కుమార్రెడ్డి, సత్యనారాయణ రెడ్డి రూరల్ మండలం, తదితర వైసిపి శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

విద్యతోనే ఉత్తమ నాయకత్వ లక్షణాలు

కిట్స్ అక్షర చైర్మన్ కోయి సుబ్బారావు.

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 9, ప్రభాతవార్త: విద్యతోనే ఉత్తమ నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ అలవడతాయని కిట్స్ అక్షర ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ కోయి సుబ్బారావు పేర్కొన్నారు. ప్రత్తిపాడు మండలంలోని యనమదల గ్రామ పరిధిలో ఉన్న కిట్స్ అక్షర ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం బీటెక్ ఆఖరి సంవత్సరం విద్యార్థులకు

వీడ్కోలు సభను ఘనంగా నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వీడ్కోలు సభలో కళాశాల చైర్మన్ సుబ్బారావు మాట్లాడుతూ..ఈ రోజు మీరు విద్యా ప్రయాణంలో ఒక మైలురాయిని చేరుకుంటున్నారని వివరించారు. మన కళాశాలలో గడిపిన సంవత్సరాలు మీ జీవితంలో చిరస్మరణీయమైన జ్ఞాపకాలుగా నిలిచిపోతాయన్నారు. మీరు కేవలం విద్యనే కాకుండా, విలువలు, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను తమ కళాశాలలో నేర్చుకున్నారని తెలియజేశారు. మీరు ఎక్కడ ఉన్నా జన్మనిచ్చిన తల్లిదండ్రులను, విద్యాబుద్ధులు నేర్పిన గురువులను, కళాశాలను ఎన్నటికీ మర్చిపోకూడదని హితవు పలికారు. కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల అంటే జాతీయస్థాయిలో క్రమశిక్షణకు మంచి పేరు ఉందని తెలిపారు. అలాంటి కళాశాలలో మీరు విద్యను అభ్యసించి, కోర్సు పూర్తి చేసి బయటకు వెళ్ళి, మంచి ఉపాధిని సాధించి ఉన్నత స్థితిలో ఉండాలని కోరుతున్నట్లు చెప్పారు. ఇప్పటికే మా కళాశాలలో విద్యను పూర్తిచేసి, దేశవిదేశాల్లో ఎందరో విద్యార్థులు మంచి ఉపాధి పొందుతూ స్థిరపడ్డారని గుర్తు చేశారు. అలాంటి వారిని ఆదర్శంగా తీసుకొని నేటి విద్యార్థులు ముందుకు సాగాలని కోరారు. సెక్రెటరీ కోయి శేఖర్ మాట్లాడుతూ ప్రపంచం మీకోసం ఎన్నో అవకాశాలతో ఎదురుచూస్తోందని మీరు ఎక్కడికి వెళ్లినా మన కళాశాల ప్రతిష్టను పెంచుతూ, సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షి ంచారు. కళాశాల డైరెక్టర్ గోగినేని సాంబశివరావు (జిఎస్ ఆర్) మాట్లాడుతూ..మీ విద్యా జీవితంలో పొందిన జ్ఞానం, నైపుణ్యాలు మరియు విలువలు మీ భవిష్యత్ విజయాలకు బలమైన పునాది అవుతాయని పేర్కొన్నారు. కృషి, పట్టుదల, సానుకూల దృక్పథం మీకు విజయపథంలో ముందుకు నడిపిస్తాయని తెలిపారు. ప్రిన్సిపాల్ డా.కె.రామకోటయ్య కొత్త అవకాశాలను స్వీకరించి, సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ ముందుకు సాగాలని, మీ భవిష్యత్తు వెలుగులతో నిండా లని, మీరందరూ ఉన్నత స్థానాలను అధిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు చెప్పారు. తుది సంవత్సరం విద్యార్థులు తమ అనుభవాలను పంచుకుంటూ కళాశాల జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. జూనియర్ విద్యార్థులు సీనియర్లకు గుర్తుగా స్మారక చిహ్నాలు అందజేశారు. గడిపిన మధుర జ్ఞాపకాలతో బీటెక్ ఆఖరి సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు పలికారు. కార్యక్రమానికి వివిధ శాఖల హెచ్వోడీలు, అధ్యాపక ఆధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

తక్కువ మోతాదులో ఎక్కువసార్లు ఆహారం తీసుకోవాలి

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 9, ప్రభాతవార్త: గర్భిణీలు తక్కువ మోతాదులో ఎక్కువ సార్లు ఆహారం తీసుకోవాలని ప్రత్తిపాడు ప్రాజెక్టు సిడిపిఓ జి.విజయలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని కాట్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం 8వ పోషణ పక్షోత్స వాల కార్యక్రమం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ పాల్గొని మాట్లాడుతూ..గర్భిణీ, బాలింతలు తీసుకోవలసిన పోషకాహారం , సంరక్షణ, గర్భిణీ పరీక్షల ప్రాముఖ్యత, గర్భధారణ సమయంలో బరువు పెరుగుదల , విశ్రాంతి, ఐరన్ మరియు కాల్షియం సప్లిమెంట్స్ యొక్క ఆవశ్యకత గురించి తెలియజేశారు. బిడ్డ యొక్క మొదటి బంగారు 1000 రోజుల గురించి క్షుణ్ణంగా వివరించారు . ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు ప్రైవేట్ మెటర్నటీ ఆసుపత్రులలో కూడా పోషణ్ పక్వాడ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని

తెలియజేశారు. ఆరోగ్యశాఖతో సమన్వయం చేసుకొని మాతృ శిశు ఆరోగ్య సేవలను సమగ్రంగా అందించాల్సిన అవసరం ఉందన్నారు. రెండు సంవత్సరాల లోపు పిల్లల మెదడు అభివృద్ధి దృష్ట్యా మొబైల్, టీవీ వంటి స్క్రీన్ వినియోగాన్ని పూర్తిగా నివారించాలని సూచించారు. అలాగే ఫాస్ట్ ఫుడ్, రెడీ టు కుక్,రెడీ టు ఈట్ ఆహార పదార్థాల వినియోగాన్ని తగ్గించి ఇంటి వంట సహజ ఆహారాన్ని ప్రోత్సహించాలని సూచించారు. చిప్స్, కుర్కురే వంటి జంక్ ఫుడ్స్ కు బదులుగా శనగలు, పప్పులు, పల్లీలు, పాప్ కార్న్, పండ్లు వంటి ఆరోగ్యకరమైన స్నాక్స్ ను వినియోగించాలని తెలియజేశారు. కుటుంబంలో పురుషుల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు ఆరోగ్యకరమైన స్నాక్స్ తయారీ, శిశు ఉపహార తయారీ పోటీలు నిర్వహించాలని, అదేవిధంగా తక్కువ ఖర్చుతో స్థానికంగా లభించే పదార్థాలతో తండ్రుల కోసం బొమ్మల తయారీ పోటీలు నిర్వహించాలని సూచించారు. పిల్లల సమగ్ర అభివృద్ధి కోసం బొమ్మలు, కథల పుస్తకాల దాన కార్యక్రమాలను ప్రోత్సహించాలని, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, అన్ని వర్గాల ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈనెల తొమ్మిది నుండి 23వ తేదీ వరకు దేశవ్యాప్తంగా 8వ పోషణ పక్షోత్స వాలు అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో భాగంగా గురువారం కాట్రపాడు, వట్టిచెరుకూరు , ముట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు.

వట్టిచెరుకూరు పీహెచ్సీ వైద్యాధికారి యస్.సరిత మాట్లాడుతూ..గర్భిణీ అని తెలిసిన వెంటనే ఆరోగ్య కేంద్రం మరియు అంగన్వాడీ కేంద్రాల్లో పేర్లు నమోదు చేయించుకోవా లన్నారు. గర్భిణీ సమయంలో 8 నుండి 10 కేజీల బరువు పెరగాలని, పగలు 2 గంటలు, రాత్రి 8 గంటల నిద్ర ఉండాలని సూచించారు. ముట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్

మానస ప్రియదర్శిని మాట్లాడుతూ.. శిశువు పుట్టిన వెంటనే అనగా గంట లోపు బిడ్డకు ముర్రుపాలు పట్టించడం వలన రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. బిడ్డకు 6 నెలలు నిండే వరకు కేవలం తల్లి పాలు మాత్రమే ఇవ్వాలని, 6 నెలలు నిండిన తరువాత అనుబంధ ఆహారం ఇస్తూ రెండు సంవత్సరాల వరకు తల్లిపాలు కొనసాగించాలని తెలియజేశారు. పిల్లలకు ఇంట్లో వేడిగా తయారుచేసే ఆహారం మాత్రమే ఇవ్వాలని సూచించారు. జంక్ ఫుడ్, ప్యాకేజ్ ఫుడ్ తినిపించకూడదని వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ సిడిపిఓ సిహెచ్.విజయ నిర్మల, డాక్టర్ జి.వెంకటేశ్వరరావు, సిహెచ్ఓ విజయ సుశీల, పుల్లడిగుంట, వట్టిచెరుకూరు సెక్టార్ ఐసిడియస్ సూపర్ వైజర్లు పి.మాధవి, కె.చిన్నమ్మాయి,హెల్త్ సూపర్ వైజర్లు జయకుమార్, ప్రియా, వెంకటేశ్వరరావు, ఎన్ఎమ్ లు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆషాలు పాల్గొన్నారు.

వైద్యుని సలహాలేని మందుల వాడకంతో అవయవ నష్టం : డాక్టర్ ప్రవీణ్‌కుమార్

తాడేపల్లి,ఏప్రిల్ 9,ప్రభాతవార్త : అనారోగ్య సమస్యలతో ఉన్నవారు వైద్యుల సూచన లేకుండా అతిగా మందుల వాడకం సురక్షిత కాదని దీనివల్ల శరీరంలోని అవయవాలు దెబ్బతినే ప్రమాదం ఉందని కెఎల్ యూనివర్సిటీ బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ వి.ప్రవీణ్‌కుమార్ ప్రజలకు సూచించారు.గురువారం చినకాకాని గ్రామంలో కెఎల్‌యు బయోటెక్నాలజీ ఎన్ఎస్ఎస్ విభాగం

ఆధ్వర్యంలో అధ్యాపకురాలు డాక్టర్ ఎం.హేమలత,వాలంటీర్లు బృందాలుగా ఏర్పడి ఇంటింటికీ వెళ్ళి అనారోగ్య సమస్యలు ఉన్న వారిని గుర్తించి వ్యాధి నిర్ధారణ కోసం వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకుంటున్నారా,మందులు ఏ విధంగా వాడుతున్నారో ప్రజలకు అవగాహన కల్పించినట్లు బయోటెక్నాలజీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు.కార్యక్రమానికి ఎన్ఎస్ఎస్ ఫీల్డ్ కోఆర్డినేటర్ పి.సురేష్ సమన్వకర్తగా వ్యవహరించగా వాలంటీర్లను యూనివర్సిటీ స్టూడెంట్ అఫైర్స్ డీన్ డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్,సలహాదారులు డాక్టర్ హబీబుల్లాఖాన్,ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ వి.సుధారాణి తదితరులు అభినందించారు.

ఏబీఎన్ రాధాకృష్ణపై మంగళగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో వైసీపీ ఫిర్యాదు

మంగళగిరి, ఏప్రిల్ 9, ప్రభాతవార్త : మహిళల పట్ల అసభ్యకర వ్యాఖ్యలు చేసిన ఛానల్ అధినేత వేమూరి రాధాకృష్ణపై మంగళగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో వైసీపీ నేతలు ఫిర్యాదు చేశారు.

మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి స్వయంగా మంగళగిరి టౌన్ పోలీస్ స్టేషన్ కు వెళ్లి ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన దొంతిరెడ్డి వేమారెడ్డి రాధాకృష్ణ వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలను ఉద్దేశించి రాధాకృష్ణ చేసిన వ్యాఖ్యలు అత్యంత హేయమైనవి, అభ్యంతరకరమైనవి. ఇటువంటి వ్యాఖ్యలు చేసినందుకు ఆయన తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ మహిళల ఆత్మగౌరవానికి అండగా ఉంటుంది,“ అని స్పష్టం చేశారు.ఈ

కార్యక్రమంలో దొంతిరెడ్డి వేమారెడ్డి తో పాటు పార్టీకి చెందిన పలువురు కీలక నేతలు బుర్రముక్క వేణుగోపాల స్వామి రెడ్డి , నాలి వెంకటకృష్ణ, అమర నాగయ్య, ఎం. సుధా రాణి, చిలువూరు ఫిలోమిన, సంకె సునీత, అగస్టిన్, బి. శాలిని, గౌస్, మదాల గోపి, ఈ నిరసనలో పాల్గొని తమ మద్దతు తెలిపారు.

గంగా భగీరథ సగర సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

-వాహనదారులు, పాదచారులకు మజ్జిగ - మంచినీటి పంపిణీ

మంగళగిరి, ఏప్రిల్ 9, ప్రభాతవార్త : మంగళగిరి నగరంలోని వెంకటేశ్వర థియేటర్ ఎదురుగా శ్రీ గంగా భగీరథ సగర సంక్షేమ సంఘం అధ్యక్షులు పందేటి సాంబశివరావు ఆధ్వర్యంలో గౌతమ బుద్ధ రోడ్డు వెంబడి గల ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సగర కార్పొరేషన్ చైర్మన్ రంగేపల్లి వెంకటరమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన వాహనదారులకు, పాదచారులకు మజ్జిగ, చల్లటి మంచినీళ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర సగర కార్పొరేషన్ చైర్మన్ రంగేపల్లి వెంకటరమణ,సగర కార్పొరేషన్ డైరెక్టర్ తాడిశెట్టి వీరస్వామి, మాట్లాడుతూ పందేటి సాంబశివరావు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని తెలిపారు.సమాజ సేవ పట్ల అంకితభావంతో ముందుండే సాంబశివరావు, ముఖ్యంగా అవసరంలో ఉన్నవారికి తోడ్పాటు అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు.వేసవికాలంలో తీవ్ర ఉష్ణోగ్రతల మధ్య పాదచారులు, వాహనదారులు ఎదుర్కొనే దాహార్తిని తీర్చేందుకు ఆయన ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని చెప్పారు..మజ్జిగ, మంచినీటి చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలకు ఉపశమనం కలిగిస్తున్నారని పేర్కొన్నారు.అంతేకాకుండా ప్రతి నెల అమావాస్య రోజున స్థానిక శివాలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నియమితంగా నిర్వహిస్తూ భక్తులకు ఆహారం అందిస్తున్నారని తెలిపారు. సంఘ అధ్యక్షులు పందేటి సాంబశివరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల అభివృద్ధికి విశేషమైన కృషి చేస్తున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రి, మంగళగిరి శాసనసభ్యులు నారా లోకేష్ స్ఫూర్తితో గంగా భగీరథ సగర సంఘం ఆధ్వర్యంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలతో చేస్తున్నామని

అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సగర కార్పొరేషన్ చైర్మన్ రంగేపల్లి వెంకటరమణ, డైరెక్టర్ తాడిశెట్టి వీరస్వామి లను సగర సంఘ చైర్మన్, శ్రీ కాశి అన్నపూర్ణేశ్వరి ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు వారిని శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో కలవకొల్లు తిరుపతి వెంకయ్య, గండికోట అచ్చయ్య, దుంపల సోములు, నంగనం ప్రసాద్, గండికోట వీర రాఘవులు, కలవకొలు గోపి, కర్నాటి సత్యనారాయణ, కటారి విష్ణు, పందేటి శ్రీనివాసరావు, కగ్గా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాప్టో ధర్నా విజయవంతం

గుంటూరు విద్య ఏప్రిల్ 9 ప్రభాతవార్త : ఫ్యాప్టో మలిదశ పోరాటంలో భాగంగా దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగ,ఉపాధ్యాయ, పెన్షనర్ల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఉపాధ్యాయుల సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో గురువారం స్థానిక మహవీర్ జూనియర్ కాలేజీ నల్లచెరువు నందు జరుగుతున్న పదోతరగతి మూల్యాంకన కేంద్రం వద్ద ఫ్యాప్టో నిరసన ధర్నా కార్యక్రమం విజయవంతమైనట్లు జిల్లా ఫ్యాప్టో చైర్మన్ కె. నరసింహారావు తెలియజేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి 12వ పిఆర్సి కమిషన్ నియామకం చేసి 30 శాతం మధ్యంతర భృతి ని ప్రకటించాలని పెండింగ్ 4డి ఎ లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.ఎస్టియు రాష్ట్ర మాజీ అధ్యక్షులు సిహెచ్ జోసఫ్ సుధీర్ బాబు మాట్లాడుతూ సిపిఎస్ రద్దు రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలని పేర్కొన్నారు. ఏపీటీఎఫ్ 257 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. బసవలింగారావు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధినేతర పనులు రద్దు చేయాలని,ఉపాధ్యాయుల అంతర మున్సిపాలిటీల బదిలీలు చేపటలని డిమాండ్ చేశారు. ధర్నా కార్యక్రమం

సందర్భంగా స్పాట్ వాల్యుయేషన్ ఉపాధ్యాయులందరూ సాయంత్రం నాలుగు గంటల నుండి 5 గంటల వరకు తమ నిరసన గలాన్ని వినిపించి, న్యాయ పోరాటాన్ని విజయవంతం చేసినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫ్యాప్టో చైర్మన్ కె. నరసింహారావు, ఏపీటీఎఫ్ 257 రాష్ట్ర కార్యదర్శి కె. బసవలింగారావు, ఎస్టియు రాష్ట్ర మాజీ అధ్యక్షులు సి.హెచ్. జోసఫ్ సుధీర్ బాబు, జిల్లా ఫ్యాప్టో కో చైర్మన్ ఫైజుల్లా, జిల్లాఫ్యాప్టో డిప్యూటీ సెక్రటరీ జనరల్స్ యు. రాజశేఖర్, మహమ్మద్ ఖలీద్, ఫ్యాప్టో జిల్లా కార్యవర్గ సభ్యులు , షేక్ బాజీ, దాసు, ఫ్యాప్టో జిల్లా నాయకులు మేకల సుబ్బారావు, యం. వి. ప్రసాద్ జె. విజయానంద్, బి.ప్రసాద్.వై మనోజ్ కుమార్, బి గోపికృష్ణ మరియు పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉమ్మడి మూడు దేవాలయాల పాలకమండలి చైర్మన్‌కు సత్కారం

గుంటూరు విద్య ఏప్రిల్ 9 ప్రభాతవార్త : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నున్న ఉమ్మడి మూడు దేవాలయాల (శ్రీ జగన్నాధస్వామి, శ్రీ ఆంజనేయ స్వామి,శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానములు)పాలక మండలి చైర్మన్ గా నియమితులైన మల్లెం పూడి శ్రీనివాసరావుకు సత్కారం జరిగింది. ఆయన తన పదవీ బాధ్యతలు ఈ నెల 12 వ తేదీన ఆదివారం ఉదయం:11:28 నిముషములకు స్వీకరించుచున్న నేపథ్యంలో టిడిపి సీనియర్ నాయకులు రాజా మాష్టారు మిత్రులు మల్లెంపూడి శ్రీనివాసరావు రాష్ట్ర గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దాసరి రాజా

మాష్టారు ని మర్యాదపూర్వకముగా కలసి,తన ప్రమాణస్వీకారానికిఆహ్వానించడానికి వచ్చిన సందర్భముగా,శ్రీవికాస్ విద్యా సంస్థల ఆవరణలో, దేవాలయ చైర్మన్ గా నియమితులైన మల్లెంపూడిని, దాసరి రాజా మాష్టారు,శ్రీదేవి రాజా మాష్టార్లు సతీసమేతముగా సత్కరించారు. ,మల్లెంపూడి శ్రీనివాసు కు చైర్మన్గా అవకాశం కల్పించిన గుంటూరు తూర్పు శాసన సభ్యులు నసీర్ అహమ్మదు కి కూడా ఈ సందర్భంగా రాజా మాష్టారు అభినందనలు తెలిపారు..

యూనిఫై యాప్స్ ప్రాంగణ ఎంపికలో ఆర్.వి.ఆర్ జె.సి. ఇంజనీరింగ్ కళాశాల 11 మంది విద్యార్థులకు 6 లక్షల ప్యాకేజీలతో ఉద్యోగ అవకాశాలు

గుంటూరు విద్య ఏప్రిల్ 9 ప్రభాతవార్త : ఇటీవల తమ కళాశాలలో ప్రముఖ ఐటి సంస్థ యూనిఫై యాప్స్ నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో 11 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల అధ్యక్షులు డా. రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు శ్రీ జాగర్లమూడి మురళీమోహన్, డా. జగదీష్ కె. మద్దినేని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు రూ.6

లక్షల ప్యాకేజీతో నియామకం కల్పించడంతో పాటు, ఇంటర్న్‌షిప్ కాలంలో నెలకు రూ.18,000 స్టైపెండ్ అందించనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను గురువారం నాడు కళాశాల సిబ్బంది అభినందించారు. 2025 2026 విద్యా సంవత్సరంలో అనేక జాతీయ, అంతర్జాతీయ స్థాయి పలు సంస్థలు కళాశాలలో క్యాంపస్ నియామకాలు నిర్వహించేందుకు ముందుకు రావడం సంతోషకరమని, ఇది కంపినీల అవసరాలకు అనుగుణంగా కళాశాల అందిస్తున్న నాణ్యమైన సాంకేతిక విద్య, ప్రాక్టికల్ నైపుణ్యాల శిక్షణకు నిదర్శనమని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ శ్రీ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డా. కొండబోలు కృష్ణప్రసాద్ పేర్కొన్నారు.కళాశాల ప్రిన్సిపాల్ డా. కొల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ, యూనిఫై యాప్స్ ప్రాంగణ నియామకాల్లో ఏ.ఐ ఎమ్.ఎల్ విభాగం నుండి ఇద్దరు, సి.ఎస్.ఈ విభాగం నుండి ముగ్గురు, డేటా సైన్స్ విభాగం నుండి నలుగురు, ఐటి విభాగం నుండి ఇద్దరు విద్యార్థులు ఎంపికై ఉద్యోగాలను సాధించారని, మరి కొన్ని కంపినీల నుండి భారీ సంఖ్యలో అధిక ప్యాకేజీలతో కూడిన నియామక పత్రాలు అందనున్నాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా కళాశాల అకడమిక్ ఆర్ డి డైరెక్టర్ డా. కె. రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్ అడ్మినిస్ట్రేషన్ డా. ఎన్.వి. శ్రీనివాసరావు, ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ అధికారులు శ్రీ సి.హెచ్. శ్రీనివాసరావు, డా.కె. సురేష్ బాబు, వివిధ శాఖల విభాగాధిపతులు, ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జులు విద్యార్థులను అభినందించారు.

నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంపుకు వర్సిటీ విద్యార్థులు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, ఏప్రిల్9, ప్రభాతవార్త: ఏఎన్‌యు పరిధిలోని ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్‌కు ఎంపికయ్యారని ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య వి.దివ్యతేజోమూర్తి తెలిపారు. కర్ణాటకలోని మంగుళూరులో ఉన్న ఎన్ఐటిటిఇ డీమ్డ్ యూనివర్సిటీలో ఈ క్యాంపు ఈనెల 13 నుంచి 19వ తేదీ వరకు జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన వాలంటీర్లను వీసీ ఆచార్య కె.గంగాధరరావు అభినందించారు. ఈ సందర్భంలో వాలంటీర్లు షేక్ నజీర్‌భాషా,

ఈ.ధనుష్య, ఆర్.పూజిత, వి.షణ్ముఖ సాయి, ఎం.ఝాన్సీప్రియ, కె.నాగమల్లేశ్వరి, రావూరి చరణ్ సాయి మణికంఠ, కె.మనోజ్‌కుమార్, ఏ.శ్రీవిద్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ కె. సుజన, ఎన్ఎస్ఎస్ విభాగం సూపరింటెండెంట్ కె. కోటేశ్వరరావు, జి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి నోబుల్ టీచర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి

గుంటూరు విద్య ఏప్రిల్ 9 ప్రభాతవార్త : . గుంటూరు రీజియన్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆర్జెడి శ్రీ బి లింగేశ్వర్ రెడ్డి ని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు ఆయన ఛాంబర్లో కలిసి మున్సిపల్ పాఠశాలల్లో నెలకొన్న పలు సమస్యలపై ప్రాతినిధ్యం చేయడం జరిగింది. జీవో నెంబర్ 84 ప్రకారం సూపర్ విజన్ మరియు అడ్మినిస్ట్రేటివ్ బాధ్యతలు మున్సిపల్ డిపార్ట్మెంట్ నుంచి స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ కు సంక్రమింప చేసే సందర్భంలో పలు విషయాలను ఆ జీవోలో ప్రస్తావించారని, ముఖ్యంగా మున్సిపల్ ఉపాధ్యాయులకు పీఎఫ్ సౌకర్యం కల్పిస్తామని ప్రకటించారని, కానీ

ఇప్పటివరకు నాలుగు సంవత్సరాలుగా 2022 నుండి పీఎఫ్ సౌకర్యం లేక మున్సిపల్ ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఆర్జెడి దృష్టికి తీసుకుని వచ్చారు. అదేవిధంగా మున్సిపల్ పాఠశాలల్లో నాన్ టీచింగ్ సిబ్బంది రిటైర్ అయిన సందర్భాలలో ఆయా పోస్టులను మరలా భర్తీ చేయకుండా స్కూల్ ఎడ్యుకేషన్ వారే మీ బాధ్యతలు చూస్తున్నారు కాబట్టి ఆ పోస్టులను వారిచేతనే భర్తీ చేయించుకోవాలని మున్సిపల్ అధికారులు అంటున్నారని, దీనిపై తగిన ఆదేశాలు మున్సిపల్ డిపార్ట్మెంట్ కు ప్రభుత్వం జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా పలు పాఠశాలల్లో డే వాచ్మెన్లు లేరని, కంప్యూటర్ ఆపరేటర్లు లేరని, ఈ సమస్యలకు పరిష్కారం చూపాలని ఆర్జెడి ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయడం జరిగింది. అదేవిధంగా 10వ తరగతి స్పాట్ వాల్యూయేషన్ కు సంబంధించిన సమస్యలను ప్రస్తావించగా చాలా వరకు సమస్యలను పరిష్కరించామని, ఇప్పుడు సర్వర్ కూడా వేగంగా పనిచేస్తుందని, కొత్త విధానం ప్రవేశపెట్టినప్పుడు మొదటి రెండు రోజులు కొంత ఇబ్బందులు ఉంటాయని, రేపటినుండి ఎలాంటి ఇబ్బందులు ఉండవని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ గుంటూరు జిల్లా అధ్యక్షులు పి సాయి విశ్వనాథ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు శ్రీ సిహెచ్ పినాకపాణి, రాష్ట్ర మున్సిపల్ కన్వీనర్ పి లలిత బాబు, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఎన్ వేణుగోపాల్ ,గుంటూరు నగర అధ్యక్షులు కె.వి.రాఘవులు ఉపాధ్యక్షులు టి. రవి తదితరులు పాల్గొన్నారు.

10-4P8exHMNWJQE 8 VJA_10-4P8exHMNWJQE.qxd 10/Apr/26 1:00 AM Page 1

మాట్లాడుతున్న మంత్రి సీతక్క

అంగన్‌వాడీ వ్యవస్థ బలోపేతమే లక్ష్యం: మంత్రి సీతక్క

మహబూబాబాద్ ప్రతినిధి, ప్రభాతవార్త: క్షేత్రస్థాయిలో అంగన్వాడి సేవలను బలోపేతం చేయడానికి మొబైల్ ఫోన్‌లు ఎంతగానో దోహదపడుతాయని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. గురువారం మహబూబాబాద్ పట్టణంలోని వయోవృద్ధుల డే కేర్ సెంటర్ ప్రారంభించి అంగన్వాడి టీచర్లకు 1313 మొబైల్‌ఫోన్‌ల పంపిణీ, పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని ఎమ్మెల్యేలు భూక్య మురళినాయక్, కోరం కనకయ్య, కలెక్టర్ స్నేహాశబరీష్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ జ్యోతి లతో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి మొబైల్ ఫోన్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో 12లక్షల వ్యయంతో వయోవృద్ధుల కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని, స్వచ్ఛంద సంస్థల ద్వారా ఈ కేంద్రాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను ప్రేమగా చూసుకోవాలని వారిని బస్టాండ్, రైల్వేస్టేషన్‌లలో వదిలేయడం తగదని సూచించారు. స్త్రీ, శిశు సంక్షేమశాఖను బలోపేతం చేయడం కోసం రాష్ట్రవ్యాప్తంగా వయోవృద్ధులు, గర్భిణిలు బాలింతలు చిన్నపిల్లలకు వివిధ పథకాలను ప్రవేశపెట్టి వారి సంక్షేమం కోసం ప్రభుత్వం కృషిచేస్తుందని తెలిపారు. ఎమ్మెల్యే భూక్య మురళినాయక్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నాయకత్వంలో ప్రభుత్వం వృద్ధుల సంక్షేమం కోసం చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకొని శాసనభలో వృద్దుల సంక్షేమ చట్టం ప్రవేశపెట్టి అమలుపరిచినందున వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్ఎస్‌యుఐ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త: చదువు నేర్పిన వివేకం పోరాట పటిమగా మారినప్పుడే దేశ చరిత్ర మారుతుందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. సమాజంలో ఏ విప్లవాత్మక మార్పు రావాలన్నా, దానికి విద్యార్థి ఉద్యమమే తొలి అడుగు అన్నారు. ఇది చరిత్ర నిరూపించిన సత్యం, అక్షరాన్ని ఆయుధంగా మలచుకొని, వ్యవస్థలోని లోపాలను ప్రశ్నించే ఆ చారిత్రక తొలి అడుగుకు, దశాబ్దాలుగా ఒక శక్తిమంతమైన వేదికగా నిలుస్తుందన్నారు. దశాబ్దాలుగా విద్యార్థుల హక్కుల కోసం పోరాడుతూ ప్రజాస్వామ్య విలువల్ని కాపాడుతూ. దేశానికి సమర్థవంతమైన నాయకత్వాన్ని అందించడంలో ఎన్.ఎస్.యు.ఐ పోషిస్తున్న పాత్ర అనిర్వచనీయం, స్ఫూర్తిదాయకం అన్నారు. గురువారం ఎన్.ఎస్.యు.ఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్వేచ్ఛ, సమానత్వం, లౌకికవాదమే ప్రాతిపదికగా విద్యార్థి లోకాన్ని ముందుకు నడిపిస్తున్న కార్యకర్తలందరికీ నా హృదయపూర్వక అభినందనలు. శుభాకాంక్షలు.

మహిళా రిజర్వేషన్‌లో బిసి రిజర్వేషన్ కోసం 16న చలో ఢిల్లీ

పిసిసి మాజీ అధ్యక్షుడు వి.హనుమంతరావు

హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:మహిళా రిజర్వేషన్ బిల్లులో బిసి మహిళలకు రాజ్యాధికారంలో పాత్ర ఉండేందుకు రిజర్వేషన్ కోటా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 16న ఛలో ఢిల్లీ ఉద్యమం చేపడుతున్నామని మాజీ పిసిసి అధ్యక్షుడు వి. హనుమంతరావు తెలిపారు. గురువారం గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ కుల గణన చేసి సమాజంలో మేమెంతో మా కేటగిరికి అంత రిజర్వేషన్ చేయాలనీ ఆయన డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు అందరూ మద్దతు ఇవ్వాలనీ ఆయన కోరారు. మహిళా బిల్లు లో మా బిసి ల వాటా మాటేమిటి ? కేటగిరి రిజర్వేషన్ రెండోసారి చేస్తామని అంటున్నారు. దీనిపై మాకు నమ్మకం లేదు అని ఖరాఖండిగా తేల్చిచెప్పారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు మహిళా రిజర్వేషన్లపై ఈ నెల 16న చలో ఢిల్లీ కార్యక్రమం ఉందనీ దీని కోసం తెలంగాణలో బిసిలు కూడా కదలిరావాలిన ఆయన కోరారు. చలో ఢిల్లీ కార్యక్రమానికి ప్రతి మహిళా తరలి రావాలనీ ఆయన సూచించారు.

11న జెఇఇ మెయిన్ సెషన్-2 ప్రాథమిక కీ

20న తుది ఫలితాలు

హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త: ఈ నెల 2 నుంచి 8 వరకు జరిగిన జేఈఈ మెయిన్ సెషన్-2 పరీక్షలకి సంబంధించిన ప్రాథమిక కీని ఈ నెల 11న విడుదల చేయనున్నట్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ప్రకటించింది. ప్రాథమిక కీతోపాటు రెస్పాన్స్ షీట్లను అదే రోజు విడుదల చేయనున్నట్టు తెలిపింది. ప్రొవిజనల్ కీపై అభ్యంతరాలను స్వీకరించిన అనంతరం ఈ నెల 20న ఫలితాలను ప్రకటించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఎన్‌టిఏ ప్రకటించింది. ఈ నెల 2 నుంచి 8 వరకు ఆరు రోజుల పాటు పది సెషన్లలో జేఈఈ సెషన్-2 పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలకు దాదాపు 11.23 లక్షల మంది హాజరయ్యారు. పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న వారిలో సుమారు 93 శాతం విద్యార్థులు హాజరైనట్లు ఎన్‌టిఏ వెల్లడించింది. అందులో పేపర్-1 బీఈ/బీటెక్) పరీక్షకు ఇండియాలో సుమారు 11.06 లక్షల మంది హాజరయ్యారు. విదేశాల్లోని పలు సెంటర్లలో 4,229 మంది విద్యార్థులు రాసినట్లు ఎన్‌టిఏ పేర్కొంది. పేపర్-2 (బి ఆర్క్, బి ప్లానింగ్) పరీక్షకు 54,953 మంది హాజరైనట్లు తెలిపింది. జేఈఈ మెయిన్‌కి సంబంధించి రెండు సెషన్లలో విద్యార్థులు సాదించిన మెరుగైన స్కోరు ఆధారంగా విద్యార్థులకు ఫైనల్ ర్యాంకులను ఎన్‌టిఏ ప్రకటించనుంది.

ర్యాగింగ్ బాధ్యులపై సస్పెన్షన్ వేటు

వరంగల్ కెఎంసిలో కలకలం

వారం రోజుల్లో చర్యలు తీసుకున్న అధికారులు

వరంగల్ క్రైం, ఏప్రిల్ 9, ప్రభాతవార్త: వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలలో వైద్య విద్యార్థుల మధ్య జరిగిన ర్యాగింగ్ పై అధికారులు చర్యలు తీసుకున్నారు. జూనియర్ వైద్య విద్యార్థులపై సీనియర్ వైద్య విద్యార్థులు ర్యాగింగ్ కు పాల్పడిన ఘటనలో జూనియర్ వైద్య విద్యార్థులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అధికారులు విచారణ జరిపి ఏడుగురు సీనియర్ వైద్య విద్యార్థులను ఆరు నెలల పాటు కళాశాల నుండి సస్పెన్షన్ విధించారు. ఆ పిదప హాస్టల్ ఇతరత్ర సదుపాయలు నిషేధం చేసి బయట నుండి విద్యను కొనసాగించేలా ఆదేశాలు ఇచ్చారు. ఈ ఘటన వివరాలు కళాశాల ప్రిన్సిపాల్ డా సంధ్య వెల్లడిస్తూ కళాశాలలో ఎన్ని కట్టు దిట్టమైన చర్యలు తీసుకున్నా రాగింగ్ భూతం విద్యార్థులను వదిలిపెట్టడం లేదని అన్నారు. ఇటీవల సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులను మోకాళ్ళ పై కూర్చోబెట్టి ఇబ్బందులకు గురి చేసినట్లు రుజువు అయ్యిందని అన్నారు. రాగింగ్ అనగానే కొత్తగా కళాశాల విద్యార్థులు సీనియర్స్ మధ్య ఉంటుందని అందరూ భావిస్తారు. ఇక్కడ మాత్రం ఎంబీబీఎస్ రెండు, మూడవ సంవత్సరాలు చదువుతన్న విద్యార్థుల మధ్య రాగింగ్ జరిగింది. రెండవ సంవత్సరం ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థుల వాట్సప్ గ్రూప్ లో మూడవ సంవత్సరం విద్యార్థుల గురించి తప్పుగా మాట్లాడారన్న సమాచారం అందుకుని తమ గురించి జూనియర్స్ తప్పుగా మాట్లాడడం సరియైనది కాదని కోపానికి గురయ్యారు. హాస్టల్ టెర్రస్ పైకి 20 మంది జూనియర్ మెడికోస్ ను పిలిచి మోకాళ్లపై కూర్చో బెట్టి తప్పయిందని మరోసారి ఇలా చేయమని సారీ చెప్పించుకున్నారు. ఇది నచ్చని కొంతమంది జూనియర్ విద్యార్థులు నేషనల్ మెడికల్ కౌన్సిల్ నుంచి మొదలు పెట్టి దేశంలో సంబంధిత శాఖాధి కారులకు, వరంగల్ పోలీస్ కమిషనర్ కు కూడా బాధిత విద్యార్థులు ఫిర్యాదు చేశారు. దీంతో కళాశాల అధికారులు రంగంలోకి దిగి విచారణ జరిపి చర్యలకు సిద్ధం అయ్యారు. ఇలాంటి ఘటనలకు ఎవరు పాల్పడకూడదని జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు.

మంత్రి పొంగులేటిపై ఆరోపణలకు ఆధారాలు ఇవ్వండి

మంత్రివర్గ విస్తరణ ఇప్పట్లో లేదు

బిజెపి, బిఆర్ఎస్ రేపైనా కలుస్తాయి!

గాంధీభవన్‌లో మీడియాతో పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ చిట్‌చాట్

హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త: పొంగులేటి పై విమర్శలు కాదు ఆధారాలు ఉంటే గాంధీభవన్‌కు వచ్చి ఇవ్వండని అంటూ టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్ సవాల్ చేశారు. గాంధీభవన్‌లో గురువారం ఇష్టాగోష్టిగా ఆయన మాట్లా డుతూ మా మీద బట్ట కాల్చి వేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని, బిఆర్ఎస్ దోపిడీ గురించి ప్రజలకు అర్థమైంది ఆధారాలు తీసుకొని చర్చకు రండి అప్పుడు కాంగ్రెస్ ఆలోచిస్తుందనీ నాదర్గుల్ భూముల కుంభకోణం బి ఆర్ ఎస్ హయంలో జరిగిందనీ అన్నారు.

మేము కట్టిన ప్రాజెక్టుల కు ఇప్పటిదాకా ఎక్కడ గీత కూడా పడలేదు మీరు కట్టిన కాళేశ్వరం మూడేళ్లలో కూలిపోతుందనీ ఎద్దేవా చేశారు. జీవన్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ 14 సార్లు బి ఫామ్ ఇచ్చామనీ, పరిస్తితులను బట్టి ముందుకి వెళ్ళాలనీ నేను చర్చ సిద్ధమని పునరుద్ఘాటించారు. మంత్రు లపై పసలేని ఆరోపణలు చేయొద్దని ఆయన హరీష్‌రావుకు హితవు చెప్పారు. మంత్రి పొంగులేటిపై వచ్చిన ఆరోపణలపై ప్రూఫ్ ఉంటే జీవన్‌రెడ్డి విమర్శలు ప్రజలు పట్టించుకునే పరిస్తితిలో లేరనీ మహేష్ కుమార్‌గౌడ్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ పోవాలని చెప్పడానికి జీవన్ రెడ్డి ఎవరు? అని నిలదీశారు. కాంగ్రెస్ కు విమర్శించే ముందు జీవన్ రెడ్డి గతంలో బిఆర్ఎస్‌పై చేసిన విమర్శలకు సమాధానం చెప్పాలనీ డిమాండ్ చేశారు.

బిఆర్ఎస్ బిజెపి వేర్వేరు కాదని భాష్యం చెప్పారు. బిజెపి, బిఆర్ఎస్ రేపైన కలుస్తాయనీ జోస్యం చెప్పారు. బిజెపితో అంటకాగినవారు దేశంలో ఎవరు బాగుపడుద్ది లేదని, ప్రజలు మార్పు కోరుకున్నారు కాబట్టి బిఆర్ఎస్ పోయింది అని అన్నారు. మంత్రి వర్గ విస్తరణ ముఖ్యమంత్రి పరిధిలోని అంశం నాకున్న సమాచారం ప్రకారం మంత్రి వర్గ విస్తరణలో ఇప్పట్లో ఉండదనీ ఆయన తెలిపారు.

విద్యార్థి రాజకీయాలతో జాతీయస్థాయికి ఎదగండి

పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

రాష్ట్రంలో విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి: మంత్రి పొన్నం ప్రభాకర్

ఇందిరాభవన్‌లో ఎన్ఎస్‌యుఐ ఆవిర్భావ దినోత్సవం

హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త: విద్యార్థి చదువుతోపాటు రాజకీయాలతో బాధ్యతతో వ్యవహరించడం అలవర్చుకోంటూ ఓపిక, సహనం కలిగి క్రమంగా ముందుకు సాగుతూ జాతీయస్థాయి నాయకులుగా ఎదగాలని భారత జాతీయ విద్యార్థి సంఘం (ఎన్ఎస్‌యుఐ) నాయకులకు పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఇందిరాభవన్‌లో గురువారం నిర్వహించిన ఎన్ఎస్‌యుఐ 56వ ఆవిర్భావ దినోత్సవాలకు ముఖ్యఅతిథిగా పిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ హాజరై మాట్లాడారు. ఎన్ఎస్‌యుఐ నుంచి రాజకీయ నాయకులుగా ఎదిగి ప్రజసేవ చేయడానికి ఒక వేదికగా మారిందని, ఇక్కడ ఉన్న నాతోపాటు మంత్రి పొన్నం ప్రభాకర్, వంశీచంద్‌రెడ్డి, ఎంపి అనిల్‌కుమార్ యాదవ్, ఎస్‌టి సెల్ ఛైర్మన్ శంకర్‌నాయక్ అందరం కూడా అక్కడ నుంచి వచ్చినవాళ్లమే అని ఆయన వివరించారు. యుక్తవయస్సు విద్యార్థులతో ఎన్ఎస్‌యుఐ పూర్వ విద్యార్థులం ఆవిర్భావ దినోత్సవం జరుపు కొనడం ఆనందం కలిగిస్తోందని అన్నారు. ఎన్ఎస్‌యుఐ అధ్యక్షుడు వెంకటస్వామి నేతృ త్వంలో మరింత బలోపేతంగా ముందుకు సాగా లని కోరారు. జాతీయ స్థాయిలో ఎదిగిన అనేక మంది నాయకులు ఎన్ఎస్‌యూఐ నుంచే ఎదిగారని ప్రజాసమస్యలపై పోరాటంతోపాటు, ఆంగ్లం, హిందితోపాటు దేశంలోని వివిధ భాషలపై పట్టు సాధించడంతో వారు ఉన్నతస్థాయికి చేరారని ఆయన గుర్తు చేశారు. నిత్యం ప్రజల్లో ఉండడం ద్వారా సమస్యలను అర్థం చేసుకుని పరిష్కార దిశగా పనిచేయాలని సూచించారు.

రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థి సంఘాల ఎన్నికలు జరగాలని, విద్యార్థి సంఘాల వల్ల ఎలాంటి అలజడి ఉండదని భవిష్యత్‌లో మంచి రాజకీయతరం రావడానికి విద్యార్థి సంఘాల ఎన్నికలు ఒక పునాది లాంటిదని అన్నారు. విద్యార్థి సంఘాల ఎన్నికలు విషయంలో ముఖ్యమంత్రి కూడా సానుకూలంగా ఉన్నారనీ ప్రభుత్వం కూడా ఎన్నికల నిర్వహణ దిశగా నిర్ణయం తీసుకొంటుందని చెప్పారు. ఎన్ఎస్‌యు శ్రేణులు నగరంలో భారీ ర్యాలీని గాంధీభవన్ వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిడబ్ల్యుసి సభ్యులు చల్లా వంశీచందర్ రెడ్డి, బిసికార్పొరేషన్ ఛైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

11 యేళ్లల్లో బిసి, ఎంబిసి కార్పొరేషన్ల ద్వారా ఖర్చు చేసింది రూ. 732 కోట్లే!

కేటాయించింది రూ. 8,905 కోట్లు

2026-27లో బిసి సంక్షేమానికి రూ. 12,511 కోట్లు కేటాయింపు

హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు 11 ఏళ్ల కాలంలో రాష్ట్రంలో 56 శాతానికిపైగా ఉన్న వెనుకబడిన తరగతుల వారికి బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్, ఎంబీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఖర్చు చేసింది కేవలం రూ. 732.28 కోట్లు మాత్రమే. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు ఈ రెండు ఫైనాన్స్ కార్పొరేషన్ల ద్వారా లబ్ధిపొందింది 89,239 మంది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం 2014 జూన్ 2న ఏర్పడింది. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం బడ్జెట్‌ను ప్రవేశ పెడుతున్నారు. అందులో బీసీ సంక్షేమ శాఖకు బడ్జెట్‌ను ప్రవేశ పెడుతూ కేటాయింపులు చేస్తున్నారు. కేటాయింపుల తరువాత నిధుల విడుదల ఆ తరువాత నిధుల ఖర్చు చేస్తున్నారు. ఇలా గత 11 ఏళ్ల కాలంలో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్‌తోపాటు మోస్ట్ బ్యాక్‌వర్డ్ క్యాస్ట్స్(ఎంబీసీ) ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఖర్చు చేసింది కేవలం రూ. 732 కోట్లు మాత్రమే. ప్రతి ఏడాది బీసీలకు బడ్జెట్‌ను కేటాయించడం.. అందులో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్, ఎంబీసీ ఫైనాన్స్ కార్పొరేషన్‌కి నిధులను కేటాయించడం చేస్తున్నారు. బీసీల్లో ఆర్థికంగా వెనుకబడి వారి అభివృద్ధికి ఆర్థిక చేయూత పథకాలను బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా అమలు చేస్తారు. అలాగే బీసీల్లో అత్యంత వెనుకబడిన కులాల వారి అభివృద్ధి కోసం ఎంబీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఆర్థిక చేయూత పథకాలను అమలు చేస్తారు. ఈ రెండు పథకాల ద్వారా ఎక్కువ మంది బీసీలకు ఆర్థిక చేయూత పథకాలను అమలు చేస్తారు. అలాంటిది గడచిన 11 ఏళ్ల కాలంలో రూ. 8905.08 కోట్లను కేటాయించారు. వాటిల్లో విడుదల చేసింది రూ. 1839.37 కోట్లు. ఇక విడుదల చేసిన వాటిల్లో ఖర్చు చేసింది రూ. 732.28 కోట్లు మాత్రమే. రాష్ట్రంలో 56 శాతంగా ఉన్న బీసీలకు బడ్జెట్‌లో కేటాయింపులు చేయడమే దామాషా ప్రకారం చేయకపోగా.. కేటాయించిన నిధులను సైతం పూర్తిగా విడుదల చేయలేదు. ఇక విడుదల చేసిన నిధులలోనూ పూర్తిగా ఖర్చు చేయలేదు. మొత్తాని రాష్ట్రంలో 56 శాతంగా ఉన్న బీసీలకు 11 ఏళ్ల కాలంలో బీసీ, ఎంబీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రూ. 732.28 కోట్లను 89,239 మందికి ఖర్చు చేశారు. 11 ఏళ్లల్లో 89,239 మందికి అంటే ప్రతి ఏడాది సరాసరి 8112 మందికి లబ్ధి చేకూరినట్టు. ఇక ఈ ఏడాది బీసీల సంక్షేమం కోసం రూ. 12,511 కోట్లను కేటాయించింది. అందులో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్‌కి రూ. 647.41 కోట్లను కేటాయించగా.. ఎంబీసీ కార్పొరేషన్‌కి రూ. 402.35 కోట్లను కేటాయించారు. ఈ ఏడాది వీటిలో ఎంత ఖర్చు చేస్తారో చూడాలి.

జనగణనలో ఒబిసిలను లెక్కించాకే మహిళలకు చట్ట సభల్లో రిజర్వేషన్లు కల్పించాలి: కవిత

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఏప్రిల్9:మహిళా రిజర్వేషన్ల బిల్లు విషయంలో బిజెపి మోసపూరితంగా వ్యవహరిస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. ఈ బిల్లు అమలులో 2011 జనాభా లెక్కలను ప్రతిపాదికగా తీసుకుంటామని చెప్పటం మహిళా లోకాన్ని మోసం చేయటమే అని పేర్కొన్నారు. మహిళా కోటాకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో గురువారం ఆమె వీడియో సందేశం విడుదల చేశారు. ప్రస్తుతం చేపట్టే జనగణనలో ఒబిసి గణన చేయాలని డిమాండ్ చేశారు.జనగణనలో కులం కాలమ్ ఉన్నా వాళ్ల ఒబిసిలకు చెందుతారు అనే స్పష్టత లేదని అన్నారు. దీంతో బిసిల జనాభా ఎంత అనే లెక్క తేలదని పేర్కొన్నారు.

జనగణనలో ఒబిసిలను లెక్కించి ఆ తర్వాతే మహిళలకు చట్ట సభల్లో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళా కోటా విషయంలో బిజెపి చేస్తున్న అన్యాయంపై పోరాటానికి బిసి మహిళలంతా సిద్ధం కావాలని కవిత పిలుపునిచ్చారు. డ్రాఫ్ట్ బిల్లు ముందే ఇవ్వాలి మహిళ రిజర్వేషన్ల బిల్లు అమలు కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పార్లమెంట్ సమావేశాలకు ముందే డ్రాఫ్ట్ బిల్లును అన్ని పార్టీలకు ఇవ్వాలని కవిత కోరారు. లేదంటే అభ్యంతరాలు చెప్పే అవకాశం ఉండదని అన్నారు. బిల్లుపై చర్చ జరిగే రోజు ఉదయమే సభ్యులకు బిల్లు పత్రులను ఇస్తామని చెప్పటమంటే కచ్చితంగా ఇది అన్యాయం చేసే కుట్ర అని మండిపడ్డారు.

డ్రాఫ్ట్ బిల్లును ముందే ఇచ్చే విషయంలో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు దేశంలోని జాతీయ పార్టీల నేతలతో మాట్లాడతానని చెప్పారు. పార్లమెంట్‌లో మహిళ బిల్లు విషయంలో బిజెపి వైఖరిని నిరసిస్తూ మహిళలకు న్యాయం చేసే విధంగా అన్ని పార్టీలు ఒక్కటి కావాలని కోరారు.

బ్రాహ్మణులపై మంద కృష్ణ వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి

బ్రాహ్మణ ఆర్గనైజేషన్ ఫర్ సోషల్ సర్వీస్ డిమాండ్

ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న బసవరాజు శ్రీనివాస్ తదితరులు

హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త: బ్రాహ్మణ సమాజంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న వారు తమ ధోరణిని వెంటనే మార్చుకోవాలని, చేసిన వ్యాఖ్యలను ఉప సంహరించుకోవాలని బ్రాహ్మణ ఆర్గనైజేషన్ ఫర్ సోషల్ సర్వీస్ (బాస్)చీఫ్ కోఆర్డినేటర్ బసవరాజు శ్రీనివాస్ హెచ్చరించారు. ఈ మేరకు గురువారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివిధ బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులతో కలిసి మాట్లాడారు. ఎమ్మార్పీ ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఇటీవలి కాలంలో బ్రాహ్మణ జాతిని కించ పరుస్తూ మాట్లా డుతున్నారని ఆక్షేపించారు. దళిత క్రైస్తవుల కుల హోదా అంశంపై సుప్రీంకోర్టు తీర్పును సమీక్షి ంచాలని కోరుతూ, సంబంధం లేని బ్రాహ్మణ సామాజిక వర్గాన్ని లక్ష్యంగా చేసుకోవడం సరికాదని అన్నారు. భావప్రకటనా స్వేచ్ఛను అడ్డం పెట్టుకుని బ్రాహ్మణులను సమాజంలో దోషులుగా నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇది సమాజంలో అసమానతలు సృష్టించడమేనని మండిపడ్డారు. హిందూ ధర్మాన్ని, మతాన్ని అవమానపరుస్తూ క్రైస్తవ మత వ్యాప్తికి సహకరిస్తున్నారని ఆరోపిం చారు. భారత స్వాతంత్ర్య సమరంలో, రాజ్యాంగ రచనలో, ఆర్థిక సంస్క రణల్లో, అంటరాని తనం నివారణలో బ్రాహ్మణులు పోషించిన విశిష్ట పాత్రను మంద కృష్ణ మాదిగ తెలుసుకోవాలని సూచించారు. గూగుల్‌లో వెతికినా బ్రాహ్మణుల గొప్పతనం, సమాజానికి వారు చేసిన సేవలు తెలుస్తాయని ఎద్దేవా చేశారు. బ్రాహ్మణులను టార్గెట్ చేయడం మాని, చేస్తున్న విపరీత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదే ధోరణి కొనసాగితే తాము కూడా ధీటుగా స్పందించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

టిజిఆర్‌జెసి ఎంట్రన్స్ టెస్ట్‌కు 45 వేల దరఖాస్తులు

15 వరకు దరఖాస్తుల స్వీకరణ.. మే 3న పరీక్ష

హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త: రాష్ట్రంలోని జనరల్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలతోపాటు, 93 కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు(కేజీబీవీ)ల్లో 2026-27 విద్యా సంవత్సరంలో ఇంటర్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల కోసం నిర్వహించే టిజి ఆర్‌జేసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(టిజిఆర్‌జేసీ సెట్)-2026 పరీక్షకు ఇప్పటి వరకు 45వేల దరఖాస్తులు వచ్చాయి. మే 3న పరీక్షను నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన దరఖాస్తులను ఈనెల 15 వరకు ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నట్టు తెలంగాణ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టిజిఆర్‌జేసీ సెట్- 2026 ద్వారా 35 తెలంగాణ గురుకుల (రెసిడెన్షియల్) జూనియర్ కాలేజిలలో, 93 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం, (ఇంగ్లీషు మీడియం. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో) ప్రవేశము కొరకు మే 3న పరీక్షను నిర్వహించనున్నట్టు తెలిపారు. 2026 మార్చిలో జరిగిన 10వ తరగతి పరీక్షలకు హాజరైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను మార్చి 16 నుంచి స్వీకరి స్తున్నామని ఏప్రిల్ 15 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్టు తెలిపారు. దరఖాస్తు ఫీజును రూ.200గా నిర్ణయించినట్టు తెలిపారు. ప్రవేశ పరీక్షలో వచ్చిన మెరిట్ మార్కుల ఆధారంగా రిజర్వేషన్ ద్వారా విద్యార్థుల ఎంపిక జరుగుతుందని తెలిపారు. ఇతర వివరాల కొరకు టిజిఆర్‌జేసీ అధికారిక వెబ్‌సైట్‌లో చూడాలని, ఇతర వివరాల కోసం 040-24734899, 7842991708, 1800 425 2428 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ప్రకటనలో సూచించారు.

రెండు డిసిసి కార్యవర్గాల కమిటీలను ప్రకటించిన పిసిసి

హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త: రాష్ట్రంలోని జోగులాంబ గద్వాల, జయ శంకర్ భూపాలపల్లి డిసిసిలకు తెలంగాణ కాంగ్రెస్ కమిటీ పూర్తి కార్య వర్గాన్ని గురువారం ప్రకటించింది. టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ అధికారికంగా రెండు జిల్లా కార్యవర్గం ప్రకటించారు. జోగులాంబ గద్వాలలో నలుగురు ఉపాధ్యక్షులు ఎనిమిది మంది జనరల్‌సెక్రటీరలను 13మంది సెక్రటరీలు, నియమించారు. జయశంకర్ భూపాలపల్లి లో నలుగురు ఉపాధ్యక్షులు, తొమ్మిది మంది జనరల్‌సెక్రటరీలు, ఒకట్రెజరర్ ఒక స్పోక్స్ మెన్, 17 సెక్రటరీలు, ఆరుగురు ఎగ్జిక్యూటివ్ మెంబర్లు నియించారు.

పెట్టుబడుల కోసం ఫస్ట్ డెస్టినేషన్‌గా తెలంగాణ

ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త: తెలంగాణ ముఖచిత్రం మార్చే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేసోందని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ సిఎల్‌పి కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం గత 28 నెలలు రూ.24,000 కోట్ల రీస్ట్రక్చరింగ్‌తో రాష్ట్ర ఆర్థిక పునరుద్ధరణకు చర్యలు చేపట్టిందని తెలిపారు. రాష్ట్రాన్ని మళ్లీ ఆర్థికంగా పరుగులు పెట్టించే ప్రయత్నం కొనసాగుతోందనీ వివరించారు. మూసీ పునరుద్ధరణ, అభివృద్ధి తో పర్యాటకం, ఉపాధి, పెట్టుబడులకు కొత్త అభివృద్ధి అవకాశాలు వస్తాయనీ ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్ ఫ్యూచర్ సిటీ తెలంగాణకు పరిశ్రమలు ఉపాధి వంటి కొత్త ఆర్థిక ఇంజిన్‌గా రూపుదిద్దుకుంటోందనీ అన్నారు. ఫ్యూచర్ సిటీని ప్రకృతికి అనుకూలంగా, గ్రీన్ ప్లానింగ్‌తో నిర్మిస్తున్నామనీ స్పోతర్లు చెప్పారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా ప్రపంచ స్థాయి నగర నిర్మాణం లక్ష్యమనీ ఆయన తెలిపారు యుఎఇ సహా అంతర్జాతీయ వేదికలపై తెలంగాణకు గుర్తింపు పెరగడంతో పెట్టుబడుల కోసం తెలంగాణ ఫస్ట్ డెస్టినేషన్‌గా నిలుస్తోందనీ చెప్పారు. గ్లోబల్ కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులకు ముందుకు వస్తున్నాయనీ అన్నారు. క్లీన్‌టెక్, ఐటీ, సేవలు, పరిశ్రమల రంగాల్లో పెట్టుబడుల ఆసక్తి పెరుగుతోందనీ వివరించారు. తెలంగాణను మళ్లీ ఆర్థికంగా నిలబెట్టే పునాది కాంగ్రెస్ ప్రభుత్వం వేయడంతో 28 నెలల్లో తెలంగాణలో కీలక రంగాల్లో గ్రోత్ కనిపిస్తోందనీ చెప్పారు.

అంతర్గాం తహశీల్దార్ కార్యాలయంలో ఎసిబి దాడులు

రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్

గోదావరిఖని, ప్రభాతవార్త: పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గంలోని అంతర్గాం తహశీల్దార్ కార్యాలయం అవినీతి కేంద్రంగా మారుతున్నట్లు మరో ఘటన రుజువైంది. భూమి ఎంక్వయిరీ పనిలో సహాయం చేస్తానంటూ రైతు వెంకటస్వామి నుంచి రూ.10,000 లంచం డిమాండ్ చేసిన రెవెన్యూ ఇన్స్పెక్టర్‌ను ఏసీబీ అధికారులు గురువారం పట్టుకున్నారు.రైతు ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు ముందుగానే ప్రణాళిక రచించి వల పన్నారు. డబ్బులు స్వీకరిస్తున్న సమయంలో అధికారిని రెడ్‌హ్యాండెడ్‌గా అదుపు లోకి తీసుకున్నారు. ఘటన స్థలంలోనే విచారణ చేపట్టి ప్రాథమిక ఆధారాలు సేకరించారు. ఈ దాడిని ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్ నేతృత్వంలో నిర్వహించారు.

కేసుపై మరింత లోతైన దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు వెల్లడించారు.ఇదే కార్యాలయంలో గతంలో కూడా ఎంఆర్వో సహా పలువురు అధికారులు ఏసీబీకి చిక్కిన సంఘటనలు చోటుచేసుకోవడం స్థానికంగా ఆందోళనకు గురిచేస్తోంది. వరుసగా బయటపడుతున్న లంచాల వ్యవహారాలపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అవినీతికి అడ్డుకట్ట వేయాలంటే కఠిన చర్యలు తప్పవని వారు అభిప్రాయ పడుతున్నారు.

పెచ్చుమీరిన భూకబ్జాలు, అవినీతి.. ప్రధానిని కలిసి సిబిఐ విచారణ కోరతాం

రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య

హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త: రాష్ట్రంలో భూకబ్జాలు, అవినీతి హద్దుపద్దు లేకుండా పెరిగిపోయాయని, వీటిపై సమగ్ర సిబిఐ విచారణ జరిపించాలని కోరుతూ త్వరలోనే ప్రధానమంత్రిని కలవనున్నట్లు రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య వెల్లడించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుత ప్రభుత్వంలో కొందరు మంత్రులు, ఐఏఎస్ అధికారులు కుమ్మక్కై రాష్ట్రాన్ని లూటీ చేస్తున్నారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత 13 ఏళ్లుగా జరిగిన అక్రమాలపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరగాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు. పదవుల్లో ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ప్రజాప్రతినిధుల అక్రమాస్తులపై విచారణ జరిపించాల్సిన అవసరం ఉందన్నారు. 'మిగులు బడ్జెట్‌తో ఉన్న ధనిక రాష్ట్రం నేడు రూ. 10 లక్షల కోట్ల అప్పుల్లో కూరుకుపోయింది. తెచ్చిన అప్పులను సైతం కాంట్రాక్టర్ల పేరుతో కొల్లగొడుతున్నారు' అని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ భూములను వేలం వేయడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. ఆ భూములను ప్రజా అవసరాలకు, పేదల ఇళ్ల నిర్మాణానికి, బీసీ హాస్టళ్ల మరియు గురుకుల భవనాల కోసం కేటాయించాలని డిమాండ్ చేశారు. నగరంలో సుమారు 6 లక్షల మంది పేదలు అద్దెలు చెల్లించలేక అవస్థలు పడుతుంటే, ప్రభుత్వం భూములను వేలం వేస్తూ కబ్జాదారులకు అమ్ముకోవడం దారుణమని మండిపడ్డారు. రెవెన్యూ అధికారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు కుమ్మక్కై చేస్తున్న దోపిడీని అరికట్టాలని, అక్రమార్కులపై కఠినచర్యలు తీసుకోవాలని ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు.

10-4Pg5 9_10-4Pg5.qxd 09/Apr/26 10:53 PM Page 1

లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు

హెజ్‌బొల్లా సైనిక స్థావరాలే లక్ష్యంగా వైమానిక దాడులు: 250 మందికిపైగా మృతి, 1100 మందికి గాయాలు

బీరూట్, ఏప్రిల్ 9: మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మరోసారి భగ్గుమన్నాయి. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో అమెరికా, ఇరాన్ మధ్య రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన కొన్ని గంటల్లోనే ఇజ్రాయెల్ లెబనాన్‌పై భీకర వైమానిక దాడులకు దిగింది. ఈ దాడుల్లో 250 మందికి పైగా మరణించగా, 1100 మందికి పైగా గాయపడ్డారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి కాల్పుల విరమణను ప్రకటించారు. హర్మూజ్ జలసంధి ద్వారా నౌకల రాకపోకలకు అనుమతించేందుకు ఇరాన్ అంగీకరించింది. ఈ ఒప్పందం వెలువడిన వెనువెంటనే ఇజ్రాయెల్ లెబనాన్‌లోని బీరుట్, బెకా లోయ సహా హిజ్బుల్లా స్థావరాలే లక్ష్యంగా విరుచుకుపడింది. అమెరికాతో కుదిరిన ఒప్పందం తమకు, హిజ్బుల్లాకు మధ్య జరుగుతున్న పోరాటానికి వర్తించదని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్పష్టం చేశారు. అధ్యక్షుడు ట్రంప్ కూడా లెబనాన్‌లో జరుగుతున్నది ఒక ప్రత్యేక ఘర్షణని పేర్కొన్నారు. ఈ దాడులను ఐక్య రాజ్యసమితి తీవ్రంగా ఖండించింది. ఒప్పందం కుదిరిన గంటల వ్యవధిలోనే ఇంతటి మారణ హోమం జరగడం నమ్మశక్యంగా లేదని యూఎన్ మానవ హక్కుల చీఫ్ వోల్కర్ టర్క్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇజ్రాయెల్ దాడులకు ప్రతీకారంగా ఉత్తర ఇజ్రాయెల్‌పై రాకెట్లతో దాడి చేసినట్లు హిజ్బుల్లా ప్రకటించింది. ఇజ్రాయెల్అమెరికా దురాక్రమణ ఆగే వరకు తమ ప్రతిదాడులు కొనసాగుతాయఅని హిజ్బుల్లా హెచ్చరించింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఏప్రిల్ 10న ఇస్లామాబాద్‌లో జరగాల్సిన తదుపరి చర్చలు అత్యంత కీలకంగా మారాయి. కాల్పుల విరమణ వార్తతో 95 డాలర్ల దిగువకు పడిపోయిన బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర, లెబనాన్ దాడులతో మళ్లీ 97 డాలర్లకు పెరిగింది.

హెజ్‌బొల్లా చీఫ్, మేనలుల్ల మృతి

టెల్ అవీవ్, ఏప్రిల్ 9: ఇజ్రాయెల్ దాడుల్లో హెజ్బొల్లా చీఫ్ నయీం ఖాసీమ్ మృతి చెందారు.

తమ దాడుల్లో నయీం ఖాసీమ్ మృతిచెందినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. అలాగే హెజ్బొల్లా అధిపతి నయీమ్ ఖాసీమ్ కార్యదర్శి, మేనల్లుడు అయిన అలీ యూసుఫ్ హర్షీని కూడా హతమార్చినట్లు పేర్కొంటూ ఇజ్రాయెల్ రక్షణ దళాలు ప్రకటన విడుదల చేశాయి. ఐడిఎఫ్ దళాలు లెబనాన్ రాజధాని బీరూట్‌లో నిర్వహించిన భారీ ఆపరేషన్‌లో ఈ విజయం సాధించినట్లు పేర్కొన్నారు. లెబనాన్‌లోని హెజ్బొల్లా మౌలిక సదుపాయాలు, ఆయుధ డిపోలపై బుధవారం రాత్రి వరుస దాడులు నిర్వహించినట్లు ఐడిఎఫ్ పేర్కొంది. ఈ ఆపరేషన్ల ముఖ్య ఉద్దేశ్యం, ఆ ఉగ్రవాద సంస్థ యొక్క కమాండ్ నెట్‌వర్క్‌ను పూర్తిగా దెబ్బతీయడం, దాని ఆయుధ సరఫరా మార్గాలనుపూర్తిగా నిలిపివేయడమేనని పేర్కొంది.

సౌదీ ముడిచమురు పైప్‌లైన్లపై ఇరాన్ క్షిపణి దాడులు..!

దుబాయి, ఏప్రిల్ 9: అమెరికా, ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన కొన్ని గంటలకే ఇరాన్ మళ్లీ తన దూకుడు ప్రదర్శించింది.

సౌదీ అరేబియాలోని అత్యంత కీలకమైన ముడి చమురు పైప్‌లైన్‌ను లక్ష్యంగా చేసుకుని డ్రోన్లు, క్షిపణులతో దాడికి పాల్పడింది. పర్షియన్ గల్ఫ్ నుంచి ఎర్ర సముద్రంలోని యన్‌బు ఓడరేవుకు చమురును రవాణా చేసే ఈ ఈస్ట్‌వెస్ట్ పైప్‌లైన్ సౌదీకి అత్యంత వ్యూహాత్మకమైనది. సుమారు 1,200 కిలోమీటర్ల పొడవున్న ఈ మార్గం, వివాదాస్పద హర్మూజ్ జలసంధిని దాటకుండా చమురు ఎగుమతి చేసేందుకు సౌదీకి ఉన్న ఏకైక ప్రత్యామ్నాయం. యన్‌బు ప్రాంతంలోని పంపింగ్ స్టేషన్లను లక్ష్యంగా చేసుకుని ఈ దాడి జరిపినట్లు ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కోర్ (ఐఆర్ జీసీ) ప్రకటించింది. ఈ ఘటనలో ఒక పంపింగ్ స్టేషన్ వద్ద మంటలు చెలరేగాయి. రోజుకు 70 లక్షల బ్యారెళ్ల చమురు రవాణా సామర్థ్యం ఉన్న ఈ పైప్‌లైన్ దెబ్బతినడంతో అంతర్జాతీయంగా చమురు ధరలు మరోసారి ఆకాశాన్నంటే అవకాశం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం సౌదీ ప్రభుత్వ చమురు సంస్థ అరామ్‌కో నష్టాన్ని అంచనా వేస్తోంది. నష్టం పరిమితంగానే ఉందని, పైప్‌లైన్ కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోలేదని తెలుస్తోంది. ఇరాన్ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే తీవ్ర పరిణామాలు తప్పవని అమెరికా జనరల్ డాన్ కెయిన్ హెచ్చరించారు.

పూర్తిస్థాయి ఒప్పందం అమలయ్యేదాకా మా బలగాలు అక్కడే ఉంటాయి: ట్రంప్

వాషింగ్టన్, ఏప్రిల్ 9: ఇరాన్‌తో యుద్ధం ముగింపునకు సంబంధించి పూర్తిస్థాయి ఒప్పందం అమలయ్యేదాకా తమ దేశానికి చెందిన యుద్ధనౌకలు, బలగాలు ఇరాన్‌ను చుట్టుముట్టే ఉంటాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ స్పష్టంచేశారు. ప్రస్తుతం కుదిరిన రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇరాన్ ఉల్లంఘిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. యుద్ధం ముగించే విషయంలో ఇరాన్‌తో పూర్తిస్థాయి ఒప్పందం కుదిరి అది అమల్లోకి వచ్చేంతవరకు తమ యుద్ధ నౌకలు, విమానాలు, సైనిక సిబ్బంది, ఆయుధాల వంటివన్నీ ఇరాన్, దాని పరిసర ప్రాంతాల్లోనే మోహరించి ఉంటాయని పేర్కొన్నారు. ఏదైనా కారణంతో ఇరాన్ ఈ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే గనుక మునుపెన్నడూ చూడనంత స్థాయిలో తాము విరుచుకుపడతామని వార్నింగ్ ఇచ్చారు. లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడుల నేపథ్యంలో హర్మూజ్‌ను మళ్లీ మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. కాల్పుల విరమణ ఒప్పందం నుంచి వైదొలుగుతామని హెచ్చరించింది. ఈ నేపథ్యంలోనే ట్రంప్ టెహ్రాన్‌కు మళ్లీ హెచ్చరికలు చేశారు. దాంతో పశ్చిమాసియాలో పరిస్థితులు మళ్లీ నివురుగప్పిన నిప్పులా మారాయి. అమెరికా ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందంలో లెబనాన్ భాగం కాదని పేర్కొంటూ ఇజ్రాయెల్ ఆ దేశంపై భీకర దాడులు చేసింది. ఇందులో వందల సంఖ్యలో పౌరులు ప్రాణాలు కోల్పోయారు. దీనికి ప్రతిగా ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌పై దాడులకు దిగింది.

ఇరాన్ ప్రతిపాదనలన్నీ చాట్‌జిపిటి రాసినవే: జెడివాన్స్

వాషింగ్టన్, ఏప్రిల్ 9: ఇరాన్అమెరికా మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన నేపథ్యంలో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ మూడు వెర్షన్లలో తన 10 పాయింట్ల ప్రతిపాదనలు పంపిందని, అందులో ఒకటి చాట్‌జీపీటీ రాసినట్లుగా ఉందని అన్నారు. ఇరాన్ నుంచి వచ్చిన మూడు వేర్వేరు ప్రతిపాదనలు గందరగోళాన్ని సృష్టించాయని పేర్కొన్నారు. తొలుత 10 పాయింట్లతో ఒక ప్రతిపా దనను పంపించారని, అయితే అది చాట్‌జీపీటీ రాసినట్లుగా ఉందని వాన్స్ అన్నారు. పశ్చిమాసియాలో అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్, ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నర్‌లకు ఆ ప్రతిపాదనలు అందాయని చెప్పారు. వెంటనే వారు ఆ ప్రతిపాదనలను తిరస్కరించారని తెలిపారు. ఇరాన్ ప్రతిపాదనలకు సంబంధించిన రెండో వర్షన్‌కు తాము అంగీకరించామని, కాల్పుల విరమణ ప్రకటనలో అధ్యక్షుడు ట్రంప్ దాన్నే ప్రస్తావించారని చెప్పారు. ప్రతిపాదనలకు సంబంధించిన మూడో వెర్షన్ మొదటి దానికంటే అత్యంత దారుణంగా ఉందని, అందులోని డిమాండ్లు అంగీకరించలేని విధంగా ఉన్నాయని అన్నారు.

అమెరికా చెప్పినట్లే వ్యవహరించిన పాకిస్థాన్!

వాషింగ్టన్, ఏప్రిల్ 9: ఇరాన్, అమెరికా మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం వెనుక అమెరికా చెప్పినట్లే పాక్ మెలిగిందన్న ఆరోపణలు తెరపైకి వచ్చాయి. మిత్రదేశంగా ఇరాన్‌ను ఒప్పించినట్లు కనిపిస్తున్న పాకిస్థాన్, నిజానికి అమెరికా చెప్పినట్లే ఆడిందని అంతర్జాతీయ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఈ మొత్తం వ్యవహారంలో పాక్ కేవలం అగ్రరాజ్యం ఆదేశాలను అమలు చేసే ఒక 'మధ్యవర్తి'గా మాత్రమే వ్యవహరించిందని, ఇది ఇరాన్‌కు చేసిన ద్రోహమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈనెల 7న ఇరాన్‌పై దాడి చేస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించినప్పటికీ, వైట్ హౌస్ అధికారులు మాత్రం యుద్ధం కంటే చర్చలే మేలని భావించారు. ఇందుకోసం ఇరాన్‌కు పొరుగు దేశమైన పాకిస్థాన్‌ను ఒక ఆయుధంగా వాడుకున్నారు. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ కూడా స్వతంత్రంగా చేసింది కాదని సమాచారం. ఆ పోస్ట్ యొక్క డ్రాఫ్ట్‌ను కూడా వైట్ హౌస్ ఆమోదించిన తర్వాతే ఆయనపోస్టుచేసారని ఆంగ్లపత్రిక పేర్కొంది. అమెరికా ప్రతిపాదనను ఇరాన్ మొదట తిరస్కరించడంతో, ఇస్లామాబాద్ వెంటనే చైనా సహాయం కోరింది. బీజింగ్ జోక్యంతోనే ఇరాన్ చివరకు ఈ కాల్పుల విరమణకు తలొగ్గిందని అంటున్నారు. శనివారం పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో జరగనున్న ఈ శాంతి సమావేశానికి అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బఘేర్ ఘాలిబాఫ్ హాజరుకానున్నారు. అయితే ఈ వేదిక వెనుక అమెరికాకు రెండు స్పష్టమైన లక్ష్యాలు ఉన్నాయి. పాకిస్థాన్ ద్వారా ఇరాన్‌పై మరింత ఒత్తిడి పెంచడం ఒకటి అయితే, పశ్చిమ ఆసియా రాజకీయాల్లో పాకిస్థాన్‌కు ప్రాధాన్యత కల్పించి, దానిని తన వైపు తిప్పుకోవడం రెండో లక్ష్యాలుగా చెబుతున్నారు.

మధ్యవర్తి దేశాన్ని నమ్మలేం

భారత్‌లో ఇజ్రాయెల్‌రాయబారి వెల్లడి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9: అమెరికాఇరాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణకు సంబంధించిన చర్చల్లో పాకిస్థాన్ పాత్రపై ఇజ్రాయెల్ సందేహం వ్యక్తం చేసింది. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంపై తమకు నమ్మకం లేదని పేర్కొంది. భారత్ లోని ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజార్ ఈ వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్‌ను తాము విశ్వసించలేమని, అమెరికా తన స్వప్రయోజనాల కోసం పాక్ మధ్యవర్తిత్వాన్ని ఉపయోగించుకోవాలని నిర్ణయించుకున్నదని తాము భావిస్తున్నట్లు అజార్ తెలిపారు. ఈ సందర్భంగా ఖతార్, తుర్కియే వంటి సమస్యాత్మక దేశాల ద్వారా హమాస్‌తో అమెరికా కుదుర్చుకున్న ఒప్పందం గురించి అజార్ ప్రస్తావించారు. ఇరాన్‌లో తాము అనుకున్న లక్ష్యాలు సాధించేందుకు యూఎస్ సమన్వయంతో ముందుకుసాగడం తమకు చాలా ముఖ్యమని అన్నారు. ఇక అమెరికాఇరాన్ మధ్య కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణకు మద్దతు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. అయితే లెబనాన్‌పై మాత్రం తమ సైనిక చర్యలు కొనసాగుతాయని పునరుద్ఘాటించారు. ఇరాన్‌పై జరిపిన ఆపరేషన్‌కు, లెబనాన్‌కు ఎలాంటి సంబంధం లేదని అజార్ అన్నారు. దక్షిణ లెబనాన్ ప్రాంతం నుంచి హెజ్‌బొల్లా మౌలిక సదుపాయాలను పూర్తిగా నిర్మూలించడమే తమ లక్ష్యమని చెప్పారు. అది ఇజ్రాయెల్ బాధ్యతగా అభివర్ణించారు.

ఇంధన కొరతపై ఎమిరేట్స్, ఖతార్‌లలో కేంద్ర మంత్రుల పర్యటనలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9: అమెరికా ఇరాన్‌దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ దేశీయంగా ఇంధన కొరతపై ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పురి ఖతార్ పర్యటనకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఆయన రెండురోజులు ఖతార్‌లో పర్యటించనున్నట్లు పెట్రోలియంశాఖ ప్రకటించింది. అయితే పూరీ పర్యటనకు సంబంధించిన స్పష్టమైన కారణాన్ని మాత్రం వెల్లడించలేదు. ఈ నేపథ్యంలో పురి ఖతార్‌కు వెళ్తుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ కూడా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో పర్యటించేందుకు సిద్ధమయ్యారు. ఈనెల 11,12 తేదీల్లో జైశంకర్ పర్యటించనున్నట్లు విదేశాంగ శాఖ పేర్కొన్నది.

భారత్ నౌకల్లోని సిబ్బందికి హై అలర్ట్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9: హర్మూజ్ జలసంధిలో చిక్కుకుపోయిన భారత నావికులకు కేంద్రం అత్యవసర అడ్వయిజరీ జారీచేసింది. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, అనవసరంగా నౌకల నుంచి బయటకు రావద్దని సూచించింది. ఈ మేరకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ ఒక అలర్ట్ జారీచేసింది. భద్రతా కారణాల దృష్ట్యా ఇరాన్ దాని పరిసర జలాల్లో చిక్కుకుపోయిన భారత నావికులు సున్నితమైన ప్రదేశాలకు దూరంగా ఉండాలని, అవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావద్దని సూచించింది.

బెంగాల్‌లో మార్పు తథ్యం: ప్రధాని మోడీ

కోల్‌కతా, ఏప్రిల్ 9: పశ్చిమబెంగాల్‌లోని హల్దియాలో ప్రధాని నరేంద్ర మోడీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తృణమూల్ కాంగ్రెస్ పార్టీపై విమర్శలు గుప్పించారు. అయిదేళ్ల క్రితం నందిగ్రామ్‌లో సిఎం మమతా బెనర్జి ఓటమిని గుర్తుచేస్తూ ఈసారి పశ్చిమబెంగాల్ రాష్ట్రం అంతటా అదే ఫలితం పునరావృతమవుతుందని చెప్పారు. పశ్చిమ బెంగాల్ మార్పును కోరుకుంటోందని, ఈ క్రమంలో బిజెపి భారీ విజయాన్ని చూస్తామని వ్యాఖ్యా నించారు. నందిగ్రామ్‌లో అయిదేళ్ల క్రితం ఏం జరిగిందో ఇప్పుడు భవానీపూర్‌తో పాటు మొత్తం బెంగాల్‌లోనూ అదే ఫలితం వస్తుందని ప్రధాని జోస్యం చెప్పారు. ఇవి సాధారణ ఎన్నికలు కావని, ఈ ఎన్నికలు అభివృద్ధికి, బెంగాల్ చరిత్రను తిరగరాయడానికి ఎంతగానో తోడ్పడతాయని అన్నారు. భారత్ ఎంతో వేగంగా అభివృద్ధి చెందినప్పటికీ టిఎంసి ప్రభుత్వం బెంగాల్ అభివృద్ధికి అడ్డుపడుతోందని విమర్శించారు. తృణమూల్ ప్రభుత్వంలో కుంభకోణాలకు, అవినీతికి పాల్పడిన వారిని జైలుకు పంపిస్తామని ప్రధాని అన్నారు. శరణార్థులకు రాజ్యాంగం ప్రకారం ప్రత్యేక హక్కులను కల్పిస్తామని, చొరబాటుదారులను మాత్రం దేశం నుంచి తరిమికొడతామని చెప్పారు. ఒక్కసారి బిజెపి అధికారంలోకి రాగానే 7వ వేతన కమిషన్‌ను అమల్లోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు.

అసోంలో భారీ విజయం బిజెపిదే: సోనోవాల్

గౌహతి, ఏప్రిల్ 9: అసోం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జోరుగా సాగుతోంది. కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్ తన స్వగ్రామమైన డిబ్రూగఢ్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో బిజెపి నేతృత్వంలోని ఎన్డీయే కూటమి భారీ విజయాన్ని నమోదు చేయబోతోందని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి సుమారు 100స్థానాలను కైవసం చేసుకుంటుందని సోనోవాల్ చెప్పారు. ఎన్నికల ప్రచారం ప్రారంభమైన మొదటిరోజు నుంచి చెబుతున్నాను. మా కూటమి వందసీట్లకు పైగా గెలవడం ఖాయం అంటూ ఆయన పేర్కొన్నారు. ప్రధాని మోడీ నేతృత్వంలోని డబుల్ ఇంజిన్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులే తమను గెలిపిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలు సామాజిక న్యాయాన్ని, మెరుగైన జీవన ప్రమాణాలను కోరుకుంటున్నారని, మోడీ ప్రభుత్వం ఆ దిశగా ఎంతో కృషి చేసిందని సోనోవాల్ అన్నారు. అస్సాంను అభివృద్ధి పథంలో నడిపించడానికి అవసరమైన మౌలిక సదుపాయాలను తమ ప్రభుత్వం కల్పించిందని, అందుకే మోడీ నాయకత్వంపై అచంచలమైన విశ్వాసం కలిగి ఉన్నారని ఆయన వివరించారు. కాగా, అస్సాంలోని మొత్తం 126 నియోజక వర్గాలకు ఈ రోజు పోలింగ్ జరుగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.5 కోట్ల మంది ఓటర్లు తమ తీర్పును ఇవిఎంలలో నిక్షిప్తం చేస్తున్నారు. అస్సాంతో పాటు కేరళ, పుదుచ్చేరిలలోకూడా నేడు ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోంది. అస్సాంలో బిజెపి వరుసగా మూడోసారి అధికారంలోకి రావాలని పట్టుదలగా ఉండగా, కాంగ్రెస్ తన పూర్వవైభం కోసం గట్టిగా పోరాడుతోంది.

బారామతిలో సునేత ఏకగ్రీవం

ముంబై, ఏప్రిల్ 9: మహారాష్ట్రలోని బారామతి నియోజకవర్గానికి జరగాల్సిన బైపోల్ ఎన్నికల నుంచి కాంగ్రెస్ పార్టీ తప్పుకున్నది. దీంతో ఎన్సీపీ నేత, డిప్యూటీ సీఎం సునేత్ర పవార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యేందుకు మార్గం సులువయింది. ఇటీవల ఎన్సీపీ నేత అజిత్ పవార్ విమాన ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిదే. ఈ నేపథ్యంలో బారామతిలో ఏప్రిల్ 23వ తేదీన ఉప ఎన్నిక జరగాల్సి ఉంది. కానీ ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ తప్పుకోవడంతో సునేత్ర పవార్ ఎన్నిక ఏకగ్రీవం కానున్నది. పోటీ నుంచి తప్పుకోవాలని ఎన్సీపీ నేతలు శరద్ పవార్, సుప్రియా సూలే కాంగ్రెస్ పార్టీని అభ్యర్థించారు. బైపోల్స్ నామినేషన్‌కు గురువారమే చివరి రోజు. అయితే బారామతి నుంచి తమ పార్టీ అభ్యర్థి అమర్ మోరే పోటీ చేయడం లేదని మహారాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ హర్షవర్దన్ సప్కాల్ తెలిపారు.

పుదుచ్చేరి పోలింగ్‌కేంద్రాల్లో 'నీల' రోబో హడావిడి

పుదుచ్చేరి, ఏప్రిల్ 9: పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో ఓ వినూత్న దృశ్యం అందరి దృష్టిని ఆకర్షించింది. ఓ పోలింగ్ కేంద్రంలో నీల అనే హ్యూమనాయిడ్ రోబో, సంప్రదాయ చీరకట్టులో ఓటర్లకు స్వాగతం పలుకుతూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రజాస్వామ్య పండుగకు సాంకేతికతను జోడించి ఎన్నికల సంఘం చేసిన ఈ ప్రయోగంపై సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. గురువారం ఉదయం పోలింగ్ ప్రారంభమైనప్పటి నుంచి ఈ మోడల్ పోలింగ్ కేంద్రం వద్ద సందడి వాతావరణం నెలకొంది. కేంద్రానికి వచ్చే ఓటర్లకు నీల రోబో చేతులు జోడించి నమస్కరిస్తోంది. ఓటు వేయడానికి వచ్చినందుకు ధన్యవాదాలు. మీ ఓటు హక్కును వినియోగించుకోండి అంటూ సందేశం ఇస్తూ వారిలో ఉత్సాహం నింపుతోంది. ఈ అనూహ్య పరిణామానికి ఓటర్లు, ముఖ్యంగా యువత ఆశ్చర్యపోయారు. చాలామంది నీల రోబోతో సెల్ఫీలు దిగేందుకు ఆసక్తి చూపారు. ఓటింగ్ శాతాన్ని పెంచడంతో పాటు, ఓటర్లలో చైతన్యం తీసుకురావాలనే లక్ష్యంతో ఎన్నికల సంఘం ఈ సరికొత్త ఆలోచనను అమలు చేసింది. పుదుచ్చేరిలోని 30 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో పోలింగ్ జరుగుతున్న విషయం తెలిసిందే. ఉదయం నుంచే ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి బారులు తీరారు.

అంచనాలను మించి భారీ పోలింగ్

పోలింగ్ ముగిసేనాటికే 75శాతం దాటిన ఓటింగ్

తిరువనంతపురం, ఏప్రిల్ 9: కేరళ, అసోం రాష్ట్రాలతో పాటు కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంత వాతావరణంలో ముగిసింది. మూడు ప్రాంతాల్లోనూ ఓటర్లు ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ అధికారికంగా ముగిసినప్పటికీ, పలు కేంద్రాల్లో ఓటర్లు క్యూలలో వేచి ఉండటంతో వారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. దీంతో తుది పోలింగ్ శాతం మరింత పెరిగే అవకాశం ఉంది.

ఈ ఎన్నికల ఓట్ల లెక్కింపును మే 4వ తేదీన చేపట్టనున్నారు. కేరళలో గెలుపుపై ఎవరి ధీమా వారిదే అన్నట్లుగా ఉంది. ప్రజాస్వామ్య పండుగగా అభివర్ణించే ఎన్నికల పర్వానికి కేరళలో గురువారం సాయంత్రం 6 గంటలకు అధికారికంగా తెరపడింది. రాష్ట్రంలోని 140 అసెంబ్లీ స్థానాలకు జరిగిన పోలింగ్‌లో సాయంత్రం 5 గంటల సమయానికి 75.01 శాతం ఓటింగ్ నమోదైంది. కోజికోడ్ జిల్లాలో అత్యధికంగా 77.63 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

2021 అసెంబ్లీ ఎన్నికల్లో 75.75 శాతం పోలింగ్ నమోదవగా, ఈసారి కూడా తుది సంఖ్య 80 శాతం మార్కును దాటుతుందా లేదా అనేది ఆసక్తికరంగా ఉంది. 1987 తర్వాత 80 శాతం ఓటింగ్ దాటడం ఇదే తొలిసారి అవుతుంది. పోలింగ్ ముగియడంతో, ఇప్పుడు అందరి దృష్టి మే 4న జరగబోయే ఓట్ల లెక్కింపుపైనే ఉంది. రాబోయే ఐదేళ్లపాటు రాష్ట్ర సచివాలయాన్ని ఎవరు శాసిస్తారనే దానిపై ఉత్కంఠ నెలకొంది. ముఖ్యమంత్రి పినరయి విజయన్ నేతృత్వంలోని అధికార లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎల్డీఎఫ్), తమ ప్రస్తుత 99 సీట్ల కంటే ఎక్కువ స్థానాలు గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేసింది. మరోవైపు, కాంగ్రెస్ సీనియర్ నేత ఏకే ఆంటోనీ, వీడీ సతీశన్ వంటి నేతల సారథ్యంలోని ప్రతిపక్ష యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్), 100 సీట్ల మార్కును దాటి అధికారంలోకి వస్తామని ధీమాగా చెబుతోంది. ఈ రెండు కూటములకు భిన్నంగా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ హంగ్ అసెంబ్లీ ఏర్పడుతుందని అంచనా వేశారు. 2016లో ఒక్క సీటు గెలిచి, 2021లో దాన్ని కోల్పోయిన బీజేపీ అంచనాలు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేపుతున్నాయి. పుదుచ్చేరిలో రికార్డు బ్రేకింగ్ పోలింగ్ నమోదయింది. 30 అసెంబ్లీ స్థానాలున్న పుదుచ్చేరిలో రికార్డు స్థాయి ఓటింగ్ నమోదైంది.

సాయంత్రం 5 గంటలకే 86.92 శాతం పోలింగ్ నమోదవడం విశేషం. ఇది 2006లో నమోదైన 86 శాతం రికార్డును అధిగమించింది. తుది పోలింగ్ శాతం మరింత పెరిగే అవకాశం ఉంది. మొత్తం 9.5 లక్షల మంది ఓటర్లు ఉండగా, వీరిలో మహిళా ఓటర్లే అధికం. అధికార ఎన్డీఏ కూటమి (ఏఐఎన్ఆర్‌సీ నేతృత్వంలో), ప్రతిపక్ష ఇండియా కూటమి (కాంగ్రెస్, డీఎంకే, వీసీకే) మధ్య ప్రధాన పోటీ నెలకొంది. వీరితో పాటు నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టివికె), సీమాన్ నేతృత్వంలోని నామ్ తమిళ్ కట్చి (ఎన్టీకే) కూడా బరిలో నిలవడంతో పోటీ ఆసక్తికరంగా మారింది. అసోం, ఇతర ఉప ఎన్నికల్లోనూ భారీగా ఓటింగ్ నమోదయింది.

అసోంలోని 126 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో సాయంత్రం 5 గంటల వరకు 84.42 పోలింగ్ నమోదైంది. సౌత్ సల్మారా మంకాచార్ జిల్లాలో అత్యధికంగా 94.08 ఓటింగ్ నమోదైంది. ఇక వివిధ రాష్ట్రాల్లో జరిగిన ఉప ఎన్నికల్లోనూ ఓటర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు.

కర్ణాటకలోని బాగల్‌కోట్‌లో 65.68 , దావణగెరె సౌత్‌లో 63.04 , నాగాలాండ్‌లోని కోరిడాంగ్ స్థానంలో 80.62, త్రిపురలోని ధర్మనగర్‌లో 79.84పోలింగ్ నమోదైంది. ప్రస్తుతం మూడు రాష్ట్రాల్లోని అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమైంది. మే 4వ తేదీ ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుండగా, మధ్యాహ్నానికి ఫలితాలపై స్పష్టత రానుంది. అప్పటి వరకు ఇదే ఉత్కంఠ అభ్యర్థుల్లో నెలకొంటుందనడంలో సందేహంలేదు.

అసోంలో ఓ పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు

కేరళలో ఓటువేసేందుకు వచ్చి నవజంట

పాండిచ్చేరిలో మండుటెండలకు తాళలేక సేద తీరుతున్న ఓటర్లు

త్రిదళాల్లో 'థియేటర్ కమాండ్' వ్యవస్థలు..!

కేంద్ర రక్షణశాఖ పరిశీలనలో ప్రతిపాదనలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9: రక్షణ దళాల్లో థియేటర్ కమాండ్ వ్యవస్థను సరికొత్తగా రూపొందిస్తున్నారు. కొత్త తరహా థియేటర్ కమాండ్ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు త్రివిధ దళాలు ప్లాన్ రెడీ చేసాయి. రక్షణ బలగాలు ఈ వ్యవస్థ కింద సరికొత్త రీతిలో తమ విధులను నిర్వర్తిస్తాయి. పశ్చిమ సరిహద్దుల్లో పాకిస్థాన్‌ను ఎదుర్కొనేందుకు వెస్ట్రన్ థియేటర్ ఏర్పాటు చేయనున్నారు. ఈ కమాండ్ భారతీయ వైమానిక దళం ఆధీనంలో ఉండనున్నది. ఇక ఉత్తర థియేటర్ కమాండ్ చైనా సరిహద్దుల్ని పర్యవేక్షిస్తుంది. దీనికి ఆర్మీ ఆఫీసర్ నాయకత్వం వహించనున్నారు. ఇక మారిటైం థియేటర్ కమాండ్‌కు నేవీ ఆఫీసర్ నాయకత్వం వహిస్తారు. త్రివిధదళాల మధ్య సమన్వయం కోసమే థియేటర్ కమాండ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. ఈ వ్యవస్థలకు రక్షణశాఖ, భద్రతా క్యాబినెట్ కమిటీ నుంచి ఆమోదం దక్కాల్సి ఉంటుంది. భౌగోళిక సరిహద్దులతో థియేటర్ కమాండ్ వ్యవస్థలు పనిచేస్తాయి. ప్రతి కమాండ్‌కు ఓ మిలిటరీ కమాండ్ నాయకత్వం వహిస్తారు. యుద్ధానికి కావాల్సిన అన్ని ఆయుధాలు అతని ఆధీనంలో ఉంటాయి. యుద్ధ పోరాట పరికరాలు, విమానాలు, హెలికాప్టర్లు, గన్నులు, యుద్ధ ట్యాంక్‌లు, సామాగ్రి, సైన్యం మొత్తం ఆ కమాండర్ ఆదేశాల పరిధిలోకి వస్తాయి. కొత్త ప్లాన్ ప్రకారం వెస్ట్రన్ థియేటర్ కమాండ్‌కు పర్మనెంట్‌గా భారతీయ వైమానిక దళం నేతృత్వం వహించనున్నది.

10-4Pg6exHMNWJQE 10_10-4Pg6exHMNWJQE.qxd 09/Apr/26 10:58 PM Page 1

ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ స్క్రీనింగ్ కమిటీ పునర్వ్యవస్థీకరణ

విజయవాడ,ఏప్రిల్ 9,ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్రంలో ఐఎఫ్ఎస్ (ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్) అధికారుల ఉద్యోగోన్నతుల పరిశీలన కోసం స్క్రీనింగ్ కమిటీని పునర్వ్యవస్థీకరిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సాదారణ పరిపాలనా శాఖ జి.ఓ 718 ప్రకారం.. అదనపు ప్రధాన అటవీ సంరక్షణాధికారి (అడిషనల్ ప్రిన్సిపల్ చీఫ్ కజర్వేటర్) స్థాయి ప్రమోషన్లను పరిశీలించేందుకు ఈ కమిటీ పనిచేయనుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇంతకుముందు జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేస్తూ, కొత్త కమిటీని ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ కమిటీకి ఛైర్మన్‌గా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సభ్యులుగా అటవీ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ / ప్రిన్సిపల్ సెక్రటరీ, ప్రధాన అటవీ సంరక్షణాధికారి, రోడ్లు భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి ఉంటారు. ఈ కమిటీ ఐఎఫ్ఎస్ అధికారుల పనితీరు, సీనియారిటీ తదితర అంశాలను పరిశీలించి, ఉద్యోగోన్నతులపై తుది సిఫారసులు చేయనుంది.

ఉగ్ర లింకుల కేసులో మరో ఆరుగురిని కస్టడీలోకి తీసుకున్న పోలీసులు

విజయవాడ,ఏప్రిల్ 9,ప్రభాతవార్తప్రతినిధి: దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన విజయవాడ ఉగ్ర లింక్స్ కేసులో దర్యాప్తు కీలక దశకు చేరుకుంది. ఈ కేసులో అరెస్టయిన మరో ఆరుగురు నిందితులను కొత్తపేట పోలీసులు గురువారం నుంచి ఐదు రోజుల పాటు కస్టడీలోకి తీసుకుని విచారించనున్నారు. రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న వీరిని మధ్యాహ్నం విజయవాడకు తరలించనున్నారు.

13వ తేదీ వరకు వీరిని విచారించేందుకు విజయవాడ సీజేఎం కోర్టు పోలీసులకు అనుమతి మంజూరు చేసింది. అంతకుముందు పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారించిన ఐదుగురు నిందితులు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా తాజా విచారణకు రంగం సిద్ధమైంది. వారి స్టేట్‌మెంట్ ఆధారంగా ఈ ఆరుగురి నుంచి కీలక సమాచారం రాబట్టాలని పోలీసులు భావిస్తున్నారు. ప్రస్తుతం కస్టడీలోకి తీసుకోనున్న నిందితుల్లో బిహార్‌కు చెందిన షాద్‌మాన్ దిల్కష్ (ఏ4), ఢిల్లీకి చెందిన లక్కీ అహ్మద్ (ఏ7), రాజస్థాన్‌కు చెందిన జిషాన్ (ఏ9), పశ్చిమ బెంగాల్‌కు చెందిన మీర్ ఆసిఫ్ అలీ (ఏ10), పుణెకు చెందిన షారుక్ ఖాన్ (ఏ12), మహారాష్ట్రకు చెందిన షేక్ ఫయాజ్ రెహమాన్ (ఏ13) ఉన్నారు. కాగా, ఈ కేసులో మొత్తం 13 మందిపై కేసు నమోదు కాగా, పోలీసులు ఇప్పటివరకు 12 మందిని అరెస్ట్ చేశారు. వారిలో ఒకరు మైనర్ కావడంతో జువైనల్ హోమ్‌కు తరలించారు. మిగిలిన నిందితులను రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉంచి విచారణ కొనసాగిస్తున్నారు.

జగన్ ఏమి చెప్పినా జనం వినే స్థితిలో లేరు

- కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

విజయవాడ, ఏప్రిల్ 9,ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్ర రాజకీయాల్లో మాజీ ముఖ్యమంత్రి జగన్ అనుచిత విధానాలను అనుసరిస్తున్నారని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వ్యాఖ్యానించారు. ఆయన ఏమీ చెప్పినా ప్రజలు ఆయనను విశ్వసించే పరిస్థితి లేదన్నారు. వైసీపీ అధినేత, తన సోదరుడు జగన్ పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మూడు రాజధానుల పేరుతో రుషికొండను మింగేసి, సొంతానికి ప్యాలెస్‌లు కట్టుకున్న జగన్.. ఇప్పుడు మావిగన్ జోకర్ గా మిగిలిపోయారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. జగన్ కేవలం వైఎస్సార్ పేరును ఉపయోగించుకున్నారో తప్ప, ఆయన ఆశయాలకు వారసుడు కాలేకపోయారని విమర్శించారు. వైఎస్సార్ జీవితకాలం వ్యతిరేకించిన బీజేపీకి జగన్ దత్తపుత్రుడిగా ఎలా మారారని ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా క్రైస్తవ మైనారిటీలపై దాడులు జరుగుతున్నా వైఎస్సార్ వారసుడిగా జగన్ ఎందుకు ఖండించలేదని, ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తుంటే ఎందుకు మౌనంగా ఉన్నారని దుయ్యబట్టారు.

క్వాంటమ్ హార్డ్‌వేర్ హబ్‌గా అమరావతి

- 14న ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభం

హార్డ్‌వేర్ టెస్ట్‌బెడ్ టెక్నాలజీ ప్రాజెక్ట్(ఉహాచిత్రం)

విజయవాడ,ఏప్రిల్ 9,ప్రభాతవార్తప్రతినిధి: అమరావతికి విశ్వవ్యాప్తం ఖ్యాతిని తీసుకుని వచ్చే,ఓ చారిత్రకత్మ ఆవిష్కరణకు తొలి అడుగు ఈ నెలలో పడనుంది.దేశంలోనే తొలి క్వాంటమ్ హార్డ్‌వేర్ టెస్ట్‌బెడ్‌లతో భవిష్యత్ టెక్నాలజీలో అమరావతి మరో సంచలనానికి నాంది పలుకనున్నది. ఈ నెల 14న ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభమయ్యే ప్రాజెక్ట్ క్వాంటమ్ యుగానికి అంకుర్పారణ కానున్నది. అమరావతిని గ్లోబల్ క్వాంటమ్ హబ్‌గా మలిచే దిశగా ఇది చారిత్రక ఘట్టంగా నిలుస్తోంది. క్వాంటమ్ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభిస్తారు. రాష్ట్ర రాజధాని అమరావతిని ప్రపంచ స్థాయి క్వాంటమ్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న లక్ష్యం దిశగా కీలకమైన ముందడుగు పడింది. దేశంలోనే తొలి క్వాంటమ్ హార్డ్‌వేర్ టెస్ట్ బెడ్‌లు అమరావతిలోని ఎస్ ఆర్ఎం యూనివర్సి విజయవాడలోని మేధాటవర్స్ లోనూ ఏర్పాటవు తున్నాయి. భారత్ క్వాంటమ్ రిఫరెన్స్ ఫెసిలిటీస్ గా వ్యవహరిస్తున్న వీటిని ఈ నెల 14న ప్రపంచ ఈ రెండుచోట్ల దేశీయ పరి జ్ఞానంతో తయారుచేసిన రెండు చిన్న క్వాంటమ్ కంప్యూటర్లను ఏర్పాటు చేస్తున్నారు. క్వాంటమ్ వ్యాలీ ఆలోచన మొగ్గతొడిగాక, ఆ రంగంలో విశేష నైపుణ్యం ఉన్న దేశ, విదేశీ నిపుణులతో స్టార్టప్ కంపెనీగా ఏర్పాటైన క్యూబిట్ ఫోర్స్ సంస్థ ఈ క్వాంటమ్ కంప్యూటర్లను రూపొందించింది. అమరావతిలో ఏర్పాటు చేస్తు న్న రిఫరెన్స్ ఫెసిలిటీస్‌ను కేవలం క్వాంటమ్ హార్డ్‌వేర్ టెస్టింగ్ కోసమే కాకుండా, దేశంలోని పరిశోధకులు, స్టార్టప్ కంపెనీలు, పరిశ్రమలు, యూనివర్సిటీలు, విద్యార్థులు వినియోగించు కోవచ్చు. క్వాంటమ్ టెక్నాలజీని ఇంత వరకు పాఠ్యపుస్తకాల్లో చదివి, సిమ్యులేటర్లపైనే ప్రయోగాలు చేస్తున్న విద్యార్థులు ఇకపై నేరుగా క్వాంటమ్ కంప్యూటర్లపై ప్రయోగాలు చేయవచ్చు. ఎస్ఆర్ఎం, మేధాటవర్స్‌లో ఏర్పాటు చేస్తున్న రిఫరెన్స్ ఫెసిలిటీల్లో 111 క్యూబిట్స్ వరకు క్వాంటమ్ ప్రాసెసర్‌లను పరీక్షించవచ్చు. రాబోయే పదేళ్లలో మిలియన్ క్యూబిట్స్ వరకు టెస్టింగ్ సదుపాయాన్ని అభివృద్ధి చేయాలని క్యూబిట్ ఫోర్స్ లక్ష్యంగా పెట్టుకుంది. దేశంలోని 6 నగరాలకు చెందిన సంస్థలు తయారుచేసిన క్వాంటమ్ విడిభాగాల్ని అమరావతికి తీసుకొచ్చి వాటిని క్యూబిట్ ఫోర్స్ సంస్థ అసెంబుల్ చేస్తోంది. వాటికి కావలసిన ప్రాసెసర్‌లను టీఐఎఫ్ఆర్ ముంబయి, ఐఐఎస్సీ బెంగళూరు తయారు చేశాయి. పుణెలోని డీఆర్‌డీవో ల్యాబ్ క్వాంటమ్ కంట్రోల్ ఎలక్ట్రా నిక్స్‌ను అందజేసింది. ఆంబర్ ఎంటర్‌ప్రైజెస్, క్యూబిట్‌ఫోర్స్ సంస్థలు అత్యంత కీలకమైన డైల్యూషన్ రిఫ్రిజిరేటర్లను తయారుచేశాయి. క్యూట్ ఎలక్ట్రానిక్స్ సంస్థ ప్రిసిషన్ కరెంట్ అండ్ వోల్టేజ్ సోర్సెస్‌ను అందజేసింది. దిమిరా సంస్థ ఫ్లెక్స్ కేబుళ్లు, క్రయోజెనిక్ వైరింగ్‌ను సమకూర్చింది. సిస్టమ్ ఇంటిగ్రేషన్, అసెంబ్లింగ్, టెస్టింగ్ బాధ్యతలను క్యూబిట్ ఫోర్స్ నిర్వహిస్తోంది. క్వాంటమ్ కంప్యూటర్లలో ప్రాసెసర్లు ఎంత కీలకమో, డైల్యూషన్ క్రయోజెనిక్ రిఫ్రిజిరేటర్లూ అంతే కీలకం. క్వాంటమ్ కంప్యూటర్లలో 273 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతను నిర్వహించేందుకు డైల్యూషన్ రిఫ్రిజరేటర్లను వినియోగిస్తారు. వీటిలో హీలియం3, హీలియం4 వాయువుల్ని వాడతారు. అమరావతి రిఫరెన్స్ ఫెసిలిటీస్‌లో ఏర్పాటుచేస్తున్న కంప్యూటర్లలో హీలియం4 వాయువుల్ని వినియోగించారు. దానితో ఉష్ణోగ్రతను 269 నుంచి 272 డిగ్రీల వరకు తగ్గించవచ్చు. హీలియం3 వాయువు చాలా అరుదుగా దొరుకుతుంది. మన దేశంలోని రక్షణరంగ పరిశోధన సంస్థల దగ్గరే అందుబాటులో ఉంది. ఇక వాటిలో వినియోగించిన కీలకమైన హార్డ్‌వేర్‌ను ప్రముఖ ప్రభుత్వరంగ రక్షణ, శాస్త్రసాంకేతిక పరిశోధన సంస్థలతో పాటు, ప్రైవేటు సంస్థలు తయారు చేశాయి.

వైఎస్సార్ మొదలుపెట్టిన పాదయాత్ర - చరిత్రను తిరగ రాసిన ఘట్టం

విజయవాడ,ఏప్రిల్ 9,ప్రభాతవార్తప్రతినిధి: దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి చేపట్టిన చారిత్రాత్మక పాదయాత్రకు ఏప్రిల్ 9కు 23 ఏళ్ల పూర్తయిన సందర్భంగా, వైసీపీ అధినేత జగన్ తన తండ్రి స్మృతులను నెమరువేసుకున్నారు. ఎక్స్ వేదికగా ఆయన భావోద్వేగంతో కూడిన ఒక ట్వీట్ చేశారు. 2003 ఏప్రిల్ 9వ తేదీన ఎర్రటి ఎండలో వైఎస్సార్ మొదలుపెట్టిన పాదయాత్ర కేవలం ఒక ప్రయాణం కాదని, అది రాష్ట్ర రాజకీయ చరిత్రనే తిరగరాసిన అపూర్వ ఘట్టమని జగన్ కొనియాడారు. ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకునేందుకు సాగిన ఆ యాత్ర, జన హృదయాల్లో నేనున్నాననే భరోసాఖి నింపిందని గుర్తుచేశారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఉచిత విద్యుత్ ఫైల్‌పై తొలి సంతకం చేసి, రైతన్నలను రాజులుగా నిలబెట్టిన ఘనత వైఎస్సార్‌దేనని జగన్ అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా పేద పిల్లలు డాక్టర్లు, ఇంజినీర్లు అయ్యేలా చేయడంతో పాటు, ఆరోగ్యశ్రీ వంటి పథకాలతో పేదలకు ప్రాణదాతగా నిలిచారని పేర్కొన్నారు.

దేశాభివృద్ధికి పరిశ్రమలు ఎంతో అవసరం

- ప్రతి కార్మికుడు దేశానికి ఒక విలువైన ఆస్తి: మంత్రి వాసంశెట్టి సుభాష్

రణస్థలం (శ్రీకాకుళం జిల్లా), ఏప్రిల్ 9 ప్రభాతవార్త : దేశాభివృద్ధికి పరిశ్రమలు ఎంతో అవసరమని రాష్ట్ర కార్మిక, కర్మాగారాలు, బాయిలర్లు, భీమా శాఖ మంత్రి వాసంశెట్టి శుభాష్ వెల్లడించారు. నాగార్జున అగ్రికం కెమికల్ లిమిటెడ్ (ఎన్ఎసిఎల్)లో 55వ జాతీయ భద్రత వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి మంత్రితో పాటు ఎచ్చెర్ల నియోజకవర్గం శాసన సభ్యులు నడికుదిటి ఈశ్వరరావు, జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ లతో కలసి గురువారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ ఏ సి ఎల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ లో నిర్వహిస్తున్న 55వ జాతీయ భద్రతా దినోత్సవ ముగింపు కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ సంస్థలోని యాజమాన్యం, ఉద్యోగులు, కాంట్రాక్ట్ సిబ్బంది భద్రత, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ పట్ల చూపుతున్న నిబద్ధతకు అభినందనలు తెలిపారు". జాతీయ భద్రతా దినోత్సవం ఒక సాధారణ వేడుక మాత్రమే కాదని, ఇది మనందరికీ భద్రతపై అవగాహన పెంచే ఒక జాతీయ ఉద్యమన్నారు. దేశ అభివృద్ధికి పరిశ్రమలు ఎంతో అవసరం. అయితే, ఆ అభివృద్ధి భద్రత, ఆరోగ్యం మరియు పర్యావరణ పరిరక్షణతో కలిసి ఉండాలన్నారు. ప్రతి కార్మికుడు దేశానికి ఒక విలువైన ఆస్తి అని, వారి భద్రతను కాపాడటం కేవలం చట్టబద్ధమైన బాధ్యత మాత్రమే కాదు, ఒక నైతిక బాధ్యత కూడా ఉంటుందన్నారు. ప్రతి ఉద్యోగి భద్రతలో భాగస్వామ్యం చేయాలని, వారికి అవగాహన కల్పించాలని, నియమాలను కచ్చితంగా ఉండాలని వివరించారు. ఎన్ ఏ సి ఎల్ ప్రోసెస్, భద్రత, మేనేజ్ మెంట్ సిస్టం అమలు చేస్తూ, స్టడీస్, రిస్క్ అసెస్మెంట్స్, మేనేజ్మెంట్ ఆఫ్ ఛేంజ్ విధానాలను పాటిస్తున్నట్లు తెలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఇంటర్లాక్స్, గ్యాస్ డిటెక్టర్లు, ఎమర్జెన్సీ షట్ డౌన్ సిస్టమ్స్ వంటి ఇంజనీరింగ్ నియంత్రణలను సమర్థంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. రెగ్యులర్ ఆడిట్లు, మాక్ డ్రిల్, లీడర్షిప్ ఆధారిత సేఫ్టీ ఇనీషియేటివ్స్ ద్వారా ప్రమాదాలను ముందుగానే నివారించే చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పర్యావరణ పరిర క్షణలో భాగంగా జీరో లిక్విడ్ డిస్చార్జ్ వంటి విధానాలను అమలు చేయడం అభినందనీ యమన్నారు. ఉద్యోగులకు శిక్షణ, ఎమర్జెన్సీ సిద్ధపాటు, వ్యక్తిగత రక్షణ పరికరాలు వినియోగం పై ప్రత్యేక దృష్టి పెట్టడం ప్రసంశనీయమన్నారు. ఇలాంటి సమగ్ర భద్రతా విధానాలు ప్రమాదాలను తగ్గించడమే కాకుండా సంస్థ పనితీరును మెరుగుపరుస్తాయని కొని యాడారు. ఎన్ ఏ సి ఎల్ సంస్థకు సి ఐ ఐ నుండి భద్రతా నాయకత్వం బహుమతి, ఐ సి సి నుండి పర్యావరణ పరిరక్షణ బహుమతి లభించడం గర్వకారణమన్నారు. ఇతర పరిశ్ర మలు కూడా ఇలాంటి ఉత్తమ పద్ధతులను అనుసరించాలన్నారు. ప్రభుత్వం, పరిశ్రమలు, కార్మికులు కలిసి పనిచేసి జీరో హార్మ్ లక్ష్యాన్ని సాధించాలని పిలుపునిచ్చారు. భద్రత కేవలం పరిశ్రమలకే పరిమితం కాదు జీవితంలో కూడా పాటించాలని చెప్పారు. ఈ సందర్భంగా అన్ని సంస్థలు భద్రతా వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలని, శిక్షణలో పెట్టుబడులు పెట్టాలని, భద్రతను ఒక విలువగా మార్చాలని కోరారు. ఎన్ ఏ సి ఎల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ను మరోసారి అభినందించారు.

సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం

సిపిఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ

పత్తికొండ,ఏప్రిల్ 9,ప్రభాతవార్త: సామ్రాజ్యావాదానికి వ్యతిరేకంగా పోరాటాలు చేపడదామని సిపిఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ పిలుపు నిచ్చారు. గురువారం కర్నూలు జిల్లా పత్తికొండలో కామ్రెడ్ చదవుల రామయ్య శతజయంతి ఉత్సవాలు సిపిఐ మండల కార్యదర్శి యు.కారుమంచి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముందుగా చదవుల రామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళీలు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు దేవానికి ప్రమాదకరంగా ఉన్నాయని, మోడీ 12 ఏళ్ళ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు తీరని అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరాన్, ఇజ్రాయిల్ అమెరికా దేశాల మధ్య జరుగుతున్న యుద్ధం కారణంగా చమురు, వాణిజ్య, ఆహార ధరలు విపరీతంగా పెరిగి పోయి సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పిచ్చోడిలా పూటకో మాట మాట్లాడుతున్నారని విమర్శించారు. భూస్వాముల నుండి వేలాది ఎకరాల భూములను పేద ప్రజలకు పంచిన ఘనత చదువుల రామయ్యకే దక్కిందన్నారు. సిపిఐ శ్రేణులు కామ్రెడ్ చదువుల రామయ్య స్ఫూర్తితో ఉద్యమాలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు, పి.రామచంద్రయ్య, ఆవుల శేఖర్, బి.గిడ్డయ్య, ఉమ్మడి జిల్లాల నుండి సిపిఐ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పిఆర్ఎన్ వలసలో ఉద్రిక్తత

మాజీ ఎమ్మెల్సీ జగదీష్, ఎమ్మెల్యే విజయచంద్ర మద్దతుదారుల మధ్య వివాదం

పార్వతీపురం, ఏప్రిల్ 9, ప్రభాతవార్త: మండలంలోని పిన్నింటి రామినాయుడువలసలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ జగదీష్ ఎమ్మెల్యే విజయ్ చంద్ర మద్దతుదారుల మధ్య వివాదం చోటు చేసుకుంది. పిఆర్ఎన్ వలస స్థానికులు చెప్పిన వివరాల ప్రకారం ఎన్టీఆర్ విగ్రహాన్ని ప్రతిష్టించి విగ్రహావిష్కరణకు ఎమ్మెల్యేను పిలవగా ఎమ్మెల్యే తనకు సమయం కేటాయించలేదని దానితో మాజీ ఎమ్మెల్సీ ద్వారపూడి జగదీష్ను పిలవడం జరిగిందని అన్నారు. దానితో స్థానిక ఎమ్మెల్యే మద్దతుదారులు తాము ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని తొలగించడం జరిగిందని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ విగ్రహవిష్కరణకు స్థలానికి చేరుకోగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మద్దతుదారులు పిఆర్ఎన్ వలస చేరుకొని జగదీష్‌తో విగ్రహావిష్కరణ చేయించొద్దంటూ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని అడ్డుకోవడంతో కొంత ఉద్రిక్త నెలకొంది. విషయం తెలుసుకున్న పోలీసులు వివాదం వద్దకు చేరుకొని ఇరువర్గాలను సముదాయించి కార్యక్రమాన్ని వాయిదా వేయించడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతూ పార్వతీపురం చరిత్రలోనే మునుపెన్నడూ ఇటువంటి రాజకీయం జరగలేదని సొంత పార్టీ వాలే పార్టీ కార్యక్రమాల్ని అడ్డుకోవడం మంచి సంస్కృతి కాదని అన్నారు. ఇది సొంత కార్యక్రమం కాదని పార్టీ కార్యక్రమాన్ని శాసించే అధికారం ఎవరికి లేదని అన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రైవేట్ లిమిటెడ్ పార్టీ కాదని ఒకరికి సంబంధించిన పార్టీ కాదని అన్నారు. ఈ కార్యక్రమాన్ని వాళ్ళు చేసిన మేము అభ్యంతరం చెప్పే వాళ్ళం కాదని అన్నారు. తాము వివాదానికి రాలేదని కార్యక్రమాన్ని వాయిదా వేసుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరం జీవులు, బిజెపి నాయకులు సురగాల ఉమామహేశ్వర రావు జగదీష్ మద్దతుదారులు పాల్గొన్నారు.

ఎర్రచందనం స్మగ్లర్లకు యేడాది జైలుశిక్ష

తిరుపతి,ఏప్రిల్ 9ప్రభాతవార్తప్రతినిధి: శేషాచలం అడవుల నుండి ఎర్రచందనం అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడిన ముగ్గురు ముద్దాయిలకు జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి గురువారం తీర్పునిచ్చారు. తిరపతి జిల్లా పోలీసుల గుడ్ ట్రయల్ మానిటరింగ్ వ్యవస్థతో స్మగ్లర్లకు శిక్ష,జరిమానా విధింపబడుతోందని పోలీసులు తెలిపారు.ఎర్రచందనం అక్రమ రవాణా ,తీవ్ర అటవీ నేరాలకు పాల్పడితే కఠిన శిక్ష తప్పదని హెచ్చరికలు చేస్తున్నారు.. తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు పర్యవేక్షణలో అమలవుతున్న "గుడ్ ట్రయల్ మానిటరింగ్ వ్యవస్థ ద్వారా ఈ కేసును సమర్థవంతంగా నడిపి, నిందితులకు శిక్ష ఖరారు చేయడంలో జిల్లా పోలీసులు విజయవంతమయ్యారన్నారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి 2టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2016లో నమోదున 29/2016 ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో, తిరుపతి జిల్లా ఆర్ఎస్ఎస్ ఎడిజె కోర్టు కీలక తీర్పు వెలువరించింది. రైల్వే కోడూరు మండలంకు చెందిన కదడా హరిబాబు అనే బాలపల్లి బాబు (60.), నాగారం బాబు రెడ్డి (36) కొర్లగుంట తిరుపతి, గోడిలా మల్లికార్జున్ (51) నిందితులకు న్యాయమూర్తి ఏ. నరసింహ మూర్తి దోషులుగా నిర్ధారిస్తూ, ఒక్కొక్కరికి ఒక సంవత్సరం కారాగార శిక్ష, పదివేల రూపాయలు జరిమానా విధించారు. జరిమానా చెల్లించకపోతే అదనంగా మూడు నెలల జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని కోర్టు స్పష్టం చేసింది. ఈ కీలక కేసులో విచారణ, పర్యవేక్షణ, కోర్టు లైజనింగ్ విభాగాల్లో అంకితభావంతో పనిచేసిన సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

లులు కంపెనీకి స్థల కేటాయింపు రద్దు ప్రజాపోరాట విజయం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సిహెచ్ బాబురావు

విజయవాడ,ఏప్రిల్ 9,ప్రభాతవార్తప్రతినిధి: లులు కంపెనీకి స్థల కేటాయింపు రద్దు ప్రజాపోరాట విజయమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబురావు పేర్కొన్నారు. విజయవాడ పాత ఆర్టీసీ బస్టాండ్ స్థలాన్ని లులు మాల్ కొరకు కేటాయిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరిస్తున్నట్లు, నిన్న హైకోర్టులో ప్రభుత్వం తరఫున ఏజీ రాతపూర్వకంగా తెలియజేశారు. లులు కి భూముల కేటాయింపును వ్యతిరేకిస్తూ రైతు నేత శ్రీ వడ్డే శోభనాద్రీశ్వరరావు హైకోర్టులో పిల్ వేసారు. దీంతో ప్రభుత్వం భూ కేటాయింపును రద్దు చేసినట్లు రాతపూర్వకంగా కోర్టుకు తెలిపింది. ఇది ప్రజా పోరాట విజయం, ప్రభుత్వం చట్ట విరుద్ధంగా, నిబంధనలు ధిక్కరించి బడా కంపెనీలకు ప్రభుత్వ స్థలాలను ధారా దత్తం చేయటం, ఈ అడ్డగోలు కేటాయింపులపైన ప్రభుత్వానికి ఇదొక హెచ్చరిక అని సిహెచ్ బాబురావు పేర్కొన్నారు.

వేసవిలో పశువుల తాగునీటికి నీటితొట్టెల ఏర్పాటు

పశుసంవర్ధక శాఖ సంచాలకుడు డాక్టర్ టి. దామోదర్ నాయుడు

విజయవాడ,ఏప్రిల్ 9,ప్రభాతవార్తప్రతినిధి: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథక అనుసంధానంతో గ్రామీణ ప్రాంతాలలో నీటి తొట్టెలను నిర్మించి, వేసవిలో పశువులకు తాగునీటి వసతి కల్పించడం జరిగిందని పశుసంవర్ధక శాఖ సంచాలకులు డాక్టర్ టి దామోదర్ నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో వేసవి కాలంలో పశువులు, జీవాల నీటి కొరతను అధిగమించడానికి పటిష్ట చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.

విజయవాడలో 11న రాష్ట్ర స్థాయి జ్యోతిరావు పూలే ద్విశతాబ్ది జయంతి ఉత్సవం

విజయవాడ,ఏప్రిల్ 9,ప్రభాతవార్తప్రతినిధి: బడుగుల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే ద్విశతాబ్ది జయంతి ఈ నెల 11న ఘనంగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా జ్యోతిరావు పూలే జయంతిని రాష్ట్ర పండుగగా, అధికారికంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పూలే జయంత్యోత్సవం నిర్వహించనున్నామన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళా విద్య, దళిత, బడుగు వర్గాల హక్కుల కోసం, అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలన కోసం పోరాడిన యోధుడు జ్యోతిరావు పూలే అని కొనియాడారు. ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కోసం జీవితాన్ని ధారపోశారన్నారు. తన సతీమణి సావిత్రిబాయి పూలేతో కలిసి 1848లో పూణేలో బాలికల కోసం మొదటి పాఠశాలను స్థాపించారన్నారు. ఈ నెల 11న మహాత్మా జ్యోతిరావు పూలే ద్విశతాబ్ది జయంతిని ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జ్యోతిరావు పూలే జయంతిని రాష్ట్ర పండుగగా, అధికారికంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర స్థాయి పూలే జయంత్యోత్సవం నిర్వహించనున్నామని మంత్రి సవిత తెలిపారు. అంతకుముందు ఏలూరు జిల్లా హనుమాన్ జంక్షన్ కు చెందిన శిల్ప కళాకారులు రూపొందించిన జ్యోతిరావు పూలే విగ్రహ నమూనాలను తన క్యాంపు కార్యాలయంలో మంత్రి సవిత పరిశీలించారు. వాటిని రూపొందించిన కళాకారులను మంత్రి అభినందించారు. ఈ సమావేశంలో పలువురు కార్పొరేషన్ చైర్మన్లు నందం అబద్ధయ్య, మల్లె ఈశ్వరరావు, ఎర్రిబోతు రమణరావు, వీరంకి గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ బయోమెట్రిక్ నమోదుకు 15 నుంచి ప్రత్యేక శిబిరాలు

విజయవాడ,ఏప్రిల్ 9,ప్రభాతవార్తప్రతినిధి: ఆధార్ బయోమెట్రిక్ నమోదుకు ఈ నెల 15 నుంచి ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు స్వర్ణ గ్రామ, వార్డుల (ఎస్‌జిఎస్‌డబ్ల్యు) శాఖ తెలిపింది. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లాల విద్యాశాఖ, సంబంధిత అధికారులకు ఆ శాఖ డైరెక్టర్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. తొలి విడతలో ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకూ, మలి విడతలో ఈ నెల 21 నుంచి 24 వరకు ఈ శిబిరాలను స్వర్ణ గ్రామ, వార్డుల కార్యాలయాల్లో, అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే మార్చి 2026 వరకు ఆధార్ నమోదు కార్యక్రమాలు పూర్తయ్యాక, రాష్ట్రంలో సుమారు 12.09 లక్షల మంది బయోమెట్రిక్ నమోదు పెండింగ్‌లో ఉన్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. గతంలో నిర్వహించిన శిబిరాల ద్వారా 79 వేల బయోమెట్రిక్ నమోదు పూర్తయ్యిందని తెలిపారు. ముఖ్యంగా 15 నుంచి 17 ఏళ్ల వయసు గల జూనియర్ కాలేజీ విద్యార్థుల బయోమెట్రిక్ నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నారు. కొత్త ఆధార్ నమోదు, ఇతర సేవలు ఈ శిబిరాల్లో అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. జిల్లాల వారీ పరిశీలిస్తే, కర్నూలు, నంద్యాల, తిరుపతి, విశాఖపట్నం జిల్లాల్లో ఎక్కువ బయోమెట్రిక్ నమోదులు పెండింగ్‌లో ఉన్నట్లు, రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 12,09,554 పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. శిబిరాల నిర్వహణకు అవసరమైన ఆధార్ కిట్ల మొబిలైజేషన్ కోసం ప్రతి కేంద్రానికి రూ.1,000 చొప్పున నిధులు విడుదల చేయనున్నట్లు ప్రభుత్వం తెలిపిందన్నారు. అదనపు భద్రత, సహాయక చర్యల కోసం మహిళా పోలీసులను కూడా నియమించనున్నట్లు పేర్కొన్నారు. ఈ శిబిరాలు నిర్వహించే సమయంలో డిజిటల్ అసిస్టెంట్లు, డబ్ల్యుఇడిపిఎస్‌లను ఇతర పనులకు పంపొద్దని జిల్లా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటం

- తిరుపతిలో ఎన్ఎస్‌యుఐ ఆవిర్భావ వేడుకలు

తిరుపతి,ఏప్రిల్ 9ప్రభాత వార్తప్రతినిధి: ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘాల్లో ఎన్ ఎస్ యు ఐ ఒకటని, విద్యార్థుల సమస్య లపై రాజీలేని పోరాటం చేస్తూ ఇందిరాగాంధీ ఆశయ సాధనకు ముందుకు సాగుతున్నామని విద్యార్థి నాయకులు చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అనుబంధ విద్యార్థి సంఘం నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా 56వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు తిరుపతిలో గురువారం ఘనంగా నిర్వహించారు. తిరుపతి జిల్లా ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షుడు శివ బాలాజీ ఆధ్వర్యంలో స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం వద్ద రాజీవ్ గాంధీ విగ్రహానికి ,స్వర్గీయ ఇందిరా గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి టపాకాయలు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తిరుపతి అర్బన్ జిల్లా అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు కేకు కట్ చేసి విద్యార్థులకు, నాయకులకు పంచిపెట్టారు. విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తూ విద్యార్థులకు అండగా నిలబడుతుందన్నారు. జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని 1971లో విద్యార్థుల ఉన్నత భవిష్యత్తు కోసం, ఉన్నత చదువుల కోసం దీనిని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నాటి నుంచి నేటి వరకు ఎన్ ఎస్ యు ఐ ఆ దిశగా ముందుకు సాగుతోందని, విద్యార్థుల్లో జాతీయ భావాలు పెంపొందిస్తూ సమానత్వం కోసం ప్రజాస్వామ్య పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తుందని చిట్టిబాబు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దొడ్డారెడ్డి రాంభూపాల్ రెడ్డి , ఏపీసీసీ ఓబీసీ సెల్ కోఆర్డినేటర్ మురళీకృష్ణ కంభంపాటి ,చిత్తూరు శివ శంకర్ ,ఎన్ ఎస్ యు ఐ తిరుపతి నగర కార్యదర్శులు గౌతం, దీపక్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జ్యోతీశ్వర్ నాయక్, తిరుపతి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రేమ్ సాగర్, విద్యార్థులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర వేద విజ్ఞానపీఠం భారతీయ ఆధ్యాత్మిక వారసత్వం



తిరుమల,ఏప్రిల్ 9ప్రభాతవార్తప్రతినిధి: పుణ్యక్షేత్రం తిరుమలలోని శ్రీ వేంకటేశ్వర వేద విజ్ఞానపీఠం దేశంలోనే అత్యున్నత వేద విద్యా కేంద్రంగా వెలుగొందుతోంది. 'వేదాలకు పుట్టినిల్లు తిరుమల" అనే మహోన్నత భావాన్ని సార్థకం చేస్తూ శ్రీ వేంకటేశ్వర వేద విజ్ఞానపీఠం భారతీయ ఆధ్యాత్మిక వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించే దివ్య విద్యా కేంద్రంగా నిలుస్తోంది. భారతీయ సంస్కృతికి మూలాధారమైన వేద సంప్రదాయాల పరిరక్షణ, ప్రచారం, ప్రోత్సాహంలో టిటిడి తనదైన శైలిలో అగ్రగామిగా నిలుస్తోంది. వేద విజ్ఞాన పీఠం 1884 ఫిబ్రవరిలో మహంత్ ప్రయాగ్ దాస్ ఆధ్వర్యంలో స్థాపించబడిన ఈ వేదపాఠశాల ప్రారంభంలో మూడు విభాగాలతో మొదలై కాలక్రమేణా వేద, ఆగమ, పౌరోహిత్యం, శాస్త్ర విద్యలను సమగ్రంగా బోధించే విశిష్ట సంస్థగా అభివృద్ధి చెందింది. 1992లో తిరుమల ధర్మగిరిలో శాశ్వతంగా స్థాపించబడిన ఈ సంస్థకు "వేద విజ్ఞానపీఠం"గా పునర్నామకరణం చేశారు. 17 విభాగాల్లో వేద విద్యా బోధన జరుగుతోంది. నాలుగు ప్రధాన విభాగాల కింద మొత్తం 17 ప్రత్యేక విద్యా శాఖలు నిర్వహించబడుతున్నాయి. వేదాధ్యయనంలో 7 వేదశాఖలు, ఆగమాధ్యయనంలో 5 ఆగమాలు, స్మార్త అధ్యయనంలో 4 విభాగాలు, దివ్యప్రబంధంలో ఆళ్వారుల 4000 పాశురాలు బోధించబడుతున్నాయి. ఈ కోర్సులు దీర్ఘకాలికంగా నిర్వహించబడుతూ విద్యార్థులకు లోతైన ఆధ్యాత్మిక జ్ఞానాన్ని అందిస్తున్నాయి ఈ విద్యాసంస్థలో ప్రస్తుతం మొత్తం 374 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అందులో వేద కోర్సుల్లో 140 మంది, ప్రబంధఆగమ కోర్సుల్లో 177 మంది, స్మార్త కోర్సుల్లో 57 మంది ఉన్నారు. వీరికి బోధన అందించేందుకు 43 మంది పండితులు సేవలందిస్తున్నారు. 540 మంది విద్యార్థులకు వసతి కల్పించే సామర్థం ఉన్న హాస్టల్ సౌకర్యాలు, శుభ్రమైన నివాస వాతావరణం, 24 గంటల నీటి సరఫరా, వేడి నీటి సదుపాయం అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులకు పోషకాహారంతో కూడిన భోజనం అందించేందుకు ఉదయం పాలు, ఇడ్లీ, దోస, ఉప్మా వంటి వంటకాలు, మధ్యాహ్నం అన్నం, పప్పు, కూరలు, సాంబారు, రసం, పెరుగు, సాయంత్రం పాలు, రాత్రి భోజనం అందిస్తున్నారు. విద్యార్థులకు ఉచితంగా దుస్తులు, పుస్తకాలు, నిత్యావసర వస్తువులు (సబ్బులు, నూనెలు, పేస్ట్ మొదలైనవి) అందించబడుతున్నాయి. ఆరోగ్య పరిరక్షణ కోసం అశ్విని ఆసుపత్రి ద్వారా ప్రతిరోజూ వైద్య సేవలు అందించబడుతున్నాయి. అవసరమైతే తిరుపతిలోని స్విమ్స్, బర్డ్ ఆసుపత్రుల్లో కూడా ఉచిత చికిత్స అందిస్తున్నారు.

10-4Pg7exHMNWJQE 11_10-4Pg7exHMNWJQE.qxd 10/Apr/26 12:15 AM Page 1

24నుండి కీలపట్ల కోనేటిరాయుని వార్షిక బ్రహ్మోత్సవాలు

తిరుమల,ఏప్రిల్ 9ప్రభాతవార్తప్రతినిధి: టిటిడి ఆధ్వర్యంలోని చిత్తూరు జిల్లా గంగవరం మండలం కీలపట్లలో వెలసిన కోనేటిరాయ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 24 నుండి మే 03వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాల ప్రారంభానికి 21న కోయిల్ ఆళ్వార్ తిరు మంజనం, 23న సాయంత్రం 6 నుండి రాత్రి 8.30 గంటల వరకు సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణ కార్యక్రమాలు జరుగుతాయి.

ప్రతి రోజు ఉదయం 8 నుండి 10 గంటల వరకు, రాత్రి 7 నుండి 9 గంటల వరకు స్వామివారి వాహనసేవలు భక్తులను అలరించనున్నాయి. 24న ఉదయం ధ్వజారోహణం, సాయంత్రం శేష వాహనం, 28న సాయంత్రం కల్యాణోత్సవం, రాత్రి గరుడ వాహనం ఉదయం చక్రస్నానంతో పరిసమాప్త మవుతాయి. ఏప్రిల్ 28న సాయంత్రం 4 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. 500 రూపాయలు చెల్లించి ఇద్దరు భక్తులు పాల్గొనవచ్చు. పాల్గొనే వారికి ఉత్తరీయం, రవికె, అన్నప్రసాదం అందజేస్తారు. మే 03న సాయంత్రం 4 గంటలకు పుష్పయాగం వైభవంగా నిర్వహించనున్నారు.

శ్రీవారి విఐపి దర్శనం పేరుతో మోసం - నిందితుడు అరెస్ట్

తిరుమల,ఏప్రిల్ 9ప్రభాతవార్తప్రతినిధి: టిటిడిలోగో దుర్వినియోగం చేసి విఐపి బ్రేక్ దర్శనాలు కల్పిస్తామని భక్తులను మోసం చేసిన తమిళనాడు తిరువల్లూరు జిల్లాకు చెందిన సి. సెంథిల్ కుమార్ (47) ను తిరుమల 2 టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం సిఐ రాముడు వివరాలను తెలిపారు. తిరుమలలో శ్రీవారి విఐపి బ్రేక్ దర్శనం కల్పిస్తామని సామిజిక మధ్యమాల వేదికల ద్వారా అమాయక భక్తులను మోసం చేస్తున్న వారిని నమ్మవద్దని తెలిపారు. తప్పుడు ప్రకటనలతో భక్తులను మోసం చేస్తున్నట్లు అతనిని గుర్తించారు. విజిలెన్స్ విభాగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు 2 టౌన్ పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. ఒక్కో టిక్కెట్‌కు దాదాపు 16,500 రూపాయలు వసూలు చేయడం కుటుంబ సభ్యుల బ్యాంక్ ఖాతాలు, డిజిటల్ పేమెంట్‌ల ద్వారా డబ్బులు స్వీకరించడం, నకిలీ హామీలతో భక్తులను మోసం చేసినట్లు దర్యాప్తులో తేలిందన్నారు.

ఘనంగా ఆర్డీటి వ్యవస్థాపకుడు డా. విన్సెంట్ ఫెర్రర్ 106వ జయంతి వేడుకలు

అనంతపురం, ఏప్రిల్ 9, (ప్రభాతవార్త బ్యూరో) 1969లో రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్‌ (ఆర్డిటి)ను స్థాపించి, ఆంధ్రప్రదేశ్ , తెలంగాణలోని గ్రామీణ ప్రజల సేవకే తన జీవితాన్ని అంకితం చేసిన విన్సెంట్ ఫెర్రర్ 106వ జయంతి వేడుకలను రెండు తెలుగు రాష్ట్రాలలోని 2,000కి పైగా గ్రామాల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. గ్రామీణ ప్రజల అభ్యున్నతికి విన్సెంట్ ఫెర్రర్ చేసిన కృషిని గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని, ప్రజలు తమ ఇళ్లలో ఏర్పాటు చేసుకున్న 1,10,000 "సేవా హుండీలను"ని పగులగొట్టి, అందులోని మొత్తాన్ని సంస్థ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ఇతరులకు సహాయం అందించేందుకు విరాళంగా ఇచ్చారు. 2012లో 40,000 సేవా హుండీల లక్ష్యంతో ప్రారంభమైన "భారతీయుల కొరకు భారతీయులు (ఇండియా ఫర్ ఇండియా) ఉద్యమంలో ఈ సేవా హుండీలు ఒక భాగం. "స్పందించు సహాయం అందించు" అనే నినాదంతో, సామాన్య ప్రజలు,

ఆర్డీటీ సంస్థ చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సహకారం, మద్దతును అందిస్తున్నారు. కళ్యాణ్ దుర్గం నియోజకవర్గము కుందుర్పి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మోంచో ఫెర్రర్, మహిళా సాధికరత విభాగం డైరెక్టర్ విశాల ఫెర్రర్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తాం

జనసేన పార్టీ ఇన్‌ఛార్జి కిరణ్ రాయల్

తిరుపతి,ఏప్రిల్ 9ప్రభాతవార్తప్రతినిధి: తిరుపతి జిల్లాలో జనసేనపార్టీ బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని, ఇందుకు యువతను ప్రోత్సహించి ముందుకు వెళతానని నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిరణ్‌రాయల్ తెలిపారు. యువతను, ప్రజలను కలసి సమస్యలు తెలుసుకుని పార్టీ అధినేత ,డిసిఎం పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు పనిచేస్తున్నామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలతో కలసి పనిచేసి విజయం సాధిస్తామన్నారు. తిరుపతి నియోజకవర్గంలో చేపట్టిన పార్టీ సభ్యత్వం నమోదు ఐదువేలు పూర్తయిందని, సహకరించిన అందరికీ,యువతకు కిరణ్‌రాయల్ ధన్యవాదాలు తెలిపారు. త్వరలోనే అధినేతను కలసి వివరిస్తానని చెప్పారు.

అంతర్రాష్ట్ర స్లీపర్ కోచ్ ప్రైవేట్ బస్సుల సీజ్

రాజమహేంద్రవరం, ఏప్రిల్9, ప్రభాతవార్త ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో నిబంధనలు ఉల్లంఘించిన అంతర్రాష్ట్ర 5 స్లీపర్ కోచ్ ప్రైవేట్ బస్సులు రవాణాశాఖ అధికారులు సీజ్ చేశారు. ప్రైవేటు స్లీపర్ కోచ్ బస్సులు ఇటీవల కాలంలో ప్రయాణీకుల ప్రాణాలకు ముప్పు తెస్తున్న తరుణంలో నిబంధనలు పాటించని పలువిషయాను అధికారులు గుర్తించారు.

జిల్లా రవాణా అధికారి ఆర్ సురేష్ స్వయంగా రెండు రోజుల ప్రత్యేక డ్రైవ్‌లో ప్రయాణీకుల భద్రతను ప్రమాదంలోకి నెట్టిన పలు ఉల్లంఘనలు గుర్తించినట్లు వెల్లడించారు. బస్సుల్లో అక్రమ అదనపు డీజిల్ ట్యాంకులు ఏర్పాటు చేసినట్లు ఈ తనిఖీ లో వెలుగులోకి వచ్చింది. అలాగే ఎమర్జెన్సీ ఎగ్జిట్‌లు (హ్యాచ్/డోర్)లను లగేజీతో మూసివేసి వున్నాయి. కొన్ని బస్సుల్లో వెనుక ఎమర్జెన్సీ డోర్ లేకపోవడం గుర్తించారు. నిబంధనలు ఉల్లంఘించిన అంతర్రాష్ట్ర ప్రైవేటు బస్సుల పై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు డిటిఓ సురేష్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాజమహేంద్రరం నుండి హైదరాబాద్ ,బెంగళూరు వంటి ప్రధాన నగరాలకు నడుస్తున్న ఆల్ ఇండియా టూరిస్ట్ పర్మిట్ ప్రైవేటు బస్సులపై స్థానిక రవాణా శాఖ అధికారులు బుధ, గురువారాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో పర్మిట్ నిబంధనలను అతిక్రమించడం మాత్రమే కాకుండా ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు కలిగించేలా ఈ తరహా చర్యలు అత్యంత ప్రమాదకరమని పేర్కొన్నారు. సీజ్ చేసిన బస్సులను స్థానిక ఆర్టీవో కార్యాలయం భద్రపరిచామని వీటికి సంబంధించి రెండు లక్షల 15 వేల రూపాయలు పన్ను ,అపరాధ రుసుము బస్సు యజమానులు చెల్లించవలసి ఉందన్నారు.

జ్యోతి ప్రజ్వలనతో స్నాతకోత్సవ వేడుకలను ప్రారంభిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ఆడపిల్లల చదువు సమాజ అభివృద్ధికి పునాది

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

చిత్తూరురూరల్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త: ఆడపిల్లల చదువు సమాజాభివృద్ధికి పునాది అని, మహిళలు ప్రతి రంగంలో ముందుకు రావాలని, భవిష్యత్తులో వారికి రాజకీయాల్లో మరిన్ని అవకాశాలు లభిస్తాయని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. గురువారం చిత్తూరులోని శ్రీమతి ఎన్‌పి సావిత్రమ్మ ప్రభుత్వ మహిళాకళాశాల 44వ వార్షికోత్సవం. స్నాతకోత్సవం, నూతన భవనాల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిధిగా విచ్చేసారు. ముందుగా హాస్టల్ భవనాన్ని ప్రారంభించిననంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులకు బంగారుపతకాలు, నగదు ప్రోత్సాహకాలు అందజేసారు. జిల్లా కలెక్టరు సుమిత్‌కుమార్, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్‌లు అతిధులుగా విచ్చేసిన కార్యక్రమంలో వెంకయ్యనాయుడు మాట్లాడుతూ ముందుగా భవనాల నిర్మాణానికి విరాళాలిచ్చిన దాతలకు అభినందనలు తెలిపారు. అలాగే కళాశాల స్థాపించిన 45 ఏళ్ల తర్వాత కూడా శ్రీమతి ఎన్‌పి సావిత్రమ్మ కుటుంబసభ్యులు ఈ కళాశాలకు తమ సహకారాన్ని అందిస్తుండడం ఆమె పట్ల వారికున్న అభిమానానికి, బాధ్యతకు నిదర్శనమన్నారు. మహిళా విద్య ద్వారానే మహిళా సాధికారత సాధ్యమవుతుందని, తద్వారా శిశుమరణాల రేటు తగ్గుదల, కుటుంబ ఆరోగ్యం, మెరుగు, పిల్లల పోషణతో పాటు విద్యాపరమైన అవకాశాల మీద సానుకూల ప్రభావం ఏర్పడి అనేక సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. అన్ని రంగాల్లో మహిళలకు సరైన అవకాశాలు కల్పించి గౌరవించినప్పుడే సౌభాగ్యం వెల్లివిరుస్తుందని, మహిళా సాధికారత సాధ్యం కావాలంటే ముందు సమాజంలో ఆలోచనా కోణంలో మార్పురావాలని కోరారు. బేటీ బచావ్ బేటీ పడావ్ నినాదంలో భారత ప్రభుత్వం మహిళా సాధికారత ధ్యేయంగా ముందుకు సాగుతుండడం అభినందనీయమని, ఈ విషయంలో అటల్‌బిహారీ వాజ్‌పేయి చేసిన కృషిని గుర్తుచేసారు. ప్రస్తుత ప్రధాని నరేంద్రమోడి సైతం బాలికలకు చదువుతో పాటు అనేక విషయాల్లో ప్రోత్సాహం, తగిన గుర్తింపు ఇచ్చే దిశగా ముందుకు సాగుతున్నారన్నారు. అనంతరం జిల్లాకలెక్టరు మాట్లాడుతూ 2016లో ముస్సోరిలో ట్రెనింగ్ పూర్తి అయిన అనంతరం అప్పటి ఉపరాష్ట్రపతి హోదాలో వెంకయ్యనాయుడు తమ బ్యాచ్‌కు ఆతిధ్యం ఇచ్చిన సందర్భాన్ని స్మరించుకొంటూ, ఆయన ఇచ్చిన మార్గదర్శక సూచనలు ఇప్పటికీ తనను ప్రేరేపిస్తున్నాయని తెలిపారు. రూ.40లక్షల వ్యయంతో నిర్మించిన కొత్తహాస్టల్ భవనం ద్వారా సుమారు 200మంది విద్యార్థినులకు సురక్షిత వసతి కల్పించబడుతుందని, ఇది విద్యార్థుల ఆర్థికభారం తగ్గించడంలో కీలకంగా వుంటుందన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులపై ఆందోళనకు వైసిపి సన్నాహాలు

- కాలవలు, డిస్ట్రిబ్యూటరీలు పూర్తి చేయాలని నేడు అనంతపురంలో రౌండ్ టేబుల్ సమావేశం - మాజీ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి రాక

అనంతపురం, ఏప్రిల్ 9 ప్రభాతవార్త బ్యూరో రాయలసీమ ఎత్తిపోత పథకం పనులు పూర్తి చేయాలని, అనంతపురం జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల కాలవ పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ వైసిపి ఆందోళనకు సిద్ధమవుతోంది. సాగునీటి ప్రాజెక్టుల కింద కాలవ పనులను పూర్తి చేసి ఆయకట్టుకు నీళ్ల ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. ప్రతి ఎకరాకు సాగునీరు ఇచ్చి జలహారతి చేస్తామని రాయలసీమను సస్యశ్యామలం చేస్తామని సీఎం చంద్రబాబునాయుడు చెబుతున్ననేపథ్యంలో సాగునీటి పథకాల కింద కాలవ పనులు పూర్తి చేస్తేనే ఆయకట్టుకు నీరు వస్తుందని వైసిపి నేతలు చెబుతున్నారు. శ్రీశైలం జలాశయం లోతట్టు ప్రాంతం నుంచి రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులను గతంలో వైసిపి ప్రభుత్వం చేపట్టిందని ఆ పనులను పూర్తి చేసి రాయలసీమ ప్రాంతానికి నీరు ఇవ్వాలని వైసిపి నేతలు డిమాండ్ చేస్తున్నారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం ద్వారా ఎక్కువ నీటిని వర్షాకాలంలో వృథాగా వెళ్తున్న నీటిని మళ్లించవచ్చని మంచి ఉద్దేశ్యంతో అమలు చేసిన రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులను పూర్తి చేయాలని వైసిపి నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. అందులో భాగంగా ఇప్పటికే కర్నూలు జిల్లాలో రాయలసీమ ఎత్తి పోతల పథకం పనులను వైసిపికి చెందిన రాయలసీమ జిల్లాల ప్రతినిధులు పరిశీలించిన విషయం తెలిసిందే. రాయలసీమ ఎత్తిపోతల పథకంపై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు వైసిపి నేతలు, కార్యకర్తలు సీమ జిల్లాల్లో ఆందోళనకు సన్నాహాలు చేస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం (10వ తేది) ఉదయం 10:00గంటలకు అనంతపురం లోని గుత్తి రోడ్డులోగల కెటిఆర్ ఫంక్షన్ హాల్‌లో వైసిపి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తోంది. రాయలసీమ ఎత్తిపోతల పథకం పూర్తి చేయాలని అనంతపురం జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటికి సంబంధించిన పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ ఈ రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తోంది. ఈ సమావేశానికి మాజీ మంత్రి, నెల్లూరు జిల్లా వైసిపి అధ్యక్షులు కాకాని గోవర్ధన్‌రెడ్డి, అనంతపురంపార్లమెంట్ పరిశీలకులు, ఓ.రెడ్డి నరేష్‌కుమార్‌రెడ్డి, అనంతపురం జిల్లా వైసిపి అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, ఇతర అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయ కర్తలు హాజరవుతున్నారు. ఈ సమావేశానికి ఎమ్మెల్సీలు, జడ్పి చైర్మన్, అసెంబ్లీ నియోజకవర్గాల పరిశీలకులు, పార్టీ రాష్ట్ర శాఖ, జిల్లా శాఖ, దాని అనుబంధ సంఘాల నాయకులు, ఇతర ముఖ్యులు హాజరు కానున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన పట్టణ అధ్యక్షులు, వైసిపి మ ండల అధ్యక్షులు, ఎంపిపిలు, జడ్పిటిసిలు తదితర ముఖ్యులు ఈ సమావేశానికి హాజరు కానున్నారు. సమావేశాన్ని విజయవంతం చేసేందుకు వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, ఇతర అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయ కర్తలు గట్టి సన్నాహాలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇటీవల తాడిపత్రి నియోజకవర్గం యాడికిలో నిర్వహించిన సభకు హాజరయ్యారు. యాడికి మండలంలో కణేకల్లు రిజర్వాయర్ పనులను పరిశీలించడంతోపాటు రైతులతో మాట్లాడటం, యాడికి మండల కేంద్రంలో బహిరంగ సభలోనూ, పార్టీ కార్యకర్తలతోనూ ప్రత్యేక సమావేశాలు సీఎం నిర్వహించారు. సీఎం చంద్రబాబునాయుడు యాడికిలో సభ నిర్వహించి వెళ్లిన కొద్ది రోజులకే తాగునీటి ప్రాజెక్టులపై వైసిపి రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేయడం గమనించ దగ్గ విషయం.

వైసిపి రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకే ఈ రౌండ్ టేబుల్ సమావేశాన్ని వైసిపి నేతలు నిర్వహిస్తోన్నట్లు తెలుస్తోంది. యాడికి సభలో రాయలసీమలో ప్రతి ఎకరాకు నీళ్లి ఇచ్చి జలహారతి చేస్తామని, పోలవరం ప్రాజెక్టును గోదావరి పుష్కరాల్లోగా పూర్తి చేస్తామని, పోలవరం ద్వారా ఆదా అయ్యే నీటితో శ్రీశైలం ప్రాజెక్టు నీళ్లు అన్నీ సీమ జిల్లాలకు మళ్లిస్తానని తదితర హామీలను సీఎం చంద్రబాబు చేసిన విషయం తెలిసిందే.

దుర్గమ్మ ఆలయంలో చలివేంద్రం - దాతలకు ఆహ్వానం

దాతలకు దుర్గమ్మ మెమెంటో అందజేస్తున్న దృశ్యం

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 9, ప్రభాతవార్త : దుర్గమ్మవారి భక్తులకు ఈ వేసవిలో దాహార్తిని తీర్చేందుకు ఆలయంలో ఏర్పాటు చేసిన చల్లటి మంచినీరు, మజ్జిగ పంపిణీకి దాతలు ముందుకు రావాలని ఇఒ వికె శీనా నాయక్ పిలుపునిచ్చారు. ఉగాది పర్వదినం నుండి జూన్ 15 వరకు ఈ చలివేంద్రాలు భక్తుల దాహార్తి తీర్చడానికి ఏర్పాటు చేశామన్నారు. దాతలు రు.650 ఒక్కరోజుకు విరాళంగా అందించవచ్చన్నారు. అధికసంఖ్యలో దాతలు ముందుకు రావాలన్నారు. దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన ఎం యామిని అరుణ శ్రీ రు.1లక్ష విరాళం గురువారం అందించారు. దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న గో సంరక్షణ ట్రస్టుకు రు.1,11,116 విరాళం గురువారం విజయవాడకు చెందిన జి భరత్ అందించారు. విజయవాడ కామయతోపుకు చెందిన పొత్తులూరి అనిత నిత్యాన్నదాన పథకానికి రు.1,00,116ల విరాళం గురువారం అందించారు. ఆయా దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం, మెమెంటోలను అధికారులు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

ఉగ్రమూలాల కేసు దర్యాప్తులో సంచలనాలు

- మహిళల పేరిట ఖవాతీన్ ప్రత్యేక విభాగం

విజయవాడ, ఏప్రిల్ 9,ప్రభాతవార్తప్రతినిధి: విజయవాడ ఉగ్రమూలాల కేసు దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసులో రిమాండ్ ఖైదీలను దశలవారిగా పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నారు. తొలి దశలో కస్టడీకి తీసుకున్న ఆరుగురు నిందితులు విచారణలో అంశాల ఆధారంగా నిందితులు ఇండియాను ఇస్లామిక్ రాజ్యంగా మార్చేందుకు భారీగా కుట్ర చేసిన విషయం స్పష్టమైనట్లు సమాచారం. ఈ క్రమంలో మరో ఆరుగురిని పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నారు. జిహాదీ కార్య కలాపాల్లో మహిళలను భాగస్వాముల్ని చేసేందుకు విదేశీ హ్యాండ్లర్లు మహిళలతో ఖవాతీన్ పేరిట ఏకంగా ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసుకున్నట్లు అధికారులు గుర్తించారు. సామాజిక మాధ్యమాల ద్వారా మహిళల్ని ఈ ఉచ్చులోకి లాగేవారని నిర్ధారించారు. ఈ కేసులో పట్టుబడిన హైదరాబాద్‌కు చెందిన సైదాబేగం ఖవాతీన్ బాధ్యతలు చూసేవారని గుర్తించారు. ఆమెకు పాకిస్థాన్, జమ్మూకశ్మీర్ లోని జిహాదీలతో సంబంధాలున్నాయని రాష్ట్ర కౌంటర్ ఇంటెలిజెన్స్ సెల్ దర్యాప్తులో తేలింది. భారత్‌లో ఇస్లామిక్ రాజ్య స్థాపనే లక్ష్యంగా యువతను జిహాద్ వైపు మళ్లించిన వారిలో అల్ హకీం షకూర్ కాకుండా మరో ఐదుగురు విదేశీ హ్యాండ్లర్లు ఉన్నట్లు గుర్తించారు.

రాజధానిపై ప్రజల నమ్మకం గెలిచింది

టిడిపి నేత దువ్వారపు రామారావు..

విజయవాడ, ఏప్రిల్ 9ప్రభాతవార్తప్రతినిధి:అమరావతికి చట్టబద్ధత రావడం ఒక చారిత్రాత్మకం దేశంలోనే చట్టబద్ధత పొందిన ఏకైక రాజధాని అమరావతి చరిత్రలో నిలిచిపోతుందనడంలో ఎలాంటి సందేహం లేదని టీడీపీ నేత దువ్వారపు రామారావు..కొనియాడారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రజలు కలలు కన్న రాజధాని అమరావతికి చట్టబద్ధత లభించడంతో రాష్ట్ర ప్రజలు ఆనందం వ్యక్తం చేసుకుంటున్నారని ఆయన వ్యక్తం చేశారు.

రాష్ట్ర పతి ఆమోదంతో అమరావతి శాశ్వత రాజధానిగా గెజిట్ నోటిఫికేషన్ విడుదల కావడంతో అమరావతి చరిత్రలోనే ఉన్నతస్థానంలో నిలుచింది. 201419 మధ్య కాలంలో అమరావతిపై అసెంబ్లీలో చర్చ నడుస్తున్నప్పుడు అప్పటి ప్రతిపక్ష నాయకుడయిన జగన్ అమరావతిని రాజధానిగా స్వాగతిస్తూ అమరావతికి కొద్దిపాటి భూమి సరిపోదు దాదాపు 30 వేల ఎకరాల భూమి కావాలి అని ఆయన చెప్పారు. అంతేకాకుండా అమరావతిలో నేను ఇల్లు కట్టుకుంటాను అని మాట కూడా ఇచ్చాడు తీరా అధికారంలోకి వచ్చాక మూడు రాజధానుల బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. మండలిలో మూడు రాజధానుల బిల్లు ఆమోదానికి వచ్చినప్పుడు టీడీపీ నాయకులు దానిని వ్యతిరేకించడం కూడా జరిగింది. ఈ రోజు శాశ్వత రాజధానిగా అమరావతి చట్టబద్ధత పొందడం వెనుక మా కృషి ఉండడం మా అదృష్టంలా భావిస్తున్నాం. అమరావతిలో అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. అటు శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు ఒక మధ్యస్థ ప్రాంతంగా ఉండాలని ఇక్కడ రాజధానిగా అమరావతిని ప్రవేశపెట్టారు. కృష్ణా నదీ తీరంలో అమరావతిని నిర్మించడానికి ప్రజల, అన్ని పార్టీలు స్వాగతించాయి. వైసీపీ ప్రభుత్వం అమరావతిని ఎన్నో రకాలుగా దూషించారు. మునిగిపోయే ప్రాంతమని, శ్మశానం, ఎడారి, ఎందుకు పనికిరాని భూములని అనేక రకాలుగా విమర్శించారు. గత ఐదేళ్ల పాలన ఎంత దుర్మార్గంగా కొనసాగిందో ప్రజలందరికి తెలుసు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజధాని ప్రాంతంలో అనేక మార్పులు చూస్తున్నాం. 58 వేల కోట్లతో అభివృద్ధి పనులు మొదలు పెట్టి అనేక భవనాలు నిర్మాణం జరుగుతున్నాయి. చంద్రబాబు మీద అభిమానంతో రాజధాని నిర్మాణం కోసం 29 వేల మంది రైతులు 34 వేల ఎకరాల భూముని స్వచ్ఛందంగా ఇవ్వడం దేశ చరిత్రలోనే గర్వించదగ్గ విషయం ఇది ఎప్పటికీ చరిత్రలో నిలిచిపోతుంది. ఆ అభిమానాన్ని నిలబెట్టు కుంటూ చంద్రబాబుగారు 201419 కాలంలో అమరావతిలో సెక్రటేరియేట్, ప్రజాప్రతినిధుల భవనాలు వంటివి నిర్మించి రహదారులు, మౌళిక సదుపాయాలు కల్పించడానికే సుమారు రూ.48 వేల కోట్లతో పనులు ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అంధకారంలో పడి ఉన్న అమరావతిని తిరిగి పట్టాలెక్కించేందుకు అనేక కృషి చేసి శాశ్వత రాజధానిగా నిలబెట్టారు. అమరావతి రాజధాని అంటే యువతకు కలల సౌధం. 26 జిల్లాల ప్రజలకు ఉద్యోగ కల్పవల్లి. గతంలో హైదరాబాద్ ను చంద్రబాబు గారు సైబరాబాద్ గా రూపకల్పన చేశారు దాని ద్వారా 70 శాతం ఆదాయంతో ప్రతి పల్లెకు నిధులు సమకూర్చేలా హైదరాబాద్ సహాయపడుతుంది. అమరావతి నిర్మాణంతో 13 జిల్లాల అభివృద్ధి, ప్రతి పంచాయతీ నిక్షేపానికి ఆదాయ వనరుగా నిలుస్తుంది. ఉత్తరాంధ్రా జిల్లా వాసిగా అమరావతిని రాజధానిగా నిర్ణయించినప్పుడు ఉత్తరాంధ్ర ప్రజలు, రాయలసీమ ప్రజలు అందరూ స్వాగతించారు. ఎందుకంటే ఇది అన్ని ప్రాంతాలకు సమదూరంలో ఉంది. విశాఖని రాజధానిగా ప్రకటించినప్పుడు విశాఖ ప్రజలు ఆనందపడాలి కానీ, దానికి మేము ఒప్పుకోలేదు ఎందుకంటే పరిపాలనా కేంద్రమంటే భవిష్యత్తుకు నాంది.

అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టు. హైదరాబాద్ రూపకల్పన ద్వారా అక్కడ ప్రజలు ఎలా అభివృద్ధి చెందారో అమరావతి నిర్మాణం ద్వారా ఇక్కడ ఉన్న ప్రతి ఒక్కరు అభివృద్ధి చెందుతారు.

తిరుపతిలో దాడులు, ప్రతిదాడులు తగ్గుముఖం: ఎస్సీకమిషన్ చైర్మన్ జవహర్

తిరుపతి,ఏప్రిల్ 9ప్రభాతవార్తప్రతినిధి: తిరుపతి జిల్లాలో సమర్థవంతమైన జిల్లా అధికారులపర్యవేక్షణలో ఎస్సీ వర్గాల సమస్యల పరిష్కారమవుతున్నాయని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కె. ఎస్. జవహర్ పేర్కొన్నారు. అంతేగాక ఎస్సీలపై దాడులు,ప్రతిదాడులు తగ్గుముఖం పట్టాయని తెలిపారు. గురువారం సాయంత్రం తిరుపతి జిల్లా కలెక్టరేట్ లో షెడ్యూల్ కులాల పై వివక్ష, వేదింపుల పై సమీక్షా సమావేశం నిర్వహించారు. తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, సంయుక్త కలెక్టర్ గోవిందరావు ఇతర అధికారులతో కలసి జరిగిన సమావేశం వివరాలను మీడియా ప్రతినిధులకు కమిషన్ చైర్మన్ వివరించారు. జిల్లాలో వివక్షాపూరిత ఘటనలు తక్కువగా ఉన్నాయని, కొద్దిపాటి భూ వివాదాలు, ఆర్థిక సమస్యలు ఉన్నప్పటికీ దాడులు, ప్రతిదాడులు తగ్గుముఖం పట్టినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం జిల్లాలో ఎస్సీలకు సంబంధించి మొత్తం 68 కేసులు పెండింగ్‌లో ఉండగా, అందులో 18 అట్రాసిటీ కేసులు ఉన్నాయని వెల్లడించారు. వీటిని డివిజన్ ల వారీగా వర్గీకరించి త్వరితగతిన పరిష్కరించాలని పోలీస్ అధికారులకు సూచించానన్నారు. ప్రతిగ్రామంలో స్మశాన వాటికల నిర్మాణం చేపట్టి జిల్లాను మోడల్ జిల్లాగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్, ముద్రా లోన్లు తదితర సంక్షేమ పథకాలపై దళితులకు విస్తృత అవగాహన కల్పించాలని సంబంధిత శాఖలకు ఆదేశించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్ష మేరకు కమిషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు.

అభివృద్ధి పేరుతో కార్పొరేటర్ల చేతుల్లో భూములు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

పుట్టపర్తి టౌన్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త అభివృద్ధి పేరుతో ప్రభుత్వం కార్పొరేటర్లకు భూములు కట్టబెడుతోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు విమర్శించారు. గురువారం పట్టణంలోని సాయి ఆరామం లో ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశాలు రెండవ రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాయలసీమలో సోలార్ హబ్ పేరిట వేల ఎకరాలు రైతుల నుంచి తీసుకుంటున్నారన్నారు. వేల ఎకరాలు తీసుకొని వందలలో ఉపాధి కల్పిస్తున్నారని అదే వ్యవసాయ అభివృద్ధి చేపడితే వేలాదిమందికి ఉపాధి కలుగుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఒకసారి రైన్ గన్స్ అంటారని ఇంకోసారి ఆర్టిక హార్టికల్చర్ హబ్, డ్రోన్ హబ్, పరిశ్రమల హబ్ అంటాడని అభివృద్ధిపై స్థిరత్వం లేదన్నారు. పరిశ్రమల స్థాపన అంటూ వేల ఎకరాలు తీసుకొని కార్పొరేటర్లకు ధారాదతం చేస్తున్నారన్నారు, లేపాక్షి నాలెడ్జ్ హబ్ కు ఎనిమిది వేల ఎకరాలు తీసుకొని ఒక్క పరిశ్రమ పెట్టకుండా బ్యాంకులలో 4600 కోట్లు అప్పు తీసుకొని ఐపి పెట్టి 500 కోట్లు మాత్రం ఆ కంపెనీ చెల్లించిందన్నారు.

ఉపాధి హామీపథకంపై సిపిఐ పాదయాత్ర

అనంతపురం, ఏప్రిల్ 9, (ప్రభాత వార్త బ్యూరో) మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి మూడు రోజులపాటు పాదయాత్ర జరుగును.. ఈనెల 10వ తేదీన ఉదయం 9:30 గంటలకు అనంతపురంలోని పంగల్ రోడ్డు దగ్గర సమతా గ్రామం నుంచి పాదయాత్ర ప్రారంభమవుతుంది. గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని జాతీయస్థాయిలోనే సింగనమల నియోజకవర్గం నార్పల మండలం బండ్లపల్లి లో గతంలో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ప్రారంభించిన విషయం తెలిసిందే. ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని మార్పులు చేసి అమలు చేయడాన్ని ప్రతిపక్షాలు తీవ్రంగా విమర్శిస్తున్నాయి.

గతంలో ఉన్న విధంగానే ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఇప్పుడు అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలలో మూడు రోజులు పాటు పాదయాత్ర నిర్వహిస్తోంది. అనంతపురం శివారులోని సమతా గ్రామం వద్ద నుంచి ప్రారంభించి బత్తలపల్లె మీదుగా నార్పల మండలం బండ్లపల్లి వరకు సిపిఐ పాదయాత్ర నిర్వహిస్తోంది.

అక్రమ వేటకు శాశ్వత అడ్డుకట్టే లక్ష్యం

- కలెక్టర్ హిమాన్షు శుక్ల, ఎస్పీ డా. అజితా వేజెండ్ల ముఖాముఖి

నెల్లూరు కలెక్టరేట్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త గురువారం నెల్లూరు టౌన్ హాల్లో తిరుపతి, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాలకు చెందిన 162 గ్రామాల మత్స్యకార కాపులు, మత్స్యకారులతో కలెక్టర్ హిమాన్షు శుక్ల, ఎస్పీ డా. అజితా వేజండ్ల ముఖాముఖీ సమావేశం నిర్వహించారు, తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాల మత్స్యకారుల అక్రమ వేట సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల స్పష్టం చేశారు. మత్స్యకారుల అభిప్రాయాల మేరకు పటిష్టమైన వ్యవస్థను రూపొందించేందుకు ప్రభుత్వం వేగవంతమైన చర్యలు చేపడుతోందన్నారు. తొలుత మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ డా. శాంతి అజెండాలోని అంశాలను వివరించగా, ప్రధానంగా పీఎంఎంఎస్‌వై పథకం కింద రూ.1.20 కోట్లతో నాలుగు హైస్పీడ్ బోట్ల కొనుగోలు, లబ్ధిదారుల ఎంపిక, బోట్ల రకం ఎంపిక, నిర్వహణ, మరమ్మతులపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా నాలుగు జిల్లాల నుంచి విచ్చేసిన మత్స్యకార గ్రామాల కాపులు తమ అభిప్రాయాలను వెల్లడిస్తూ 650 హెచ్‌పి సామర్థం గల స్టీల్ బోట్లనే కొనుగోలు చేయాలని, వాటి నిర్వహణను ప్రభుత్వమే భరించాలని సూచించారు. మెరైన్ పోలీసుల ఆధ్వర్యంలోని బోట్లకు రిపేర్లు చేయాలని, గస్తీ బోట్లలో పనిచేసే మత్స్యకారులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. తీర గస్తీ బాధ్యత పూర్తిగా ప్రభుత్వమే తీసుకోవాలని, సబ్సిడీ పెంచితే తామే బోట్లు కొనుగోలు చేసేందుకు సిద్ధమని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా తమిళనాడు జాలర్ల అక్రమ వేట, దాడులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తమ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం ముందుకు రావడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాల మత్స్యకారుల అక్రమ ప్రవేశాన్ని పూర్తిగా అడ్డుకునేందుకు పటిష్ట వ్యవస్థను రూపొందించేందుకు ప్రభుత్వం చర్యలు వేగవంతం చేస్తోందన్నారు. ఈ క్రమంలో దక్షిణ కోస్తా నాలుగు జిల్లాల తీరప్రాంతంలోని 23 మండలాల మత్స్యకారులతో ప్రత్యేకంగా సమావేశమై వారి అభిప్రాయాలను సేకరించినట్లు తెలిపారు. తమిళనాడు బోట్లను ఎలా అడ్డుకోవాలి, పట్టుకున్న తర్వాత ఏం చేయాలి, ఎంతకాలం ఉంచాలి వంటి అంశాలపై చర్చించామని వివరించారు. నాలుగు జిల్లాలకు నాలుగు హైస్పీడ్ బోట్లు మంజూరు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. తిరుపతి జిల్లాకు ఒకటి, నెల్లూరు జిల్లాకు రెండు, బాపట్ల జిల్లాకు ఒక బోటును మంజూరు చేయగా, ప్రకాశం జిల్లాకు కూడా బోటు మంజూరు చేసేలా ప్రతిపాదనలు.

సెల్ఫీ దిగుతూ జలపాతంలో పడి ముగ్గురు బాలికల మృతిపై జగన్ దిగ్భ్రాంతి

విజయవాడ,ఏప్రిల్ 9,ప్రభాతవార్తప్రతినిధి: అల్లూరి జిల్లా అనంతగిరి మండలం మూలగుమ్మి జలపాతంలో ముగ్గురు బాలికలు ప్రాణాలు కోల్పోవడంపై మాజీ సిఎం జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సెల్ఫీ దిగుతూ ప్రమాదవశాత్తూ జలపాతంలో పడి బాలికలు మృతిచెందడం అత్యంత విషాదకరమని తెలిపారు. ఇటీవలే ఇంటర్మీడియట్ పరీక్షలు రాసి భవిష్యత్‌కోసం కలలు గంటున్నారని పేర్కొన్నారు. ఈ కష్టకాలంలో వారి కుటుంబ సభ్యులకు ధైర్యం కలగాలని తెలిపారు.

అలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా భద్రతా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు.

10-4pg10 12 VJA_10-4pg10.qxd 10/Apr/26 12:22 AM Page 1

శతకానికి ఇంకెంత దూరం!

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 ప్రారంభమై రెండు వారాలు పూర్తయింది.15 మ్యాచ్‌లు ముగిశాయి. సిక్స్‌ల మోత మోగుతోంది. ఇప్పటికే 229 సిక్స్‌లు, మరో 427 ఫోర్లు బాదారు. ధనాధన్ ఇన్నింగ్స్‌లకూ కొదవలేదు. అయినా ఇప్పటికీ ఆ ఒకటి లోటుగా ఉంది. ఏ మ్యాచ్‌కు ఆ మ్యాచ్‌లో ఆ లోటు తీరుతుందని క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నా ఆశ నెరవేరడం లేదు. హాఫ్‌సెంచరీల వరద పారుతున్నా పులల్‌సెంచరీ ఎపుడన్నది ఆసక్తిగా మారింది. ఐపీఎల్‌లో మొదటగా సెంచరీ సాధించే హీరో ఎక్కడ అని క్రికెట్ అభిమానులు ఎదురుచూస్తున్నారు.

(వార్త క్రీడా విభాగం)

ఐపీఎల్ 2025 సీజన్ రెండో మ్యాచ్‌లోనే శతకం నమోదైంది. రాజస్థాన్ రాయల్స్‌పై ఇషాన్ కిషన్ (ఎస్‌ఆర్‌హెచ్) కేవలం 45 బంతుల్లోనే సెంచరీ మోత మోగించాడు. ఆ సీజన్‌లో తొలి సెంచరీ చేసిన మొనగాడిగా నిలిచాడు. మొత్తంగా గత ఏడాది ఐపీఎల్‌లో 9సెంచరీలు నమోదయ్యాయి. అభిషేక్ 55 బంతుల్లో 141 రన్స్ చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఇషాన్, అభిషేక్‌తో పాటు రిషబ్ పంత్, రాహుల్, సాయి సుదర్శన్, క్లాసెన్, ప్రియాన్ష్ ఆర్యా, వైభవ్ సూర్యవంతి శతకాలు బాదారు. ముఖ్యంగా వైభవ్... గుజరాత్‌పై 37 బంతుల్లో 7 ఫోర్లు, 11 సిక్స్‌లతో మెరుపు శతకం సాధించాడు.

ఐపీఎల్ 2026లో ఇప్పటివరకు కేఎల్ రాహుల్ (92), సమీర్ రిజ్వీ(90) మాత్రమే నైంటీస్ లోకి వచ్చారు. ఇద్దరూ కూడా ఢిల్లీ క్యాపిటల్స్ ఆటగాళ్లే. కఎల్ రాహుల్... గుజరాత్‌పై సెంచరీ సాధించే ఊపులో కనిపించినా తృటిలో చేజార్చుకున్నాడు. మరో ఇద్దరు రికల్టన్(81), ఇషాన్ కిషన్(80) 80 ప్లస్ రన్స్ చేశారు. కానీ ఎవ్వరూ సెంచరీ సాధించలేకపోయారు.

మ్యాచ్‌లో ఆరెంజ్ క్యాప్, పర్పుల్ క్యాప్ ఓ హోదాను, ప్రత్యేకతను సూచిస్తుంది. ఆరెంజ్ క్యాప్ ధరించారంటే అప్పటివరకు అతనే అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మెన్ కింద లెక్క. అత్యధిక వికెట్లుతో ఉన్న వారు పర్పుల్ క్యాప్ ధరిస్తారు. ఈ రేసులో యశస్వి జైస్వాల్(170 రన్స్), రవి బిష్ణోయ్ (7 వికెట్లు) ముందున్నారు.

పరుగుల వేటలో యశస్వీ జైస్వాల్

ఐపీఎల్ 2026 సీజన్ ఇప్పుడిప్పుడే అసలైన హీట్ అందుకుంటోంది. లీగ్‌లో 15 మ్యాచ్‌లు ముగిసేసరికి పాయింట్ల పట్టికతో పాటు, ఆరెంజ్ క్యాప్ (అత్యధిక పరుగులు), పర్పుల్ క్యాప్ (అత్యధిక వికెట్లు) రేసు

రసవత్తరంగా మారింది. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, మార్‌క్రమ్, అభిషేక్, ఇషాన్, సంజూ లాంటి వాళ్లను వెనక్కి నెట్టిరాజస్థాన్ రాయల్స్ యంగ్ సెన్సేషన్ యశస్వి జైస్వాల్.. ఆరెంజ్ క్యాప్ రేసులో ముందున్నాడు.3 మ్యాచ్‌ల్లో 170 స్ట్రైక్ రేట్‌తో 170 పరుగులు సాధించాడు. అందులో రెండు అర్ధసెంచరీలు ఉన్నాయి. మరో యువ సంచలనం సమీర్ రిజ్వీ 160 పరుగులతో రెండో స్థానంలో ఉంటే, సన్‌రైజర్స్ హైదరాబాద్ విధ్వంసకర బ్యాటర్ హెన్రిక్ క్లాసెన్145 పరుగులతో మూడో స్థానంలోఉన్నాడు. ఇక 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ 122 పరుగులతో టాప్4లో నిలిచి అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాడు.రోహిత్ శర్మ(118) అయిదో స్థానంలో ఉన్నాడు.

రవి బిష్ణోయ్ పర్పుల్ క్యాప్

వికెట్ల వేటలో స్పిన్ మాంత్రికుడు బిష్ణోయ్ ముందు నిలిచి పర్పుల్ క్యాప్‌ను తన ఆధీనంలో ఉంచు కున్నాడు. ఈ రాజస్థాన్ రాయల్స్ లెగ్ స్పిన్నర్ 3 మ్యాచ్‌ల్లో 7 వికెట్లు పడగొట్టాడు. ప్రసిద్ధ్ కృష్ణ 6 వికెట్లతో గట్టి పోటీ ఇస్తుండగా... రషీద్ ఖాన్, లుంగి ఎన్గిడి వంటి స్టార్ బౌలర్లు 5 వికెట్లతో తర్వాతి స్థానాల్లో ఉన్నారు. ఈ సీజన్‌లో స్పిన్నర్లు, పేసర్ల మధ్య వికెట్ల వేట పోటాపోటీగా సాగుతోంది.

ఐపీఎల్ 2026 సీజన్‌లో సిక్సర్ల మోత మోగుతోంది. ఇప్పవరకు 229 సిక్స్‌లు నమోదయ్యాయి. ఎక్కువ సిక్స్‌లు బాదిన ప్లేయర్లలో వైభవ్ సూర్యవంశీ, సమీర్ రిజ్వీ టాప్ ప్లేస్‌లో ఉన్నారు. చెరో 11 సిక్స్‌లు బాదారు. రికల్టన్ (ముంబై), టిమ్ డేవిడ్(ఆర్సీబీ), రజత్ పాటిదార్(ఆర్సీబీ) తలా 9 సిక్స్‌లు, యశస్వీ జైశ్వాల్ 8 సిక్స్‌లు నమోదుచేశారు.

ఈ సీజన్ లో ఇప్పటివరకు ఒక ఇన్నింగ్స్ లో అత్యధిక పరుగులు చేసిన రికార్డు కేఎల్ రాహుల్ పేరిట ఉంది. గుజరాత్ టైటాన్స్‌పై ఆయన చేసిన 92 పరుగులు హైలైట్‌గా నిలిచాయి. రవి బిష్ణోయ్ గుజరాత్ టైటాన్స్‌పై 4 ఓవర్లలో 41 పరుగులిచ్చి 4 వికెట్లు తీసి ఈ సీజన్ బెస్ట్ స్పెల్ నమోదు చేశాడు. ముజరబానీ కూడా ఒక మ్యాచ్‌లో 4 వికెట్లు తీశాడు. ఈ సీజన్‌లో మేటి ప్లేయర్లను వెనక్కి నెడుతూ యంగ్ గన్స్ దూసుకువస్తున్నారు. చూస్తుంటే యువ ఆటగాళ్లు, అనుభవజ్ఞుల మధ్య పోరు స్పష్టంగా కనిపిస్తోంది.

తొలి రౌండ్‌లోనే లక్ష్య సేన్, శ్రీకాంత్ పరాజయం

ఏడో సీడ్‌పై ఆయుష్ సంచలనం

నింగ్బో (చైనా): ఆసియా సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పురుషుల సింగిల్స్‌లో భారత రైజింగ్ స్టార్ ఆయుశ్ శెట్టి సంచలనంతో శుభారంభం చేశాడు. తొలి రౌండ్‌లో 21-13, 21-16తో ప్రపంచ 7ర్యాంకర్ లిన్ షి ఫెంగ్ (చైనా)ను బోల్తా కొట్టించి ప్రీక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. 51 నిమిషాల్లో ముగించాడు. రెండు గేముల్లోనూ ఆయుశ్ తొలుత వెనుక బడ్డా... సంయమనం కోల్పోకుండా ఆడి ఆధిక్యం చాటాడు. అదే జోరులో గేమ్‌లను సొంతం చేసుకున్నాడు. భారత్‌కే చెందిన హెచ్ఎస్ ప్రణయ్ కూడా ముందంజ వేశాడు. ప్రణయ్ 24-22, 21-12తో నుగుయెన్ హాయ్ డాంగ్ (వియత్నాం)పై గెలుపొందాడు. అయితే భారత నంబర్ వన్ లక్ష్య సేన్, ప్రపంచ మాజీ నంబర్‌వన్ కిడాంబి శ్రీకాంత్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించి నిరాశపరిచారు. ప్రపంచ 22వ ర్యాంకర్ లీ చెయుక్ యి (హాంకాంగ్)తో జరిగిన మ్యాచ్‌లో లక్ష్య సేన్ 12-21, 19-21తో ఓడిపోయాడు. లీ చెయుక్ చేతిలో లక్ష్య సేన్‌కిది నాలుగో ఓటమి కావడం గమనార్హం.ఈ ఏడాది మలేసియా ఓపెన్ లోనూ లీ చెయుక్ చేతిలో లక్ష్య సేన్ పరాజయం పాలయ్యాడు. ప్రపంచ మాజీ చాంపియన్ లో కీన్ యెవ్ (సింగపూర్)తో జరిగిన మ్యాచ్‌లో శ్రీకాంత్ 21-18, 9-21, 11-21తో ఓటమి చవిచూశాడు. 52 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో శ్రీకాంత్ తొలి గేమ్‌ను సొంతం చేసుకున్నా... అదే జోరును కొనసాగించడంలో విఫలమై ఓటమి మూటగట్టుకున్నాడు.

లక్నో సూపర్ జెయింట్ ముకుంద్

కోల్‌కతా:కోల్‌కతా: ఐపీఎల్ 2026లో కోల్‌కతా నైట్ రైడర్స్ పరాజయాల పరంపర కొనసాగుతోంది. కేకేఆర్ గెలుపు బోణీ ఆశలపై ముకుంద్ చౌదరి(27 బంతుల్లో 2 ఫోర్లు, 7 సిక్స్‌లతో 54 నాటౌట్) నీళ్లు చల్లాడు. ఈడెన్ గార్డెన్స్ వేదికగా గురువారం జరిగిన మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌ను అద్భుత విజయాన్ని అందించాడు. 182 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన లక్నో ఓ దశలో 128పరుగులకే 7 వికెట్లు కోల్పోయింది. అప్పటికే 16 ఓవర్లు ముగిశాయి. విజయం సాధించాలంటే 24 బంతుల్లో 54 పరుగులు సాధించాల్సిన పరిస్థితి. ఈ దశలో ముకుల్ చౌదరీ సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. 17వ ఓవర్లో అరోరా బంతులకు 4, 6... 18వ ఓవర్లో రెండు సిక్స్‌లు, 19వ ఓవర్లో గ్రీన్ బంతులపై 6,4,6తో 19 రన్స్ సాధించాడు.చివరి ఓవర్లో విజయానికి 6 బంతుల్లో 14పరుగులు చేయాలి. అరోరా వేసిన చివరి ఓవర్లో రెండో బంతికి సిక్స్, అయిదో బంతికి సిక్స్ బాది లక్నోకు అద్భుత విజయాన్ని అందించాడు.మిగతా బ్యాట్స్‌మెన్లలో బదోనా (54) అర్ధసెంచరీతో రాణించాడు. కోల్‌కతా నైట్

రైడర్స్ బౌలర్లలో వైభవ్ అరోరా, అంకుల్ రాయ్ చెరో రెండేసి వికెట్లు పడగొట్టారు.

అంతకుముందు రహానే(41) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో ఆదుకోగా.. రఘువంశీ(45)మరోసారి మెరిశాడు. ఆఖర్లో పావెల్(39 నాటౌట్),కామెరూన్ గ్రీన్(32 నాటౌట్)లు ధనాధన్ ఆడారు. కేకేఆర్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లకు 181 పరుగులు చేసింది.

భారత్ తొలి టెస్ట్ విక్టరీ హీరో కన్నుమూత

చెన్నై: భారత క్రికెట్‌లో విషాదం చోటు చేసుకుంది. టీమిండియా తొలి టెస్ట్ గెలిచిన జట్టులోని చివరి ఆటగాడు దొరైస్వామి గోపీనాథ్(96) కన్నుమూశారు. భారత అత్యంత వృద్ధ టెస్ట్ క్రికెటర్ కూడా ఆయనే.చెన్నైలోని తన నివాసంలో వృద్ధాప్య సమస్యలతో గోపీనాథ్ గురువారం తుదిశ్వాస విడిచారు. 1952లో ఇంగ్లండ్‌పై భారత్ సాధించిన తొలి టెస్ట్ విజయంలో గోపీనాథ్ కీలక పాత్ర పోషించారు. ఈటెస్ట్‌లో భారత్ ఇన్నింగ్స్ 8 పరుగుల తేడాతో గెలిచి చరిత్ర సృష్టించింది. ఆ చారిత్రత్మ మ్యాచ్‌లో గోపీనాథ్ 35 పరుగులు చేశారు. తొలి టెస్టు విజయం సాధించిన భారత జట్టులో ఇప్పటివరకు జీవించి ఉన్న ఏకైక క్రికెటర్ గోపీనాథ్ కావడం విశేషం. ఇప్పుడు ఆయన మరణంతో భారత క్రికెట్‌లో ఒక శకం ముగిసింది.

1951లో ఇంగ్లండ్‌పై అంతర్జాతీయ అరంగేట్రం చేసిన గోపీనాథ్ తన కెరీర్‌లో భారత్ తరపున 8 టెస్టులు ఆడారు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో మద్రాస్ తరపున 83 మ్యాచ్‌లు ఆడారు. గోపీనాథ్ తన అరంగేట్ర మ్యాచ్‌లోనే మెరుపులు మెరిపించాడు. తన అరంగేట్ర టెస్టులో 8వ స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన గోపీనాథ్ మొదటి ఇన్నింగ్స్‌లో అజేయంగా 50, రెండో ఇన్నింగ్స్‌లో 42 పరుగులు చేసి అందరినీ ఆకట్టుకున్నారు. మొత్తంగా ఆయన 8 మ్యాచ్‌లలో 242 పరుగులు చేశారు. ఆయన మృతి పట్ల బిసిసిఐ, పలువురు క్రికెటర్లు సోషల్ మీడియా వేదికగా సంతాపం తెలిపారు.

టిసిఎస్ లాభం 13వేల కోట్లు

ముంబయి, ఏప్రిల్ 9: టాటా గ్రూప్‌నకు చెందిన దిగ్గజ ఐటీ సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) త్రైమాసిక ఫలితాలను గురువారం స్టాక్ మార్కెట్లు ముగిసిన తర్వాత ప్రకటించింది. 2025-26 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో కంపెనీ రూ.13,718 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఏడాది ఇదే నాలుగో త్రైమాసికం ఫలితాలతో పోలిస్తే ఈసారి కంపెనీ నికరలాభం ఏకంగా 12 శాతం పెరిగింది. మార్కెట్ అంచనాలను మించి లాభాలనుఆర్జించింది. కంపెనీ ఆదాయం సైతం ఏకంగా 10 శాతం మేర పెరిగింది.

నాలుగో త్రైమాసికంలో కంపెనీ ఆదాయం రూ.70,698 కోట్లుగా నమోదైనట్లు టీసీఎస్ తెలిపింది. ఈ క్రమంలో టీసీఎస్. తమ వాటాదారులకు ఫైనల్ డివిడెండ్ కింద ఒక్కోషేరుకు రూ.31 చొప్పున చెల్లిస్తామని తెలిపింది. ఇందుకు కంపెనీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ నుంచి ఆమోదం లభించిందని, షేర్ల హోల్డర్ల ఆమోదానికి లోబడి ఈ డివిడెండ్ చెల్లింపులు ఉంటాయని పేర్కొంది. గడిచిన నాలుగో త్రైమాసికంలో తమకు మూడు మెగా డీల్స్ లభించినట్లు టీసీఎస్ వెల్లడించింది. ఈమూడు మెగా డీల్స్ మొత్తం కాంట్రాక్ట్ విలువ 12 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు వెల్లడించింది.

వరుసగా మూడో త్రైమాసికంలో మేము లాభాలను నమోదు చేశామని తెలుపుటకు సంతోషిస్తున్నాం. 12 బిలియన్ డాలర్ల కాంట్రాక్ట్ విలువ గల మూడు మెగా డీల్స్ అందుకోవడం వల్ల ఇది సాధ్యమైంది. అలాగే మా 5 పిల్లర్ల వ్యూహం, మా ఏఐ ఆధారిత సేవలు సైతం ఇందుకు దోహదపడ్డాయని టీసీఎస్ సీఈఓ, ఎండీ కే క్రితివాసన్ పేర్కొన్నారు. ప్రస్తుత అనిశ్చిత పరిస్థితుల్లో కంపెనీని మంచి స్థానంలో ఎలా నిలబెట్టాలి, ఏఐని పూర్తి స్థాయిలో ఎలా అందిపుచ్చుకోవాలని అనే అంశాలపైనే ఫోకస్ చేస్తున్నట్లు తెలిపారు.

టీసీఎస్ గత ఆర్థిక సంవత్సరాన్ని మొత్తం 40.7 బిలియన్ డాలర్ల విలువైన డీల్స్ సాధించింది. ఒక ఏడాదిలో ఐదు మెగా డీల్స్ సాధించి అత్యధిక డీల్స్ సాధించిన ఏడాదిల్లో ఒకటిగా నిలిచింది. కంపెనీ తన బిల్డ్ పార్ట్‌నర్ అక్వైర్ విధానం ద్వారా పెట్టుబడులను ముమ్మరం చేసింది.

కోస్టల్ క్లౌడ్, లిస్ట్ ఎంగేజ్‌లను కొనుగోలు చేసి, హైపర్‌వాల్ట్‌ను స్థాపించింది. గత ఆర్థిక ఏడాదిలో టీసీఎస్ కంపెనీకి మొత్తం రూ.2.67 లక్షల కోట్ల ఆదాయం లభించింది. ఇయర్ ఆన్ ఇయర్ ప్రాతిపదికన చూసుకుంటే టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌కు 5 శాతం మేర ఆదాయం పెరిగింది.

జైప్రకాష్ ప్లాట్ల లబ్ధిదారులకు అదానీ భరోసా

ముంబయి, ఏప్రిల్ 9: జయప్రకాశ్ అసోసియేట్స్ లిమిటెడ్ (జేఏఎల్)లో ఫ్లాట్లు బుకింగ్ చేసుకుని 15 ఏళ్లుగా స్వాధీనం కోసం ఎదురుచూస్తున్న వందలాది మంది ఇంటి కొనుగోలుదారులకు ఊరట లభించింది.అదానీ గ్రూప్ రూ.14,500కోట్ల రుణ పరిష్కార ప్రణాళిక అమలుపై స్టే ఇచ్చేందుకు సుప్రీం కోర్టు నిరాకరించిన క్రమంలో వారందరికీ 15 ఏళ్ల తర్వాత సొంతిళ్లు దక్కుతాయన్న ఆనందం కలుగుతోంది. దశాబ్దం న్నర కాలంగా ఎదురుచూస్తున్న బయ్యర్లకు అదానీ ఇప్పుడు ఆశాకిరణంగా కనిపిస్తున్నారు. జయప్రకాశ్ అసోసియేట్స్ లిమిటెడ్‌లో ఇళ్లు బుకింగ్ చేసుకుని స్వాధీనం చేసుకునేందుకు ఏళ్ల తరబడి చట్టపరంగా పోరాడుతున్నట్లు ఇంటి కొనుగోలుదారుల సంఘం సభ్యులు తెలిపారు. తమ రుణ పరిష్కార ప్రణాళిక ద్వారా ఈ ప్రాజెక్టులను అదానీ గ్రూప్ పూర్తి చేయాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఇంటి కోసం డబ్బులు చెల్లించి ఏళ్ల తరబడి ఈఎంఐలతో పాటు ఇంటి రెంటు సైతం కడుతున్న కొనుగోలుదారులు ఉన్నారు.

జయప్రకాశ్ అసోసియేట్స్ లిమిటెడ్‌కు సంబంధించిన ప్రాజెక్టుల్లో దాదాపు 8వేల మంది బయర్లున్నారు. అదానీ గ్రూప్ ఈ ప్రాజెక్టులను స్వాధీనం చేసుకున్న తర్వాత రెండేళ్లలో తమ చేతికి ప్రాపర్టీలు వస్తాయని వారంతా భావిస్తున్నారు. ఈ ప్రాజెక్టుల్లో ప్రధానమైన నోయిడాలోని జేపీ గ్రీన్ విష్ టౌన్‌లో 2011లో చాలా మంది అపార్ట్‌మెంట్ల కోసం బుకింగ్ చేసుకున్నారు. నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ 2025, మార్చి 17న అదానీ ఎంటర్ ప్రైజెస్ రూ.14,535 కోట్ల రుణ పరిష్కార ప్రణాళికకు ఆమోదం తెలిపింది. జేఏఎల్ సంస్థకు సంబంధించి ప్రధాన రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు జేపీ గ్రీన్, జేపీ ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీ వంటివి ఉన్నాయి. డిఫాల్ట్‌ల తర్వాత జేఏఎల్ దివాలా తీసింది. బయ్యర్లంతా అదానీ గ్రూప్‌కు జై కొట్టారు.

ఈక్విటీలకు హర్మూజ్ ఎఫెక్ట్

నష్టాల్లోకి జారుకున్న సెన్సెక్స్, నిఫ్టీ

ముంబయి, ఏప్రిల్ 9: దేశీయ స్టాక్ మార్కెట్లు మళ్లీ నష్టాల్లోకి జారుకున్నాయి. వరుసగా 5 రోజుల పాటు లాభాలు అందుకున్న సూచీలు ఈరోజు భారీగా పడిపోవడం గమనార్హం. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టినట్లు కనిపించినా ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని భయాలు నెలకొన్నాయి. ఇరాన్‌అమెరికా మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంతో యుద్ధానికి బ్రేకులు పడినట్లు కనిపించినా లెబనాన్ పై ఇజ్రాయెల్ దాడులతో పరిస్థితులు మళ్లీ మొదటికి వచ్చాయి. ఈ దాడులకు ప్రతిగా హర్మూజ్ జల సంధిని ఇరాన్ మళ్లీ మూసివేయడంతో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు మళ్లీ దూసుకెళ్లాయి. ఇది స్టాక్ మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపించింది. ఇన్వెస్టర్లకు లాభాల స్వీకరణకు దిగడం, విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలు కూడా నష్టాలకు కారణమయ్యాయి. దీంతో సెన్సెక్స్ ఒక దశలో 1000కి పైగా పాయింట్లు కోల్పోయింది. గురువారం రోజున ఉదయం సెన్సెక్స్ 77,319 పాయింట్ల వద్ద నష్టాల్లో ట్రేడింగ్ మొదలు పెట్టింది.రోజు మొత్తం నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 76,347 వద్ద కనిష్ఠ స్థాయిని తాకి చివరకు 931 పాయింట్లు కోల్పోయి 76,631 వద్ద ముగిసింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ సూచీ నిఫ్టీ 222 పాయింట్లు నష్టపోయి 23,775 వద్ద స్థిరపడింది. ఈ క్రమంలో డాలరుతో పోలిస్తే రూపాయి విలువ 92.62 వద్ద కొనసాగింది. సెన్సెక్స్ 30 సూచీలో ఇండిగో, ఎల్ అండ్ టీ, ఎటర్నల్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ స్టాక్స్ భారీగా నష్టపోయాయి. బీఈఎల్, పవర్ గ్రిడ్, ఎన్టీపీసీ, టీసీఎస్, హెచ్‌సీఎల్ వంటి స్టాక్స్ లాభపడ్డాయి.

అంతర్జాతీయ మార్కెట్లో మళ్లీ క్రూడ్ ఆయిల్ ధరలు భగ్గుమన్నాయి. కాల్పుల విరమణతో 95 డాలర్ల దిగువకు వచ్చిన బ్రెంట్ క్రూడ్ ఆయిల్ బ్యారెల్ ధర మళ్లీ 98.42 డాలర్ల స్థాయికి ఎగబాకింది. బంగారం ధర ఔన్సుకు 4728 డాలర్ల స్థాయికి చేరింది. అనిశ్చిత పరిస్థితుల్లోనూ హిందాల్కో షేర్లు 3.56 శాతం లాభపడ్డాయి. ఆ తర్వాత డాక్టర్ రెడ్డీస్, బజాజ్ ఆటో, భారత్ ఎలక్ట్రానిక్స్, మ్యాక్స్ హెల్త్ కేర్ వంటి షేర్లు సగటున 1 శాతానికిపైగా లాభాలు అందుకున్నాయి. ఇండిగో, జియో ఫైనాన్షియల్ సగటున 3.25 శాతం మేర పడిపోయాయి. లార్సెన్, శ్రీరామ్ ఫైనాన్స్, ఎటర్నల్ షేర్లు 2.35శాతం వరకు పడిపోయాయి.కీలక రంగాల్లో షేర్లు భారీగా నష్టపోవడంతో దేశీయ మార్కెట్ సూచీలు నష్టాలను చవిచూడాల్సి వచ్చింది. ఇరాన్ అమెరికా మధ్య యుద్ధం ఇంకా ముగియలేదన్న వార్తలు ఇన్వెస్టర్లను అప్రమత్తం చేశాయి

అన్‌క్లెయిమ్డ్ ఫండ్స్ 2.2 లక్షలకోట్లు

ముంబయి, ఏప్రిల్ 9: బ్యాంకు డిపాజిట్లు, ఈక్విటీలు, ఇన్సూరెన్స్, ఈపీఎఫ్ అకౌంట్లు, మ్యూచుఫండ్లలో గత ఏడాది 2025 డిసెంబర్ నాటికి ఎవరూ క్లెయిమ్ చేయని సంపద రూ.2.2 లక్షల కోట్లుగా ఉన్నట్లు వ్యక్తిగత ఫైనాన్స్ అడ్వైజరీ సంస్థ ఫైనాన్స్ మ్యాగజైన్ వెల్లడించింది. ముఖ్యంగా స్టాక్ మార్కెట్లో ఎవరూ తీసుకోని సొమ్ము వేగంగా పెరుగుతోంది. షేర్ మార్కెట్లో అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ల విలువ రూ.89,000 కోట్లుగా ఉన్నట్లు నివేదిక అంచనావేసింది.మొత్తం 1671 కంపెనీల వద్ద ఇన్వెస్టర్ల సొమ్ము మూలుగుతోందని తెలిపింది. బ్యాంకు డిపాజిట్ల తర్వాత షేర్ మార్కెట్లో అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు రెండో స్థానంలో ఉన్నాయి. రూ. 2.2 లక్షల కోట్లకు పైగా విలువైన ఈ పెట్టుబడులు తక్కువ రాబడినిచ్చే నిద్రాణమైన పొదుపులు కావు. కానీ క్లెయిమ్‌లు అందకపోవడం, పని చేయని ఖాతాలు లేదా పెట్టుబడిదారులు, వారి కుటుంబాలలో అవగాహన లోపం కారణంగా అందుబాటులో లేకుండా పోయిన అధిక వృద్ధి సామర్థ్యం గల పెట్టుబడులు ఉన్నాయి.

లక్షల కోట్ల సొమ్ము సరైన వ్యక్తులకు చేరడం లేదు. బహుళ ఫైనాన్షియల్ అసెట్స్ రూపంలో ఈ సొమ్ము ఉన్నట్లు నివేదిక తెలిపింది. బ్యాంక్ డిపాజిట్లలో రూ.97,545 కోట్లతో 44.2 శాతం సొమ్ము ఎవరూ తీసుకోలేదు. ఈక్విటీ షేర్లలో రూ.89,004 కోట్లతో 40.3 శాతం, ఇన్సూరెన్స్ పాలసీల్లో రూ.20,062 కోట్లతో 9.1, ఈపీఎఫ్ అకౌంట్లలో రూ.10,915 కోట్లతో 4.9 శాతం, మ్యూచువల్ ఫండ్లలో రూ.3,452 కోట్లతో 1.6 శాతం,ఆర్ఈఐటీఎస్, ఇన్విట్స్, ఎన్సీడీల్లో 764 కోట్లతో 0.3 శాతం, చొప్పున అన్‌క్లెయిమ్డ్ ఫండ్స్ నిలిచిపోయాయి.వన్ ఫైనాన్స్ మ్యాగజైన్ ప్రకారం పైన చెప్పిన డేటా ఆర్‌బీఐ నోటిఫికేషన్స్, ఎన్ఎస్ఈ బీఎస్ఈ షేర్ హోల్డింగ్ ప్యాటర్న్స్, ఐఈపీఎఫ్ రూల్స్, ఐఆర్‌డీఏఐ యాన్యువల్ రిపోర్ట్స్, ఈపీఎఫ్ఓ డేటా,సెబీ యాన్యువల్ రిపోర్ట్స్ ఆధారంగా తీసుకున్నారు. బ్యాంకుల్లో ఉన్న అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లను ఆర్‌బీఐ డిపాజిటర్ ఎడ్యుకేషన్ అవర్నెస్ ఫండ్‌లో జమ చేస్తున్నారు. వీటికి 3 శాతం సింపుల్ ఇంట్రెస్ట్ వస్తుంది. ద్రవ్యోల్బణం కారణంగా ఈ డబ్బు విలువ భారీగా తగ్గిపోతుందని చెప్పవచ్చు.గడిచిన 10 ఏళ్ల కాలంలోనే ఈ డబ్బు 34 రెట్లు పెరిగింది.2015లో రూ.7875కోట్ల అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు ఉంటే 2025 నాటికి 98,545 కోట్లకు పెరిగాయి.ఇక షేర్ మార్కెట్లో చూసుకుంటే దాదాపు 1671 కంపెనీలకు చెందిన 166 కోట్ల షేర్లు కొనుగోలు చేసి ఎవరూ క్లెయిమ్ చేసుకోని సొమ్ము విలువ రూ.89,004 కోట్లుగా ఉంది. ఇది ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ అండ్ ప్రొటెక్షన్ ఫండ్ అథారిటీ వద్ద ఉంటాయి. ఈ లింకులోకి లాగిన్ అయ్యి కస్టమర్లు తమకు సంబంధించిన సొమ్మును తనిఖీ చేసి క్లెయిమ్ చేసుకోవచ్చు.

డిమాండ్ సరఫరాలు మాత్రమే.. రూపాయి విలువ నిర్ధారిస్తాయి: ఆర్బీఐ

ముంబయి, ఏప్రిల్ 9:పశ్చిమాసియా ఉద్రిక్తతలతో చమురుధరలు గ్లోబల్‌స్థాయిలోపెరగడంతో డాలర్ చెల్లింపులు పెరిగి రూపాయి భారీగా క్షీణించింది. అయితే ఈ క్షీణత కట్టడికి ఆర్‌బిఐ జోక్యం అవసరం లేదని తీవ్రస్థాయిలో ఉంటే డాలర్ల కౌంటర్లు తెరిచి రూపాయి క్షీణత కట్టడిచేస్తుందన్నారు. భాగంగానే కరెన్సీ విలువల్లో అధిక హెచ్చుతగ్గులు కనిపిస్తే మాత్రమే ఆర్బీఐ జోక్యంచేసుకుంటుందని చెప్పారు. ప్రస్తుతానికి మాత్రం ఎలాంటి ఆందోళనా అవసరం లేదని,జోక్యం చేసుకోబోమని చెప్పుకొచ్చారు. రూపాయి విలువను ఒక నిర్దిష్ట స్థాయి (90 లేదా 95 ఇలా) దగ్గర ఉంచడం తమ లక్ష్యం కాదని అన్నారు. డిమాండ్ అండ్ సప్లై మాత్రమే రూపాయి విలువను నియంత్రిస్తాయని పేర్కొన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉందని ప్రస్తుతానికి ఎలాంటి ఇబ్బంది లేదని స్పష్టం చేశారు. బలమైన ఆర్థిక మూలాలు ఉన్నప్పటికీ అంతకుముందు ఏడాదులతో పోలిస్తే 202526 ఆర్థిక సంవత్సరంలో రూపాయి విలువ కాస్త ఎక్కువ మాత్రమే క్షీణించిందని మల్హోత్రా వివరించారు.

మూడేళ్ల తర్వాత విప్రో షేర్ బైబాక్



బెంగళూరు, ఏప్రిల్ 9: టెక్నాలజీ దిగ్గజకంపెనీ విప్రో ఈనెల 15,16 తేదీల్లోనే షేర్ల బైబాక్‌నుప్రకటిస్తుందని కంపెనీ వర్గాలు చెపుతున్నాయి. ఆరోజే కంపెనీ నాలుగో త్రైమాసిక ఫలితాలు ప్రకటించడంతోపాటు బోర్డు ఆమోదంపొందిన తర్వాత షేర్‌బైబాక్‌ను కూడా ప్రకటిస్తుందని అంచనా.ఈనెల 16వ తేదీ కంపెనీ బోర్డు సమావేశం జరగనున్నది. ఈ వివరాలను కూడా ఎక్స్ఛేంజికి నివేదిస్తుంది. గడచిన మూడేళ్ల తర్వాత తొలిసారిగా విప్రో బైబాక్‌ను ప్రకటిస్తోంది. 2023జూన్‌లో ఒకసారి షేర్‌బైబాక్‌చేసిన కంపెనీ ఆనాడు షేర్లను రూ.445 చొప్పున రూ.12 వేల కోట్ల ఆఫర్‌తో ఆనాడు షేర్లు కొనుగోలుచేసింది. కంపెనీ మొత్తం ఈక్విటీ వాటాల్లో 4.91శాతం బైబాక్‌చేసింది. అంతకుముందు 2020లో విప్రో కంపెనీ రూ.400 చొప్పున రూ.9500 కోట్లవిలువైన షేర్లను బైబాక్‌చేసింది. మళ్లీ షేర్‌బైబాక్ ఉండవచ్చని అంచనా.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14